సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 96

గురువారం 21-12-2023

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'





దైవం మానుష రూపేణ...

వైద్యుడ్ని దైవంతో పోలుస్తారు.. కోటిన్నర కుటుంబాలకు ఉచిత వైద్యం అందిస్తూ ఇప్పటివరకు నలభై లక్షల మందికి ప్రాణం పోసిన జగనన్నని ఏమని పిలవాలి !

హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్ళేప్పుడు జీవనభృతికై రోగికి డబ్బులిచ్చి మరీ చిరునవ్వుతో సాగనంపే మన హృదయాధినేత

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి గారు

చిరకాలం చిరునవ్వుతో చిరంజీవిగా వెలుగొందాలని ఆశిస్తూ... వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...

















- కుటుంబానికి రూ. 25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ పెంపు - కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం.
- ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించే వ్యాధులు 1,059 నుండి 3,257 వరకు పెంపు
- క్యానర్స్ వంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు సైతం పరిమితులు లేకుండా ఉచితంగా సేవలు
- 10,032 పైగా వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు
- 1126 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- 542 అర్బన్ క్లినిక్‌లు
- ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష
- గడప వద్దకే నాణ్యమైన వైద్యసేవలు
- 1088 కొత్త 108, 104 సేవలు
- వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా
- వైఎస్ఆర్ కంటివెలుగు
- నాడు-నేడు ద్వారా అత్యాధునిక వసతులు
- వైఎస్ఆర్ టెలీమెడిసన్ సేవలు
- వైద్య సిబ్బంది నియామకం
- ప్రతి మెడికల్ కాలేజీకి అనుబంధంగా
- మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణం..
- ఉచితంగా వైద్యం.
- మీ ఇంటి వద్దకే ఉచితంగా మందులు

రూ. 8,480 కోట్లతో 17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం.. గతంలో వున్న 11 కాలేజీలు ఆధునీకరణ.



ఈ ఏడాదే ప్రారంభమైన 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వచ్చే ఏడాది మరో 5, ఆపై ఏడాది 2025-26లో మరో 7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభం.



వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

రాజ్యసభ సభ్యులు

ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం...



మారిన సర్కారు బడి..
మురిసిన చదువుల తల్లి..
జగనన్న అమ్మ ఒడి
జగనన్న గోరుముద్ద..
జగనన్న విద్యా కానుక
BYJU'S The Learning App
మన బడి నాడు-నేడు..
జగనన్న విద్యా దీవెన
జగనన్న వసతి దీవెన..
ఇంగ్లీషు మీడియం విద్య - CBSE సిలబస్‌తో
దేశ చరిత్రలో తొలిసారిగా తల్లుల గురించి, వారి పిల్లల చదువుల గురించి ఆలోచించిన మనసున్న నాయకుడు మన జగనన్న...
విద్యారంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మఒడి పథకం వల్ల అక్షరాస్యత రేటు పెరుగుతుందని నోబెల్ గ్రహీత జాన్ బి. గూడెనఫ్ ప్రశంసించారు.
పోషకాహార లోపానికి వ్యతిరేకంగా 31.88 లక్షల మంది మహిళలు మరియు పిల్లలకు లబ్ధి చేకూర్చేలా ఏపీ ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ చొరవను నీతి ఆయోగ్ ప్రశంసించింది.
ఏపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా 14,500 స్కూళ్లను ఆధునీకరించాలని కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
నాడు
నేడు
జగనే కావాలి రావాలి
విద్యావ్యవస్థలో వినూత్న పథకాల ద్వారా..
విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తూ,
ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించేలా
కృషిచేస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారికి
అభినందనలు మరియు జన్మదిన శుభాకాంక్షలు...
శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి
వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి
రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు
జగనన్న అమ్మఒడి - బతుకులు మార్చే గుడి

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 96

గురువారం 21-12-2023

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం


ఏఆర్ విజయారావ్, ఎన్వైకే డైరెక్టర్

సైదాబాద్: 15వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంను గురువారం (నేటి) నుంచి నిర్వహిస్తామని నెహ్రూ యువ కేంద్ర ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ ఏఆర్. విజయారావ్ తెలిపారు. బుధవారం సైదాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఆమె విలేకరులకు కార్యక్రమ వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని కోపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించే ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా యువతకు క్రీడా పోటీలను రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ (సీతక్క) ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహకారంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖకు చెందిన తెలంగాణ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 220 మంది పాల్గొంటున్నారని తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో యువతకు పలు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్టు విజయారావ్ తెలిపారు.


ఆటలతో ఆత్మవిశ్వాసం



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, మానసిక వికాసం.. వీటికి మించి ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని భారత బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ చైర్మన్ నార్మన్ ఐసాక్ అన్నారు. నగరంలోని ఇంటర్నేషనల్ స్కూళ్ల విద్యార్థులకు భౌరంపేటలోని అంబిటస్ వరల్డ్ స్కూల్ లో 'అంబిలీప్' పేరిట నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నార్మన్ ఐసాక్ మాట్లాడుతూ, ఆటల్లో పాల్గొనేలా విద్యార్థులను పాఠశాలలు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాకర్, బాస్కెట్‌బాల్, తైక్వాండో, క్రికెట్, స్కేటింగ్, టెన్నిస్, స్విమ్మింగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. డజనుకుపైగా ఇంటర్నేషనల్ స్కూళ్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు వ్యక్తిగత, పాఠశాల తరఫున క్రీడల్లో గెలుపొంది బహుమతులు గెలుచుకున్నారు. అంబిటస్ వరల్డ్ స్కూల్ అకడమిక్ హెడ్ డాక్టర్ అనుభూతి శుక్లా, ప్రిన్సిపాల్ నిషా సింగ్ పాల్గొన్నారు.

పాతబస్తీలో 'మెట్రో'కు మోక్షం!

- సీఎం ఆదేశాలతో కదిలిన హెచ్ఎంఆర్ఎల్ యంత్రాంగం
- పాతబస్తీలో డోర్ ప్రాపర్టీ సర్వే షురూ



చార్మినార్: పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులకు మోక్షం లభించింది. మెట్రో రైలు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన ఇక్కడి ప్రజలకు ఊరట లభించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నగరంలో మెట్రో రైల్ విస్తరణపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తదితర అధికారులతో సమీక్షించారు. పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రో అధికార యంత్రాంగం కదిలింది. బుధవారం ఎంజీబీఎస్–దారుషిఫా చౌరస్తా, కోట్ల అలీజా–చౌడవ్ మసీద్ వరకు రోడ్డుకు ఇరువైపులా డోర్ ప్రాపర్టీ సర్వేను హెచ్ఎంఆర్ఎల్ సిబ్బంది నిర్వహించారు. తమ వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ సర్వే చేసి అవసరమైన ఫొటోలు, సమాచారాన్ని సేకరించారు.

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా టూ ఎయిర్‌పోర్టు వరకు...

ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో పాతబస్తీ ప్రజల్లో మెట్రో రైలు ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి. అనుకున్నట్లే ఈ విషయంపై ఈ నెల 13న సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత హెచ్ఎంఆర్ఎల్ ఎండీతో సమీక్ష చేసి వెంటనే కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. ముందుగా అనుకున్నట్లు పాతబస్తీలో 5.5 కిలో మీటర్ల దూరానికి మెట్రో పనులు ప్రారంభించాల్సి ఉండటంతో ఈ పనుల్లో భాగంగా డోర్ ప్రాపర్టీ సర్వే ప్రారంభించారు. పాతబస్తీ ఫలక్‌నుమా నుంచి మహాత్మా గాంధీ బస్ స్టేషన్(ఎంజీబీఎస్) ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. నగరంలోని ఇతర కారిడార్లలో మెట్రో రైలు పరుగులు తీస్తుండగా...పాతబస్తీలో దాని ఊసే లేకపోయింది. సాధ్యమైనంత వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట, బార్కాస్, పహాడీషరీఫ్ ద్వారా ఎయిర్‌పోర్టు వరకు కారిడార్ ఏర్పాటుకు నివేదికలను రూపొందించి తమకు అందజేయాలని సీఎం ఆదేశించడంతో బుధవారం ఈ సర్వే ప్రారంభమైందని సంబంధిత అధికారులు తెలిపారు.


కోట్ల అలీజా చౌరస్తాలో డోర్ ప్రాపర్టీ సర్వే చేస్తున్న మెట్రో రైలు సిబ్బంది

జూబ్లీహిల్స్‌లో మైసూర్ శారీ ఉద్యోగ్ అవుట్‌లెట్ ప్రారంభం

బంజారాహిల్స్: భారత సంప్రదాయ దుస్తుల బ్రాండ్లలో అగ్రగామిగా ఉన్న మైసూర్ శారీ ఉద్యోగ్ సంస్థ జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లో కొత్త ఫ్లాగ్‌షిప్ అవుట్‌లెట్‌ను తెరిచింది. బుధవారం సంస్థ వ్యవస్థాపకుడు దినేష్ తలేరాతో పాటు ప్రతినిధులు ఈ షోరూంను ప్రారంభించారు. తమ బ్రాండ్‌కు మాత్రమే సొంతమైన స్టైల్‌ను కొనసాగించడంతో పాటు అద్భుతమైన హస్తకళ, నేతల సంరక్షణ పట్ల తమ నిబద్ధతను చాటుకునేందుకు ఇదొక వేదిక కానుందని ఈ సందర్భంగా దినేష్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మైసూర్ శారీ ఉద్యోగ్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని హైదరాబాద్ వినియోగదారులకు అనుగుణంగా ఇక్కడ ఉత్పత్తులు ఉంటాయన్నారు. ప్రత్యేకమైన డిజైన్లు, సిల్క్‌మార్క్ సర్టిఫికెట్‌తో కూడిన దుస్తులను ఈ షోరూంలో అందుబాటులో ఉంచామన్నారు. పట్టు చీరలు, లెహంగాలు, ఫ్యాబ్రిక్స్, కుట్టని సూట్లు, సల్వార్‌కమీజ్‌లు, దుప్పట్టాలు అద్భుతమైన కలెక్షన్లతో ఇక్కడ ఆకట్టుకోనున్నాయని అన్నారు.


స్టోర్‌ను ప్రారంభించిన మైసూర్ శారీ ఉద్యోగ్ వ్యవస్థాపకుడు దినేష్ తలైరా తదితరులు

నేటి నుంచి 'ధ్యాన మహా యాగం'

పంజగుట్ట: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ (పీఎస్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు ధ్యాన మహా యాగం, అఖండ ధ్యాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్, పత్రీజీ కుమార్తె పరిమల పత్రి తెలిపారు. హైదరాబాద్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సహకారంతో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, అన్మాస్‌పల్లి లోని మహేశ్వర మహా పిరమిడ్, పత్రీజీ శక్తిస్థల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె కార్యక్రమ వివరాలను ప్రతినిధులు విజయ్ భాస్కర్ రెడ్డి, మారం శివప్రసాద్, ఎం.నవకాంత్‌తో కలిసి వెల్లడించారు. విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఉదయం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివిధ దేశాల నుంచే కాకుండా భారతదేశం నలుమూలల నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉచిత ఎంట్రీ, భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు.

కార్మిక కుటుంబాల అభ్యున్నతికి కృషి

మై హోం కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రాము రావు

మణికొండ: పారిశ్రామిక, నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలతో పాటు వారి పిల్లల అభ్యున్నతికి తమ సంస్థ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని మై హోం కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ జూపల్లి రాము రావు అన్నారు. హైదరాబాద్ నగరంలోనే మొదటి సారి నిర్మాణ రంగ కార్మికుల పిల్లల కోసం కోకాపేటలో ఏర్పాటు చేసిన అవేక్ష డే కేర్ కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము రావు మాట్లాడుతూ, తమ వద్ద పనిచేసేందుకు కార్మికులు ఒడిశా, బిహార్, పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల నుంచి వస్తారన్నారు. అలాంటి వారి పిల్లలకు విద్యా బుద్ధులతో పాటు పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తామన్నారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ) రీజినల్ మేనేజర్ మిమాన్షు అస్థానా మాట్లాడుతూ, నిర్మాణ, పారిశ్రామిక రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు సరైన విద్య, ఆహారం అందటం లేదనే ఉద్దేశంతో ఆయా రంగాలలో పనిచేస్తున్న సంస్థల భాగస్వామ్యంతో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో పారిశ్రామిక ప్రాంతాలైన జీడిమెట్ల, చర్లపల్లి, ఉప్పల్, మౌలాలి, పాశమైలారం, జీనోమ్ వ్యాలీలలో ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్మికుల పిల్లలను రోజంతా అవేక్ష కేంద్రం నిర్వాహకులు చూసుకుంటారని, దాంతో తల్లిదండ్రులు నిశ్చింతగా పనిచేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులతో పాటు కార్మికులు, పిల్లలు పాల్గొన్నారు.


కోకాపేటలో అవేక్ష డే కేర్ కేంద్రాన్ని ప్రారంభించిన జూపల్లి రాము రావు తదితరులు

23న టీటీడీ శ్రీవారి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు


మాట్లాడుతున్న టీటీడీ డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్‌లలోని శ్రీవారి ఆలయాల్లో ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ డిప్యూటీ ఈఓ రమేష్ బాబు తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్ బాలాజీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల, కొలువు, పంచాంగ పఠనం ఏకాంతంగా నిర్వహిస్తామన్నారు. సర్వదర్శనం తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వీఐపీలు, ప్రొటోకాల్ ప్రముఖులు ఉదయం 3 గంటలకు రిపోర్ట్ చేయాలని సాయంత్రం 6 నుంచి 6.45 గంటల వరకు నైవేద్య విరామ సమయం ఉంటుందన్నారు. తిరిగి సాయంత్రం 6.45 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందని రాత్రి 7.30 గంటలకు తోమాల, కొలువు, పంచాంగ పఠనం నిర్వహిస్తామన్నారు. ఈ పర్వదినాల సందర్భంగా డిసెంబర్ 23న ఆర్జిత కల్యాణోత్సవ సేవలు టీటీడీ రద్దు చేసిందని ఆయన తెలిపారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో టీటీడీ జూబ్లీహిల్స్ ఆలయ ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, లోకల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, హరి కిషన్, రంగు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ 'క్యాంపస్ బంద్'కు విద్యార్థి సంఘం పిలుపు

వర్సిటీలో ఊపందుకున్న నిరసనలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిరసనలు కొనసాగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం 'హెచ్‌సీయూ క్యాంపస్ బంద్'కు హెచ్‌సీయూ విద్యార్థి సంఘం 2023–24 పిలుపు ఇవ్వడంతో నిరసనలు మరింత ఊపందుకున్నాయి. హెచ్‌సీయూలోని హిందీ విభాగంలో పనిచే వినోద్, పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే ప్రవీణ్‌లు వారం రోజుల వ్యవధిలో మృతి చెందారు. వారిపై ఉన్నతాధికారులు పని ఒత్తిడి పెంచడం వల్ల ఆందోళనకు గురై మృత్యువాత పడ్డారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థులు నిరసనలు చేపట్టారు. రెండు రోజులుగా హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు నిరసన చేస్తున్న విద్యార్థులకు వర్సిటీ కార్మికులు, టీచర్స్ అసోసియేషన్ కూడా మద్దతు ప్రకటించడంతో నిరసనలు మరింత ఉధృతం అయ్యాయి. ఈ నేపథ్యంలో క్యాంపస్ సంపూర్ణ బంద్‌కు విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. హెచ్‌సీయూలో మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు న్యాయం చేయాలని ఏడు డిమాండ్లను యూనివర్సిటీ యాజమాన్యం ముందు ఉంచామని, వాటిని అంగీకరించేంత వరకు పోరాటం సాగిస్తామని హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మోహిత్ స్పష్టం చేశారు.



హెచ్‌సీయూ ప్రధాన గేటు ఎదుట బైఠాయించిన విద్యార్థులు

మెదక్ జిల్లా వార్తలు

నేటి నుంచి విద్యుత్ వినియోగదారుల సమావేశాలు

మెదక్: జిల్లాలోని అన్ని మండలాల్లో నేటి నుంచి విద్యుత్ వినియోగదారుల సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి జానకిరాములు బుధవారం తెలిపారు. నేడు మెదక్‌టౌన్, హవేళీఘనాపూర్, తూప్రాన్, కౌడిపల్లిలో సమావేశాలు ఉంటాయని తెలిపారు. ఈనెల 22న చిన్నశంకరంపేట, శివ్వంపేట, ఈనెల 23న కొల్చారం, వెల్దుర్తి, 27న నర్సాపూర్, మాసాయిపేట, 28న చిలిపిచెడ్, చేగుంట, 29న కౌడిపల్లి, రామాయంపేట, జనవరి 2న పాపన్నపేట, నిజాంపేట, నార్సింగి, టేక్మాల్, జనవరి 3న పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్ గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

ముద్ర రుణాలతో ఉపాధి


కంచన్‌పల్లిలో డ్రోన్ ఉపయోగాలు తెలియజేస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం ముద్ర రుణాలు పంపిణీ చేస్తోందని నోడల్ అధికారి లక్ష్మీకాంత రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కంచన్‌పల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్‌బీఐ స్వయం ఉపాధి కోసం ముద్ర రుణాలు ఇస్తోందని చెప్పారు. రైతులకు పంట రుణాలు, పీఎం బీమా యోజన, సురక్ష బీమా యోజన సైతం కల్పిస్తోందన్నారు. అనంతరం ఈసీ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధితో కూలీలకు పనులు కల్పిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌తో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్ ద్వార ఆధునిక వ్యవసాయం చేయవచ్చని వ్యవసాయ అధికారులు చెప్పారు. డ్రోన్‌తో రసాయనాలు, ఎరువులు స్ప్రే చేసే విధానం వివరించారు.

రేపు హుండీ లెక్కింపు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈనెల 22న లెక్కిస్తున్నట్లు ఈఓ శశిధర్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు భక్తుల సమక్షంలో హుండీ లెక్కిస్తామన్నారు. అలాగే స్వామివారి జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు, ప్రసాదాల విక్రయాల కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

డీఈవో శ్రీనివాస్‌రెడ్డి


విద్యార్థుల ప్రాజెక్టును తిలకిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: భారతదేశం గర్వించదగ్గ గొప్ప మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని నివాళిగా మండలంలోని బక్రిచెప్యాల ఉన్నత పాఠశాలలో గణిత మేళా నిర్వహించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు గణితం ద్వారా వేగం, కచ్చితత్వం అనే లక్ష్యాలను విద్యార్థులు అలవర్చుకొని జీవితంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

సిద్దిపేట జిల్లా పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రతీ ఉపాధ్యాయుడు, విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన గణిత ప్రదర్శనలను తిలకించి అభినందించారు. జిల్లా సహాయ గణాంక అధికారి నర్సింహా చారి, ప్రధానోపాధ్యాయుడు నాగేందర్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు సుహాసిని, సునీత, ఎస్ఎంసీ చైర్మన్ సంధ్య, ఉపాధ్యాయులు పూర్ణచందర్ రావు, అనిల్ కుమార్, శ్రీశైలం, రమాదేవి, లక్ష్మయ్య, ఆగయ్య, శ్రీకాంత్, సరిత, భూలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నారుమడి రక్షణ చర్యలు తీసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామ శివారు నారుమడులను నార్సింగి వ్యవసాయ అధికారి యాదగిరి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో అక్కడక్కడ నారుమడులు ఆరోగ్యంగా కనిపించలేదన్నారు. నారుమడులు ఆరోగ్యంగా పెరగడానికి రైతులు సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో నారుమడులలోని నీటిని తొలగించాలని, అనంతరం నారుపై గడ్డిని పల్చగా కప్పి ఉంచాలన్నారు. తెల్లవారుజామున గడ్డిని తీసివేసి బోరు ద్వారా వేడి నీటిని అందిస్తే నారు ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. మెటల్ ఆక్సిల్, తయోమితాజిన్ మిశ్రమంతో ఒక గ్రాము మందును లీటరు నీటిలో పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారిని దివ్య, రైతులు ఉన్నారు


నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ యాదగిరి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన ఉండాలి

నర్సాపూర్ రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలని నర్సాపూర్ బీవీఆర్ఐటీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే అన్నారు. బుధవారం కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బూట్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. బీవీఆర్ఐటీలోని డీఎస్టీ, ఎన్ఎస్ఎస్టీసీ విభాగం నిపుణులు నర్సాపూర్ జిల్లా పరిషత్ బాలికల, బాలుర, చిన్న గొట్టిముక్కుల జిల్లా పరిషత్, విష్ణు హైస్కూల్, కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు నవంబర్ 11 నుంచి 19వ తేదీ వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించారు. ఐడియా థాన్ కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు మధుబాబు, పిచ్చాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోనే విజ్ఞానం

రూం టు రీడ్ ప్రోగ్రాం ఉమ్మడి రాష్ట్ర ఆఫీసర్ రాంబాబు


విద్యార్థులతో మాట్లాడుతున్న రాంబాబు

సిద్దిపేటఅర్బన్: చదువుతోనే విజ్ఞానం పెరుగుతుందని రూమ్ టు రీడ్ సంస్థ ఉమ్మడి రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని నాంచారుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. రూమ్ టు రీడ్ గ్రంథాలయాన్ని, విద్యార్థులు చదువుకుంటున్న తీరును పరిశీలించారు. కథల పుస్తకాలు చదివించి వారితో భావాన్ని చెప్పించారు. ప్రతీ అంశంలోనూ విద్యార్థులు చక్కగా ప్రతిభ కనబరుస్తున్నారని వారిని అభినందించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని భాషా పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు రవి, దేవరాజు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎన్జీఓ భవన్‌లో నాటక ప్రదర్శన

మెదక్ కలెక్టరేట్: బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై గురువారం నాటక ప్రదర్శన ఉంటుందని జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి నాటకాన్ని మెదక్ టీఎన్జీఓ భవన్‌లో ప్రదర్శిస్తారన్నారు. 23న తూప్రాన్‌లోని శివసాయి గార్డెన్స్‌లో, 24న నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ మినీ ఆడిటోరియంలో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నూతనంగా పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మిస్తున్నారు. బుధవారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఉన్న వర్తక వ్యాపారులు మార్వాడీల సంఘం తరఫున రూ.లక్ష సర్పంచ్ నత్తి మల్లేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నత్తి మల్లేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, సత్యనారాయణ, దాచారం నాగరాజు, గోపాల్, వార్డు సభ్యులు నరేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


విరాళం ఇస్తున్న మార్వాడీ సంఘం సభ్యులు

ఉన్నతి కమిటీ పాఠశాల సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న ఉన్నతి కమిటీ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఉన్నతి కమిటీ సభ్యులు బుధవారం సందర్శించారు. కమిటీ సభ్యులు టీచింగ్ డైరీ, బోధన, పాఠ్య ప్రణాళికలు, ఆన్‌లైన్ మార్కుల ఎంట్రీ విధానం పరిశీలించారు. అనంతర పాఠశాల బోధన ప్రగతిని నమోదు చేసుకున్నారు. పాఠశాలను సందర్శించినవారిలో సభ్యులు లక్ష్మణ్, మనోహర్‌రావు, ధనుంజయ్, మధుసూదన్, మహేందర్‌రెడ్డి, వేణుగోపాల్, మంజుల తదితరులు దున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నర్సాపూర్: నర్సాపూర్ మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా రవిగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహులు, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్ రెడ్డి, రమేష్‌గౌడ్, కోశాధికారిగా దశరథ, సహాయ కార్యదర్శులుగా రాజు, గోపాల్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా వీరేశం, చందర్, సర్దార్, మల్లేశం, భిక్షపతి ఎన్నికయ్యారు.


నర్సాపూర్ మండల రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న డీలర్లు

పోలింగ్ స్టేషన్లు మార్చాలి

పాపన్నపేట(మెదక్): అత్యధిక ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను మార్చాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. మెదక్ నియోజక వర్గంలో 45 పోలింగ్ స్టేషన్లలో 500 మంది కన్నా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, దీంతో వారు ఓటుహక్కు వినియోగించుకోవడంలో ఇబ్బంది అవుతుందన్నారు. వాటిని విభజించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, లేదా తక్కువ ఓటర్లు ఉన్న పక్క పోలింగ్ స్టేషన్లలో కలపాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.


'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 96

గురువారం 21-12-2023



సమష్టిగా రాణిస్తేనే...


నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మూడో వన్డే. గెలిచిన జట్టుకు సిరీస్ -10లో



గరిష్టాల వద్ద బేర్ అటాక్..!

9 నెలల్లో అతిపెద్ద నష్టం. లాభాల స్వీకరణతో సూచీలు డీలా -11లో

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మిమిక్రీ'పై ఆగ్రహ జ్వాలలు

రాజ్యసభ చైర్మన్‌ను అనుకరిస్తూ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మిమిక్రీ చేయడాన్ని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు.

వివరాలు 6లో ▸



డొనాల్డ్ ట్రంప్‌కు షాక్

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడేందుకు ట్రంప్ అనర్హుడంటూ కొలరాడో రాష్ట్ర సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

వివరాలు 6లో ▸



ఢిల్లీ నుంచి అయోధ్యకు విమానం

భవ్య రామ మందిరం ప్రారంభంకానున్న నేపథ్యంలో ఢిల్లీ నుంచి అయోధ్యకు విమాన సర్వీసులు మొదలుపెట్టనున్న ఎయిరిండియా.

వివరాలు 6లో ▸



ప్రజాస్వామ్యం ఊపిరి తీస్తున్నారు

విపక్ష సభ్యులను బహిష్కరిస్తూ పార్లమెంట్ వేదికగా ప్రజాస్వామ్యం ఊపిరితీస్తున్నారని బీజేపీపై సోనియా నిప్పులు చెరిగారు.

వివరాలు 6లో ▸

సభలో శ్వేతపత్రం ఫైర్

రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల అంశంపై శాసనసభలో వాడీవేడి చర్చ

- గత సర్కారు అడ్డగోలుగా అప్పులు చేసిందన్న డిప్యూటీ సీఎం భట్టి
- తప్పుడు నివేదికలతో రుణాలు తెచ్చారని సీఎం రేవంత్ విమర్శలు
- ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించడమే తమ ఉద్దేశమని వ్యాఖ్య
- 'శ్వేతపత్రం' అంతా తప్పుల తడక అని హరీశ్‌రావు మండిపాటు
- పెరిగిన ఆస్తులు, పంటల మాట ఎత్తరేమిటని నిలదీత
- గ్యారంటీ హామీలు అమలు చేయకుండా తప్పించుకునే సాకుతోనే ఇలా చేస్తున్నారని ధ్వజం
- హరీశ్ ప్రసంగిస్తుండగా కల్పించుకున్న సీఎం, మంత్రులు
- అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు
- శ్వేతపత్రంలో లోపాలు ఉన్నాయన్న ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్.. రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చొద్దని సూచన
- 9 గంటలకుపైగా సుదీర్ఘ చర్చ.. సభ నేటికి వాయిదా వేసిన స్పీకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన శ్వేతపత్రం అసెంబ్లీలో సెగలు రేపింది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రాష్ట్రం ఏర్పడే నాటికి 2014–15లో ప్రభుత్వ అప్పులు రూ.72,658 కోట్లు అయితే.. ఇప్పుడు రూ.6.71 లక్షల కోట్లకు చేరాయని పేర్కొంటూ ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శ్వేతపత్రం విడుదల చేయగా.. దీనిపై జరిగిన స్వల్పకాలిక చర్చలో అధికార, విపక్ష సభ్యుల నడుమ పలు సందర్భాల్లో తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దారుణంగా మార్చిందని అధికారపక్షం విమర్శలు గుప్పిస్తే.. 'శ్వేతపత్రం' అంతా తప్పులతడక అని, అప్పులతోపాటు ఆస్తులు పెరిగిన అంశాన్ని ఎందుకు చెప్పడం లేదని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నిలదీసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటో ప్రజలకు తెలియజేయాలన్నదే

మిగతా 8వ పేజీలో ▶

దారుణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

రేవంత్

అసెంబ్లీలో శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి

- 2014–15లో రాష్ట్ర ఖజానాలో 303 రోజులు నిధులు ఉండేవి
- అది 2022–23 నాటికి 33 రోజులకు తగ్గిపోయింది
- మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులతో వ్యాపారం చేస్తామని అప్పులు చేశారు.. ఎవరినీ కించపర్చే ఉద్దేశం లేదని వ్యాఖ్య

- వివరాలు 8లో ▶





రాష్ట్రాన్ని దివాలా తీయించారు

- రోజువారీ కార్యకలాపాలకూ ఓడీలు తెచ్చారు
- శ్వేతపత్రంపై లఘు చర్చకు డిప్యూటీ సీఎం భట్టి జవాబు
- అప్పు ఏ రూపంలో తెచ్చినా అప్పే.. భారం పడేది ప్రభుత్వం పైనే
- మీలా మేం చేయం.. ఆర్థిక క్రమశిక్షణతో పరిస్థితిని పట్టాలెక్కిస్తాం
- ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే శ్వేతపత్రం అన్న భట్టి
- సభ నేటి ఉదయానికి వాయిదా

- వివరాలు 8లో ▶

అప్పు రూ. 5 లక్షల కోట్లే : హరీశ్

- తప్పుల తడకగా ఆర్థిక శ్వేతపత్రం.. ఇందులో అప్పులు రూ.6,71,757 కోట్లు అని చూపించారు
- గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే ధోరణి ఇది
- తెలంగాణను దివాలా రాష్ట్రంగా దుష్ప్రచారం చేస్తే ప్రమాదకరంగా పర్యవసానాలు.. రాష్ట్రం ఆర్థికంగా బలపడటానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పునాదులు వేసిందని స్పష్టీకరణ

- వివరాలు 3లో ▶



రాష్ట్ర అప్పులు రూ. 6,71,757 కోట్లు

అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో సర్కారు వెల్లడి



- గత పదేళ్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై.. 13 అంశాలతో 42 పేజీల నివేదిక సభ ముందుకు..
- రిజర్వు బ్యాంకు, కాగ్ నివేదికలు, కేంద్ర ప్రభుత్వ లెక్కలు, బడ్జెట్ అంచనాలతో రూపకల్పన
- 1956 నుంచి 2023 వరకు అంశాల వారీగా 22 టేబుళ్లతో వివరణ
- రెవెన్యూ, ద్రవ్యలోటు, రుణాల సేకరణ, రెవెన్యూ వసూళ్లు తదితర అంశాల చేర్పు
- ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని వివరించడమే ప్రధాన ఉద్దేశమన్న సర్కారు.. ఆర్థిక సవాళ్లను బాధ్యతాయుతంగా అధిగమిస్తామని, ఆ దిశలో ఇదే మొదటి అడుగని వెల్లడి
- శ్వేతపత్రాన్ని అసెంబ్లీ ముందుంచిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

8లో



సాత్విక్



ఇషా సింగ్



హుసాముద్దీన్



అజయ్

జాతీయ క్రీడా పురస్కారాల్లో

తెలుగు వెలుగులు

సాత్విక్ సాయిరాజ్‌కు 'ఖేల్ రత్న'

అజయ్, హుసాముద్దీన్, ఇషా సింగ్‌లకు 'అర్జున'

అంతర్జాతీయస్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తున్న భారత క్రీడాకారులకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బుధవారం జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది. ఈ అవార్డుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురు క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్; బ్యాడ్మింటన్), అజయ్ కుమార్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్; అంధుల క్రికెట్), హుసాముద్దీన్ (తెలంగాణ; బాక్సింగ్), ఇషా సింగ్ (తెలంగాణ; షూటింగ్) ఉన్నారు. దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన 'ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర)లకు లభించింది. అజయ్, హుసాముద్దీన్, ఇషా సింగ్ 'అర్జున' అవార్డులు పొందారు. జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు ఈ అవార్డులు అందజేస్తారు. బ్యాడ్మింటన్‌లో సాత్విక్, చిరాగ్ గత ఐదేళ్లుగా నిలకడగా రాణిస్తున్నారు. ఈ ఏడాది మాత్రం వీరు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు.

- వివరాలు 10లో

చిన్నపల్లెపై చిన్నచూపు



రాష్ట్రంలో అతి తక్కువ ఓటర్లున్న దొంగతోగు గ్రామ పంచాయతీ

- 35 మంది ఓటర్లతో ఏర్పాటు.. ప్రస్తుతం 69 మంది
- ఇంతవరకు అంబులెన్స్ రాని గ్రామమిది
- పక్క ఊరెళ్లాలంటే 6 కిలోమీటర్లు నరకం చూడాల్సిందే
- రోడ్డు, తాగునీరు, వైద్య వసతులు లేక ప్రజల సతమతం
- బడిలోనే పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- మద్యం అమ్మని, ఏకగ్రీవ పంచాయతీలో కానరాని అభివృద్ధి
- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి'గ్రౌండ్ రిపోర్టు

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

ప్రాజెక్టులపై విచారణ.. దోషులకు శిక్ష ఖాయం



గత ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద విచారణ జరపనున్నట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు.ఈ ప్రాజెక్టుల వల్ల కొత్త ఆయకట్టు ఎంత పెరిగిందో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

- వివరాలు 3లో ▶

మూడు క్రిమినల్ బిల్లులకు ఆమోదం



బ్రిటిష్ వలస పాలకుల హయాం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులను లోక్‌సభలో బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించారు.

- వివరాలు 6లో ▶

డీహెచ్‌గా రవీంద్రనాయక్



వైద్య ఆరోగ్యశాఖకు కొత్త బాస్‌లు వచ్చారు. ప్రజారోగ్య సంచాలకులు (డీహెచ్), వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ)గా కొత్త అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. డీహెచ్‌గా డాక్టర్ రవీంద్రనాయక్‌ను, డీఎంఈగా డాక్టర్ త్రివేణిని నియమించారు.

- వివరాలు 12లో ▶


బిగ్‌బాస్-7 విజేత పల్లవి ప్రశాంత్ అరెస్టు



బిగ్‌బాస్ సీజన్-7 విజేత పల్లవి ప్రశాంత్‌ను బుధవారం రాత్రి అతని స్వగ్రామం కొల్గూరులో పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ప్రశాంత్ ఇంటివద్దకు వచ్చారు.

- వివరాలు 12లో ▶

ఇదండీ సంగతి



రాష్ట్రం సంగతి దేవుడెరుగు! మనకు భవిష్యత్తు ఉంటుందంటారా?

చేనేత సాంస్కృతిక వారసత్వం గొప్పది

- ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ చేనేత
- భూదాన్‌పోచంపల్లిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- చేనేత పరిశ్రమకు ఫ్యాషన్ డిజైనర్లు సహకరించాలని సూచన
- తమ ప్రాంతానికి చెందిన కొందరిని ఇక్కడకు తీసుకొస్తానని వెల్లడి.. ఇక్కత్ కళాకారులతో ముఖాముఖి

- వివరాలు 5లో



భారతదేశం మ్యాప్, చరఖా బొమ్మలు ఉన్న చేనేత వస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము. చిత్రంలో మంత్రులు తుమ్మల, సీతక్క




బుధవారం రాజస్తాన్ జోధ్‌పూర్‌లోని పోలో గ్రౌండ్‌లో 'జోధ్‌పూర్ పోలో సీజన్-2023' ప్రారంభం సందర్భంగా విన్యాసాలు చేస్తున్న భారత వాయుసేన విమానాలు. ఈ విన్యాసాలు చూపరులకు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కరోనా కేసుల ఉధృతి

దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. గత 24 గంటల వ్యవధిలో ఏకంగా 614 కొత్త కేసులు నమోదయ్యాయి. మే 21వ తేదీ తర్వాత ఒక్క రోజులో ఇంతగా కొత్త కేసులు నమోదవడం ఇదే తొలిసారికావడం గమనార్హం. గత 24 గంటల్లో కేరళలో ముగ్గురు కోవిడ్‌తో కన్నుమూశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 2,311కు పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. కేరళ, మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో రోజువారీ కేసుల సంఖ్యలో మరింత పెరుగుదల కనిపించింది.

- వివరాలు 6లో ▶



- 'రామేశ్వరం కాకులు' కథా సంపుటికి ప్రకటన
- అవార్డులు ప్రకటించిన అకాడమీ
- కథ, నవల, పర్యావరణ రంగాల్లో పతంజలి శాస్త్రి విశిష్ట కృషి

పతంజలి శాస్త్రికి సాహిత్య అకాడమీ పురస్కారం

సాక్షి, హైదరాబాద్: సుప్రసిద్ధ తెలుగు రచయిత తల్లావఝుల పతంజలి శాస్త్రికి 2023 సంవత్సరానికిగాను సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఆయన రాసిన 'రామేశ్వరం కాకులు'కథా సంపుటికి ఈ పురస్కారం ప్రకటించారు. బేతవోలు రామబ్రహ్మం, పాపినేని శివశంకర్, దార్ల వెంకటేశ్వరరావు జ్యూరీగా వ్యవహరించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన పత్రికా సమావేశంలో మొత్తం 24 భారతీయ భాషల పురస్కార గ్రహీతలను ప్రకటించారు. ఈసారి కేవలం ఐదు భాషల్లో కథా సంపుటాలు

మిగతా 5వ పేజీలో ▶

ట్రాన్స్ థానే క్రీక్‌లో అనర్హులకు ప్లాట్లు

కాగ్ నివేదిక వెల్లడి.. శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికమంత్రి అజిత్ పవార్

లీటర్ పాలపై రూ.5 సబ్సిడీ అందిస్తామన్న ప్రభుత్వం

మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడీసీ) విధానాలకు విరుద్ధంగా ట్రాన్స్ థానే క్రీక్ (టీటీసీ) ప్రాంతంలో అనర్హులకు నేరుగా ప్లాట్లు కేటాయించారని కాగ్ ఎత్తి చూపింది. సవరించిన భూమి ధరల అమలులో లోపాలున్నాయని, ఇది నష్టాలకు కారణమైందని తెలిపింది. ఎంఐడీసీ వెల్లడించింది. కేటాయించిన 3,284 పారిశ్రామిక ప్లాట్లలో 3,053 నిరుపయోగంగా ఉన్నాయని తెలిపింది.

- వివరాలు 7లో

క్లుప్తంగా...



సీఎం జగన్‌కు అక్షరమాల!

సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకొని నంద్యాలకి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్.. అక్షరాలతో జగనన్న జీవిత చరిత్రను వేశారు. ఏ 3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్నుతో సీఎం జగన్ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న విషయాలను చిత్రంలో రాశారు. వైఎస్సార్ మృతి, ఓదార్పు యాత్ర, ప్రజాసంకల్ప యాత్ర, సీఎంగా ప్రమాణస్వీకారం, నవరత్నాలు తదితరాలను చిత్రంలో చూపించారు. – నంద్యాల(అర్బన్)

22న 'టైంస్లాట్ టోకెన్లు' రద్దు

అదే రోజు మధ్యాహ్నం నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో 'వైకుంఠ'టోకెన్ల జారీ

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 23–జనవరి 1 వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 22న అదేరోజు శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో మంజూరు చేసే సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను రద్దు చేసింది. భక్తులు తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనంలో ఆరోజు శ్రీవారిని దర్శించుకోవచ్చు. 22న మధ్యాహ్నం 2 గంటల నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను జారీ చేయనుంది. 23న ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధుల్లో దర్శనమిస్తారు. నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. 24న తెల్లవారుజామున శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం జరుగనుంది. డిసెంబర్ 22–24 వరకు, డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు, కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమిత సంఖ్యలో బ్రేక్ దర్శనం ఇవ్వనుంది.

ఆరోగ్యానికి ఆట బాట

రెండు ప్రధాన లక్ష్యాలతో బెంచ్‌మార్క్‌లా 'ఆడుదాం ఆంధ్ర' • గ్రామీణుల్లో ఆరోగ్యకర జీవనానికి వ్యాయామం, క్రీడల వైపు ప్రోత్సాహం

- మట్టిలో మాణిక్యాలను అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టడమే లక్ష్యం
- 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 47 రోజుల పాటు క్రీడా సందడి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పీవీ సింధు ఇతర క్రీడాకారులు. చిత్రంలో మంత్రి రోజా

సాక్షి, అమరావతి: క్రీడా రంగంలో 'ఆడుదాం ఆంధ్ర'కార్యక్రమాన్ని బెంచ్ మార్క్‌లా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. దీనిద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర జీవనాన్ని పెంపొందించడంలో భాగంగా వ్యాయామం, క్రీడలను ప్రోత్సహించడం ఒక ప్రధాన కారణమైతే.. మట్టిలోని మాణిక్యాల ప్రతిభను వెలికితీసి ప్రపంచ వేదికలపై నిలబెట్టే మహోన్నత ఉద్దేశంతో ఐదు రకాల క్రీడాలను ప్రమోట్ చేస్తున్నామన్నారు. ఈ రెండు ప్రధానాంశాలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెగా క్రీడాటోర్నీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఏటా డిసెంబరులో 'ఆడుదాం ఆంధ్ర'ను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 26వతేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు పండుగ వాతావరణంలో క్రీడా పోటీలు చేపట్టాలని నిర్దేశించారు. 15 వేల గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రకు అన్ని రకాలుగా సన్నద్ధమవ్వాలని సూచించారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఐదు రకాల క్రీడలు..

ప్రజారోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. విలేజ్ క్లినిక్స్ ద్వారా ప్రివెంటివ్ కేర్‌పై దృష్టి పెట్టాం. ప్రివెంటివ్ కేర్ మరింత సమర్థంగా పని చేయాలంటే నిత్యం వ్యాయామం అవసరం. ప్రివెంటివ్ కేర్‌లో భాగంగా ప్రతి ఇంటిలో ఫిజికల్ యాక్టివిటీస్ పెరిగితే భవిష్యత్తులో అవన్నీ తగ్గుతాయి. అందుకే ఆడుదాం ఆంధ్రను ప్రాముఖ్యత ఉన్న అంశంగా గుర్తించాలి. గ్రామీణ క్రీడాకారులకు సరైన గుర్తింపు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కుతుంది. ఇందులో భాగంగానే ఐదు రకాల క్రీడలు.. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ప్రమోట్ చేయాలి. ప్రతిభగల క్రీడాకారులకు ఉన్నతస్థాయి శిక్షణ అందించే దిశగా అడుగులు వేయాలి. పోటీల ప్రారంభానికి ముందే అన్ని స్థాయిల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టాలి. 3 కిలోమీటర్ల మారథాన్ లాంటి కార్యక్రమాలు జిల్లా స్థాయిలో నిర్వహించాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రతిభకు నగదు బహుమతి

క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ విజేతలకు రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు, జిల్లాలో రూ.60 వేలు, నియోజకవర్గంలో రూ.35 వేలు చొప్పున నగదు బహుమతి ఇస్తున్నాం. ఈ క్రీడలకు సంబంధించి ద్వితీయ బహుమతి కింద రాష్ట్ర స్థాయిలో రూ.3 లక్షలు, జిల్లాలో రూ.30 వేలు, నియోజక వర్గంలో రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తాం. బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, జిల్లాలో రూ.35 వేలు, నియోజకవర్గంలో రూ.25 వేలు, ద్వితీయ బహుమతి కింద వరుసగా రూ.లక్ష, రూ.20 వేలు, రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందచేస్తాం.

రాష్ట్ర విద్యుత్ రంగంలో మరో మైలురాయి

ఎన్‌టీటీపీఎస్‌లో 8వ యూనిట్ ప్రారంభం.. 800 మె.వా వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదన సంస్థ (ఏపీజెన్‌కో) మరో మైలురాయిని అధిగమించింది. ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్)లోని 8వ యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి విజయవంతంగా శ్రీకారం చుట్టింది. కొత్తగా నిర్మించిన 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ 72 గంటలపాటు నిర్విరామంగా వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేయడంతో.. బుధవారం ఉదయం 10.45 గంటలకు విద్యుత్ వాణిజ్య ఉత్పత్తి (కమర్షియల్ ఆపరేషన్ డేట్– సీవోడీ) ప్రారంభమైంది. ఏపీజెన్‌కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు సమక్షంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది హర్షధ్వానాల మధ్య ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, ఏపీ డిస్కంల ప్రతినిధులు బుధవారం ఉదయం సీవోడీ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,760 నుంచి 2,560 మెగావాట్లకు పెంచుకుని ఏపీజెన్‌కోలో డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ అతి పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఆవిర్భవించింది. డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో స్టేజ్–5 కింద 800 మెగావాట్ల సామర్థ్యంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన ఎనిమిదో యూనిట్ కోవిడ్ లాంటి కష్టకాలాన్ని, అనేక సవాళ్లను అధిగమించి వాణిజ్య ఉత్పత్తి సాధించింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ కేక్ కట్‌చేసి, కొత్త యూనిట్ నిర్మాణంలో భాగస్వాములై సేవలందించిన పలువురిని జ్ఞాపికలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించడంవల్లే ఎనిమిదో యూనిట్ నిర్మాణపనులు పూర్తిచేసి సీవోడీ చేసుకోగలిగామని ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు చెప్పారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సహించడంవల్లే ఇది సాధ్యమైందన్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

8,789 మెగావాట్లకు పెరిగిన జెన్‌కో సామర్థ్యం

డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ సీవోడీతో జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 6,610 మెగావాట్లకు పెరిగింది. జెన్‌కో మొత్తం ఉత్పాదన సామర్థ్యం 8,789 మెగావాట్లకు పెరిగింది. ప్రస్తుతం జెన్‌కోకి 6,610 మెగావాట్ల థర్మల్, 1,773.600 మెగావాట్ల హైడల్, 405.426 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. మొత్తం రాష్ట్ర గ్రిడ్ డిమాండ్‌లో 55 నుంచి 60% వి ద్యుత్ అందించే సామర్థ్యం ఏపీ జెన్‌కోకు వచ్చింది.

నిస్సహాయుల పట్ల కరుణ చూపాలి..

- ఆకాశమంత సహనం ఉండాలి
- అప్పుడే దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటాం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం, ఆకాశమంత సహనంతో మెలగడం.. ప్రతి మనిషి అలవాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అప్పుడే మనం దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవ మత పెద్దలతో కలిసి కేక్ కట్‌చేసి, క్యాండిల్స్ వెలిగించి తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'క్రిస్మస్ పండుగ వస్తున్న శుభసందర్భంలో ఈ సాయంత్రం పూట అడ్వాన్స్‌గా క్రిస్మస్‌ను జరుపుకొంటున్నాం. ఈ మంచి రోజులో ఇక్కడికి వచ్చిన అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలే కాకుండా మొత్తం తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మీ అన్నగా, తమ్ముడిగా మెర్రీ క్రిస్మస్ ఇన్ అడ్వాన్స్ తెలియజేస్తున్నాను. దేవుని విషయంలో మనందరికీ తెలిసిన ఒక్కటే ఒక్క విషయం... మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం. ఆకాశమంత సహనం ప్రతి మనిషిలోనూ అలవాటు చేసుకోవడం. అవధులు లేని త్యాగం, మరీ ముఖ్యంగా శత్రువుల పట్ల కూడా క్షమాగుణం. ఇవన్నీ కష్టమైన విషయాలు అయినప్పటికీ ఆ ప్రతి విషయాన్ని మనం ఎప్పుడు గ్రహిస్తామో, ఎప్పుడైతే వాటిని మనసారా పాటించాలని తాపత్రయపడతామో.. అప్పుడు మనం కూడా దేవుడు నచ్చిన బిడ్డలుగా ఉంటాం. దేవుడు ఆ మనసు మనందరికీ ఇవ్వాలని, రాష్ట్రాన్ని, ప్రజలను ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా ఇక్కడున్నవారితోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అందరికీ మరోసారి మెర్రీ క్రిస్మస్ తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నా..'అని చెప్పారు. రాష్ట్రంలో పలు రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని సీఎం వైఎస్ జగన్ సన్మానించి, అవార్డులు అందజేశారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన విందులో క్రైస్తవ మతపెద్దలు, దైవసేవకులతో కలిసి సీఎం జగన్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

- తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ సంబరాలు

సాక్షి,అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని ఈనెల 21 (గురువారం) రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో భారీఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా ఏర్పాట్లుచేశాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మొక్కలు నాటడంతో పాటు అన్నదానం, వస్త్రదానాలు చేయనున్నారు. అలాగే, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. రక్తదాన శిబిరాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది అభిమానులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సైతం పాల్గొంటారన్నారు. అలాగే, వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం ఉ.9.30 గంటలకు దివంగత సీఎం వైఎస్సార్‌కి నివాళి అర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, కేక్ కటింగ్, దుస్తులు, బహుమతుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇక ఇప్పటికే రెండ్రోజులు ముందే దేశ, విదేశాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రారంభించారని అప్పిరెడ్డి చెప్పారు.

బాబు ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు నేరస్వభావాన్ని ఆపాదించడానికి వీల్లేదని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ హైకోర్టుకు నివేదించారు. ఉచిత ఇసుక విధానంలో తప్పులు జరిగి ఉంటే కేసు నమోదుకు మూడేళ్లు ఎందుకు ఆగారని ప్రశ్నించారు. ఇన్నేళ్ల తరువాత కేసు ఎందుకు నమోదు చేశారన్న దానికి కారణాలు చెప్పడం లేదన్నారు. ఇసుక విధానం ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూరినట్లు సీఐడీ ఎలాంటి ఆధారాలను చూపలేదని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అందువల్ల అవినీతి నిరోధక చట్టం కింద చంద్రబాబును ప్రాసిక్యూట్ చేయాలంటే సెక్షన్ 17(ఏ) కింద గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పిటిషనర్ చంద్రబాబు వయసు, అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉచిత ఇసుక పథకం పేరుతో కోట్ల రూపాయల మేర ఖజానాకు నష్టం కలిగించినందుకు సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

క్లుప్తంగా...

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. గత పదేళ్ల తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన శ్వేతపత్రంలో ప్రధానంగా రాష్ట్ర అప్పులపైనే దృష్టి కేంద్రీకరించిందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.72 వేల కోట్ల అప్పు ఉంటే.. అదే 2023 నాటికి రూ.6.71 లక్షల కోట్లకు పెరిగిందని తమ్మినేని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందులో కార్పొరేషన్ సంస్థల అప్పులు కూడా ఉన్నాయన్నారు. అప్పులు తీర్చడానికి ప్రజల నుంచి వసూలు చేస్తామని షరతులు పెట్టి ఏకంగా ఆర్థికసంస్థల నుంచి 10.75% అధిక వడ్డీకి తెచ్చారని, దీని వల్ల ప్రజలపై వడ్డీ భారం విపరీతంగా పడుతుందని తమ్మినేని తెలిపారు.

కేసీఆర్ కుటుంబ అవినీతిపై దర్యాప్తు చేయండి

మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్ కుటుంబ పాలన, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసం, అవినీతిపై దర్యాప్తు చేయాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ బుధవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీని వెంటనే ప్రారంభించాలన్నారు. 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ జీవోను వెంటనే అమలుచేసి ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 150 అడుగుల సేవాలాల్ విగ్రహం, సేవాలాల్ మందిర నిర్మాణం, బంజారా మ్యూజియం, రీసెర్చ్, కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు పది ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు.

ఎంఐఎం, సీపీఐ పక్షనేతలుగా అక్బరుద్దీన్, కూనంనేని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభలో ఎంఐఎం పక్షనేతగా అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ పక్ష నేతగా కూనంనేని సాంబశివరావు పేర్లను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభలో ప్రకటించారు. కాగా, బుధవారం శాసనసభ ప్రారంభం కాగానే, తొలుత ఇటీవల మృతిచెందిన మాజీఎమ్మెల్యేలు రామన్నగారి శ్రీనివాస్‌రెడ్డి(రామాయంపేట), కొప్పుల హరీశ్వర్‌రెడ్డి(పరిగి), కుంజా సత్యవతి(భద్రాచలం)కి సంతాపాన్ని తెలుపుతూ తీర్మానం చేశారు.

అప్పు 5 లక్షల కోట్లే



తప్పుల తడకగా ఆర్థిక శ్వేతపత్రం

- ఇందులో అప్పులు రూ.6,71,757 కోట్లు అని చూపించారు
- గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే ధోరణి ఇది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు
- తెలంగాణను దివాలా రాష్ట్రంగా దుష్ప్రచారం చేస్తే ప్రమాదకరంగా పర్యవసానాలు
- విశ్వసనీయత దెబ్బతింటుంది, పెట్టుబడులు రావు
- కాళేశ్వరంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమంటూ సవాల్
- రాష్ట్రం ఆర్థికంగా బలపడటానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పునాదులు వేసిందని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం అవాస్తవాలను ప్రచారం చేస్తోందని, ఆర్థిక శ్వేతపత్రం తప్పుల తడకగా, అంకెల గారడీలా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆర్థికంగా పటిష్టంగా ఉన్న తెలంగాణను దివాలా తీసిన రాష్ట్రంగా దుష్ప్రచారం చేస్తే, దాని పర్యవసానాలు చాలా ప్రమాదకరంగా ఉంటాయని పేర్కొన్నారు. 'శ్వేతపత్రంలో అప్పులు రూ. 6,71,757 కోట్లు అని చూపించినా.. అందులో స్పెషల్ పర్పస్ వెహికిల్స్ కింద తీసుకున్న మొత్తం రూ.1,54,876 కోట్లు వారే భరిస్తారని మీరే పేర్కొన్నారు. ఈ లెక్కన అప్పు రూ.5,16,881 కోట్లు అయితే.. డిసెంబర్ నుంచి మార్చి వరకు తీసుకునే రుణాలు రూ.16 వేల కోట్లు కూడా దీంట్లో కలిపారు. అవి తీసేస్తే వాస్తవ అప్పు రూ.5 లక్షల కోట్లు మాత్రమే..'అని హరీశ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే ధోరణి ఈ శ్వేతపత్రంలో కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే మార్కెట్‌లో తెలంగాణకు ఏర్పడ్డ విశ్వసనీయత దెబ్బ తింటుందని, పెట్టుబడులు రాకుండా పోతాయని చెప్పారు. బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు.

శ్వేతపత్రాలా? హామీల ఎగవేత పత్రాలా?

'దివాలా.. దివాలా అని ప్రభుత్వమే దిక్కుమాలిన ప్రచారం చేస్తే, రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు ఆగి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాక, రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీయడం అవివేకం. శ్వేతపత్రంలో ప్రగతి కోణం కన్నా, రాజకీయ ప్రత్యర్థుల మీద దాడి, వాస్తవాల వక్రీకరణ కోణమే ఎక్కువగా కనిపిస్తోంది. ఆర్థికంగా ఆరోగ్యంగా ఉన్న రాష్ట్రాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం అప్పులు, దివాలా, బీమారు రాష్ట్రంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. మీరు విడుదల చేస్తున్నవి శ్వేతపత్రాలా? లేక మీరిచ్చిన హామీల ఎగవేత పత్రాలా? అనే అనుమానం కలుగుతోంది..'అని హరీశ్ అన్నారు.

సీఎం గురుశిష్యులు వండి వార్చారు

'సీఎం రేవంత్‌రెడ్డి పాత గురుశిష్యులు ఈ శ్వేతపత్రాన్ని వండి వార్చారు. సస్పెండ్ అయిన ఏపీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈ శ్వేతపత్రం తయారీ వెనుక ఉన్నారు. (దీనికి మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం చెప్పగా అవసరమైతే తయారు చేసిన వాళ్ల పేర్లు కూడా చెప్తామని హరీశ్‌రావు అన్నారు) తెలంగాణ అధికారులపై నమ్మకం లేక ఆంధ్రా రిటైర్డ్ అధికారులతో నివేదిక తయారు చేయించారు. అప్పు, జీఎస్‌డీపీ నిష్పత్తిని చూపకుండా అప్పు రెవెన్యూ రాబడని చూపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యయంలో తెలంగాణ వాటా కింద 1956–57 నుంచి 2013–14 వరకు 41.68 శాతం ఖర్చు చేసినట్లు గంపగుత్త లెక్క తీశారు. ఆదాయం, ఖర్చు లెక్కలపై హౌస్ కమిటీ వేయాలి..'అని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టులన్నింటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

'మా హయాంలో నిర్మించిన ప్రాజెక్టులన్నింటిపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. నిప్పులో కాల్చితేనే బంగారం విలువ తెలుస్తుంది. కొత్త సీఎంకు విషయం అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. కాళేశ్వరం కార్పొరేషన్ కింద తీసుకున్న అప్పు కేవలం కాళేశ్వరం కోసమే ఖర్చు చేయలేదు. పాలమూరు ప్రాజెక్టుకు కూడా ఖర్చు చేశాం..'అని తెలిపారు.

ఆస్తులు పెరిగిన విషయం దాచిపెడుతున్నారు

'విద్యుత్ సంస్థలు తీసుకున్న రుణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల స్థాపనకు, పంపిణీ వ్యవస్థల బలోపేతానికి ఖర్చు చేయడం జరిగింది. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత సంస్థలు తిరిగి ఆ రుణాలను చెల్లిస్తాయి. (మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకొని మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇచ్చి రైతులు, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయాలనేదేనా గత ప్రభుత్వ ఉద్దేశం అని నిలదీశారు) ఎంతసేపు అప్పులు అప్పులు అని నాణానికి ఒకవైపే చూపిస్తున్నారు. నాణానికి రెండో వైపు ఆస్తులు పెరిగాయి. ఈ విషయం దాచిపెడుతున్నారు..'అంటూ హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంపద సృష్టించి ఆస్తులు కూడబెట్టాం

'గత ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం చట్టం నిబంధనల పరిధి దాటకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించి, పరిమితి మేరకు మాత్రమే రుణాలు తీసుకుంది. సంపద సృష్టించి ఆస్తులు కూడబెట్టింది. 200 టీఎంసీల నీరున్న రిజర్వాయర్లు నిర్మించింది. (ఈ సమయంలో మంత్రి కొండా సురేఖ జోక్యం చేసుకొని సచివాలయం, ప్రగతి భవన్, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వంటివి కమీషన్ల కోసమే నిర్మించారని ఆరోపించారు) విద్యుత్ సంస్కరణల పేరిట బోర్లు, బావులకు మీటర్లు పెడితే ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించి అదనంగా 0.5 శాతం రుణాలు తీసుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది. కానీ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా కేసీఆర్ దానికి అంగీకరించలేదు. ఒకవేళ ఆ నిబంధనకు అంగీకరించి ఉంటే రూ.35 వేల కోట్లు రాష్ట్రానికి అదనంగా వచ్చేవి. (ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మోటార్లకు బిల్లులు వసూలు చేసే నిబంధన విద్యుత్ సంస్కరణల్లో లేదన్నారు. దీంతో కొద్దిసేపు ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది) వివిధ కార్పొరేషన్లు తీసుకున్న రుణాలను కూడా ప్రభుత్వ రుణాలుగా చిత్రీకరించి గగ్గోలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేషన్లు తీసుకునే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీని మాత్రమే ఇస్తుంది..'అని హరీశ్‌రావు చెప్పారు.

బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ

'రాష్ట్రం ఆర్థికంగా బలపడడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం బలమైన పునాదులు వేసింది. పెద్ద నోట్ల రద్దు, ఆర్థిక మాంద్యం, కరోనా వంటి సంక్షోభాలను తట్టుకుని బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ నిలిచింది. అప్పులు తక్కువ తీసుకున్న రాష్ట్రాల్లో కింద నుంచి తెలంగాణ ఐదో స్థానంలో ఉంది. కేంద్రం నుంచి రావలసిన రూ.లక్ష కోట్లు రాకపోవడం వల్ల ఆర్థికంగా రాష్ట్రానికి ఇబ్బంది కలిగింది. ఎస్‌పీవీలను అప్పులుగా తప్పుగా చూపించారు. ఏ ప్రభుత్వం వద్ద డబ్బులు కట్టల రూపంలో బీరువాల్లో ఉండవు. (మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని.. బంగారు తెలంగాణ అంటూ గోబెల్స్ ప్రచారం చేశారని, ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి కల్పించారని అన్నారు) కేంద్రం అనుమతి లేకుండా రాష్ట్రాలు అప్పులు తీసుకోజాలవు..'అని స్పష్టం చేశారు.

ఆస్తులు పెంచాం.. అభివృద్ధి చేశాం

- 'పదేళ్లలో తెలంగాణ ఆస్తులు' పేరిట నివేదిక విడుదల చేసిన బీఆర్ఎస్
- కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రానికి సమాధానమని ప్రకటన
- తప్పుడు లెక్కలతో మోసం చేసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ పిలుపు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై విడుదల చేసిన శ్వేతపత్రానికి సమాధానంగా భారత్ రాష్ట్ర సమితి 'పదేళ్లలో సృష్టించిన తెలంగాణ ఆస్తులు'అంటూ 51 పేజీల నివేదికను విడుదల చేసింది. రంగాల వారీగా పదేళ్ల పాలనలో తాము సృష్టించిన ప్రభుత్వ ఆస్తుల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కు పెంచడంతో పాటు రూ.1649 కోట్లతో జిల్లా కలెక్టరేట్ భవనాలు నిర్మించామని పేర్కొంది. 2014కు ముందు ప్రస్తుతం రంగాల వారీగా సృష్టించిన మౌలిక వసతుల వివరాలను వెల్లడించింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల సంఖ్య పెంపు, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, చెత్త సేకరణ వాహనాలు, గురుకులాల సంఖ్య పెంపు వంటి అంశాలను గణాంకాలతో సహా ప్రస్తావించింది. విద్య, పారిశ్రామిక పెట్టుబడులు, హరితహారంతో పాటు ఆధ్యాత్మిక సంపద పెంచామంటూ ఆ నివేదికలో వివరాలను పొందుపరిచింది.

కొత్త ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు

ఆరోగ్య శాఖ ద్వారా పెరిగిన బెడ్ల సంఖ్య, కొత్త ఆసుపత్రులు, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు తదితరాలను వివరంగా పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నీటిపారుదల రంగంలో సాగించిన నిర్మాణాలు, వాటికి అయిన ఖర్చును నివేదికలో ప్రకటించింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో సహా పదేళ్ల కాలంలో చేపట్టిన అనేక పనులు, వాటికి వెచ్చించిన మొత్తాన్ని గణాంకాలతో సహా వివరించింది. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా పని చేతకాక అప్పుల పేరు చెప్పి తెలంగాణ సమాజాన్ని మోసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా బీఆర్ఎస్ పిలుపునిచ్చింది.

ప్రాజెక్టులపై విచారణ.. దోషులకు శిక్ష ఖాయం

- మేడిగడ్డలో నేరపూరిత నిర్లక్ష్యం
- కరెంటు మీటర్ల విషయంలో హరీశ్ చెప్పేవన్నీ అబద్ధాలే
- గత పాలనలో పౌరసరఫరాల శాఖ పనితీరు లోపభూయిష్టం
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద పూర్తిస్థాయిలో విచారణ జరపనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టుల వల్ల కొత్త ఆయకట్టు ఎంత పెరిగిందో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే వచ్చిందన్నారు. దీనిపై తప్పనిసరిగా విచారణ జరుగుతుందని, దోషులను శిక్షిస్తామని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాజెక్టు, రూ.7,500 కోట్లతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుతో కొత్త ఆయకట్టు జీరో అని అన్నారు. మేడిగడ్డలో జరిగింది నేరపూరిత నిర్లక్ష్యమని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు. అక్టోబర్ 21న మేడిగడ్డలోని ఏడవ బ్లాక్‌లో ఐదు అడుగుల మేర కుంగితే సీరియస్‌గా విచారణ జరగలేదన్నారు. ఇప్పటి వరకు నాటి సీఎం ఒక్క మాట మాట్లాడలేదని , నిర్మాణ సంస్థ, అధికారులు అందరూ అప్పటి సీఎం డిజైనింగ్ ప్రకారమే నిర్మించామని చేతులెత్తేశారన్నారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి, తెలంగాణను అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని ఆయన ధ్వజమెత్తారు.

హరీశ్ చెప్పేవన్నీ అబద్ధాలే

వ్యవసాయానికి విద్యుత్ మీటర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు అబద్ధాలు చెపుతున్నారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. రైతుల నుంచి బిల్లులు వసూలు చేసే అవకాశమే లేదని, తాను పార్లమెంట్ కమిటీలో సభ్యుడిగా ఉన్నందున తనకు అవగాహన ఉందని చెప్పారు. గత ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ పనితీరు లోపభూయిష్టంగా ఉందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. బియ్యం పంపిణీ, ధాన్యం సేకరణకే పరిమితమైన పౌరసరఫరాల శాఖలో 2018–19 నుంచి ఇప్పటి వరకు ఆడిట్ జరగలేదన్నారు. గత పదేళ్లుగా కేంద్రం ఇచ్చే ఐదు కిలోల బియ్యానికి అదనంగా ఒక కిలో బియ్యం మాత్రమే ఇస్తున్నప్పటికీ, రూ. 56వేల కోట్ల అప్పు చేశారని తెలిపారు. ఇవి కాకుండా రూ. 11,500 కోట్ల నష్టాలు ఉన్నాయని వివరించారు. ఈ మొత్తాలకు సంవత్సరానికి వడ్డీ కిందనే రూ. 3వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా మిల్లర్ల వద్ద రూ. 22వేల కోట్ల విలువైన ధాన్యాన్ని నిల్వ చేశారని, అందులో ఎంత మేర ఫిజికల్‌గా ఉందో లెక్కలు చూడాలన్నారు. పేదలకు పంపిణీ చేసే బియ్యంలో కూడా నాణ్యత లేదని, 70 శాతం కార్డుదారులు ఆ బియ్యాన్ని తినడం లేదన్నారు. రూ.39 కిలో చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేస్తూ పేదలకు పంపిణీ చేస్తుంటే క్వాలిటీ బాగోలేక ఆ బియ్యం నిరుపయోగం అవుతున్నాయన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు బియ్యం కావాలని కోరినా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని ఆయన ధ్వజమెత్తారు.



రేవంత్‌ను కలిసిన జాజుల

బీసీ కులగణనపై సీఎం హామీ ఇచ్చారు

అసెంబ్లీ కార్యాలయంలో రేవంత్‌ని కలిసిన జాజుల, వివిధ బీసీ సంఘాల నాయకులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ కులగణనను కచ్చితంగా చేస్తామని, బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా రిజర్వేషన్లను పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ కులాల లెక్కలు తీస్తామని సీఎం హామీ ఇచ్చారని, కోర్టులో న్యాయపరమైన అంశాలు ఉన్నందున ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి గ్రామపంచాయతీ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక దీనిపై ఒక ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తామని సీఎం చెప్పారని ఆయన పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని వివిధ బీసీ సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలియజేశారు. ఈ ప్రతినిధుల బృందంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కో చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

తెలంగాణ లాభదాయక రాష్ట్రమే

- ఆర్థిక పరిస్థితి తక్కువ చేసి చూపుతూ పరువు తీయొద్దు... ఎంఐఎం సభా పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ
- శ్వేతపత్రం అంతా తప్పుల తడక లెక్కలని విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తక్కువ చేసి చూపుతూ తెలంగాణ పరువు తీసే ప్రయత్నం చేయొద్దని ఎంఐఎం సభా పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడక లెక్కలు చూపించిందని విమర్శించారు. శ్వేతపత్రంపై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం తెలంగాణను అవమానించే విధంగా వ్యవహరించవద్దని హితవు చెప్పారు. తెలంగాణ ముమ్మాటికీ లాభదాయక రాష్ట్రమేనని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విభజన తరువాత బడ్జెట్‌కు సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిన వ్యయాలపై శ్వేతపత్రంలో చూపిన లెక్కల్లో తేడాలను ఉదహరించారు. శ్వేతపత్రంలో ఉన్న లెక్కలకు, ఆర్‌బీఐ, కాగ్ నివేదికల్లో పొందుపరిచిన లెక్కలకు పొంతనే లేదన్నారు.

అలాగైతే కర్ణాటకలో కూడా పొంతనలేదు

రాష్ట్ర బడ్జెట్ లెక్కలతో పాటు కర్ణాటక బడ్జెట్ లెక్కల్లో కూడా శ్వేతపత్రంలోని లెక్కలకు, కాగ్ నివేదిక లెక్కలకు కూడా పొంతన లేదని అక్బరుద్దీన్ విమర్శించారు. తెలంగాణ వచ్చాక విద్యుత్, సాగునీరు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు, ప్రజలకు సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అందాయని వివరించారు. అప్పులు పెరిగినా.. గణనీయంగా అభివృద్ధి జరిగిందన్నారు. చివరికి ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లకు సంబంధించి కూడా శ్వేతపత్రానికి, కాగ్ నివేదికకు చాలా తేడా ఉందన్నారు. ఈ రెండింటితో పాటు ఆర్‌బీఐ నివేదికల్లో దేన్ని ప్రామాణికంగా తీసుకోవాలని ప్రశ్నించారు. బ్యూరోక్రాట్లు అధికార పార్టీ మన్ననల కోసం తప్పుడు లెక్కలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, దీనిపై విచారణ జరిపి, అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఆడిట్ పూర్తయితేనే కాగ్ రిపోర్టులో సరైన లెక్కలు ఉంటాయని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పగా పదేళ్ల క్రితం నాటి ఆదాయ వ్యయాల ఆడిట్ కూడా పూర్తి కాలేదా అని అక్బరుద్దీన్ నిలదీశారు.

కేంద్రం కూడా అప్పులు చేసిందన్న అక్బరుద్దీన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన అప్పులు ఏకంగా 244 శాతం పెరిగాయని అక్బరుద్దీన్ వివరించారు. పదేళ్ల క్రితం రూ. 44,25,347 కోట్లు ఉన్న అప్పులు రూ. 1,52, 53,915 కోట్లకు పెరిగాయని చెప్పారు. దీన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కరోనా సమయంలో ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితుల్లో కూడా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం ఆగలేదన్నారు. ఈ సందర్భంగా వార్షిక వృద్ధి రేటు ను, ఆర్థిక వృద్ధి రేటును వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్. చిత్రంలో గుత్తా, శ్రీధర్‌బాబు తదితరులు

ఒకే ప్రాంగణంలో అసెంబ్లీ ఉభయ సభలు

ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో స్పీకర్, మండలి చైర్మన్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని కమిటీ హాల్లో బుధవారం సాయంత్రం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ మాదిరిగానే శాసనసభ, శాసన మండలి ఒకే చోట ఉండాలని ప్రభుత్వం ఆలోచన చేయడాన్ని ఆహ్వానించారు. రెండు సభల సమావేశ మందిరాలు ఒకేచోట ఉండటం వల్ల సభ్యులు, మంత్రులకు, అధికారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు అన్ని పనులు పూర్తి చేసుకొని ఇక్కడే బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. ఆర్అండ్‌బీతో పాటు ఇతర శాఖల అధికారులు పనులను వేగవంతంగా చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ రంగంపై స్వల్పకాలిక చర్చ

అనంతరం శాసనసభ నిరవధికంగా వాయిదా పడే అవకాశం

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఆరో రోజు సమావేశాల్లో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు తెలంగాణ విద్యుత్ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయనుంది. ఈ శ్వేత పత్రంపై స్వల్పకాలిక చర్చ అనంతరం శాసనసభ నిరవధికంగా వాయిదా పడే అవకాశం ఉంది. బుధవారం రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై స్వల్పకాలిక చర్చ అనంతరం శాసనసభను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. గురువారం జరిగే స్వల్పకాలిక చర్చలో బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొంటారు.

గత పాలనపై శ్వేత పత్రం సరే.. మీరేం చేస్తారో చెప్పండి

- బీజేపీ సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని బీజేపీ సభ్యుడు మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వంపై శ్వేతపత్రాలు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తుందో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ ఏలుబడిపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన. బడ్జెట్‌లో 35 శాతం వేతనాలకే వెచ్చించాల్సిన అవసరముందని, సంక్షేమ పథకాలకు నిధులు ఎలా సమకూరుస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగులకు మూడు డీఏలు ఇవ్వాల్సి ఉందని, కొత్త పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఆదాయ సమీకరణపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్రం సహకరించినా అప్పులు చేసిన బీఆర్ఎస్ సర్కారు

గత బీఆర్ఎస్ హయాంలో కూడా రాష్ట్రానికి కేంద్రం అనేక విధాలుగా సహకరించిందని మహేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట అనాలోచితంగా అప్పులు చేసిందని విమర్శించారు. తప్పుడు నివేదికలు రూపొందించడం వల్లే ప్రపంచబ్యాంకు వద్దకు రుణానికి వెళ్లలేదన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమని కేంద్ర సర్కారు ఆదేశించిదన్న బీఆర్ఎస్ నేతల మాటల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలి

'గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా ధ్వంసమైన రాష్ట్రాన్ని ఎలా పునర్నిర్మిస్తారో చెప్పాల్సిన బాధ్యత సీఎంపై ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగం కావడంపై సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి మద్దతుగా ఉంటాం'అని బీజేపీ సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సభలో వ్యాఖ్యానించారు.


విద్య, వైద్యంపై నిర్లక్ష్యం: కాంగ్రెస్ సభ్యుడు మదన్‌మోహన్‌రావు

గత ప్రభుత్వం పేదలకు కీలకమైన విద్య, వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ శాసనసభ్యుడు మదన్‌మోహన్‌రావు శ్వేతపత్రంపై జరిగిన చర్చలో ఆరోపించారు. ఎంతో ప్రాధాన్యమైన విద్యకు 7.6 శాతం, వైద్యానికి 6.21 శాతం కేటాయించడం దారుణమన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏ సామాన్యుడికీ మేలు జరగలేదన్నారు.

ఏం చేసినా మీకు ఫలితం లేదు.. ✗ పదవి కొనుక్కునే ఖర్మ మాకు లేదు

హరీశ్‌రావు, రాజగోపాల్ రెడ్డి మధ్య మాటల యుద్ధం

- అసెంబ్లీలో శ్వేత పత్రంపై చర్చ సందర్భంగా అధికార విపక్ష సభ్యుల వాగ్వాదం..
- స్పీకర్ పోడియం వద్ద బీఆర్ఎస్ సభ్యుల అభ్యంతరం
- కోమటి రెడ్డి బ్రదర్స్‌పై హరీశ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్



సాక్షి, హైదరాబాద్: 'మీ పార్టీలో కేసీఆర్ తర్వాత కేటీఆర్‌కే ప్రాధాన్యం.. మీరెంత కష్టపడ్డా ఫలితం లేదు'... అంటూ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, 'మీ పార్టీ మాదిరి రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి కొనుక్కునే ఖర్మ మాకు లేదు'అంటూ బీఆర్ఎస్ సభ్యుడు మాజీ మంత్రి హరీశ్‌రావు ఒకరిపై ఒకరు చేసుకున్న రాజకీయ విమర్శలు బుధవారం శాసనసభలో దుమారం రేపాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభా వాతావరణం కొద్దిసేపు వేడెక్కింది. గత బీఆర్ఎస్ పాలనపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంపై సభ చర్చ చేపట్టింది. హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఇది శ్వేతపత్రం కాదు.. కోత పత్రమంటూ ఎద్దేవా చేశారు. ఈ దశలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, 'హరీశ్‌రావు ఎంత కష్టపడ్డా ఫలితం లేదు. కేసీఆర్ తర్వాత కేటీఆర్ ఉంటారు. మిమ్మల్ని ఎంత వాడుకోవాలో అంత వాడుకుంటారు'అని వ్యాఖ్యానించారు.

హరీశ్‌కు మేనమామ పోలికలు.. అందుకే అబద్ధాలు: రాజగోపాల్‌రెడ్డి

ఇదే క్రమంలో 'ఆయనకు మేనమామ పోలికలు వచ్చాయి. కేసీఆర్ చెప్పినట్టే అబద్ధాలు చెబుతున్నారు'అని కోమటిరెడ్డి అనడంతో బీఆర్ఎస్ పక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సభను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినా, బీఆర్ఎస్ సభ్యులు వెనక్కు తగ్గలేదు. సభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ 'ప్రభుత్వంపై బీఆర్ఎస్ సభ్యులు ఎదురుదాడికి దిగడం సరికాదు... స్పీకర్‌ను బెదిరించడం ఏమిటి?'అని ఆక్షేపించారు. 'పదేళ్లు విపక్షంలో కూర్చున్నాం... రెండు రోజులకే మీకు అసహనం వస్తే ఎలా'అంటూ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. అప్పటికీ విపక్ష సభ్యులు వెనక్కు తగ్గలేదు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలకు సమాధానం చెప్పేందుకు హరీశ్‌రావుకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు.

రూ. 50 కోట్లకు పీసీసీ పదవి కొనుక్కునే ఖర్మ పట్టలేదు: హరీశ్

తిరిగి తన ప్రసంగాన్ని కొనసాగించిన హరీశ్‌రావు 'పీసీసీ పదవిని రూ. 50 కోట్లకు కొనుక్కునే ఖర్మ మాకు పట్టలేదు. పదవి కొనుక్కున్నారనే మాట అన్నది కోమటి రెడ్డి బ్రదర్సే'అనడంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. ఇరుపక్షాల వాగ్వాదంతో సభ మరింత వేడెక్కింది. హరీశ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు పట్టుబట్టారు. లేదంటే రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు. రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటే తాను విత్‌డ్రా చేసుకుంటానని హరీశ్‌రావు అన్నారు. ఇరుపక్షాల మధ్య వాగ్వాదం తారస్థాయికి చేరుతున్న తరుణంలోనే హరీశ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

బావ.. బామ్మర్దుల గురించి చెప్పాలా?: మంత్రి కోమటిరెడ్డి

హరీశ్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'రేవంత్ రెడ్డి నేతృత్వంలో మా పార్టీ ముందుకెళ్తోంది. మీకేం పని లేదా? మీ పదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పకుండా మాపై విమర్శలేంటి?'అంటూ మండిపడ్డారు. హరీశ్‌ను ఉద్దేశిస్తూ 'మీ బావ... బామ్మర్దులు ఎంత కొట్టుకున్నారో చెప్పాలా...?'అంటూ ప్రశ్నించారు. ఇన్నేళ్లు దోచుకున్న విషయాలు బయటికొస్తున్నాయనే భయంతో సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు.



నీ లోపల తవ్వు, లోపల మంచితనపు ఊట ఉంది:
నువ్వు తవ్వితే అది ఎప్పుడూ పైకి రావడానికి సిద్ధంగా ఉంది.
- మార్కస్ అరేలియస్

సాక్షి
గురువారం, 21 డిసెంబర్ 2023

భద్రం... బీ కేర్‌ఫుల్!

పారాహుషార్ గంట మరోసారి మోగింది. దేశంలో కోవిడ్ కేసులు మళ్ళీ పెరుగుతున్నాయి. మే 21 తర్వాత ఎన్నడూ లేనంత అత్యధిక స్థాయిలో 614 కొత్త కరోనా ఇన్ఫెక్షన్ కేసులు వచ్చాయి. కరోనా వైరస్ కొత్త వేరియంట్ జెఎన్.1 కేసు తొలిసారిగా కేరళలో బయటపడిన కొద్దిరోజుల్లోనే ఆ రాష్ట్రంలో నలుగురు బలయ్యారు. ఒక్క బుధవారమే దేశవ్యాప్తంగా 341 కొత్త కోవిడ్ ఇన్ఫెక్షన్ కేసులు నమోదు కావడం, అందులో 292 కేసులు కేరళ నుంచి వచ్చినవే కావడంతో తక్షణమే అప్రమత్తత అవసరమైంది. ఈ నేపథ్యంలోనే వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాల్సి వచ్చింది. భయాందోళనలకు గురి కానక్కర్లేదు కానీ, జాగ్రత్తలు మాత్రం తప్పవనేది ఇప్పుడు మన ఆరోగ్య మంత్రం.

సరిగ్గా మూడేళ్ళ క్రితం మొదలైన కరోనా ఇప్పటికీ ఏదో ఒక రూపంలో మానవాళిని వేధిస్తూనే ఉంది. చిన్నాచితకా అలల్ని పక్కనపెడితే, రెండు ప్రధాన కరోనావేవ్‌లు మన దేశంలో జన జీవితాన్ని ఎంతగా అతలాకుతలం చేశాయో అందరికీ అనుభవైకవేద్యం. అప్పుడు నేర్చిన పాఠాలే ఇప్పుడు మార్గదర్శకాలు. ఈ మూడేళ్ళ కాలంలో అనేక కరోనా వైరస్ వేరియంట్లు వచ్చాయి. ఆ వరుసలోదే భారత్‌లో తాజాగా కనిపించిన జెఎన్.1 వేరియంట్. బీఏ.2.86 కుటుంబానికి చెందిన ఈ వైరస్ ఉత్పరివర్తనం ఏడాది పైచిలుకుగా రూపుదిద్దుకొంటూ వచ్చిందట. ఇది ఇప్పటికే సుపరిచితమైన ఒమిక్రాన్‌లో బలవత్తరమైన వేరియంట్ అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వివిధ దేశాల్లో ఇప్పటికే ఇది తన విజృంభణ చూపుతోంది. డిసెంబర్ 3 ముందు వారంలో 32 వేల మందికి కరోనా సోకితే, ఆ తరువాతి వారంలో 56 వేల మందికి ఇన్ఫెక్షన్ వచ్చిందని సింగపూర్ ఆరోగ్య శాఖ వెల్లడించింది.

మన దేశంలోని కేరళలో ర్యాండమ్ శాంపిళ్ళకు ఆర్టీ–పీసీఆర్ టెస్టులు చేస్తుండగా ఈ జెఎన్.1 వేరియంట్‌ను గుర్తించారు. మన దగ్గర ఈ వేరియంట్ తొలిసారిగా బయటపడి, కేసులు పెరుగుతుండగానే రాష్ట్రాలన్నిటికీ కేంద్రం తాజాగా మార్గదర్శకావళిని జారీ చేయడం గమనార్హం. పలు రాష్ట్రాలు అప్రమత్తమై ఇప్పటికే సమీక్షా సమావేశాలు జరిపి, మార్గదర్శ కాలను ప్రకటించాయి. కేరళలో పరిస్థితులు, కొత్త జెఎన్.1 వేరియంట్ కేసుల భయంతో కర్ణాటక సర్కార్ 60 ఏళ్ళ పైబడిన వారికి, అనారోగ్య సమస్యలున్నవారికి మాస్కు ధరించడం తప్పని సరి చేసింది. కేరళ సరిహద్దు జిల్లాలలను అప్రమత్తం చేసింది. ప్రజల రాకపోకలు, సమావేశాలపై నియంత్రణలు విధించ లేదన్న మాటే కానీ, కోవిడ్ లక్షణాలున్న వారికి పరీక్షలు చేయించడం పెంచింది.

వివిధ దేశాల్లో ఈ వేరియంట్ కనిపిస్తుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ తాజా పరిస్థితులపై దృష్టి సారించింది. దీన్ని ఆసక్తికరమైన వేరియంట్‌గా పేర్కొంది. ఒమిక్రాన్ తరగతికి చెందినప్పటికీ ఈ వేరియంట్ మరీ ప్రాణాంతకమైనదేమీ కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కోవిడ్ టీకా వేసుకోని వారికి సైతం ఈ వేరియంట్ వల్ల ప్రాణహాని ఉండదనీ భరోసా ఇస్తున్నారు. అది కొంత ఊరటనిచ్చే అంశం. అలాగని అశ్రద్ధచూపలేం, అజాగ్రత్త వహించలేం. ఎవరెన్ని చెప్పినా ఆరోగ్యం, ప్రాణరక్షణకు సంబంధించిన విషయం గనక సహజంగానే ఈ వేరియంట్ పట్ల మన దేశంలో ఆరోగ్య నిపుణుల్లో, ప్రజల్లో ఆందోళన నెలకొనడం సహజమే. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు తొందరపడి, కఠిన నియంత్రణలు పెట్టనక్కరలేదు కానీ, మాస్కు ధారణ, చేతుల పరిశుభ్రత, సామాజిక దూరం పాటించడం లాంటి కనీస జాగ్రత్తలు పాటించడమే ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష.

అసలే వ్యాధినిరోధక శక్తి తగ్గే చలికాలం. దానికి తోడు శబరిమల యాత్ర, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సెలవులతో ప్రయాణాల సీజన్. పైగా వచ్చేది సార్వత్రిక ఎన్నికల సీజన్. ర్యాలీలు, బహిరంగ సభల హంగామా. కరోనా వ్యాప్తికి కలిసొచ్చే ఇన్ని అంశాల మధ్య జాగ్రత్తలను విస్మరించడం ఎలాచూసినా రిస్కే. కట్టుదిట్టమైన ఆరోగ్యవ్యవస్థ, పరీక్షల వల్ల కేరళలో ఎప్పటికప్పుడు భారీగా కరోనా కేసులు బయటపడుతున్నాయి కానీ, అంతటి పరీక్షలు, నిఘా లేని చోట పరిస్థితులు చాప కింద నీరులా ఉండివుండవచ్చు. దురదృష్టమేమంటే, మన దేశంలోనే కాక అనేక ప్రపంచ దేశాల్లో సైతం ఆ మధ్య కోవిడ్ కేసులు తగ్గాక, అధికారికంగా మహమ్మారి ముగిసినట్టు ప్రకటించారే తప్ప తర్వాతి జాగ్రత్తలు తీసుకోవట్లేదు. జీనోమిక్ ప్రాసెసింగ్ టెస్టులు సహా వివిధ రూపాల్లో నిఘాను విస్మరించారు. భారత్‌లో లేబరేటరీ నెట్‌వర్క్ 'ఇన్సాకాగ్' (ఇండియన్ సార్స్–కోవ్–2 జీనోమిక్స్ కన్సార్టియమ్) తగిన స్థాయిలో పనిచేయకపోవడమే అందుకు ఉదాహరణ.

గత మూడేళ్ళలో దేశంలో 4.5 కోట్ల మంది కరోనా బారినపడ్డారనీ, 5.33 లక్షల మంది మరణించారనీ సర్కారు వారి తాజా లెక్క. ఈ అధికారిక లెక్కలకు అందని, సామాన్య బాధితుల సంఖ్య ఇంతకు అనేక రెట్లు ఎక్కువే. ఈ పరిస్థితుల్లో టెస్టులు ఎంత ఎక్కువగా చేస్తే, కరోనా విజృంభణను అంత త్వరగా పసిగట్టి, చర్యలు చేపట్టవచ్చు. అలాగే, కొత్త వేరియంట్లకు ఇప్పుడున్న టీకాలు ఏ మేరకు పనిచేస్తాయో పరీక్షించాలి. వివిధ దేశాలు ఇప్పటికే కొత్తవాటికి తగ్గట్టు టీకాలను మెరుగు చేస్తున్నాయి. మన దేశానికీ వాటి అవసరం ఉందేమో శాస్త్రీయ సలహా స్వీకరించాలి. ముంచుకొచ్చే దాకా ఆగకుండా మూడు నెలలకోసారి ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్‌లు చేయడం మంచిది. అలసత్వం దూరమవుతుంది. అలాగే, కరోనాపై నిరంతర నిఘా సరేసరి. ప్రజానీకానికి సమాచారం చేరవేస్తూ, పొంచివున్న ముప్పుపై అవగాహన పెంచడం ముఖ్యం. ప్రజారోగ్యంపై అన్ని రాష్ట్రాలూ, ప్రభుత్వాలు ఏకతాటిపైకి రావాలి. రాజకీయాలకు అతీతంగా, సమన్వయంతో ఏకోన్ముఖ వైఖరిని అవలంబించాలి. ప్రయాణాలు, జనసమ్మర్దం పెరిగే రానున్న వారాలు కీలకం గనక సన్నద్ధతే సగం మందు!

ఈసారీ మిశ్రమ ఫలితాలేనా?

విశ్లేషణ



దినేష్ సి. శర్మ

వాతావరణ మార్పు అనేది ప్రజల జీవనోపాధి, వారి ఆహార భద్రతకు సంబంధించినది. కాబట్టే కాప్28 సదస్సుకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. రెండు వారాలపాటు చర్చలు సాగిన తర్వాత, ఈ వార్షిక సమావేశాన్ని ఆనవాయితీగా జరుగుతున్నట్లే అదనపు రోజుకి పొడిగించారు. వాతావరణ మార్పుల విపత్తు ప్రభావం నుండి భూగ్రహాన్ని రక్షించడానికి దౌత్యవేత్తలు మరో 'ఒప్పందం' కుదుర్చుకున్నారు. దుబాయ్‌లో జరిగిన ఈ దశ చర్చలు అక్షరాలా బడా చమురు కంపెనీల నీడలో జరిగాయి. శిలాజ ఇంధనాల ద్వారా సంపాదించిన సంపదను చూసి గర్వించే నగరంలో, కర్బన ఉద్గారాలను తగ్గించే మార్గాల గురించి వాతావరణ అధికారులు, ప్రపంచ నాయకులు చర్చించడం ఒక వక్రోక్తి.

ఈ ఏడాది కాప్28 చర్చలకు అధ్యక్షత వహించింది, సుల్తాన్ అల్–జబేర్. ఈయన యూఏఈ పరిశ్రమల మంత్రి మాత్రమే కాదు, ప్రపంచంలోని ప్రముఖ చమురు కంపెనీలలో ఒకటైన అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ కూడా. వాతావరణ మార్పుపై యూఎన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (సీఓపీ28) అధ్యక్షుడిగా అల్–జబేర్ రాబోయే వాతావరణ విపత్తు నుండి ప్రపంచాన్ని రక్షించడంలో ఏకాభిప్రాయాన్ని రూపొందించే లక్ష్యాన్ని కలిగి ఉన్నారు. కానీ, దుబాయ్ సదస్సు మిశ్రమ ఫలితాలనే అందించింది.

పారిస్ ఒప్పంద లక్ష్యాలను అమలు చేయడంలో సాధించిన పురోగతిని ఈ సదస్సు సమీక్షించాల్సింది. అవి: 'ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వ స్థాయి ఉష్ణోగ్రత కంటే 2 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా ఉంచడం.' అలాగే, 'సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వ స్థాయికంటే 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించకుండా పెరిగేట్టు చూడటం.' ఈ లక్ష్యాలను సాధించడానికి, వాతావరణ మార్పులపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ చేసిన లెక్కల ప్రకారం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు 2025 కంటే ముందు గరిష్ఠ స్థాయికి చేరుకోవాలి. ఇక 2030 నాటికి అవి 43 శాతం తగ్గాలి. అప్పుడే మనం వాతావరణ మార్పుల వల్ల కలిగే అత్యంత తీవ్రమైన కరువులు, వేడిగాలులు, వర్షం వంటి ఘోర ప్రభావాన్ని నివారించ గలుగుతాము. కానీ పారిస్ లక్ష్యాల వైపు వెళ్లే మార్గానికి ప్రపంచం దూరంగా ఉంది. 2025 నాటికి సంబంధిత జాతీయ వాతావరణ ప్రణాళికల కింద చర్యను వేగవంతం చేయడం, కట్టుబాట్లను సవరించడంపై ఏకాభిప్రాయాన్ని కాప్28 సాధించాల్సింది!

'గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల విషయంలో లోతైన, వేగవంతమైన, నిరంతర తగ్గింపుల ఆవశ్యకతను' సదస్సు గుర్తించింది. అది అంగీకరించిన పాఠ్యం 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించకుండా సగటు ఉష్ణోగ్రత పెరగాలన్న లక్ష్యానికైతే అనుగుణంగానే ఉంది. కానీ ఇలా తగ్గించే విషయంలో ఒక మార్గాన్ని సూచించేటప్పుడు మాత్రం ఆ పాఠ్యం తడబడుతోంది. వారి వారి పరిస్థితులకు అనుగుణంగా, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి జరుగుతున్న ప్రపంచ ప్రయత్నాలకు అన్ని దేశాలు సహకరించాలని కోరుతున్నారు. ప్రపంచ చర్య కోసం సూచించిన మార్గాలు ఏవంటే... ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 3 రెట్లు పెంచడం, 2030 నాటికి ప్రపంచ సగటు వార్షిక ఇంధన సామర్థ్యం మెరుగుదల రేటును రెట్టింపు చేయడం; బొగ్గు శక్తికి సంబంధించి 'ఫేజ్–డౌన్' దిశగా ప్రయత్నాలను వేగవంతం చేయడం; నెట్–జీరో ఉద్గార ఇంధన వ్యవస్థల వైపు ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలను వేగవంతం చేయడం; శతాబ్దానికి ముందు లేదా మధ్యలో సున్నా లేదా తక్కువ స్థాయిలో కర్బన ఇంధనాలను ఉపయోగించడం; పరివర్తనలను పరిష్కరించని



అసమర్థ శిలాజ ఇంధన సబ్సిడీలను త్వరగా తొలగించడం.

కాప్ 28 సూచించిన మార్గాలలో అత్యంత ముఖ్యమైనది, 'ఇంధన వ్యవస్థలలో శిలాజ ఇంధనాలకు దూరంగా, న్యాయమైన, క్రమబద్ధమైన, సమానమైన పద్ధతిలో, శాస్త్రానికి అనుగుణంగా 2050 నాటికి నెట్–జీరోని సాధించడానికి ఈ క్లిష్టమైన దశాబ్దంలో చర్యను వేగవంతం చేయడం'. బొగ్గు కోసం ఉపయోగించిన పదం 'ఫేజ్–డౌన్'(క్రమంగా తగ్గించడం). కానీ దీనికి అదనపు గుణవాచకాలు ఏమీ కలపలేదు. చమురు, గ్యాస్ కోసం ఉపయోగించిన పదం 'పరివర్తించడం'. ఇది చాలా అస్పష్టంగా ఉంది, పైగా అనేక షరతులతో వస్తుంది. చాలా దేశాలు 'ఫేజ్–అవుట్' పదాన్ని ఉపయోగించాలని కోరుకున్నాయి. ఆతిథ్య దేశం, ఒపెక్ దేశాలు 'పరివర్తించడం' అనే తేలికపాటి పదబంధంతో ముందుకు వచ్చాయి.

దుబాయ్‌లో శిలాజ ఇంధన పరిశ్రమకు లభించిన మరో రాయితీ ఏమిటంటే, పరివర్తన ఇంధనాల పాత్ర. 'పరివర్తన ఇంధనాలు ఇంధన భద్రతకు భరోసానిస్తూ శక్తి పరివర్తనను సులభతరం చేయడంలో తమ పాత్ర పోషిస్తాయి' అని కాప్28 పాఠ్యం గుర్తించింది. అంతర్జాతీయ ఇంధన సంస్థ సహజ వాయువును 'పరివర్తన ఇంధనం'గా పరిగణించినందున ఇది సహజ వాయువుకు ప్రాణదాత. మొత్తంమీద, చమురు, గ్యాస్ విషయంలో కాప్28 పాఠ్యం దయాపూరితంగా వ్యవహరించింది. బొగ్గు విషయంలో అలా జరగలేదు. ఆ కోణంలో, ఇది చమురు అనుకూలమైనది, సహజవాయువు అనుకూలమైనది. అయినప్పటికీ కొందరు వ్యక్తులు ఈ ఒప్పందాన్ని 'చారిత్రకం' అంటున్నారు. ఎందుకంటే మొదటిసారిగా కాప్ పాఠ్యంలో శిలాజ ఇంధనాల గురించి నేరుగా ప్రస్తావించారు మరి.

ఊహించినట్లుగా, మీథేన్ గురించిన సూచన కాప్28 పాఠ్యంలోకి చొప్పించారు. '2030 నాటికి ప్రత్యేకించి మిథేన్ ఉద్గారాలతో సహా ప్రపంచవ్యాప్తంగా కార్బనేతర ఉద్గారాల తగ్గింపును వేగవంతం చేయడం, గణనీయంగా తగ్గించడం' కోసం చర్య తీసుకోవాలని సదస్సు ఆయా దేశాలకు పిలుపునిచ్చింది. ఇది భారతదేశంతోపాటు అనేక ఇతర దేశాలకు సమస్యాత్మకమైనది. కార్బన్ డయాక్సైడ్ వలె, మీథేన్ కూడా వాతావరణ మార్పులకు దోహదం చేస్తుంది. కాకపోతే వందల సంవత్సరాలపాటు ప్రభావం చూపే కార్బన్ డయాక్సైడ్‌తో పోలిస్తే, వాతావరణంలో మీథేన్ చాలా తక్కువ జీవితాన్ని (12 సంవత్సరాలు) కలిగి ఉంటుంది. అయితే, రేడియేషన్‌ను గ్రహించడంలో మీథేన్ సమర్థవంతంగా పని చేస్తుంది కాబట్టి, దాని వేడెక్కించే ప్రభావం కార్బన్ డయాక్సైడ్ కంటే చాలా రెట్లు ఎక్కువ. అందువల్ల, మీథేన్ ఉద్గారాలలో భారీ తగ్గింపులు అనేవి వాతావరణం వేడెక్కడాన్ని పరిమితం చేయడంలో సహాయపడగలవని వాదన. వరి పొలాలు, పశువులతో సహా బొగ్గు గనులు, సహజ వాయువు, చమురు ఉత్పత్తి, పంపిణీ సమయంలో లీకేజీలు కూడా మీథేన్ ఉద్గారాలకు కారణమవుతాయి. దుబాయ్‌లో అంగీకరించిన విధంగా మీథేన్ ఉద్గారాలను తగ్గించవలసి వస్తే ఈ అన్ని రంగాలలో చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

ఈ సదస్సులో ఇతర వివాదాస్పద అంశాలు (అనుసరణ, క్లైమేట్ ఫైనాన్స్, 'నష్టం మరియు హాని', సాంకేతికత బదిలీ) కూడా చర్చించారు. కానీ ముందుకు సాగలేదు. కాప్28 పాఠ్యంలో చేసుకున్న అన్ని కట్టుబాట్లు, వాగ్దానాలు ఏవంటే, పునరుత్పాదక సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచడం, బొగ్గు వాడకం తగ్గించడం, పరివర్తన ఇంధనాల వినియోగం, ఇంధన సామర్థ్యం మొదలైనవి. దీనికి అభివృద్ధి చెందుతున్న దేశాలలో అదనపు నిధులు, సాంకేతికత అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ జాతీయ వాతావరణ కార్యక్రమాలను అమలు చేయడానికి అవసరమైన క్లైమేట్ ఫైనాన్స్ పరిమాణాన్ని 2030 ముందు కాలానికి 5.9 ట్రిలియన్ల డాలర్లుగా అంచనా వేశాయి. ఇంధన పరివర్తన అనుసరణకు కూడా భారీ నిధులు అవసరం. అభివృద్ధి చెందిన దేశాలు దుబాయ్‌లో కొన్ని కొత్త కట్టుబాట్లను అంగీకరించాయి. గ్రీన్ క్లైమేట్ ఫండ్ ఇప్పటి వరకు మొత్తం 12 బిలియన్ డాలర్ల నామమాత్రపు వాగ్దానాలను పొందింది. పైగా ఈ అభివృద్ధి సహాయాన్ని క్లైమేట్ ఫైనాన్స్‌గా మార్చారు.

వాతావరణ మార్పు అనేది ప్రజలు, వారి జీవనోపాధి, శక్తి, ఆహార భద్రతకు సంబంధించినది. వాతావరణ చర్చల సమయంలో తీసుకున్న దౌత్యపరమైన నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అరుదుగా మాత్రమే మార్పును తీసుకొస్తాయి. ఈలోగా, వాతావరణ మార్పునకు చెందిన వినాశకరమైన ప్రభావం కొనసాగుతుంది. నిజంగానే దౌత్యవేత్తలు భూగోళాన్ని రక్షించగలిగితే, దుబాయ్ చర్చలను సంబరాలు చేసుకోవచ్చు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కుర్చీ మారితే...



ఉపరాష్ట్రపతి కాంగ్రెస్‌కు చెందినవారై ఉండి, ప్రతిపక్షం ఆయనను వెక్కిరించి ఉంటే – దాన్ని అవమానం అని కాంగ్రెస్ అనేది; భావస్వేచ్ఛ అని బీజేపీ అనేది. ప్రజాస్వామ్యంలో ఏదీ 'పవిత్రం' కాదు. భారత ప్రజాస్వామ్యంలో మాత్రం ఎవరు అధికారంలో ఉన్నారన్న దాన్నిబట్టి అది మారుతుంటుంది.

– ఖాలిద్ బేగ్, హోస్ట్

ఆదర్శ పార్లమెంట్?



శీతకాల సమావేశాలకు మూడు రోజులే ఉంది. ఆదర్శంగా నిలవాలంటే... భద్రతా వైఫల్యం గురించి హోంమంత్రి ప్రకటన చేయాలి; ఉపరాష్ట్రపతిని వెక్కిరించినందుకు ప్రతిపక్షం క్షమాపణ చెప్పాలి. బదులుగా వారిపై సస్పెన్షన్ ఉపసంహరించాలి. అది జరిగేనా? నిజానికి, పార్లమెంటులో గోడలు నిర్మించేవాళ్లకన్నా వంతెనలు నిర్మించే రాజకీయవేత్తలు కావాలి.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

డబ్బే డబ్బు



ఒకవైపు 80 కోట్ల మంది పేదలను పోషిస్తున్న దేశంలో, మరోవైపు ప్రపంచంలోనే అత్యంత ధనిక ఐపీఎల్ లీగ్ ఉంది. దుబాయి వేలంలో ఒక ఆటగాడు 24 కోట్లు పలికాడు! తన సొంత ధనిక దేశంలో ఇంత సొమ్మును కలలో కూడా ఊహించలేడు. అయినా ప్రజా సేవ కోసం విరాళం ఉండదు.

– యశోవర్ధన్ ఝా ఆజాద్, మాజీ ఐపీఎస్ అధికారి

జరగని చర్చలు



భారతీయ న్యాయ వ్యవస్థను వేగవంతం చేయడం అనేది కీలక ప్రాధాన్యత కలిగినది. కాబట్టి నేర న్యాయ బిల్స్ మీద సరైన చర్చ జరగడం అవసరం. దురదృష్టవశాత్తూ, సభలో ప్రతిపక్షం లేకుండానే ఈ బిల్లులు ఆమోదం పొందాయని గుర్తుపెట్టుకోవాల్సి ఉంటుంది.

– విక్రమ్ చంద్ర, సంపాదకుడు

ఏమైంది మనకు?



స్వాతంత్ర్యం నుండి బెంగాలీల పతనం అనేది ఒక విషాదకర కథ. దేశంలో 40 శాతం పైగా బాలికలకు బాల్య వివాహాలు జరుగుతున్న రాష్ట్రాలు రెండు మాత్రమే. పశ్చిమ బెంగాల్, త్రిపుర. ఎక్కడ మనం తప్పు చేశాం?

– అభిషేక్ బెనర్జీ, కాలమిస్ట్

ఇన్ బాక్స్

వర్ధిల్లు నాయకా!



గుడికంటే గొప్పగా తయారైన
మా ఊరి బడిని చూసినపుడు
అక్షరాలు నేర్చడానికి ముస్తాబైన
అమ్మ ఒడి నవ్వుల్ని చూసినపుడు
ఫీజుల భయం లేకుండా పిల్లలు
పెద్దచదువులకు వెళుతున్నపుడు
రేపటి తరాన్ని తయారు చేయాలన్న
నీ తపన కనిపిస్తోంది.

వైద్యం కోసం అమ్మను ధీమాగా
ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తున్నపుడు
మందులు పంపాల్సిన పనిలేదురా అబ్బాయ్
అంటూ నాన్న రాసిన ఉత్తరం చదివినపుడు
పక్కింటి బంగారమ్మను చూడ్డానికి
డాక్టరే ఇంటికొచ్చారని తెలిసినపుడు
ప్రజల ఆరోగ్యానికి...
నీ ఆలోచనే శ్రీరామరక్ష అనిపిస్తోంది.

సూర్యోదయానికి ముందే
గుమ్మంలో పెన్షన్ కానుక పలకరిస్తే
వ్యవసాయ రంగానికి
భరోసాయే కేంద్రం అయితే
గ్రామ సచివాలయాలు చిగురించి
ప్రజల సేవకు చిరునామాలైతే
ప్రతి గడపా తమకోసం
ఒక ప్రతినిధి ఉన్నారని నమ్మితే
పాలన ప్రజల మధ్యనే ఉండాలనే...
నీ ఆదర్శం కనపడుతోంది.
ఇల్లు లేని పేదల కోసం వెలసిన ఊళ్లను
సువిశాలంగా కడుతోన్న కళాశాలలను
పోర్టుల నిర్మాణంలో వేగాన్ని చూసినపుడు
రాష్ట్ర ఆర్థిక పురోగతికి
నీ ముందుచూపు కనపడుతోంది.

దశాబ్దాలుగా ఊపిరాడని
ఉద్దానం గొంతులో తడి...
గుండెల్లో ధీమా నింపినపుడు
కడుపులో పేగు కదిలినట్టనిపించింది
నాయకుడిని కనేది ప్రజలే కదా మరి!
వర్ధిల్లు నాయకా..!!

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

సమర్థ పాలకుడు... సంక్షేమ నాయకుడు

సందర్భం



డా॥ మేరుగు నాగార్జున

ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పటికే ఉన్న వ్యవస్థలను అత్యంత ప్రభావవంతం చేయడంతో పాటు, ప్రజల కోసం నూతన వ్యవస్థలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా సంక్షేమ రంగంలో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలూ, ప్రజలకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్న తీరూ విప్లవాత్మకం. అందుకే సంక్షేమ రంగానికి సంబంధించినంత వరకూ ప్రగతి గురించి చెప్పుకోవాలంటే జగన్‌కు ముందు, జగన్ తర్వాత అని చెప్పుకోవాలి. ఈ కారణంగానే యావత్ భారతదేశం ఈరోజున ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది.

జగన్ తన నాలుగేళ్ల పదవీ కాలంలోనే ఎవరూ పూర్తిగా గుర్తు పెట్టుకోలేనన్ని ఎక్కువ సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అప్పటి వరకూ ఉన్న వ్యవస్థల పని తీరును ప్రభావితం చేస్తూ వాటిని ప్రజలకు మరింత చేరువ చేయగలిగారు. ఉదాహరణకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు ఇచ్చే పథకాలు గత ప్రభుత్వాల హయాంలోనూ ఉన్నాయి. అయితే అప్పట్లో పెన్షన్ మంజూరు కావడం, పెన్షన్ మొత్తాలు చేతికి అందడం పెద్ద ప్రహసనంగా ఉండేది. ఒకరికి పెన్షన్ రావాలంటే పెన్షన్ తీసుకుంటున్నవారిలో ఒకరు చనిపోతే తప్ప వీలు లేకుండా నిబంధనలుండేవి. పెన్షన్ కోసం రోజుల తరబడిగా ఎదురు చూస్తూ ఉండాల్సి వచ్చేది. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అర్హత కలిగిన వారికి పెన్షన్ల మంజూరు చాలా సులభతరంగా మారింది. కచ్చితంగా ఒకటవ తేదీన సూర్యోదయానికి ముందే ఇంటి కొచ్చి తలుపుతట్టి పెన్షన్ మొత్తాలను అందించే సరికొత్త వ్యవస్థ రాష్ట్రంలో ఏర్పడింది. పెన్షన్లను మాత్రమే కాదు రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు అందించే బియ్యం తదితర చౌక వస్తువుల కోసం దుకాణాల వరకూ వెళ్లాల్సిన పని లేకుండా ఇంటి ముంగిటకే రేషన్ వాహనాలను తెచ్చి పెట్టారు. అలాగే ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడానికి 'దిశ యాప్'ను జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అందరి మన్ననలూ పొందుతోంది.

గతంలోనూ సంక్షేమ పథకాలు ఉన్నా... లబ్ధిదారులకు ఆ ఫలాలు చేరడానికి దళారీ వ్యవస్థ వాహకంగా ఉండేది. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక తెచ్చిన కొత్త వ్యవస్థలతో పైరవీకారులు, దళారులకు మరణశాసనం రాశారు. 'కులం చూడం, మతం చూడం, పార్టీలు అసలే చూడం.. పేదరికం ఒక్కటే అర్హతకు ప్రామాణికం' అన్నదే సంక్షేమ పథకాల అజెండాగా జగన్ పెట్టుకున్నారు. ఒక్క బటన్ నొక్కడం ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్న 'డీబీటీ' (డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్) విధానం సీఎంగా జగన్ రాకతోనే వచ్చింది. అనర్హులు ప్రభుత్వ పథకాలు అందుకోలేని పరిస్థితిని గ్రామ వార్డు సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థ ద్వారా కల్పించారు. ఈ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో ఎక్కడైనా పొరపాట్లు దొర్లి దాని కారణంగా ఎవరైనా అర్హులు నష్టపోయే పరిస్థితి ఏర్పడితే అలాంటి వారు ఎప్పుడైనా ఆ పథకాల కోసం దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందే వెసులుబాటు కలిగించారు.

గతంలో క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు లాంటివి తీసుకోవాలంటే పెద్ద తతంగమే ఉండేది. లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలోనే సీఎం జగన్ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు రూపకల్పన చేశారు. క్యాస్ట్ సర్టిఫికెట్, ఇన్‌కం సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, రెసిడెన్స్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లాంటి ముఖ్యమైన సర్టిఫికెట్లను ఈ రోజున ప్రజలు ఎవరికీ ఒక్క రుపాయి కూడా ఇవ్వకుండా, ఎవరినీ కలవాల్సిన అవసరం లేకుండా సచివాలయాల ద్వారా సులభంగా అందుకోగలుగుతున్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుపేదలకు ఎలాంటి వివాదాల్లేకుండా ఇళ్ల స్థలాలను అందించడం కూడా సచివాలయాల ద్వారా మత్రమే సాధ్యమైంది. సచివాలయాలకు అనుబంధంగా సీఎం జగన్ సృష్టించిన 2.56 లక్షల మంది 'వాలంటీర్ల' వ్యవస్థ... సిఫార్సులు, పైరవీలను పాతరేసింది. వ్యవసాయానికి వెన్నుదన్నుగా రైతుకు విత్తనాలు అందించడం దగ్గర నుంచి వ్యవసాయోత్పత్తుల అమ్మకాల దాకా ఆసరాగా నిలిచే 'రైతు భరోసా కేంద్రాలు' (ఆర్‌బీకే) కూడా ఈ రోజున దేశ, విదేశీ ప్రజల దృష్టిని



ఆకర్షిస్తున్నాయి.

సామాజిక న్యాయం కోసం బాబాసాహెబ్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్ రామ్, మౌలానా ఆజాద్, కొమురం భీం, అల్లూరి సీతా రామరాజు కోరుకున్న సమాజం దిశగా ప్రభుత్వ ఫలాలు అట్టడుగు వర్గాల వారికి చేరాలంటే పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నది జగన్ ప్రభుత్వం నమ్మిన సిద్ధాంతం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని మాటల్లో చెప్పకుండా చేతల్లో చేసి చూపిస్తున్న ఘనత ముఖ్యమంత్రిది. ఏ వర్గాలైతే ఇంత కాలం అణచి వేయబడ్డాయో, ఏ వర్గాలైతే ఇంత కాలం రాజకీయ పదవులకు దూరంగా ఉన్నాయో ఆ వర్గాలకు రాజ్యాధికారం దక్కుతోంది. శాసనసభ స్పీకర్ గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం, శాసనమండలి ఛైర్మన్‌గా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజు, మండలి డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన జకియా ఖానమ్‌కు అవకాశం ఇచ్చారు. ఇది కాకుండా శాశ్వత ప్రాతిపదికన 'బీసీ కమిషన్'తో పాటుగా ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేశారు. ఎస్సీలలో మాల, మాదిగ, రెల్లి కులాలకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అందులో మాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవిని మహిళకు కేటాయించారు. నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసి, దాన్ని అమలు చేసిన తొలి ప్రభుత్వం జగన్‌దే. కాగా, అందులోనూ 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనతా జగన్ సర్కార్‌దే.

గత మూడేళ్ల కాలంలోనే రెగ్యులర్, ఔట్ సోర్సింగ్‌లతో కలిపి ఇప్పటి వరకూ 2.61 లక్షల ఉద్యోగాలను బీసీ వర్గాల వారికి ఇవ్వడం, గ్రామ వార్డు సచివాలయాల్లో ఇచ్చిన 1.30 లక్షల శాశ్వత ఉద్యోగాలలో 83 శాతం ఉద్యోగాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికే ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయమే. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వర్గాల వారికి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న చేయూతను చూసి 'మేము కూడా ఈ సామాజిక వర్గాల్లో పుట్టి ఉంటే బాగుండేద'నే భావన ఈరోజున అగ్రవర్ణాల వారిలో కలుగుతోందంటే అతిశయోక్తి కాదు. ఈ విధంగా నవ్యాంధ్ర రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న జగన్ కలకాలం ఆయురారోగ్యాలతో విలసిల్లాలి!

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి
(నేడు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.నవమి ఉ.11.37 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** రేవతి రా.12.17 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.12.59 నుండి 2.30 వరకు, **దుర్ముహూర్తం:** ప.10.06 నుండి 10.52 వరకు, **అమృత ఘడియలు:** రా.10.01 నుండి 11.31 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.29, **సూర్యాస్తమయం:** 5.26.

చేనేత సాంస్కృతిక వారసత్వం గొప్పది

- ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ చేనేత
- భూదాన్‌పోచంపల్లిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- చేనేత పరిశ్రమకు ఫ్యాషన్ డిజైనర్లు సహకరించాలని సూచన
- తమ ప్రాంతానికి చెందిన కొందరిని ఇక్కడకు తీసుకొస్తానని వెల్లడి
- ఇక్కత్ కళాకారులతో ముఖాముఖి


భూదాన్ పోచంపల్లిలోని శ్రీరంజన్ సిల్క్స్ ఇండస్ట్రీలో సిల్క్ దారాన్ని పరిశీలిస్తున్న రాష్ట్రపతి

సాక్షి, యాదాద్రి: మన చేనేత సాంస్కృతిక వారసత్వం, దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి ముందుకు తీసుకుపోవడంలో చేనేత కళాకారుల సహకారం గొప్పదని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. చేనేత రంగంలో గురు, శిష్య సంప్రదాయం ప్రకారం వృత్తి నైపుణ్యాలు తరతరాలుగా అందించడం మంచి సాంప్రదాయమని ప్రశంసించారు. ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త డిజైన్‌లు, ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో చేనేత పరిశ్రమకు ఫ్యాషన్ డిజైనర్లు సహకరించాలని కోరారు. ఇందులో శిక్షణ ఒక ముఖ్యమైన అంశమని ఆమె అన్నారు. శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. ఇక్కత్ వస్త్రాలు తయారు చేసే చేనేత కళాకారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత దేశ వారసత్వంలో ఒక భాగమైన చేనేత వృత్తి గురించి తెలుసుకోవడానికి పోచంపల్లి గ్రామానికి వచ్చి పట్టు చీరలు ఎలా తయారు చేస్తారో చూడడం సంతోషం కలిగిస్తోందని రాష్ట్రపతి చెప్పారు. ఇక్కడి నుంచి తాను ఇంత గొప్ప చేనేత ఇక్కత్ వృత్తి నైపుణ్య జ్ఞానాన్ని తీసుకువెళుతున్నానని అన్నారు. తమ ప్రాంతానికి చెందిన కొందరిని పోచంపల్లికి తీసుకువచ్చి చేనేత వృత్తిని పరిచయం చేయిస్తానని తెలిపారు. యూఎన్‌డబ్ల్యూటీవో (యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్) 2021లో పోచంపల్లి గ్రామాన్ని ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామాలలో ఒకటిగా ప్రకటించడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమానికి చేనేత రంగంలో విశిష్టత కలిగిన అవార్డు గ్రహీతలు వచ్చారంటూ.. చేనేత సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ ముందుకు తీసుకుపోతున్న వారిని అభినందించారు. చేనేత రంగం ద్వారా ప్రతిరోజు 35 లక్షల మంది జీవనోపాధి కల్పించుకుంటున్నారని, తెలంగాణాలో నేసిన వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయని చెప్పారు. పోచంపల్లితో పాటు రాష్ట్రంలోని వరంగల్, సిరిసిల్ల, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, పుట్టపాక వస్త్రాలకు జీఐ ట్యాగ్ వచ్చిందని రాష్ట్రపతి తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి సమస్యలు

ముగ్గురు చేనేత కళాకారులు కొన్ని ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని రాష్ట్రపతి హామీ ఇచ్చారు. అంతకుముందు ఆమె పోచంపల్లిలోని శ్రీరంజన్ సిల్క్ ఇండస్ట్రీ ప్రొడక్షన్ కంట్రోల్ యూనిట్‌ను సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే తెలంగాణ చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన పెవిలియన్ థీమ్‌ను సందర్శించారు. ముడిపట్టు నుంచి పట్టును తీయడం, వస్త్రాలను తయారు చేయడం లాంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు చరఖాలతో నూలు వడకడాన్ని వీక్షించారు. ప్రత్యేక స్టాళ్లను, ఆచార్య వినోభాబావే ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాష్ట్రపతికి చీరల బహూకరణ

చేనేత అవార్డు గ్రహీతలు బోగ సరస్వతి, లోక శ్యామ్‌కుమార్, కూరపాటి వెంకటేశం.. చేనేత రంగంలో తమ వృత్తి నైపుణ్యాలను, ఇబ్బందులను రాష్ట్రపతికి వివరించారు. ఈ సందర్భంగా పొట్ట బత్తిని సుగుణ రాష్ట్రపతికి చీరను బహూకరించారు. బోగ సరస్వతి డబుల్ ఇక్కత్ వస్త్రాన్ని అందజేశారు. వేదికపై రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క.. రాష్ట్రపతికి చీరలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జౌళి శాఖ కార్యదర్శి రచనా సాహు, రాష్ట్ర జౌళి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమారెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్పృహ తప్పి పడిపోయిన ఏసీపీ

భూదాన్ పోచంపల్లి/భువనగిరి క్రైం: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భూదాన్‌పోచంపల్లి పర్యటనలో స్వల్ప అపశ్రుతి చోటు చేసుకుంది. హెలీపాడ్ వద్ద విధుల్లో ఉన్న ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు కళ్లు తిరిగి పడిపోయారు. ఆయన తన పక్కనే ఉన్న ఇంకో అధికారి మీద పడడంతో ఇద్దరూ కింద పడ్డారని భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. హెలీకాప్టర్ ల్యాండింగ్ సమయంలో ఈ ఘటన జరగడంతో వేరే విధంగా ప్రచారం జరిగిందని వివరణ ఇచ్చారు. హెలీకాప్టర్ ఫ్యాన్ గాలి ఉధృతికి కార్పెట్ పైకి లేవడంతో ఆయన గాయపడినట్టు తొలుత ప్రచారం జరిగింది. కాగా చేతికి గాయమైన ఏసీపీని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

స్థానికంగా నూలు డిపో ఏర్పాటు చేయాలి



పలు ఆటుపోట్లు ఎదుర్కొంటున్న చేనేత వృత్తికి అండగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి 15 శాతం నూలు సబ్సిడీని సకాలంలో పొందలేకపోతున్నాం. ఇందుకోసం భూదాన్ పోచంపల్లిలో నూలు డిపో ఏర్పాటు చేయాలి. తద్వారా వేలాది మంది చేనేతలకు మేలు జరుగుతుంది. డబుల్ ఇక్కత్, కాటన్, మర్సైస్ వస్త్రాల తయారీ కోసం వందలాది మగ్గాలు నడుస్తాయి. చేనేత కుటుంబాలకు మరింత ఉపాధి లభిస్తుంది. – బోగ సరస్వతి

సాంకేతిక సంస్థను ఏర్పాటు చేయాలి



పోచంపల్లి కళాకారులకు రంగులు అద్దకం, డిజైన్ల తయారీ, నూతన ప్రక్రియల కోసం శిక్షణ ఇప్పించాలి. చేనేత యువతకు శిక్షణ ఇప్పించడానికి చేనేత సాంకేతిక సంస్థను ఏర్పాటు చేయాలి. మమ్మల్ని చేనేత కార్మికులుగా కాకుండా చేనేత కళాకారులుగా పిలవాలి. మా వృత్తికి విరమణ లేదు. మాకు అండగా ఉండాలి.

– లోక శ్యామ్‌కుమార్

డూప్లికేట్‌ను నియంత్రించాలి



టై అండ్ డై చీరలు, వస్త్రాలను డూప్లికేట్ చేస్తున్నారు. మా వృత్తిని దెబ్బతీసే విధంగా మిల్లుల నుంచి టై అండ్ డై వస్త్రాలను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో మేము ఉపాధి కోల్పోతున్నాం. ఇక్కత్ బ్రాండ్‌ను కాపాడాలి. చేనేత వృత్తిని ఆదుకోవడానికి ఆర్థిక సహాయం అందించాలి. వస్త్రాల అమ్మకంపై డిస్కౌంట్ ఇవ్వాలి. పోచంపల్లి బ్రాండ్ ఇమేజ్ పెంచాలి. – కూరపాటి వెంకటేశం

కేయూ మహిళా హాస్టల్‌లో ర్యాగింగ్!

- డాన్స్ చేయాలని ఓ విద్యార్థినిపై ఒత్తిడి
- విచారణ జరిపిన ప్రొఫెసర్ల బృందం
- రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావుకు నివేదిక

కేయూ క్యాంపస్: వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ మహిళా హాస్టల్‌లో పీజీ కోర్సు కామర్స్ విభాగానికి చెందిన సీనియర్ విద్యార్థినులు అదే విభాగానికి చెందిన జూనియర్లను పరిచయం పేరిట ర్యాగింగ్ చేశారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహాచారి, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్య దృష్టికి ఈ విషయం వెళ్లడంతో వీసీ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు బుధవారం విచారణ జరిపారు. ఈ ఘటనలో సీనియర్ విద్యార్థులను వారం రోజులపాటు సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న రాత్రి క్యాంపస్‌లోని మహిళా హాస్టల్‌లో కామర్స్ విభాగానికి చెందిన సీనియర్లు అదే విభాగానికి చెందిన జూనియర్ విద్యార్థినులను హాస్టల్‌లో ఒకచోటికి పిలిపించుకుని పరిచయం చేసుకున్నారు. ఈ క్రమంలో ఓ జూనియర్‌ను డ్యాన్స్ చేయాలని ఒత్తిడి చేయడంతో ఆ విద్యార్థిని కన్నీరు పెట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయం మరుసటి రోజు నర్సింహాచారి దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. దీంతో బుధవారం హాస్టళ్ల కమిటీ చైర్మన్, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్‌లాల్, కామర్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహాచారి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జి.శమిత, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్య, హాస్టళ్ల అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుచరితపాల్ కలిసి ర్యాగింగ్ ఆరోపణలపై విచారణ జరిపారు. జూనియర్ విద్యార్థినులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో సీనియర్ విద్యార్థినుల వారంరోజులపాటు హాస్టల్‌నుంచి సస్పెండ్ చేయాలని ఈ బృందం తీర్మానించి రిపోర్టును రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావుకు అందించినట్లు తెలిసింది.

తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవాలి

- వారి సంక్షేమం కోసం కృషి చేయాలి
- సీపీపీ భేటీలో సోనియాగాంధీ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం శక్తి మేరకు కృషి చేయాల్సి ఉందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అంకితభావం, దృఢ సంకల్పంతో పని చేసిన పార్టీ సహచరులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా స్పష్టమైన తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని, విశ్వాసాన్ని కాపాడుకునేందుకు పార్టీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లు ఆమోదం పొందడంపై సోనియా సంతోషం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టండి

- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద టీఎమ్మార్పీఎస్ ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బిల్లు ప్రవేశపెట్టకపోతే రానున్న రోజుల్లో బీజేపీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ హెచ్చరించారు. శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీఎంఆర్‌పీఎస్ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఇటుక రాజు మాదిగ మాట్లాడుతూ.. కేంద్రంలో పూర్తి మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామంటూ.. గతంలో బీజేపీ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. బిల్లును ఈ రెండురోజుల్లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలంతా కలసి బీజేపీకి బుద్ధి చెబుతామని ఇటుక రాజు మాదిగ హెచ్చరించారు.

కరెన్సీపై అంబేడ్కర్ చిత్రం కోసం తీర్మానం చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంబేడ్కర్ ఫొటో సాధన సమితి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఢిల్లీలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సమితి నేత జె.పరశురామ్ రేవంత్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎంపీగా రేవంత్ ఉన్నప్పుడు ఈ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడి రాష్ట్రపతికి లేఖ రాశారని ఆయనకు గుర్తు చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని పరశురాం కోరారు.

సేవాలాల్ జయంతిని ‘బంజారా దినోత్సవం’గా ప్రకటించండి

- కేంద్రానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: సంత్ సేవాలాల్ జయంతి రోజైన ఫిబ్రవరి 15ని బంజారా దినోత్సవంగా ప్రకటించాలని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే దేశవ్యాప్తంగా సంత్ సేవాలాల్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని అర్వింద్ లేవనెత్తారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంత్ సేవాలాల్‌ను స్మరిస్తూ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఆయన వంటి గొప్ప ఆధ్యాత్మిక నాయకుల ప్రయత్నాలకు నివాళిగా దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణకు పసుపు బోర్డు, సమ్మక్క–సారక్క గిరిజన విశ్వవిద్యాలయాలను మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీకి అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించండి

- ప్రభుత్వానికి క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ విజ్ఞప్తి

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తెలంగాణ క్రైస్తవుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే పరిష్కరించాలని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ విజ్ఞప్తి చేసింది. నగరంలోని ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకలకు ముందే క్రైస్తవుల సమస్యలు పరిష్కరించి ‘మిరాకిల్ క్రిస్మస్ గ్రీటింగ్’ అందజేయాలని ఫ్రంట్ చైర్మన్ జెరూసలేం మత్తయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

24న ముదిరాజ్ మేధోమథన సదస్సు

పంజగుట్ట(హైదరాబాద్): ఈ నెల 24వ తేదీన ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ముదిరాజ్ మేధోమథన సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కన్వీనర్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు కో కన్వీనర్ అల్లుడు జగన్, నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కోళ్ల వెంకటేశ్ ముదిరాజ్‌లతో కలిసి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గెలిచిన మక్తల్ శాసనసభ్యుడు వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

మత సామరస్యానికి భరోసా: మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మత సామరస్యాన్ని కాపాడుతుందని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ సచివాలయంలో క్రిస్టియన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విలియమ్స్ మాట్లాడుతూ క్రిస్మస్ పండగ విశిష్టతను వివరించారు. ప్రొటోకాల్ డైరెక్టర్ అరవిందర్ సింగ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. సెక్రటేరియట్ చర్చ్ క్వయర్, సభ్యులు, మ్యూజిక్ డైరెక్టర్ పీజేడీ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పాటలు ఆలపించారు.

ఆర్యవైశ్యులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

- ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సత్యనారాయణ
- నూతన కార్యవర్గం ఎన్నిక


ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం

ఖైరతాబాద్(హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్లలో పదోవంతు ఆర్యవైశ్యులు ఉన్నారని, వారికి జనాభా దామాషా ప్రకారం రాజకీయపార్టీలు అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్నిరాము సత్యనారాయణ కోరారు. బుధవారం ఖైరతాబాద్‌లోని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యాలయంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. గతనెలలో అధ్యక్ష ఎన్నిక జరగగా తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నాయకులు హాజరై పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తిరువీధి ప్రకాశ్‌రావు, ప్రధానకార్యదర్శిగా శేబు షణ్ముఖరావు, కోశాధికారిగా నుడురుమాటి శ్రీనివాసరావు, రాజకీయ కమిటీ చైర్మన్‌గా కోట సత్యనారాయణ, వాసవి సేవాదళ్ చైర్మన్‌గా పెనుగొండ శ్రీనివాసరావు, అదనపు కోశాధికారిగా నారాయణ విశ్వేశ్వరరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా జి.రామ్మోహన్, చీఫ్ ఆర్గనైజర్‌గా ఉమామహేశ్వరరావుతోపాటు 15 మంది ఉపాధ్యక్షులు, 15 మంది కార్యదర్శులు, 25 మంది కార్యవర్గ సభ్యులను సమావేశం ఎన్నుకుంది.

దొంగలు జాస్తి.. ఎమ్మెల్యే గస్తీ


- మక్తల్‌లో వరుస చోరీలు
- పోలీసులతో కలిసి ఎమ్మెల్యే శ్రీహరి గస్తీ


రాత్రి సమయంలో గస్తీ తిరుగుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో దొంగలు హడలెత్తిస్తున్నారు. దొంగల బెడదతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. దొంగల్ని పట్టుకునేందుకు పోలీసులతో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గస్తీ తిరుగుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పది రోజుల్లో 15 దొంగతనాలు జరగగా.. మూడు కేసులు నమోదయ్యాయి. కొందరు అద్దె ఇళ్లను ఖాళీచేసి స్వగ్రామాలకు వెళ్లిపోవడం గమనార్హం. వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. వరుస చోరీలతో భయాందోళనకు గురవుతున్న పట్టణ ప్రజల్లో ధైర్యం నింపేందుకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పోలీసులతో పాటు గస్తీ తిరుగుతున్నారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత 2 గంటల సమయంలో పలు కాలనీల్లో పర్యటించారు. ఉదయం, సాయంత్రం కాలనీవాసులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు.

పతంజలి శాస్త్రికి సాహిత్య అకాడమీ పురస్కారం

▶ మొదటి పేజీ తరువాయి



అవార్డులు గెలుచుకోగా వాటిలో ఒకటి తెలుగు సంపుటి కావడం గమనార్హం. ఎక్కువ భాషల్లో కవిత్వానికే అకాడమీ పురస్కారం మొగ్గు చూపింది.

పిఠాపురంలో జననం.. రాజమహేంద్రవరంలో చిరకాలంగా జీవనం

1945 మే 14న పిఠాపురంలో జన్మించిన తల్లావఝుల పతంజలి శాస్త్రి బాల్యం, కాలేజీ జీవితం అంతా ఒంగోలులోనే గడిచింది. తల్లి మహాలక్ష్మి, తండ్రి కృత్తివాస తీర్థులు. పతంజలి శాస్త్రి ఇరువైపుల తాత గార్లు తల్లావఝుల శివశంకర శాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులు. ఎస్.వి.యూనివర్సిటీలో ఎం.ఏ చేసిన పతంజలి శాస్త్రి పుణే నుంచి ఆర్కియాలజీలో పీహెచ్‌డీ చేశారు. అమలాపురం కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పని చేసి, ఆ తర్వాత ‘ఎన్విరాన్‌మెంట్ సెంటర్’స్థాపించి పర్యావరణ రంగంలో కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవుల రక్షణ కోసం చాలా పోరాడారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలలో పర్యావరణ కార్యకర్తగా సదస్సులకు హాజరయ్యారు. దక్షిణ భారతదేశ చరిత్ర మీద, దేవాలయాల వాస్తు మీద పతంజలి శాస్త్రికి విశేష పరిజ్ఞానం ఉంది. భార్య విజయలక్ష్మితో రాజమండ్రిలో చిరకాలంగా జీవనం గడుపుతున్నారు. కుమారుడు శశి, కుమార్తె గాయత్రి.

అర్ధ శతాబ్దానికి పైగా కథా రచయితగా.. ప్రత్యేక కథాశైలితో ప్రతిష్ఠ

1960ల నుంచి కథలు రాస్తున్న పతంజలి శాస్త్రిది తెలుగులో ప్రత్యేక శైలి. తేట తెల్లంగా కథావస్తువును బయల్పరచకుండా పాఠకుడి మేధ కొద్దీ అర్థం చేసుకునే విషయాలను ఇమడ్చుతారు ఆయన. నిర్దిష్టమైన సాంస్కృతిక నేపథ్యంతో కాకుండా సార్వజనీనమైన మానవ ప్రవర్తనలతో కథ నుచెప్పడం ఆయన ధోరణిలో కనిపిస్తుంది. జేబు దొంగలు, హోటల్ క్లీనర్లు, ఐటీ ఉద్యోగాల కట్టు బానిసలు, రంగు రాళ్ల వెతుకులాటలో ప్రాణాలు కోల్పోయే వాళ్లు, వేశ్యలు, గారడీల వాళ్లు పాత్రలుగా ఆయన కథల్లో కనిపిస్తారు. ‘వడ్ల చిలుకలు’, ‘పతంజలి శాస్త్రి కథలు’, ‘నలుపెరుపు’, ‘రామేశ్వరం కాకులు’పతంజలి శాస్త్రి కథాసంపుటాలు కాగా ‘హోరు’, ‘దేవర కోటీశు’, ‘గేద మీద పిట్ట’నవలలు. వీటిలో ‘గేద మీద పిట్ట’ముఖ్య వస్తువు ‘మగ వేశ్యలు’కావడం ఒక ప్రత్యేకత. ‘మాధవి’అనే నాటకం రాశారు. గాథాసప్తశతిలోని వంద కథల్ని తెలుగులోకి అనువదించారు. ‘నేను నడుస్తున్నా, బస్సులో ఉన్నా, ఏం చేస్తున్నా మనసులో ఏదో కథ రాస్తూనే ఉంటాను’అని చెప్పే పతంజలి శాస్త్రి అలుపెరగక రాస్తూనే ఉన్నారు. పతంజలి శాస్త్రికి సాహిత్య అకాడమీ పురస్కారం రావడం పట్ల పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

తబ్లిగీ జమాత్‌కు ప్రభుత్వం నుంచి నిధులా?

- దీని వెనక సూత్రధారులెవరో తేల్చాలి
- సమావేశాన్ని రద్దుచేయని పక్షంలో తీవ్ర పరిణామాలుంటాయ్: బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: తబ్లిగీ జమాత్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం వెనుక సూత్రధారులెవరో తేల్చి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో ఇస్లామిక్ సమాజం పేరిట జరిగే తబ్లిగీ జమాత్ సమావేశాన్ని రద్దు చేయాలన్నారు. ఆ విధంగా జరగని పక్షంలో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బుధవారం ఓ ప్రకటనలో సంజయ్ హెచ్చరించారు. తీవ్రవాద భావజాల వ్యాప్తికి, బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడే సంస్థకు ప్రభుత్వ నిధులెలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ సంస్థకు సమావేశ ఏర్పాట్ల కోసం రూ.2.45 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడం దారుణమన్నారు. ఒకవైపు రాష్ట్రం దివాలా తీసిందని చెబుతున్న ప్రభుత్వం.. టెర్రరిజం, ఇస్లాం మత వ్యాప్తిని ప్రోత్సహిస్తున్న సంస్థ నిర్వహించే కార్యక్రమానికి నిధులివ్వడం ఏమిటని నిలదీశారు. ఈ సంస్థపై చర్యలు తీసుకోవాల్సింది పోయి నిధులిస్తూ ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని బండి ప్రశ్నించారు. టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తోందనే కారణంతో ఇస్లామిక్ దేశాలైన సౌదీ అరేబియా, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కజకిస్తాన్ దేశాలు తబ్లిగీ జమాత్ సంస్థను నిషేధించాయని సంజయ్ తెలిపారు.

కాంగ్రెస్ రంగు బయటపడుతోంది: రచనారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం తబ్లిగీ జమాత్ సమావేశానికి నిధులు విడుదల చేయడంపై బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి మండిపడ్డారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రంగు బయటపడుతోందని ధ్వజమెత్తారు. ఇస్లాం మత వ్యాప్తి, ఉగ్రవాద భావజాల వ్యాప్తి చేసే సంస్థకు ప్రభుత్వం డబ్బులివ్వడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తుక్డేతుక్డే గ్యాంగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేయాలనుకుంటున్నారని నిలదీశారు. తాము మైనారిటీలకు వ్యతిరేకం కాదని, ఇస్లాం మత వ్యాప్తి, ఉగ్రవాద భావజాల వ్యాప్తి చేసే సంస్థకు ప్రభుత్వం డబ్బులివ్వడం సరికాదని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య!


బండి సుమన్ (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్: పెద్దపల్లి జిల్లా పూసాల గ్రామానికి చెందిన బండి సుమన్ (27) బుధవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బండి లచ్చయ్య–ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు. చిన్నకుమారుడు సుమన్ డిగ్రీ, బీఈడీ పూర్తిచేశాడు. ఉద్యోగం రాకపోవడంతో మూడేళ్లుగా ఇంటివద్దే ఖాళీగా ఉంటున్నాడు. తనకు ఉద్యోగం లేదని తరచూ బాధపడుతూ మానసికంగా కుంగిపోయాడని, ఈ క్రమంలోనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

చూసిరాస్తూ పట్టుబడి.. ప్రాణాలు తీసుకుని

డీబార్ చేశారని విద్యార్థి ఆత్మహత్య


ఆంజనేయులు (ఫైల్)

మాగనూర్/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పరీక్షలో చూసిరాస్తూ పట్టుబడిన ఒక విద్యార్థి తనను డీబార్ చేశారన్న మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నారాయణపేట జిల్లాలో మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. మాగనూరు మండలం అచ్చంపేటకు చెందిన పూజారి ఆంజనేయులు (18) మక్తల్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మరికల్‌లోని సరస్వతి డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ కెమిస్ట్రీ పరీక్ష రాసేందుకు వెళ్లాడు. చూసిరాస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబట్టాడు. అంతకుముందు ఇద్దరు విద్యార్థినులు కూడా చూసిరాస్తూ పట్టుబడినా.. ఇన్విజిలేటర్ తిరిగి జవాబు పత్రం వారికి ఇచ్చేశారని విద్యార్థులు తెలిపారు. ఆంజనేయుల్ని మాత్రం ప్రస్తుతం మిగిలిన రెండు పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షలు రాయకుండా డీబార్ చేసినట్టు పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెందిన సదరు విద్యార్థి మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకుని సొంత పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు బుధవారం ఉదయం మరికల్‌లో కళాశాల ఎదుట పరీక్షలు రాయకుండా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి పరీక్ష కేంద్రానికి చేరుకొని విద్యార్థులను సముదాయించడంతో రెండు గంటల తర్వాత వారు పరీక్ష రాసేందుకు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ స్పందిస్తూ.. ముగ్గురు అధికారులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

‘పార్లమెంటు సభ్యుల సస్పెన్షన్ అప్రజాస్వామికం’

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నిలదీస్తున్న 141 మంది పార్లమెంట్ సభ్యులను బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిందని వామపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ చర్యల్లో భాగంగా ఈనెల 22న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని వామపక్ష పార్టీలు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చాయి. ఇటీవల పార్లమెంట్‌లో చోటు చేసుకున్న ఘటనపై సమగ్ర చర్చ జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, దేశ భద్రతను కాపాడాలని ప్రతిపక్షాలు కోరాయి. దీనిపై సమాధానం ఇవ్వకుండా, ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించాయి.

స్థానికులకు 80 శాతం ఉద్యోగాలపై హర్షం

సీఎంకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడంపై కాంగ్రెస్ చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించి సింగరేణి సంస్థకు ఆదేశాలు జారీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటిదాకా అమల్లో ఉన్న వివిధ నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేయడం వల్ల ఔట్‌సోర్సింగ్ ఆఫ్ ఓబీ రిమూవల్, బొగ్గు రవాణా, ఫారెస్ట్రీ, సెక్యూరిటీ సర్వీసెస్ తదితరాల్లో స్థానికులకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.

బస్సులో వస్తారు.. బైక్‌తో వెళ్తారు

- ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్.. 17 వాహనాలు స్వాధీనం


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ శబరీష్

సాక్షి, హైదరాబాద్: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలతో పాటు వాటిని కొనుగోలు చేసి ఇతరులకు అమ్మిన మరో వ్యక్తిపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి సుమారు రూ.8.50 లక్షల విలువచేసే 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ డీసీపీ శబరీష్, ఏసీపీ రఘునందన్ రావు, సిఐ ప్రశాంత్ సమక్షంలో నిందితుల వివరాలను వెల్లడించారు. వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగతనం అవుతున్న నేపథ్యంలో పేట్ బషీరాబాద్ సీఐ ప్రశాంత్, డిఐ రాజు ప్రత్యేకంగా టీం తయారుచేసి దొంగతనం చేస్తున్న వారికోసం వేట ప్రారంభించారు. పలు సీసీ కెమెరాలు గుర్తించిన పోలీసులు ఆ దిశగా అడుగులు వేశారు.

తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు..

మెదక్ జిల్లా లింగారెడ్డిపేట్‌కు చెందిన సెంట్రింగ్ పనులు చేసే మన్నె మహేష్ (23) అదే గ్రామానికి చెందిన కారు డ్రైవర్ షేక్ అమీర్ (29) జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలు చేస్తూ వాటిని అమ్ముకుంటూ వస్తున్నారు. మెదక్ జిల్లా నుండి నగరానికి బస్సులో రావడం.. ఇక్కడ ద్విచక్ర వాహనం దొంగతనం చేసి బైక్‌పై వెళ్లడం చేస్తున్నారు. ఈ క్రమంలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకంగా 11 కేసులు నమోదు కాగా, జీడిమెట్ల, అల్వాల్, మేడ్చల్, జిన్నారం, శంకరంపేట్ పోలీస్ స్టేషన్ల్లో పరిధిలో ఒక్కో కేసు నమోదు అయింది. అయితే వీరు మొత్తం 17 వాహనాలు దొంగిలించి ఎత్తుకుపోగా 16 కేసులు నమోదు అయ్యాయి. మరొకరు ఫిర్యాదు చేయాల్సి ఉంది. పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ ద్విచక్ర వాహనాల దొంగలు ఎట్టకేలకు కొంపల్లి –దూలపల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో అనుమానంతో వారిని అదుపులో తీసుకొని తమదైన శైలిలో ప్రశ్నించగా పై దొంగతనాల వివరాలను వెల్లడించారు. వీరిద్దరితో పాటు వాహనాలను కొనుగోలు చేసిన మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన డ్రైవర్ రాజును కూడా రిమాండ్‌కు తరలించారు.

ట్రంప్‌కు షాక్

కాపిటల్ హిల్‌పై దాడి కేసులో దోషే **అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హుడు** కొలరాడో కోర్టు సంచలన తీర్పు

- కొలరాడో రిపబ్లికన్ ప్రైమరీలో పాల్గొనకుండా ఆయనపై నిషేధం
- ట్రంప్‌కు రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బే: పరిశీలకులు
- తీర్పుపై తీవ్రంగా మండిపడ్డ ట్రంప్, అమెరికా సుప్రీంకోర్టులో అప్పీల్



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి షాక్ తగిలింది. 2024 నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడేందుకు ఆయన అనర్హుడంటూ కొలరాడో రాష్ట్ర సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2021లో కాపిటల్ హిల్‌పై జరిగిన దాడి ఉదంతంలో ఆయన పాత్ర ఉందని తేల్చింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ (సెక్షన్ 3) ప్రకారం ట్రంప్‌ను దోషిగా నిర్ధారించింది. దీని ప్రకారం ప్రభుత్వంపై, ప్రభుత్వ సంస్థలు, భవనాలపై దాడిలో పాల్గొనే అధికారులు భవిష్యత్తులో ప్రభుత్వ పదవులు చేపట్టడానికి అనర్హులు. కాకపోతే అధ్యక్ష అభ్యర్థిని ఈ సెక్షన్ కింద పోటీకి అనర్హుడిగా ప్రకటించడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి! ఈ తీర్పు కొలరాడో రాష్ట్రం వరకే వర్తిస్తుంది. తీర్పు నేపథ్యంలో కొలరాడోలో రిపబ్లిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎన్నిక (ప్రైమరీ)లో ట్రంప్ పోటీ చేయకుండా కోర్టు అనర్హత వేటు వేసింది. ప్రైమరీ బ్యాలెట్ పేపర్ల నుంచి ఆయన పేరును తొలగించాలని ఆదేశించింది. ''కాపిటల్ భవనంపై దాడికి తన మద్దతుదారులను ట్రంప్ స్వయంగా పురిగొల్పారు. అక్రమ పద్ధతుల్లో, హింసాత్మకంగా అధికార మార్పిడిని అడ్డుకోజూశారు. తద్వారా దేశ ప్రజల తీర్పునే అపహాస్యం చేశారు. కనుక సెక్షన్ 3 ప్రకారం దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు ఆయన అనర్హుడు'' అంటూ ఏడుగురు జడ్జిల ధర్మాసనం 4–3 మెజారిటీతో తీర్పు చెప్పింది.

ట్రంప్ 'అధ్యక్ష' ఆశలపై నీళ్లు!

మరోసారి అధ్యక్షుడు కావాలన్న 77 ఏళ్ల ట్రంప్ కలలకు కొలరాడో కోర్టు తీర్పు గట్టి ఎదురు దెబ్బేనని భావిస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఇప్పటికే ఆయన అందరి కంటే ముందున్నారు. కొలరాడో కోర్టుది తప్పుడు తీర్పంటూ ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తనను ఏదోలా అడ్డుకునేందుకు న్యాయ వ్యవస్థను కూడా అడ్డగోలుగా వాడుకునేందుకు అధ్యక్షుడు జో బైడెన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్టు ట్రంప్ లాయర్లు ప్రకటించారు. కొలరాడో కోర్టు కూడా తన తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలుకు జనవరి 4 దాకా గడువిచ్చింది. అప్పటిదాకా తీర్పు అమలుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ రాజకీయ భవితవ్యాన్ని సుప్రీంకోర్టులోనే తేలనుంది. అయితే, ఒకట్రెండు నెలల్లో రాష్ట్రాలవారీగా ప్రైమరీలు మొదలవుతున్న నేపథ్యంలో ఆలోగా సుప్రీంకోర్టు విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించకపోతే ట్రంప్ పరిస్థితి ఏమిటన్నది కూడా ఆసక్తికరంగా మారింది. కొలరాడోలో మార్చి 5న జరగనున్న ప్రైమరీకి అధ్యక్ష అభ్యర్థుల బ్యాలెట్ పత్రాల ఖరారుకు జనవరి ఐదో తేదే తుది గడువు! అంతేగాక కాపిటల్ భవనంపై దాడి ఉదంతానికి సంబంధించి ఇంకా పలు రాష్ట్రాల్లో ట్రంప్ కేసులు ఎదుర్కొంటున్నారు. అక్కడా ఇలాంటి తీర్పే వస్తే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన పోటీ మరింతగా చిక్కుల్లో పడనుంది.

వివేక్ రామస్వామి అండ

రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి ట్రంప్‌తో పోటీ పడుతున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి కూడా కొలరాడో సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టడం విశేషం. ఈ విషయంలో ట్రంప్‌కు అండగా నిలవాల్సిన అవసరముందని ఆయన అన్నారు. ఈ తీర్పు కారణంగా కొలరాడో రిపబ్లికన్ ప్రైమరీలో ట్రంప్ పోటీ పడలేకపోతే తాను కూడా అక్కడ పోటీ చేయబోనని ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులెవరూ కూడా కొలరాడో ప్రైమరీలో బరిలో దిగొద్దని 38 ఏళ్ల వివేక్ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

ఏమిటా కేసు?

2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ఓటమిని ఒప్పుకునేందుకు ట్రంప్ ససేమిరా అనడం, తననే విజేతగా ప్రకటించాలంటూ పట్టుబట్టడం తెలిసిందే. 2021 జనవరి 6న జో బైడెన్‌ను దేశ అధ్యక్షునిగా ప్రకటించేందుకు కాంగ్రెస్ సమావేశం జరుగుతుండగా కాపిటల్ హిల్‌పై ట్రంప్ మద్దతుదారులు దాడికి దిగి తీవ్ర విధ్వంసం సృష్టించారు. సంచలనం సృష్టించిన ఈ ఘటనపై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ ఉదంతంలో ట్రంప్‌ను దోషిగా కొలరాడో జిల్లా కోర్టు గతంలోనే ప్రకటించింది. అయితే అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి ఇది అడ్డు కాబోదని పేర్కొనగా కొలరాడో సుప్రీంకోర్టు తాజా తీర్పులో దాన్ని తోసిపుచ్చింది.

కరోనా కేసుల ఉధృతి

కొత్తగా 614 కేసులు నమోదు | ఆందోళన అక్కర్లేదు, అప్రమత్తంగా ఉండండి: మంత్రి మాండవీయ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. గత 24 గంటల వ్యవధిలో ఏకంగా 614 కొత్త కేసులు నమోదయ్యాయి. మే 21వ తేదీ తర్వాత ఒక్క రోజులో ఇంతగా కొత్త కేసులు నమోదవడం ఇదే తొలిసారికావడం గమనార్హం. గత 24 గంటల్లో కేరళలో ముగ్గురు కోవిడ్‌తో కన్నుమూశారు. భారత్‌లో కొత్తగా వెలుగుచూసిన జేఎన్1 ఉపరకం వైరస్ కేసులు ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో 21 నమోదయ్యాయని నీతి ఆయోగ్ సభ్యుడు(ఆరోగ్యం) డాక్టర్ వీకే పాల్ చెప్పారు. ఈ వైరస్ సోకినవారు 92 శాతం వరకు ఇంటివద్దే చికిత్స పొందుతున్నారని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 2,311కు పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం ఉదయం వెల్లడించింది. కేరళ, మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటకల్లో రోజువారీ కేసుల సంఖ్యలో మరింత పెరుగుదల కనిపించింది.

ఆరోగ్య మంత్రి ఉన్నతస్థాయి సమావేశం

కేసుల ఉధృతి నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ రాష్ట్రాల ఉన్నతాధికారులతో కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. '' పెరుగుతున్న కేసులతో ఆందోళన అక్కర్లేదు. కానీ అప్రమత్తంగా ఉండండి. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడం, కరోనా కేసుల నిర్ధారణ పరీక్షల పెంపు, ఆస్పత్రుల్లో చికిత్స సన్నద్ధత అంశాలపై సూచనలు చేశారు. కొత్తరకం వేరియంట్‌గా భావించే అనుమానిత కేసుల శాంపిళ్లను వెంటనే ఇన్సాకాగ్ జన్యుక్రమ విశ్లేషణ ల్యాబ్‌లకు పంపండి. కేసుల నిర్ధారణ, నిఘా, చికిత్స విధానాలను పటిష్టంచేయండి. ఆస్పత్రుల్లో మెడికల్ ఆక్సిజన్, పడకలు, వెంటిలేటర్లు, వైద్య ఉపకరణాలు, ఆక్సిజన్ ప్లాంట్లు తదితరాల లభ్యతను ఎప్పటికప్పుడు సరిచూసుకోండి. ఈ సన్నద్ధతపై ప్రతి మూడు నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ నిర్వహించండి. వైరస్ విస్తృతిపై ప్రజల్లో అవగాహన పెంచండి'' అని మంత్రి ఉన్నతాధికారులకు సూచించారు. దేశంలో ఆరోగ్య పరిస్థితిపై మంత్రికి కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. కొత్త జేఎన్1 సబ్‌వేరియంట్‌ను 'వేరియంట్ ఆఫ్ ఇంట్రస్ట్' పరిగణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వ్యాప్తి వేగం ఎక్కువగా ఉన్నా రిస్క్ తక్కువేనని స్పష్టంచేసింది. అమెరికా, చైనా, సింగపూర్, భారత్‌లలో ఈ వైరస్ వెలుగుచూసింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కొత్తపల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య బుధవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు తీవ్రంగా గాయపడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కొత్తపల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిబిరంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. వెంటనే తేరుకున్న మావోయిస్టులు ఎదురుకాల్పులు జరుపుతూ సమీప అటవీప్రాంతంలోకి పారిపోయినట్టు సమాచారం. పోలీసులు మావోల క్యాంప్‌ను ధ్వంసం చేశారు. ఘటనాస్థలిలో భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ''మావోల జాడ కోసం గాలింపు చేపట్టగా సమీప ప్రాంతాల్లో రక్తపు మరకలు ఎక్కువగా కనిపించాయి. ఎన్‌కౌంటర్ సందర్భంగా దాదాపు ఆరుగురు మావోలు తీవ్రంగా గాయపడి ఉండొచ్చు లేదా మరణించి ఉండొచ్చు'' అని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు.

మళ్లీ ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా!

ఒక రోజు ముందే ధ్యానం కోసం పయనం

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకల కేసులో ప్రశ్నించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమన్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి బేఖాతరు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈరోజు(డిసెంబర్ 21న) ఆయన ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సిఉంది. కానీ ఆయన ఒకరోజు ముందుగానే బుధవారం విపాసనా ధ్యానం కోర్సులో చేరేందుకు వెళ్లినట్లు వార్తలొచ్చాయి. ఆయన ఏ నగరానికి వెళ్లారనేది వెల్లడికాలేదు. 10 రోజుల ధ్యానం షెడ్యూల్ కోసం మంగళవారమే ఆయన వెళ్లిపోవాల్సిఉంది. కానీ విపక్షాల 'ఇండియా' కూటమి భేటీలో బుధవారం బిజీగా ఉండటంతో మధ్యాహ్నం ఆయన బయల్దేరారు. '' ఆయన ఏటా చలికాలంలో విపాసనా ధ్యానానికి వెళ్తారని అందరికీ తెలుసు. కావాలనే ఆయనకు ఈ తేదీలో ఈడీ సమన్లు ఇచ్చింది. గైర్హాజరుపై కోర్టులో న్యాయబద్ధంగా ముందుకెళ్లేందుకు మా న్యాయవాదులు ప్రయత్నిస్తున్నారు'' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా వ్యాఖ్యానించారు. నవంబర్ రెండో తేదీన హాజరుకావాలని కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీచేయగా రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని కారణం చూపి ఆనాడు హాజరుకాలేదు. దీంతో డిసెంబర్‌లో మళ్లీ సమన్లు ఇవ్వగా ఇలా మరోసారి డుమ్మా కొడుతున్నారు.

మూడు క్రిమినల్ బిల్లులకు ఆమోదం

- మూజువాణి ఓటుతో ఆమోదించిన సభ
- ప్రతిపాదిత చట్టాలతో నేర న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు సాధ్యపడతాయి
- బ్రిటిషర్ల ఆలోచనా ధోరణి, చిహ్నాల నుంచి ప్రజలకు విముక్తి
- భారతీయ ఆలోచనా ధోరణికి అనుగుణంగా న్యాయం చేకూర్చే వ్యవస్థ రానుంది
- లోక్‌సభలో ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: బ్రిటిష్ వలస పాలకుల హయాం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులను లోక్‌సభలో బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించారు. భారతీయ న్యాయ(రెండో) సంహిత బిల్లు, భారతీయ నాగరిక్ సురక్షా(రెండో) సంహిత బిల్లు, భారతీయ సాక్ష్య(రెండో) బిల్లును కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గతవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇండియన్ పీనల్ కోడ్–1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్–1898, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 స్థానంలో ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. లోక్‌సభలో ఈ బిల్లులపై బుధవారం చర్చ జరిగింది. సమగ్రమైన సంప్రదింపులు, భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయ సేకరణ తర్వాతే మూడు బిల్లులను సిద్ధం చేసినట్లు అమిత్ షా చెప్పారు. ముసాయిదా బిల్లుల్లో ప్రతి కామా, ఫుల్‌స్టాప్‌ను కూడా క్షుణ్నంగా పరిశీలించినట్లు తెలిపారు. మన దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న క్రిమినల్ చట్టాలు బ్రిటిష్ వలస పాలకుల ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. భారతీయ ఆలోచనా ధోరణికి అనుగుణంగా న్యాయం చేకూర్చే వ్యవస్థను నెలకొల్పడానికి మూడు కొత్త బిల్లులకు రూపకల్పన చేసినట్లు అమిత్ షా ఉద్ఘాటించారు. ప్రతిపాదిత మూడు నూతన క్రిమినల్ చట్టాలు వలస పాలన మైండ్‌సెట్ నుంచి, బ్రిటిషర్ల చిహ్నాల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తాయని తెలిపారు. ఈ చట్టాలతో నేర న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు వస్తాయన్నారు. నేర న్యాయ వ్యవస్థకు తొలిసారిగా మానవత్వాన్ని జోడించబోతున్నామని హర్షం వ్యక్తం చేశారు. మూడు కొత్త చట్టాలకు న్యాయం, పారదర్శకత, నిష్పక్షపాతమే ఆధారమని వివరించారు. ప్రొవిజినల్ కలెక్షన్ ఆఫ్ ట్యాక్సెస్ బిల్లు–2023ను కూడా బుధవారం పార్లమెంట్‌లో ఆమోదించారు.

మరో ఇద్దరు విపక్ష ఎంపీల సస్పెన్షన్

భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడంతో బుధవారం లోక్‌సభలో ఇద్దరు విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. కేరళ కాంగ్రెస్(మణి) సభ్యుడు థామస్ చెళికాదన్, సీపీఎం సభ్యుడు ఎ.ఎం.ఆరీఫ్‌ను సభ నుంచి ఈ సెషన్‌లో మిగిలిన కాలమంతా సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్ నుంచి సస్పెండైన విపక్ష ఎంపీల సంఖ్య 143కు చేరుకుంది. లోక్‌సభ నుంచి 97 మంది, రాజ్యసభ నుంచి 46 మంది సస్పెండయ్యారు.



ఢిల్లీ నుంచి అయోధ్యకు విమానం

30న తొలి ఫ్లైట్‌ను నడపనున్న ఎయిర్‌ఇండియా

న్యూఢిల్లీ: భవ్య రామ మందిరం అయోధ్యలో ప్రారంభంకానున్న నేపథ్యంలో భక్తుల ప్రయాణసౌకర్యం కోసం ఢిల్లీ నుంచి అయోధ్యకు విమానసర్వీసులు మొదలుపెడుతున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ బుధవారం ప్రకటించింది. విమానసర్వీసుల ప్రారంభసూచికగా తొలి విమానం డిసెంబర్ 30వ తేదీన ఢిల్లీ నుంచి ప్రయాణించనుంది. జనవరి 16వ తేదీ నుంచి రోజువారీ సర్వీసులను అందుబాటులోకి తెస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ చెప్పారు. ఏ–321/బీ–737 రకం విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనువుగా మర్యాద పురుషోత్తమ శ్రీరామ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ రన్‌వేను విస్తరించారు. దాంతో IX 2789 విమానంతో తమ సంస్థ సర్వీసులకు శ్రీకారం చుడతామని ఎయిర్‌ఇండియా ఒక ప్రకటనలో పేర్కొంది. దేశంలోని రెండో, మూడో శ్రేణి నగరాలకు తమ సేవలను విస్తరించాలని నిర్ణయించినట్లు అలోక్ సింగ్ తెలిపారు. డిసెంబర్ 30వ తేదీన దేశ రాజధాని నుంచి అయోధ్యకు విమానం నడుపుతామని మరో పౌరవిమానయాన సంస్థ ఇండిగో గతంలోనే తెలిపింది. జనవరి ఆరో తేదీ నుంచి ఈ సంస్థ రోజువారీ సర్వీసులను మొదలుపెట్టనుంది. ఈనెలాఖరులోగా అయోధ్య ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తవుతుందని, ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా విమానాశ్రయం ప్రారంభం అవుతుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఇటీవలే వెల్లడించారు. రూ.350 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్‌కు డీజీసీఏ ఇటీవలే ఏరోడ్రోమ్ లైసెన్స్‌ను మంజూరుచేసింది.

ప్రజాస్వామ్యం ఊపిరి తీస్తున్నారు

- విపక్ష ఎంపీల సస్పెన్షన్‌పై సోనియా ఆగ్రహం
- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రసంగం



సస్పెన్షన్‌ను నిరసిస్తూ బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో విపక్ష ఎంపీల ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: విపక్ష సభ్యులను మూకుమ్మడిగా బహిష్కరిస్తూ పార్లమెంట్ వేదికగా ప్రజాస్వామ్యం ఊపిరితీస్తున్నారని పాలక బీజేపీపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా నిప్పులు చెరిగారు. ఇటీవల మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమి తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ స్పందించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఒక పార్టీగా, 'ఇండియా' కూటమి భాగస్వామిగా కీలక బాధ్యతలు కాంగ్రెస్ నెరవేర్చాల్సి ఉందని ఆమె వ్యాఖ్యానించారు. బుధవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలనుద్దేశించి సోనియా మాట్లాడారు. '' మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ ఓటమితో నెలకొన్న నిరాశను సానుకూల దృక్పథంగా మలుచుకుని లోక్‌సభ ఎన్నికలకు సంసిద్ధంకండి'' అని ఎంపీలకు సూచించారు.

తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాం

''ప్రస్తుతం మనం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాం. మన పట్టుదల, ధృడ సంకల్పంతో కష్టాలను అధిగమించగలమన్న నమ్మకం నాకుంది. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మన నేతల ధైర్యసాహసాలు, పోరాట పటిమను మనం ఎన్నడూ మర్చిపోకూడదు. ఎన్నికల్లో ఓటమి నుంచి వచ్చిన నిరాశను వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సానుకూల దృక్పథ ఆయుధంగా మలచుకోండి'' అని ఎంపీలకు కర్తవ్యబోధ చేశారు. ''లోక్‌సభలో పొగబెట్టిన ఘటనపై చట్టబద్ధమైన వివరణ కోరినందుకు ఏకంగా ఇంతమంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం అసాధారణం. విపక్షాలను బయటకు గెంటి ప్రజాస్వామ్యం గొంతు నొక్కేస్తున్నారు'' అన్నారు.

బయటమాట్లాడి సభను కించపరిచారు

''పార్లమెంట్‌లో చొరబాటు క్షమించరాని నేరం. ఏమాత్రం సమర్థనీయంకాదు. ఇంత జరిగితే తీరిగ్గా నాలుగు రోజుల తర్వాత ప్రధాని నోరు మెదిపారు. అది కూడా పార్లమెంట్‌లో మాట్లాడకుండా బయటికొచ్చి ప్రసంగించారు. ఆయన సభా మర్యాదలు ఏపాటివో దీన్నిబట్టే తెల్సిపోతోంది. ఒకవేళ ఇదే సమయంలో బీజేపీ విపక్షంలో కూర్చుని ఉంటే ఎంతగా నిరసనలు, ఆందోళనలతో పరిస్థితిని దిగజార్చేదో మీరే ఊహించుకోండి. జమ్మూకశ్మీర్ బిల్లు సందర్భంగా నెహ్రూ వంటి గొప్ప దేశ భక్తుడి పరువు తీసేందుకు, చరిత్రను వక్రీకరించడానికి ప్రధాని, హోంమంత్రి తెగ ఆరాటపడ్డారు. ఈ విషయంలో మేం అస్సలు భయపడం. మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలుచేయాలి'' అని సోనియా అన్నారు.

ఆధారాలు అందజేస్తే పరిశీలిస్తాం

సిక్కు వేర్పాటువాది హత్య కుట్రపై తొలిసారిగా స్పందించిన మోదీ

న్యూఢిల్లీ: అమెరికాలోని సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్రలో భారత ప్రమేయముందన్న అంశంపై ప్రధాని మోదీ తొలిసారిగా స్పందించారు. బ్రిటన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ అంశంపై మోదీ మాట్లాడారు. '' పన్నూ హత్య కుట్రలో భారత్ ప్రమేయముందని ఎవరైనా బలమైన ఆధారాలు మా ప్రభుత్వానికి సమర్పిస్తే తప్పకుండా పరిశీలిస్తాం. మా భారతీయ పౌరుడు ఏదైనా మంచిపనో, చెడు పనో చేసి ఉంటే మాకు చెప్పండి. బలమైన ఆధారాలు అందజేయండి. మేం తప్పక పరిశీలిస్తాం. చట్టబద్ధపాలనకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. సంబంధంలేని విషయాలతో అమెరికా–భారత్ దౌత్య సంబంధాలను కలపొద్దు. గత కొద్ది సంవత్సరాలుగా ఇరుదేశాల మైత్రి బంధం మరింత బలపడుతోంది. అమెరికా, కెనడా ద్వంద్వ పౌరసత్వమున్న పన్నూను హత్యచేసేందుకు భారతీయ అధికారితో కలిసి నిఖిల్ గుప్తా అనే భారతీయుడు కుట్ర పన్నాడని అమెరికా ఆరోపిస్తోంది. ప్రస్తుతం చెక్ రిపబ్లిక్ పోలీసుల కస్టడీలో ఉన్న గుప్తాను తమకు అప్పగించాలని అమెరికా ఒత్తిడిపెంచిన నేపథ్యంలో దీనిపై మోదీ మాట్లాడారు. '' అనవసర ఆరోపణల విషయం మాదాకా వచ్చింది. ఇప్పటికే ఈ ఆరోపణల్లో నిజానిజాల నిగ్గుతేల్చేందుకు దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేశాం'' అని మోదీ వెల్లడించారు. '' భావ ప్రకటనా స్వేచ్ఛ మాటున కొందరు విదేశాల్లో ఉంటూ భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇంకోవైపు అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలు సమున్నత స్థితికి చేరుకుంటున్నాయి. ఇలాంటి వేర్వేరు ఘటనలకు మధ్య సంబంధం అంటగట్టడం సరికాదు'' అని మోదీ వ్యాఖ్యానించారు.

లాలూ, తేజస్వీలకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: తాను రైల్వేమంత్రిగా ఉన్న కాలంలో భూములు రాయించుకుని కొందరికి రైల్వేలో గ్రూప్–డీ ఉద్యోగాలు కట్టబెట్టారన్న ఆరోపణలపై ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఈడీ సమన్లు జారీచేసింది. ఆయన కుమారుడు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌కూ సమన్లు పంపింది. ఈనెల 22వ తేదీన ఢిల్లీ ఆఫీస్‌కు రావాలని తేజస్వీని, డిసెంబర్ 27న రావాలని లాలూకు ఈడీ సూచించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో వీరిద్దరి నుంచి అధికారులు వాంగ్మూలాలు తీసుకోనున్నారు. ఈడీ ఇప్పటికే ఇదే కేసులో ఏప్రిల్‌లో ఎనిమిది గంటలపాటు తేజస్వీని విచారించింది. లాలూ ప్రసాద్‌కు ఈ కేసులో సమన్లు పంపడం ఇదే తొలిసారి. గత నెలలో లాలూ కుటుంబానికి ఆప్తుడైన అమిత్ కాత్యాల్‌ను ఈడీ అరెస్ట్‌చేసిన నేపథ్యంలో వీరికి సమన్లు జారీకావడం గమనార్హం.

ఇస్రోకు ఐస్‌లాండ్ 'అన్వేషణ' అవార్డ్

న్యూఢిల్లీ: చంద్రుడిపై జీవం జాడ కోసం అన్వేషిస్తున్న ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)కు ఐస్‌ల్యాండ్‌కు చెందిన సంస్థ నుంచి అవార్డ్ దక్కింది. చంద్రయాన్–3 మిషన్ ద్వారా చంద్రుడిపై సాఫ్ట్‌ల్యాండింగ్‌ను విజయవంతంగా పూర్తిచేసినందుకుగాను 2023 ఏడాదికి లీఫ్ ఎరిక్‌సన్ లూనార్ ప్రైజ్‌ను ఇస్తున్నట్లు హుసావిక్ నగరంలోని ఎక్స్‌ప్లోరేషన్ మ్యూజియం తెలిపింది. క్రిస్టోఫర్ కొలంబస్ కంటే 400 సంవత్సరాల ముందే అమెరికా గడ్డపై కాలుమోపిన తొలి యూరోపియన్ లీఫ్ ఎరిక్సన్‌కు గుర్తుగా ఈ అవార్డును ఎక్స్‌ప్లోరేషన్ మ్యూజియం ఇస్తోంది. నూతన అన్వేషణలతో చేస్తున్న కృషికిగాను ఈ అవార్డ్‌ను ప్రదానంచేస్తోంది. ఇస్రో తరఫున భారత రాయబారి బి.శ్యామ్ ఈ అవార్డ్‌ను అందుకున్నారు. అవార్డ్ ఇచ్చినందుకు ఇస్రో చైర్మన్ సోమనాథ్ ధన్యవాదాలు తెలిపారు.

సమోసాకు డబ్బుల్లేక చాయ్‌తో సరిపెట్టారు

విపక్షాల 'ఇండియా' కూటమి భేటీపై జేడీయూ నేత వ్యంగ్యం

న్యూఢిల్లీ: ఢిల్లీలో మంగళవారం విపక్షాల 'ఇండియా' కూటమి భేటీలో ప్రస్తావనకు వచ్చిన కీలకాంశాలపై ఓ వైపు చర్చ జరుగుతుంటే అక్కడ సమోసాలు ఇవ్వలేదంటూ జేడీ(యూ) సీనియర్ నేత సునీల్ కుమార్ పింటూ కాంగ్రెస్‌నుద్దేశిస్తూ చులకనగా మాట్లాడారు. డబ్బుల్లేక కాంగ్రెస్ కనీసం సమోసాలు కూడా వడ్డించలేదని వ్యాఖ్యానించారు. '' నిన్నటి సమావేశానికి భాగస్వామ్య పార్టీల అగ్రనేతలంతా విచ్చేశారు. సీట్ల పంపకాలపై చర్చించాలనుకున్నా అది టీ, బిస్కెట్లకే పరిమితం అయింది. ఎందుకంటే కాంగ్రెస్ దగ్గర నిధులు నిండుకున్నాయి. రూ.138, రూ.1,380, రూ.13,800 ఇలా చిన్న చిన్న మొత్తాలను ఆ పార్టీ విరాళంగా సేకరిస్తోంది. ఇంకా విరాళాలు రావాల్సి ఉంది. అప్పటిదాకా సమోసాలుండవు. టీ, బిస్కెట్లతో సరిపెట్టుకోవాలి. సమోసాలు లేకుండా ఎలాంటి తీవ్రమైన చర్చలు జరగబోవు'' అని సునీల్ పింటూ వెటకారంగా అన్నారు. సంబంధిత వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశారు.

అయ్.. హిందీ తెలియాల్సిందే

విపక్షాల కూటమి సమావేశంలో నితీశ్ కుమార్ ప్రసంగిస్తుండగా డీఎంకే నేత టీఆర్ బాలు బాగా ఇబ్బంది పడ్డారు. హిందీరాని బాలుకు నితీశ్ హిందీ ప్రసంగం అర్థంకాలేదు. అర్థంచేసుకునేందుకు తన పక్కనే కూర్చున్న రాష్ట్రీయ జనతాదళ్ రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝాను సాయంకోరారు. 'మీ ప్రసంగాన్ని ఆయనకు అర్థమయ్యేలా అనువాదం చేయొచ్చా?' అని నితీశ్‌ను ఝా కోరారు. దీంతో ఆగ్రహించిన నితీశ్.. ' హిందీ మన జాతీయ భాష. అందుకే మన దేశాన్ని హిందుస్తాన్‌గా పిలుచుకుంటాం. హిందీ అందరి భాష. అలాంటి హిందీ తెలియాల్సిందే. నేర్చుకుని అర్థంచేసుకోవాలి. మీరు అనువాదాలు ఏవీ చేయకండి'' అని ఝాను వారించారు.

'మిమిక్రీ'పై ఆగ్రహ జ్వాలలు

- ఉపరాష్ట్రపతి పట్ల విపక్షాల ప్రవర్తనను ఖండించిన రాష్ట్రపతి, ప్రధాని మోదీ
- పార్లమెంట్‌ను, ఉప రాష్ట్రపతి పదవిని అవమానిస్తే సహించబోను: ధన్‌ఖడ్
- ఆయనకు కేంద్ర మంత్రులు, ఎన్డీయే ఎంపీల సంఘీభావం



న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను అనుకరిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మిమిక్రీ చేయడాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. విపక్ష సభ్యుల ప్రవర్తన పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. ధన్‌ఖడ్‌కు మద్దతు ప్రకటిస్తూ రాష్ట్రపతి ముర్ము బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఉపరాష్ట్రపతి పట్ల విపక్ష ఎంపీల ప్రవర్తనను చూసి కలత చెందానని పేర్కొన్నారు. పార్లమెంటరీ సంప్రదాయాలను ఎంపీలంతా కాపాడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. రాష్ట్రపతికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలిపారు. అందరూ ఇతరుల పట్ల కనీస మర్యాద పాటించాలని రాష్ట్రపతి సమయానుకూలంగా గుర్తు చేశారన్నారు. ''చివరి శ్వాస వరకూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటా. అవమానాలు, హేళనలు నన్ను మార్గం నుంచి తప్పించలేవు'' అని తేల్చిచెప్పారు.

ధన్‌ఖడ్‌కు ప్రధాని మోదీ ఫోన్

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పట్ల విపక్ష సభ్యుల ప్రవర్తన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం ధన్‌ఖడ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి పట్ల విపక్ష సభ్యుల ప్రవర్తన తనకు చాలా బాధ కలిగించిందని చెప్పారు. ఉపరాష్ట్రపతిని అనుకరిస్తూ విపక్ష సభ్యులు మిమిక్రీ చేయడాన్ని ఆక్షేపించారు. ఎవరెన్ని విధాలుగా హేళన చేసినా తన విధులు నిర్వర్తిస్తూనే ఉంటానని, ఎవరూ తనను అడ్డుకోలేరని ధన్‌ఖడ్ చెప్పారు. తానూ 20 ఏళ్లుగా ఇలాంటి హేళనలు, అవమానాలు ఎదుర్కొంటున్నానని మోదీ చెప్పారని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ధన్‌ఖడ్‌కు కేంద్ర మంత్రులు, ఎన్డీయే ఎంపీలు మద్దతు ప్రకటించారు. సంఘీభావంగా బుధవారం లోకసభలో 10 నిమిషాలపాటు లేచి నిల్చున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ధన్‌ఖడ్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ధన్‌ఖడ్ బుధవారం రాజ్యసభలో కూడా మాట్లాడారు. తనను వ్యక్తిగా హేళన చేస్తే పట్టించుకోను గానీ పార్లమెంట్‌ను, ఉప రాష్ట్రపతి పదవిని అవమానిస్తే సహించబోనని హెచ్చరించారు. మిమిక్రీ చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఎవరినీ కించపర్చాలన్న ఉద్దేశం తనకు లేదని అన్నారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తమ ఎంపీకి మద్దతుగా ప్రకటన చేశారు.

బీజేపీ ఎంపీపై చర్యలేవి: కాంగ్రెస్

జాట్ కులాన్ని ప్రతిపక్షాలు అవమానించాయన్న ఆరోపణలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖండించారు. ప్రతి అంశంలోనూ కులాన్ని లాగడం మానుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్‌లో తనను ఎన్నోసార్లు మాట్లాడనివ్వలేదని, దళితుడిని కాబట్టే మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తాను అనొచ్చా అని ప్రశ్నించారు. మోదీ గతంలో అప్పటి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీని మిమిక్రీ చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గుర్తు చేశారు. ఆగంతకులకు లోక్‌సభ పాస్ ఇచ్చిన బీజేపీ ఎంపీపై మాత్రం చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

24 మందికి సాహిత్య అకాడమీ పురస్కారాలు

న్యూఢిల్లీ: ఆంగ్ల రచయిత్రి నీలం సరణ్ గౌర్, హిందీ నవలా రచయిత సంజీవ్‌సహా 25 మంది రచయితలు 2023 సంవత్సరానికి సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో భేటీ అయిన అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు 24 భారతీయ భాషలకుగాను జ్యూరీ సభ్యులు సూచించిన పేర్లకు ఆమోదం తెలిపిందని సాహిత్య అకాడమీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొమ్మిది కవితా సంపుటాలు, ఆరు నవలలు, ఐదు చిన్న కథల సంపుటాలు, మూడు వ్యాసాలు, ఒక సాహిత్య అధ్యయనానికి ఈ అవార్డులు దక్కాయి. ముఝే పెహ్‌చానో నవలకుగాను సంజీవ్‌కు, రెకియమ్ ఇన్ రాగా జానకి పుస్తకానికిగాను నీలం సరణ్ గౌర్‌కు అవార్డు దక్కింది. టి.పతంజలి శాస్త్రి(తెలుగు), విజయ్ వర్మ(డోగ్రీ), వినోద్ జోషి(గుజరాతీ), మన్సూర్ బనిహారి (కశ్మీరీ), అరుణ్ రంజన్ మిశ్రా(సంస్కృతం) తదితరులు అవార్డులు పొందిన వారిలో ఉన్నారు. వచ్చే ఏడాది మార్చి 12వ తేదీన ఢిల్లీలో వీరందరికీ అవార్డులను ప్రదానం చేసి రూ.1 లక్ష నగదు బహుమతి అందిస్తారు. తామ్ర ప్రశంసా పత్రం ఇచ్చి శాలువాతో సత్కరిస్తారు.

క్లుప్తంగా...

అన్ని వర్గాల అభిప్రాయం తీసుకున్నాకే

కులగణనపై నిర్ణయమన్న శిందే

నాగ్‌పూర్: సమాజంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించిన తరువాతే కుల ప్రాతిపదికన జనాభా గణనపై తగిన నిర్ణయం తీసుకుంటామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ విదర్భ సాహ-సంఘచాలక్ శ్రీధర్ గాడ్గే మంగళవారం మాట్లాడుతూ కుల ప్రాతిపదికన జనాభా గణన జరగకూడదని, ఈ కసరత్తు రాజకీయంగా కొంత మందికే ప్రయోజనం చేకూరుస్తుందని, ఇది సామాజికంగా, ఐక్యత పరంగా మంచిది కాదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై ఒక ప్రశ్నకు శిందే బుధవారం సమాధానమిచ్చారు. మహారాష్ట్ర ప్రగతిశీల రాష్ట్రమని, దాని సంస్కృతి, సంప్రదాయాలు ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ అన్ని వర్గాలు, కులాల వారు కలిసిమెలిసి జీవిస్తారు, కలిసి పని చేస్తారని చెప్పారు. అందుకే సమాజంలోని అన్ని వర్గాల అభిప్రాయం తీసుకున్న తర్వాత ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇక్కడి రేషింబాగ్‌ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) స్మారకాన్ని ఆయన సందర్శించారు. ప్రతి సంవత్సరం నాగ్‌పూర్‌లో రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా బీజేపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు హెడ్గేవార్, గోల్వాల్కర్ స్మారకాన్ని సందర్శిస్తారు.

డ్రైనేజ్‌లో చెత్త వేయొద్దు

పౌరులకు బీఎంసీ విజ్ఞప్తి



ముంబై: నగరంలోని మురికి కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలను బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) కోరింది. ఉల్లంఘించిన వారికి కఠినమైన చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నట్లు తెలిపింది. 'డీప్ క్లీనింగ్' క్యాంపెయిన్ కింద గత పదిహేను రోజుల్లో 1,042 మెట్రిక్ టన్నుల చెత్తను, 139 టన్నుల ఘన వ్యర్థాలను సేకరించింది. ''స్వచ్ఛత డ్రైవ్ నిర్వహించిన ప్రాంతంలో ప్రజలు మళ్లీ చెత్త వేయొద్దని, వేస్తూ పోతే శుభ్రపరిచే ప్రయత్నాలు ఫలించవని బీఎంసీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని బీఎంసీ యంత్రాంగం పరిశీలిస్తోందని పేర్కొంది. డీప్ క్లీనింగ్ డ్రైవ్‌లో 33 జేసీబీలు, 148 డంపర్లు, 21 కాంపాక్టర్లు, 69 వాటర్ ట్యాంకర్లు, తొమ్మిది రోడ్లు స్వీపింగ్ మిషన్లు, ఏడు మిస్టింగ్ మిషన్లు, ఆరు సక్షన్ మిషన్లు, మూడు లిట్టర్ పికర్ మెషిన్లతో పాటు 3,700 మంది కార్మికులు పనిచేశారు. ఈ ప్రచారంలో భాగంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలు శుభ్రం చేస్తున్నారు. డీప్ క్లీన్ డ్రైవ్ తర్వాత కూడా నగర పౌరులు నగరంలోని డ్రైనేజీ కాలువల్లో చెత్తను పారవేస్తున్నారని, డ్రైన్‌లో వ్యర్థాలను వేయడం వల్ల ఈ చెత్త మురుగునీటి పారుదల అడ్డుకుంటుందని గుర్తు చేసింది.

ట్రాన్స్ థానే క్రీక్‌లో అనర్హులకు ప్లాట్లు

- కాగ్ నివేదిక వెల్లడి
- శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికమంత్రి అజిత్ పవార్
- లీటర్ పాలపై రూ.5 సబ్సిడీ అందిస్తామన్న ప్రభుత్వం





నాగ్‌పూర్: మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడీసీ) విధానాలకు విరుద్ధంగా ట్రాన్స్ థానే క్రీక్ (టీటీసీ) ప్రాంతంలో అనర్హులకు నేరుగా ప్లాట్లు కేటాయించారని కాగ్ ఎత్తి చూపింది. సవరించిన భూమి ధరల అమలులో లోపాలున్నాయని, ఇది నష్టాలకు కారణమైందని తెలిపింది. ఎంఐడీసీ వెల్లడించింది. కేటాయించిన 3,284 పారిశ్రామిక ప్లాట్లలో 3,053 నిరుపయోగంగా ఉన్నాయని తెలిపింది. 2014–21లో పారిశ్రామిక అభివృద్ధిలో ఎంఐడీసీ పాత్ర, పనితీరు ఆడిట్‌పై కాగ్ నివేదిక ఇచ్చింది. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల చివరి రోజైన బుధవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 3,284 కేటాయింపుదారులలో 231 (7%) మంది మాత్రమే తమ ప్లాట్‌లను పూర్తిగా ఉపయోగించుకున్నారని వెల్లడించింది. భూమి ధరల స్థిరీకరణ/సవరణ విధానం సరికాదని నివేదిక సూచించింది. భూమి ధరల సవరణ కోసం ఎంఐడీసీ ఎలాంటి పద్ధతి/వెయిటేజీ ఫార్ములాను రూపొందించలేదని, తాత్కాలిక ప్రాతిపదికన అన్ని ఐఏలలో రేట్లు ఏకరీతిగా సవరించారని ఆడిట్ గుర్తించింది. ఎంఐడీసీ నిర్దేశించిన విధానాలకు (ఇ–బిడ్డింగ్, వెయిటింగ్ లిస్ట్, ప్రాధాన్యత మరియు విస్తరణ) విరుద్ధంగా అనర్హులకు నేరుగా ప్లాట్ల కేటాయింపులు చేశారని తెలిపింది. ప్లాట్లు అందుబాటులో లేనప్పటికీ, కేటాయింపుదారులకు భూమి కేటాయింపు కోసం ఆఫర్ లెటర్‌లు జారీ చేశారని తెలిపింది. ఇది ఎంఐడీసీ నిబంధనల ఉల్లంఘనని నివేదిక పేర్కొంది.

పాల ధర తరువాత సబ్సిడీ జమ..

పాల ఉత్పత్తిదారులకు లీటరుకు రూ.5 సబ్సిడీని మహారాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఇది రాబోయే రెండు నెలల పాటు అమలు చేయనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ శాసనసభలో ప్రకటించారు. సహకార డెయిరీలకు సరఫరా చేసే పాల ఉత్పత్తిదారులకు లీటరుకు రూ.5 సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం వచ్చే ఏడాది మొదటి రెండు నెలల వరకు అమలులో ఉంటుందని ఆయన చెప్పారు. పాల ఉత్పత్తిదారుల బ్యాంకు ఖాతాల్లో లీటరు పాల ధర రూ.29 జమ అయిన తర్వాత, ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని కూడా అదే ఖాతాలకు బదిలీ చేస్తుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం డెయిరీలు లీటరు పాలను రూ.29కి కొనుగోలు చేస్తున్నాయి.

ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 4,872 మంది నవజాత శిశువులు మృతి

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మహారాష్ట్రలో 4,872 మంది నవజాత శిశువులు మరణించారని ఆరోగ్య మంత్రి తానాజీ సావంత్ ప్రకటించారు. రోజువారీ సగటున 23 మరణాలు సంభవించాయని బుధవారం శాసనసభకు తెలిపారు. 4,872 మంది శిశువుల్లో 795 మంది (16 శాతం) శ్వాస సంబంధిత వ్యాధులతో మరణించారని ఆయన చెప్పారు. ముంబై, థానే, షోలాపూర్, అకోలా, నందుర్‌బార్‌లలో అత్యధిక మరణాలు నమోదయ్యాయని ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే సచిన్ కళ్యాణశెట్టి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. చనిపోయిన శిశువుల వయస్సు 28 రోజుల లోపే ఉంది. రాష్ట్రంలో 52 ప్రత్యేక నియోనాటల్ కేర్ రూమ్‌లు పనిచేస్తున్నాయని, అనారోగ్య శిశువులందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు, పరీక్షలు, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

నల్ల రిబ్బన్లు ధరించిన విపక్ష సభ్యులు..

కాగా, 140 మందికి పైగా పార్లమెంటు సభ్యుల సస్పెన్షన్‌కు నిరసనగా మహారాష్ట్రలోని అనేక మంది ప్రతిపక్ష శాసనసభ్యులు బుధవారం తమ చేతులకు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజయ్ వడెట్టివార్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అశోక్ చవాన్, ఎన్సీపీ (శరద్ పవార్ గ్రూపు) నేత అనిల్ దేశ్‌ముఖ్, కాంగ్రెస్ శాసనసభ్యుడు సతేజ్ పాటిల్‌తో పాటు పలువురు శాసనసభ్యులు విధాన్ భవన్ మెట్లెక్కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాగ్‌పూర్‌లో శాసనసభ శీతాకాల సమావేశాలు జరుగుతున్నా, మరాఠా రిజర్వేషన్ సమస్య పరిష్కారం కావడం లేదని, సోయాబీన్, పత్తి పంటలకు సరైన ధర లభించడం లేదని వారు ఆందోళనకు దిగారు.

విదర్భపై మాట్లాడకుండా సీఎం తప్పించుకున్నారు : ప్రతిపక్షాల ఆరోపణ

విదర్భ ప్రాంతానికి సంబంధించిన నీటిపారుదల వెనుకబాటు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలపై శాసనసభలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ఒక్క మాట కూడా మాట్లాడలేదని ప్రతిపక్ష నాయకులు బుధవారం ధ్వజమెత్తారు. విదర్భపై అధికార పార్టీలు ఆసక్తి చూపడం లేదని ప్రతిపక్ష నేత విజయ్ వడెట్టివార్ (కాంగ్రెస్), ఎన్సీపీ (శరద్ పవార్) పక్ష నేత అనిల్ దేశ్‌ముఖ్ ఆరోపించారు. మిహాన్ ప్రాజెక్ట్, పంటలు, నీటిపారుదల బ్యాక్‌లాగ్ మొదలైన సమస్యలపై చర్చ కోసం రూల్ 293 కింద ప్రతిపాదన పెట్టామని, ముఖ్యమంత్రి సమాధానం ఇస్తారని మేము ఆశించామని, కానీ విదర్భ గురించి ఆయన ఏమీ చెప్పలేదని విమర్శించారు. ప్రభుత్వానికి విదర్భపై ప్రేమ లేదనడానికి ఇది నిదర్శనమని అసెంబ్లీ వాకౌట్ చేసిన అనంతరం వడెట్టివార్ విలేకరులతో అన్నారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలకు బుధవారం చివరి రోజు కావడంతో అధికార పార్టీల నేతలు విమానం ఎక్కేందుకు తొందరపడుతున్నారని దేశ్‌ముఖ్ ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో నేరాలు తగ్గాయి

- ప్రతిపక్షాలవి తప్పుడు ఆరోపణలు
- ఫడ్నవీస్ స్పష్టీకరణ

నాగ్‌పూర్: రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గిందని ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. 2020లో మొత్తం నేరాల సంఖ్య 39,4017 కాగా, 2022 నాటికి 37,4038కి తగ్గిందని బుధవారం తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) ప్రకారం ఢిల్లీ, కేరళ, హర్యానా, తెలంగాణ, మధ్యప్రదేశ్‌లలో మహారాష్ట్ర కంటే ఎక్కువ నేరాలు నమోదయ్యాయి. అత్యాచార కేసుల్లో మహారాష్ట్ర 16వ స్థానంలో ఉండగా, మహిళలపై అకృత్యాల కేసుల్లో రాష్ట్రాల మొత్తం జనాభా నిష్పత్తిలో రాష్ట్రం ఏడో స్థానంలో ఉంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే.. మహారాష్ట్ర సురక్షితమని, ఎన్సీఆర్బీ డేటాను ప్రతిపక్షాలు తప్పుగా అర్థం చేసుకుంటున్నాయని ఫడ్నవీస్ అన్నారు. రాష్ట్రంలో జనాభా ఎక్కువగా ఉన్నందున ఎన్సీఆర్బీ కేసుల సంఖ్య ఎక్కువగా కనిపించిందని ఆయన నొక్కి చెప్పారు. దేశంలోని అనేక ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహారాష్ట్రలో ఉన్నవారు సురక్షితంగా, శాంతియుతంగా ఉన్నారని పేర్కొన్నారు. గతవారం అసెంబ్లీలో తీర్మానంపై చర్చ సందర్భంగా, విదర్భకు చెందిన ప్రతిపక్ష శాసనసభ్యులు మహారాష్ట్ర రెండవ రాజధాని క్రైమ్ క్యాపిటల్‌గా మారిందని, ముఖ్యంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, డ్రగ్స్ పెద్ద మొత్తంలో లభించాయన్నారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగానే నాగ్‌పూర్‌ను క్రైమ్ క్యాపిటల్‌గా చిత్రీకరిస్తున్నారని, నగరాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే వాస్తవానికి నాగ్‌పూర్‌లో క్రైమ్ రేట్ అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే తగ్గిందని ఫడ్నవీస్ బదులిచ్చారు. నాగ్‌పూర్‌ను క్రైమ్ క్యాపిటల్‌గా ట్యాగ్ చేయడం ద్వారా వారు పెట్టుబడులను ఆకర్షించే నగర అవకాశాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ''నాకు నాగ్‌పూర్‌పై ప్రత్యేక ప్రేమ ఉంటుంది. నేను ఉప ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నాగ్‌పూర్‌పై చాలా మందికి ప్రేమ పెరుగుతోంది. ఈ నగరం పరువు తీసేలా వారు ప్రకటనలు చేస్తున్నారు. 2021లో నేరాల్లో నాగ్‌పూర్ దేశంలో రెండవ స్థానంలో ఉంది. ఇప్పుడు నాగ్‌పూర్ ఎనిమిదో స్థానంలో ఉంది. వాస్తవానికి జనాభా పరిమాణానికి అనుగుణంగా ఇది 22వ లేదా 23వ స్థానంలో ఉంది'' అని ఫడ్నవీస్ వివరించారు. మహిళలపై నేరాలు, హత్యలు, చోరీలు, అత్యాచారాలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. నాగ్‌పూర్ పరువు తీసే ధోరణి మానుకోవాలని తాను ప్రతిపక్ష నాయకులను అభ్యర్థిస్తున్నానన్నారు.

ముంబైలో జేఎన్.1 మొదటి కేసు

మాస్కులు తప్పనిసరి చేసిన ప్రజారోగ్య శాఖ



ముంబై: నగరంలో జేఎన్.1 వేరియెంట్ మొదటి కేసు నమోదైనట్టు ప్రజారోగ్య శాఖ తెలిపింది. కోవిడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ప్రజలను కోరింది. కోవిడ్ నిబంధనలను అనుసరించి ముఖ్యంగా మాస్కులు ధరించడం తప్పనిసరని పేర్కొంటూ సర్క్యులర్ జారీ చేసింది. రాష్ట్రంలో బుధవారం 14 కొత్త కోవిడ్ కేసులు నమోదు కాగా, వాటిలో నాలుగు ముంబైకి చెందినవి. సింధుదుర్గ్ జిల్లాకు చెందిన 41 ఏళ్ల వ్యక్తికి జేఎన్.1 వేరియెంట్ గుర్తించామని, ఆయన వైద్యుల పరిశీలనలో ఉన్నారని, పౌరులు కచ్చితంగా మాస్క్ ధరించాలని రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్ సిన్హ్ సర్నికర్ అన్నారు. అనారోగ్యం/తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ (ఎస్ఏఆర్ఐ) రోగులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని అన్ని జిల్లాల ఆరోగ్య అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

గెలుపోటములకు అతీతంగా ప్రజా సేవ

రాష్ట్ర నేతలకు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పిలుపు



షోలాపూర్: రాజకీయాల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమని, వాటిని పట్టించుకోకుండా ప్రజలకు సేవ చేయడమే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లక్ష్యమని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. షోలాపూర్ బీఆర్ఎస్ నాయకులు నాగేష్ వల్యాల్, దశరథ్ గోప్, జయంత్ గోప్, జయంత్ ఓలే పాటిల్, మోహసీన్ తదితరులు హైదరాబాద్‌కు వెళ్లి బీఆర్ఎస్ నేత హరీశ్ రావుతో భేటీ అయ్యారు. మహారాష్ట్రలో పార్టీని విస్తరించే విధంగా కార్యకలాపాలు కొనసాగించాలని ఆయన వారికి సూచించారు. రాబోయే అన్ని ఎన్నికల్లో పార్టీ పోటీ చేయనున్నట్టు చెప్పిన హరీశ్, పార్టీ శ్రేణులంతా అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ముంబైతోపాటు పుణే, ఔరంగాబాద్ మొదలగు జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలు ప్రారంభించనున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఆచరణకు సాధ్యంకాని ఉచిత హామీలిచ్చి కాంగ్రెస్ గెలిచిందని, చాలా తక్కువ ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యామని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరంలేదని సూచించారు. షోలాపూర్ బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షునిగా మోహసిన్ షేక్‌ను నియమించారు. ఆయనకు నియామక పత్రాన్ని హరీశ్ రావు అందించారు.

డ్రోన్లు, గ్లైడర్లకు అనుమతి లేదు

ముంబై పోలీసుల ఆదేశాలు



ముంబై: రాబోయే 20 రోజుల పాటు నగరంలో డ్రోన్లు, గ్లైడర్లను ఉపయోగించడాన్ని నిషేధిస్తూ ముంబై పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో న్యూ ఇయర్ వేడుకలకు ముందు, నగరంలో డ్రోన్లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్, పారాగ్లైడర్లు, పారా మోటార్లు, హ్యాండ్ గ్లైడర్లు, హాట్ ఎయిర్ బెలూన్లను 30 రోజుల పాటు నిషేధిస్తూ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 20, 2023 నుండి జనవరి 18, 2024 వరకు ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని, ఈ మేరకు 144 సెక్షన్ కింద జారీ చేసినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సమయంలో తీవ్రవాద లేదా దేశ వ్యతిరేక అంశాలు గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వారు డ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్, పారాగ్లైడర్లను ఉపయోగించి వీవీఐపీలను లక్ష్యంగా చేసుకుని ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అవకాశం ఉందని, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయవచ్చని, మహానగరంలో శాంతిభద్రతలకు భంగం కలిగించవచ్చని ఆ ఆదేశాల్లో పేర్కొంది. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ముంబైలో పెద్ద ఈవెంట్లు కూడా నిర్వహించబడతాయని.. వాటికి భద్రత అవసరమని తెలిపింది. పోలీసుల ద్వారా వైమానిక నిఘా లక్ష్యంగా యంత్రాలు ఉపయోగించే వైమానిక పరికరాల ఉపయోగం మినహా, ఎగిరే డ్రోన్లు, ఇతర వస్తువులకు నగరంలో నిషేధమని, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్) ద్వారా వ్రాతపూర్వకంగా నిర్దిష్ట అనుమతితో నగరంలో వైమానిక వస్తువులను ఉపయోగించవచ్చని వెల్లడించింది.



సినీనటుడు రామ్‌చరణ్ బుధవారం ముంబైలో సందడి చేశారు. భార్య ఉపాసన, కూతురు క్లీంకారాతో కలిసి నగరంలోని మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. కూతురుకు ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు.

మంత్రాలయ పోస్టల్ కేంద్రానికి మంచి స్పందన

- రెండు నెలల్లో 50,905 దరఖాస్తులు
- 31,561 దరఖాస్తులు ముఖ్యమంత్రి కార్యాలయానికే



పోస్టల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం శిందే (ఫైల్)

దాదర్: సందర్శకుల రద్దీని తగ్గించేందుకు మంత్రాలయ ప్రారంభించిన సెంట్రల్ పోస్టల్ కేంద్రానికి మంచి స్పందన వస్తోంది. గడచిన రెండు నెలల్లో ఏకంగా 50,905 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రాలయ వర్గాలు తెలిపాయి. ఇందులో అత్యధికంగా 31,561 దరఖాస్తులు ముఖ్యమంత్రి కార్యాలయానికి సంబంధించినవి ఉన్నాయి. తమకు ఆర్థిక సాయం చేయాలని కొందరు, భూతగాదాలు, తమ సమస్యలు పరిష్కరించాలని, సిఫార్సు లేఖల కోసం మరికొందరు, ఇలా రకరకాల కారణాలతో రాష్ట్రం నలుమూలల నుంచి నిత్యం వందల సంఖ్యల్లో సంబంధిత శాఖల మంత్రులతో, కార్యదర్శులతో, అధికారులను కలిసేందుకు సామాన్యులు వస్తుంటారు. వినతి పత్రాలు ఇచ్చిన తరువాత తమ పనులు ఎంతవరకు ముందుకు సాగాయని తెలుసుకునేందుకు మరోసారి వస్తారు. ఇలా తరుచూ రావడంవల్ల మంత్రాలయ భవనం భద్రతా సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. అంతేగాకుండా తరచూ వచ్చి వాకబు చేయడంవల్ల సిబ్బంది పనులకు ఆటంకం కలుగుతోందనే భావన ఉంది.

అదనపు భారం...

అనేక సందర్భాల్లో మంత్రాలయ సిబ్బందికంటే విజిటర్ల సంఖ్య అధికంగా ఉంటోంది. వివిధ పనుల నిమిత్తం వచ్చిన జనాలను లోపలికి పంపడానికి మంత్రాలయ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద విజిటర్లకు ఎంట్రీ పాస్‌లు జారీ చేయడానికి ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. విజిటర్లు తమ ఆధార్ కార్డు గాని, పాన్ కార్డు ఇతర ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే ఎంట్రీ పాస్ జారీచేస్తారు. లోపల పనులు ముగించుకుని ఎంత సమయంలో తిరిగి బయటకు రావాలని నిబంధనలు లేకపోవడంతో వీరంత క్యాంటీన్‌లో టీ, కాఫీలు సేవిస్తూ, అల్పాహారం తింటూ కాలక్షేపం చేస్తున్నారు. ఫలితంగా క్యాంటీన్ సిబ్బందిపై కూడా అదనపు భారం పడుతోంది. పలుమార్లు మంత్రాలయకు వచ్చిన బాధితులకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, సంబంధిత శాఖల మంత్రులు, కార్యదర్శుల అపాయింట్‌మెంట్ దొరక్కపోవడం, న్యాయం జరగకపోవడంతో విసుగెత్తిన బాధితులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలున్నాయి.

రద్దీని నియంత్రించేందుకు..


చివరకు మంత్రాలయ భవనంలో విజిటర్ల సంఖ్యను నియంత్రించేందుకు సామాన్య పరిపాలన విభాగం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన మంత్రాలయ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద సెంట్రల్ పోస్టల్ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ వినతి పత్రాలను ఇక్కడే స్వీకరించడం ప్రారంభించారు. దీంతో మంత్రాలయ భవనంలోనికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. అయితే తమ వినతి పత్రంతోపాటు ఒక ఫారం నింపాల్సి ఉంటుంది. ఆ ఫారంపై బార్‌కోడ్ ఉంటుంది. బాధితులు సమర్పించిన పత్రాలు, లేఖలు స్కాన్ చేస్తారు. ఆ తరువాత సంబంధిత డిపార్టుమెంట్లకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తారు. తరువాత ఆ బార్‌కోడ్ నంబరు ద్వారా తాము సమర్పించిన వినతి పత్రం లేదా దరఖాస్తు ఎక్కడుంది? ఎంతవరకు పురోగతి సాధించింది? తదితర వివరాలు ఎప్పటికప్పుడు తమ మొబైల్ ఫోన్‌లో చూసుకోవచ్చు. దీంతో బాధితులు తరచూ మంత్రాలయ భవనం చుట్టు కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. మంత్రాలయ భవనంలో దాదాపు 90 శాతం వరకు రద్దీ తగ్గిపోయింది. సామాన్య ప్రజల వ్యయ, ప్రయాసలు చాలావరకు తగ్గాయి.



ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే బుధవారం నాగ్‌పూర్‌లోని దీక్షభూమిని సందర్శించారు. అక్కడ డాక్టర్ బాబాసాహెబ్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బుద్ధుడికి నమస్కరించారు.

నష్టపోయిన రైతులకు ప్లాట్లు

మంత్రి ఉదయ్ సమంత్



నవీ ముంబై: సిడ్కో ప్రాజెక్ట్ ద్వారా నష్టపోయిన రైతులకు ప్లాట్లు అందజేస్తామని మంత్రి ఉదయ్ సమంత్ చెప్పారు. సిడ్కో ప్రాజెక్టు ద్వారా 461 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. 12.5% స్కీమ్ ప్రాధాన్యతతో భూకేటాయింపులు చేస్తామన్నారు. 1980లో, సిడ్కో పరిపాలన నవీ ముంబై ప్రాజెక్ట్ కోసం 95 గ్రామాల రైతుల నుంచి వేల ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు బాధితులకు 5% ప్లాట్లు కేటాయించాలని అప్పట్లోనే నిర్ణయించారు. అభివృద్ధి చేసిన ప్రాంతంలో సేకరించిన భూమిలో 12.5% సిడ్కోకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరంజడే, ద్రోణగిరి నోడ్‌లలో సుమారు 461 మంది బాధిత రైతులకు 12.5% పథకం కింద సిడ్కో ఇంకా ప్లాట్లు కేటాయించలేదు. ప్లాట్లు అందుబాటులో లేవని సిడ్కో చెబుతోంది. కొత్త ప్రభుత్వం ప్రకారం, చంజే, మతివాలి. దెవలపర్లకు కేటాయించిన ప్లాట్లపై సందేహాలు తలెత్తితే రాతపూర్వక ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీఎంను కలిసిన కేంద్ర మంత్రి భగవంత్ ఖుబా



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేంద్ర రసాయనాలు, ఎరువులు, రెన్యూవబుల్ ఎనర్జీ శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో రేవంత్‌రెడ్డిని కలిసిన కేంద్రమంత్రి ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఇదిలా ఉండగా.. సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ ఆర్చిబిషప్ ఆంథోని పూల మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం మరోమారు ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొనేందుకు మధ్యాహ్నం 12 గంటలకు ఆయన ఢిల్లీ వెళుతున్నట్టు బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ ఈ భేటీకి హాజరవుతున్నారు. ఈయనతో పాటు తెలంగాణ నుంచి సీడబ్ల్యూసీ ఆహ్వానితులుగా ఉన్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి హాజరు కానున్నారు. కాగా, సీఎం ఢిల్లీ వెళ్లడం, అసెంబ్లీ సమావేశాలు కూడా కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్ వాయిదా పడింది. అయితే, మళ్లీ ఎప్పుడు ఈ కలెక్టర్ల భేటీ జరుగుతుందన్న దానిపై మాత్రం ప్రభుత్వ వర్గాలు స్పష్టత ఇవ్వలేదు.

రాష్ట్ర అప్పులు రూ.6,71,757 కోట్లు

అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో సర్కారు వెల్లడి

- గత పదేళ్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై.. 13 అంశాలతో 42 పేజీల నివేదిక సభ ముందుకు..
- రిజర్వు బ్యాంకు, కాగ్ నివేదికలు, కేంద్ర ప్రభుత్వ లెక్కలతో రూపకల్పన
- 1956 నుంచి 2023 వరకు అంశాల వారీగా 22 టేబుళ్లతో వివరణ
- ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని వివరించడమే ప్రధాన ఉద్దేశమన్న సర్కారు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటు నాటి నుంచి తాము అధికారంలోకి వచ్చేంత వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన గణాంకాలతో కాంగ్రెస్ సర్కారు శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థికశాఖ బాధ్యతలు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దీనిని బుధవారం శాసన సభ ముందుంచారు. గత పదేళ్లలో ప్రభుత్వం చేసిన అప్పులు, రెవెన్యూ రాబడులు, వసూళ్ల తీరు, ఇతర రాష్ట్రాలతో పోలుస్తూ గణాంకాలు, కేంద్ర ప్రభుత్వ లెక్కలు, ఆర్‌బీఐ, కాగ్ నివేదికల్లో పేర్కొన్న అంశాలను పొందుపరిచారు. మొత్తం 22 పట్టికల్లో పలు గణాంకాలను వెల్లడించారు.

ఆర్థిక శ్వేతపత్రంలోని ముఖ్యాంశాలివీ..

- బడ్జెట్ ప్రతిపాదనల్లో వాస్తవ ఖర్చు శాతం ఆందోళనకరం. 2014–15లో బడ్జెట్ అంచనాలతో పోలిస్తే వాస్తవ ఖర్చు 61.9శాతమే. 2014–2023 మధ్య సగటు వ్యయం 82.3 శాతం. గత పదేళ్లలో రూ.14,87,834 కోట్ల మేర బడ్జెట్ అంచనాలను ప్రతిపాదిస్తే.. అందులో ఖర్చు చేసినది రూ.12,24,877 కోట్లు.
- కాంగ్రెస్ పాలనలో 2004–14 వరకు సగటు వ్యయం 87శాతం. మొత్తం రూ.10,04,326 కోట్ల అంచనాలకు గాను రూ.8,73,929 కోట్ల ఖర్చు జరిగింది.
- 1956–57లో ఉమ్మడి ఏపీ బడ్జెట్‌లో తెలంగాణ వాటా కింద రూ.33 కోట్లు ఖర్చు పెట్టగా.. 2013–14 నాటికి ఇది రూ.56,947 కోట్లకు చేరింది. మొత్తంగా గత 57 ఏళ్లలో అంటే 1956–57 నుంచి 2013–14 వరకు తెలంగాణ లో జరిగిన ఖర్చు రూ.4,98,053 కోట్లు.
- ఈ నిధులతోనే ఓఆర్‌ఆర్, ఎయిర్‌పోర్టుతోపాటు నాగార్జునసాగర్, జూరాల, కోయిల్‌సాగర్, దేవాదుల, శ్రీరాంసాగర్, కడెం లాంటి సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి ప్రాజెక్టులు, ట్రిపుల్‌ఐటీలు, వర్సిటీలు, వైద్య కళాశాలలు, ఆస్పత్రులు, రోడ్లు–భవనాలు, కాల్వలు, విద్యుత్ లైన్లు, రక్షణ సంస్థలు, ఔషధ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు ఏర్పాటు చేయగలిగాం. 1956 నుంచి 2014 వరకు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన 16 మంది సీఎంల కాలంలో తెలంగాణ అప్పు రూ.72,658 కోట్లు మాత్రమే.
- 2014–15 తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ రాబడులు అస్థిరంగా ఉన్నాయి. స్థూల ఉత్పత్తితో పోలిస్తే రెవెన్యూ రాబడులు 2015–16లో గరిష్టంగా 13.2శాతంగా ఉండగా.. 2018–19లో 11.8 శాతానికి క్షీణించాయి. అంటే కరోనా మహమ్మారికి ముందే ఆర్థిక మందగమనం ప్రారంభమైంది. ఇక రెవెన్యూ రాబడుల శాతం కూడా పడుతూ, లేస్తూ వచ్చింది. 2021–22లో తెలంగాణ కంటే కేవలం మరో ఐదు రాష్ట్రాలే తక్కువ రెవెన్యూ రాబడులు కలిగి ఉన్నాయి.
- పెరుగుతున్న ఖర్చులతో పోలిస్తే ఆదాయ వనరుల్లో పెరుగుదల లేని కారణంగా ద్రవ్యలోటు పెరిగింది. ఈ లోటును పూడ్చడానికి రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. ఈ రుణాలు గత పదేళ్లలో ఏటా సగటున 24.5శాతం చొప్పున పెరిగాయి. బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపించిన రుణాల్లో బడ్జెటేతర రుణాలను చేర్చలేదు. ప్రభుత్వ హామీతో స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్పీవీలు) ఏర్పాటు చేసి ప్రభుత్వమే చెల్లించే విధంగా కొన్ని రుణాలు, ప్రభుత్వ హామీ ఉన్న ఎస్పీవీలు చెల్లించేలా మరికొన్ని, ప్రభుత్వ హామీ లేకుండా మరికొన్ని రుణాలు సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా చేసిన అప్పులు, హామీ ఇచ్చినవి, హామీలేనివి కలిపి మొత్తం అప్పు రూ.6,71,757 కోట్లకు చేరింది.
- ఈ అప్పులతో ఏటా రుణాల తిరిగి చెల్లింపు భారం పెరిగిపోయింది. 2014–15లో అప్పుల అసలు, వడ్డీ చెల్లింపులు రూ.6,954 కోట్లు కాగా..2023–24 నాటికి ఇది రూ.32,939 కోట్లకు చేరింది.
- మొత్తం రెవెన్యూ రాబడుల్లో రుణాల చెల్లింపుల భారం 2014–15లో 14 శాతం కాగా.. 2023–24 నాటికి 34 శాతానికి పెరిగింది. బహిరంగ మార్కెట్ రుణాల సగటు వడ్డీ రేటు 7.63 శాతం. కానీ గత ప్రభుత్వం గ్యారంటీలిచ్చి తీసుకున్న రుణాల్లో 95 శాతం రుణాల వడ్డీ రేటు 8.93 నుంచి 10.49 శాతం వరకు ఉంది.



- రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 24 ప్రభుత్వ శాఖల్లో 39,175 ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. ఇందుకు రూ.3,49,843 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా.. రూ.1,89,903 కోట్లు వ్యయమైంది. మిగతా పనుల కోసం రూ.72,983 కోట్లను రుణాలు తీసుకోవాల్సి ఉంది.
- ఈ ఏడాది డిసెంబర్ 19 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, డిస్ట్రిబ్యూటర్లకు సంబంధించిన 4,78,168 బిల్లులను క్లియర్ చేయాల్సి ఉంది. ఈ బిల్లుల మొత్తం విలువ రూ.40,154 కోట్లు.
- ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్ల సగటు వార్షిక వృద్ధిరేటు 17 శాతం. 2014–15లో రూ.17,130 కోట్లు జీతాలు, పెన్షన్ల కింద చెల్లించగా.. 2021–22 నాటికి అది రూ.48,809 కోట్లకు చేరింది. రాష్ట్ర రాబడిలో ఇది 38 శాతం.
- కొన్నేళ్లుగా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాలపై ఆధారపడటం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్షీణతను సూచిస్తోంది. 2014–15లో రాష్ట్ర ఖజానాలో 303 రోజులు నగదు నిల్వ ఉండగా..2023–24 (నవంబర్ 30వరకు) 30 రోజులకు పడిపోయింది. 2022–23లో వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సు, ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాలను 328 రోజులు ఉపయోగించుకున్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ డొల్లతనాన్ని తెలియజేస్తోంది.
- 2014–19 మధ్య రాష్ట్రం రెవెన్యూ మిగులును నమోదు చేయగా.. 2019–22 మధ్య జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, సబ్సిడీల వంటి చెల్లింపులు, పునరావృత ఖర్చులను తీర్చడానికి కూడా రెవెన్యూ రాబడులు మిగలలేదు.
- మొత్తం రాబడులు, వ్యయం మధ్య ఉండే తేడాను ద్రవ్యలోటు అంటారు. ఈ ద్రవ్యలోటు 2014–15లో రూ.9,410 కోట్లుకాగా.. 2015–16లో రూ.18,856 కోట్లు, 2016–17 నాటికి రూ.35,281 కోట్లకు చేరింది.
- కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్టేట్ ఆఫ్ స్టేట్ ఫైనాన్సెస్ నివేదిక ప్రకారం.. 2023–24లో దేశంలోని రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో 14.7 శాతం విద్యపై ఖర్చు చేస్తాయని అంచనా వేయగా.. తెలంగాణ 7.6శాతం ఖర్చు చేస్తుందని అంచనా వేసింది. ఇది జాతీయ సగటులో సగం మాత్రమే. ఇదే నివేదిక ప్రకారం వైద్యంపై ఖర్చు కేవలం 5 శాతం మాత్రమే.

తెలంగాణ ఆవిర్భావం నాటి నుంచి బడ్జెట్, బడ్జెటేతర రుణాలివీ..

అంశం	రుణాలు (రూ.కోట్లలో)
ఎఫ్ఆర్‌బీఎం రుణాలు (2023-24 బడ్జెట్ అంచనాల ప్రకారం)	3,89,673
ప్రభుత్వ జామీనుతో స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్పీవీ) పేరిట తీసుకున్న రుణాలు (ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది)	1,27,208
ప్రభుత్వ జామీనుతో ఎస్పీవీల పేరు మీద తీసుకున్న రుణాలు (వీటిని ఎస్పీవీలే తిరిగి చెల్లిస్తాయి)	95,462
ప్రభుత్వ జామీను లేకుండా ఎస్పీవీలు/కార్పొరేషన్లు/సంస్థల పేరిట తీసుకున్న రుణాలు (తిరిగి అవే చెల్లిస్తాయి)	59,414
మొత్తం రుణాలు	6,71,757

గత పదేళ్లలో రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు, చేసిన వాస్తవ వ్యయం, వ్యత్యాసం శాతాలివీ..

సంవత్సరం	బడ్జెట్ ప్రతిపాదన	వాస్తవ వ్యయం	ఖర్చు శాతం
2014-15	1,00,638	62,306	61.9
2015-16	1,15,689	97,811	84.5
2016-17	1,30,416	1,21,735	93.3
2017-18	1,49,646	1,20,211	80.3
2018-19	1,74,454	1,35,328	77.6
2019-20	1,46,492	1,42,857	97.5
2020-21	1,82,914	1,57,547	86.1
2021-22	2,30,726	1,82,998	79.3
2022-23	2,56,859	2,04,085	79.5
మొత్తం	14,87,834	12,24,877	82.3
2023-24	2,90,396	1,48,053 (నవంబర్ వరకు)	51

(బడ్జెట్ ప్రతిపాదనలు, వాస్తవ వ్యయం.. రూ.కోట్లలో)

మూలధన పెట్టుబడులకు కేటాయింపులు, వాస్తవ వ్యయం వివరాలు (రూ.కోట్లలో)

నిధులు	మంజూరు చేసినవి	వాస్తవ వ్యయం	చేయాల్సిన వ్యయం
బడ్జెట్	1,89,777	1,02,820	86,957
రుణాలు	1,60,066	87,083	72,983
మొత్తం	3,49,843	1,89,903	1,59,940

పారదర్శకంగా అధిగమిస్తాం

మొత్తం 42 పేజీల్లో 13 అంశాలను కూలంకషంగా వివరిస్తూ ఆర్థిక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. రాష్ట్ర బడ్జెట్ అంచనాలు–వాస్తవ వ్యయం, ఉమ్మడి ఏపీలో తెలంగాణలో చేసిన ఖర్చు, రెవెన్యూ వసూళ్లు, రుణాల తీరు, మూలధన వ్యయం, జీతభత్యాలు–పెన్షన్ల ఖర్చు, రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు, విద్య, ఆరోగ్య రంగాల్లో ఖర్చును అంశాల వారీగా వివరిస్తూ రూపొందించినట్టు తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వంగా పొందిన ప్రభు త్వ ఆర్థిక పరిస్థితిని వివరించడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. ప్రజలు మార్పు కోసం ఇచ్చిన ఆదేశాన్ని, పార్టీ వాగ్దానం చేసిన ఆరు హామీలను నెరవేర్చడానికి ఆర్థిక సవాళ్లను బాధ్యతాయుతంగా, వివేకంతో, పారదర్శకంగా అధిగమించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొంది.

సభలో శ్వేతపత్రం ఫైర్

▶ మొదటి పేజీ తరువాయి

తమ ఉద్దేశమని అధికారపక్షం పేర్కొంటే.. ఈ సాకుతో గ్యారంటీ హామీలు అమలు చేయకుండా తప్పించుకోవాలని కాంగ్రెస్ సర్కారు చూస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది.

మాజీ ఎమ్మెల్యేలకు నివాళి అర్పించి..

మూడు రోజుల విరామం అనంతరం బుధవారం ఉదయం 11 గంటలకు శాసనసభ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. సభలో ఎంఐఎం పక్ష నేతగా అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ పక్ష నేతగా కూనంనేని సాంబశివరావులను గుర్తిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు రామన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, కుంజా సత్యవతి మరణం పట్ల శాసనసభ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. తర్వాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ప్రభుత్వ వనరుల వినియోగం సక్రమంగా జరగలేదని, రోజూవారీ ఖర్చుల కోసం కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దశాబ్దకాలంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను ప్రజలకు తెలియపర్చడం కోసమే శ్వేతపత్రాన్ని విడుదల చేశామని చెప్పారు.

పరిశీలించేందుకు అరగంట సమయమిచ్చి..

స్వల్పకాలిక చర్చలో భట్టి అనంతరం ప్రసంగించాల్సిందిగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్పీకర్ అవకాశం ఇచ్చారు. అయితే 42 పేజీల నివేదికను ఇచ్చి, అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వకపోవడంపై హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు కూడా కొంత సమయం కావాలని కోరారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. సుమారు గంటా 15 నిమిషాల తర్వాత సభ తిరిగి సమావేశమైంది.

గత ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టేందుకే..

ప్రసంగాన్ని ప్రారంభించిన హరీశ్‌రావు.. కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన శ్వేతపత్రం గత ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టే ధోరణిలో తప్పుల తడకగా రూపొందించారని మండిపడ్డారు. శ్వేతపత్రంలో ప్రగతి కోణం లేదని, రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేయడంతోపాటు వాస్తవాల వక్రీకరణ కోసం ఉపయోగించుకునేలా ఉందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో సస్పెండైన అధికారుల సాయంతో కాంగ్రెస్ సర్కారుకు అనుకూలంగా ఉండేలా శ్వేతపత్రం తయారు చేయించారని విరుచుకుపడ్డారు. అయితే హరీశ్ ప్రసంగిస్తున్న సమయంలో... సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు తదితరులు జోక్యం చేసుకుని గత సర్కారుపై విమర్శలు చేశారు. దీనిపై హరీశ్ అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు శ్వేతపత్రంలో లోపాలు ఉన్నాయంటూ ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ తప్పు పట్టారు. ఈ తరహా చర్చల ద్వారా రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయొద్దని సూచించారు. మరోవైపు కాంగ్రెస్ సర్కారు రాష్ట్ర ఆర్థిక స్థితిని సాకుగా చూపించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి తప్పుకోవాలని చూస్తే ఊరుకోబోమని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పక్షాన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసింది శూన్యమని వ్యాఖ్యానించారు. భారీగా అప్పులు చేసినా.. ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలు చేపట్టలేదని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు విమర్శించారు.

అప్పులు, తప్పులే అంటూ సీఎం విమర్శలు

గత ప్రభుత్వం మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల నుంచి ఆదాయం వస్తుందంటూ తప్పుడు నివేదికలతో అప్పులు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హరీశ్‌రావు ప్రసంగిస్తున్న సమయంలో పలుమార్లు జోక్యం చేసుకుని విమర్శలు గుప్పించారు. అప్పట్లో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అత్యధిక వడ్డీకి అడ్డగోలుగా రుణాలు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. చివరిగా శ్వేతపత్రంపై జరిగిన స్వల్పకాలిక చర్చకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తర్వాత కూడా సీఎం రేవంత్ మరోసారి జోక్యం చేసుకుని గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. తొమ్మిది గంటలకుపైగా సుదీర్ఘంగా సాగిన ఈ చర్చను ముగిసినట్లు ప్రకటించిన స్పీకర్.. శాసనసభను గురువారంకు వాయిదా వేశారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించారు

రోజువారీ కార్యకలాపాలకూ ఓడీలు తెచ్చారు

- శ్వేతపత్రంపై అసెంబ్లీలో లఘు చర్చకు డిప్యూటీ సీఎం భట్టి జవాబు
- అప్పు ఏ రూపంలో తెచ్చినా అప్పే.. భారం పడేది ప్రభుత్వం పైనే
- మీలా మేం చేయం.. ఆర్థిక క్రమశిక్షణతో పరిస్థితిని పట్టాలెక్కిస్తాం
- ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే శ్వేతపత్రం అన్న భట్టి



సాక్షి, హైదరాబాద్: తక్కువ బడ్జెట్ మొత్తాలతో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రాంతంలో ఎన్నో ఆస్తులు సాధించి పెడితే, లక్షల కోట్ల బడ్జెట్‌లు పెట్టి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేకపోగా రాష్ట్రాన్ని దివాలా తీయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. రోజువారీ వ్యాపారం చేసే చిరువ్యాపారులు ఏ రోజుకారోజు అప్పు తెచ్చి రోజులు గడిపినట్టు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రోజువారీ కార్యకలాపాలకు రిజర్వ్ బ్యాంకు నుంచి ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) తెచ్చి నడిపే దుస్థితికి రాష్ట్రాన్ని చేర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నో ప్రాజెక్టులను కడితే, కేసీఆర్ ప్రభుత్వం కట్టకకట్టిక కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నాసిరకం పనులతో ఎందుకూ పనికి రాకుండా పోయిందని ధ్వజమెత్తారు. పాలమూరు–రంగారెడ్డి పథకం పూర్తి చేయలేకపోయిందని, కానీ గొప్ప ప్రాజెక్టులు పూర్తి చేసినట్టు జనాన్ని తప్పుదారి పట్టించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల సందర్భంగా జరిగిన లఘు చర్చకు భట్టి జవాబిచ్చారు.

అప్పులు తీర్చేందుకు కొత్త అప్పులు

'రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం దారుణంగా మార్చింది. అప్పులు తీర్చేందుకు కొత్త అప్పులు చేసే దుస్థితికి తెచ్చింది. ప్రభుత్వ రుణ భారం 34 శాతానికి పెరిగింది. ఈ భారాన్ని ఎవరు మోయాలి? ఆస్తులు సృష్టించామని చెప్తున్నారు. మరి ఆదాయం ఎందుకు రావటం లేదు? జీతాలు కూడా ఎందుకు సకాలంలో ఇవ్వలేకపోయారు? ప్రజలకు వాస్తవాలు తెలియాలి. అందుకే శ్వేతపత్రం విడుదల చేశాం..' అని చెప్పారు.

ఎలా చేసినా ప్రభుత్వ అప్పులే

'బహిరంగ మార్కెట్‌లో కంటే అధిక వడ్డీలకు రుణాలు తెచ్చారు. హరీశ్‌రావుకు అన్నీ తెలుసు. ఇంతకాలం స్వేచ్ఛ లేనందున మాట్లాడలేదు. ఇప్పుడైనా వాస్తవాలను అంగీకరించి మా వాదనతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నా. తెలంగాణ వచ్చాక మేం పాలనలో ఉండి ఉంటే భూతల స్వర్గం చేసేవాళ్లం. కానీ వీళ్లు అప్పుల కుప్ప చేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో ప్రభుత్వం నేరుగా రుణాలు తెచ్చినా, కార్పొరేషన్లు, ఇతర సంస్థలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పూచీకత్తుతో, పూచీకత్తు లేకుండా అప్పులు తెచ్చినా.. చివరకు భారం పడేది ప్రభుత్వంపైనే. ఆ అప్పులన్నీ ప్రభుత్వ అప్పులే. ఇలా 2014 నుంచి 2023 వరకు చేసిన మొత్తం అప్పులు రూ.6,71,757 కోట్లు. ప్రతి కుటుంబం నెత్తిపై రూ.7 కోట్ల అప్పు తీసుకున్నారు..' అని భట్టి ధ్వజమెత్తారు.

ఆదాయం పెరిగితే ఓడీ ఎందుకు?

'రాష్ట్ర ఆదాయం, జీఎస్డీపీ బాగా పెరిగితే ఓడీ ఎందుకు తీసుకున్నారు? ఓడీ అంటే ఏమిటి? రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తింటాయని లోతుగా చెప్పట్లేదు. ఓడీ అంటే దివాలా తీయడం. బ్యాంక్రప్ట్ కావడం. రాష్ట్రాన్ని మొత్తం ఖతం చేసి ఓడీ తీసుకోబోమనే మాట ఇవ్వమంటే ఎలా? అయితే మీలాగా మాత్రం మేం చేయం. ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టాలు ఎక్కిస్తాం. ఆర్థిక క్రమశిక్షణతో సంపదను సృష్టించి అభివృద్ధి పనులు చేపడతాం..' అని స్పష్టం చేశారు.

మేం మీలా చేస్తామని ఎలా అనుకున్నారు?

'తెలంగాణ అధికారులపై నమ్మకం లేక ఆంధ్రా ప్రాంత అధికారులతో శ్వేతపత్రం రూపొందించారని బీఆర్ఎస్ సభ్యులు అనటం వింతగా ఉంది. మాకు తెలంగాణ ప్రజలు, అధికారులపై నమ్మకముంది. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పని చేయించుకున్న అధికారులతోనే శ్వేతపత్రం తయారు చేయించాం. కానీ మీకు తెలంగాణ అధికారులపై నమ్మకం లేకనే కదా.. ఏపీ కేడర్ అధికారులను పిలిపించుకుని సీఎస్‌గా, డీజీపీగా నియమించుకుంది. మేము కూడా మీలాగే చేస్తామని ఎలా అనుకున్నారు?' అంటూ భట్టి ఎద్దేవా చేశారు.

జనం ఆకాంక్షలు నెరవేర్చేలా ముందుకు..

'మేం ప్రతిపక్షాలను ప్రత్యర్థులుగానే చూస్తాం తప్ప శత్రువుగా చూడం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రజలకు తెలపాలన్నదే మా ఉద్దేశం తప్ప ఎవరినో ఇబ్బంది పెట్టాలని కాదు. అన్ని విషయాలు చెప్తే రాష్ట్ర పరపతిపై ప్రభావం పడుతుందని చెప్పటం లేదు. ఎన్నో ఆకాంక్షలతో తెలంగాణ తెచ్చుకున్నాం. మోయలేని అప్పు భారం ఉన్నా, జనం ఆకాంక్షలను నెరవేర్చేలా ముందుకు సాగుతాం..' అని పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదు

శాసనసభ లేనప్పుడు ఎవరైనా ప్రజావాణికి రావచ్చని, తమ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని భట్టి చెప్పారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో చెప్పలేదని, ఉద్యోగాలిస్తామని చెప్పామన్నారు. అంతకుముందు సభలో శ్వేత పత్రం ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం చర్చను ప్రారంభించారు. బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ సభ్యుల విజ్ఞప్తి మేరకు.. శ్వేతపత్రాన్ని అందరూ చదివి అర్థం చేసుకోవడానికి వీలుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను అరగంట సేపు వాయిదా వేశారు. ఆ తర్వాత చర్చ జరిగింది. దీనిపై భట్టి సమాధానం ముగిసిన తర్వాత సభను గురువారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

కాళేశ్వరంను పనికిరాకుండా చేశారు

'కాళేశ్వరం పేరుతో రూ.97 వేల కోట్లు దుర్వినియోగమయ్యాయి. ఆ ప్రాజెక్టును గొప్పగా చూపి పనికిరాకుండా చేశారు. గొప్పలకు పోయిన ప్రాజెక్టు మిషన్ భగీరథ. ఈ ప్రాజెక్టు వచ్చిన తర్వాతనే ఊరి జనం మంచి నీళ్ల తాగారు అన్నట్టు చెప్పుకొన్నారు. కానీ నా పాదయాత్రలోనే దాని అసలు డొల్లతనం స్పష్టమైంది. చాలా ప్రాంతాల్లో జనం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తవ్వించిన మంచినీటి బావుల నుంచే నీళ్లు తోడుకుని తాగుతున్నారు. అందుకే ఈ పథకంపై విచారణ జరపాలని కోరుకుంటున్నా..' అని డిప్యూటీ సీఎం అన్నారు.

దారుణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

అసెంబ్లీలో శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి

- 2014–15లో రాష్ట్ర ఖజానాలో 303 రోజులు నిధులు ఉండేవి
- అది 2022–23 నాటికి 33 రోజులకు తగ్గిపోయింది
- మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులతో వ్యాపారం చేస్తామని అప్పులు చేశారు
- ఎవరినీ కించపర్చే ఉద్దేశం తమకు లేదని వ్యాఖ్య
- మాజీ మంత్రి హరీశ్‌రావు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ఆర్థిక స్థితి ఎలా ఉందనేది ప్రజల ముందు పెట్టేందుకే శ్వేతపత్రాన్ని విడుదల చేశామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేవని పేర్కొన్నారు. గత పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక స్థితి అత్యంత దారుణంగా మారిందన్నారు. రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వెల్లడించిన గణాంకాలనే శ్వేతపత్రంలో వివరించామని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో ఖజానాలో నిధులు 303 రోజులు ఉండేవని, 2022–23 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి కేవలం 38 రోజులే నిధులు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వాన్ని నడిపించేందుకు ప్రతిరోజు అడుక్కునే స్థాయికి రాష్ట్రాన్ని దిగజార్చారని మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రంపై విపక్షాల అభ్యంతరాలను రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. అసెంబ్లీలో సీఎం చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతోనే మా ప్రభుత్వం తొలిరోజు నుంచే ప్రజాపాలన సాగించేలా చర్యలు చేపట్టింది. తెలంగాణను బలమైన రాష్ట్రంగా ప్రపంచ చరిత్రలో నిలుపుతాం. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలను అందిస్తాం. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రధానిని కలవడం కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి నేను స్వయంగా ఫోన్ చేశా. రాష్ట్ర సంక్షేమం కోసం ఎలాంటి ప్రయత్నాన్ని వృథా కానివ్వం.

ఆస్తులు తనఖా పెట్టి అప్పులు తెచ్చారు

తెలంగాణ రావడానికి పూర్వం కాంగ్రెస్ ప్రభుత్వాలు కష్టపడి సంపాదించి పెట్టిన ఆస్తులను బీఆర్ఎస్ ప్రభుత్వం తనఖాపెట్టి అప్పులు తెచ్చింది. ఆర్టీసీకి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన జూబ్లీ బస్టాండ్, పలు ఇతర బస్టాండ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం తనఖాపెట్టి రూ.2,886 కోట్లు అప్పు తెచ్చింది. టీఎస్ జెన్‌కో, ఎస్పీడీసీఎల్ సహా ఇతర కరెంటు సంస్థల ఆస్తులపై రూ.4,972 కోట్లు అప్పు తెచ్చారు. మేం కష్టపడి ఔటర్ రింగురోడ్డును నిర్మిస్తే రూ.7,300 కోట్లకు తెగనమ్ముకుని బంగారు గుడ్లు పెట్టే బాతును ఒకేసారి కోసుకుతిన్నారు. గత పదేళ్లలో రూ.13.72 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇంతా చేసి సామాన్యులకు ఒరిగిందేమీ లేదు. పేద కుటుంబాలకు పెద్ద కొడుకులా అండగా ఉంటానన్న కేసీఆర్ ఆసరా పింఛన్లు ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారు. పైగా మాజీ మంత్రి హరీశ్‌రావు సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడుతున్నారు.

వ్యాపారం చేస్తామని అప్పులు చేశారు

నీటిపారుదల శాఖ మంత్రులుగా కేసీఆర్, హరీశ్‌రావు ఇద్దరే తొమ్మిదిన్నరేళ్లు చూసుకున్నారు. కాళేశ్వరాన్ని రూ.80 వేల కోట్లతో కట్టామనడం అబద్ధం. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్‌కు రూ.97,449 కోట్లు మంజూరైతే.. విడుదలైంది రూ.79,287 కోట్లు. ఇవి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి ఖర్చు చేసింది. దీనిపై సమగ్ర వివరాలను ఇస్తాం. ప్రభుత్వం పెట్టిన ఖర్చు, తెచ్చిన రుణా లు కలిపితే అసలు లెక్క తేలుతుంది. కాళేశ్వరం నీటితో వ్యాపారం చేస్తామని.. ఏటా రూ.5,199 కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి అప్పులు తెచ్చారు. మిషన్ భగీరథతోనూ ఏటా రూ.5,706 కోట్లు ఆదాయం వస్తుందని.. ఇలా నీటి ద్వారా రూ.10,800 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని బ్యాంకులను తప్పుదోవ పట్టించి రుణాలు తీసుకొచ్చారు. వాటిపై మాజీ ఆర్థికమంత్రి హరీశ్‌రావు సంతకాలు చేశారు. అత్యధిక వడ్డీకి అడ్డగోలుగా రుణాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన విషయాన్ని కాగ్ తన నివేదికలో స్పష్టంగా తేల్చింది. ఇంతా చేసి ఇంకా హరీశ్‌రావు మంత్రి అన్నట్టుగానే భ్రమల్లో ఉండి అసెంబ్లీలో తప్పుడు లెక్కలు చెప్తున్నారు. తమ తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పాల్సింది పోయి దబాయిస్తున్నారు. 2014కు ముందు ప్రజలు మంచినీరు తాగలేదా? గ్రామాల్లో నల్లాలు లేవా? నీళ్ల ట్యాంకులు లేవా? బీఆర్ఎస్ వచ్చాకే మంచినీళ్లు తాగినట్టు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ వారి కుటుంబ తగాదాలను సభలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. తండ్రిని కూలదోసి రాజ్యాన్ని లాక్కునే ప్రయత్నాలను చరిత్రలో చాలా చూశాం.



'హైదరాబాద్'పై అఖిలపక్షం

హైదరాబాద్ ప్రపంచ ఖ్యాతి గాంచింది. ఈ మరింత అభివృద్ధి చేసేందుకు త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తాం. 119 మంది ఎమ్మెల్యే లు, 40 మంది ఎమ్మెల్సీలు, 17 మంది ఎంపీలు, 11 మంది రాజ్యసభ సభ్యులతోపాటు అసెంబ్లీలో అడుగు పెట్టని సీపీఎం, ఇతర పార్టీలను అఖిలపక్ష సమావేశాలకు పిలుస్తాం.'' అని రేవంత్ పేర్కొన్నారు.

అప్పులెందుకు చేశారు.. దేనికి ఖర్చు పెట్టారు?: కూనంనేని

కొత్త రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో సాగిన పాలన ఇప్పుడు రూ.6.7లక్షల కోట్ల అప్పులకు చేరడం ఆలోచించాల్సిన విషయమని సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ప్రభుత్వాలు అవసరాలకు అప్పులు తీసుకున్నా.. ఆ నిధులు దేనికి ఖర్చు చేశారనే లెక్కలు ప్రజలకు చెప్పాలని, జవాబుదారీగా పాలన సాగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పదేళ్ల క్రితం పరిస్థితి ఎలా ఉందో ఇప్పటికీ అలానే ఉందన్నారు.

సభను తప్పుదోవ పట్టించే వారిపై చర్యలు!

మాజీ మంత్రి హరీశ్‌రావు శాసనసభను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని రేవంత్ పేర్కొన్నారు. ''శాసనసభను తప్పుదోవ పట్టించేలా సభ్యులెవరైనా మాట్లాడితే, ఆధారాలు లేకుండా ఉన్నట్టు చిత్రీకరిస్తే.. సభలో తప్పుడు సమాచారాన్ని ఇస్తే కఠిన చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో శాసనసభ వ్యవహారాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో వాటిని ఒకసారి పరిశీలించాలి''అని శాసన సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. తన ప్రసంగం సందర్భంగా రేవంత్ రెండు సార్లు హరీశ్‌రావును ఆర్థికమంత్రి అని ప్రస్తావించారు. తర్వాత మాజీ ఆర్థిక మంత్రి అని సరిదిద్దుకున్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని హరీశ్‌రావు దొంగలెక్కలు ఏవో చెప్పుకుంటారని, ఆయన గెలిచింది ఐదుసార్లేనని విమర్శించారు.



శక్తి లేదనిపిస్తుంది.
ప్రయత్నించాలి.
కాళ్లలో బలం లేదనిపిస్తుంది.
కదలాలి.
ఎవరూ తోడు నిలవడం లేదనిపిస్తుంది.
ఒంటరిగా పోరాడాలి.
లేదని ఓడేది మనిషే.
ఉందని గెలిచేది మనిషే.
మేనుకా పాడెల్‌కు చూపు లేదు.
నేపాల్ నుంచి ఇండియాకు
పాటను నమ్ముకుని వచ్చింది.
తన పాటతో ఎందరినో కదిలించింది.
ఇండియన్ ఐడెల్ కంటెస్టెంట్‌గా ఎంపికై
ఇప్పుడు 'సలార్'లో పాడి దేశం మొత్తానికి
వినపడుతోంది.
స్ఫూర్తిదాయకమైన
ఈ గాయని గురించి...

పాడాలి... వినపడుతుంది

'ఓ పాలన్ హారే నిర్గుణ్ ఔర్ న్యారే
తుమ్రె బిన్ హమ్రా కోనో నహీ'...

'లగాన్'లోని ఈ పాటను మేనుకా పాడెల్ (25) పాడుతున్నప్పుడు, ఆ పాటలోని ఆర్తికి, అర్పణకి, ఆరాధనకి న్యాయ నిర్ణేతల్లో ఒకరైన శ్రేయా ఘోషల్ ఏడుస్తూనే ఉంది. మరో జడ్జి విశాల్ దద్లానీ పరిస్థితీ అంతే. ఇంకో జడ్జయిన ప్రముఖ గాయకుడు కుమార్ షాను 'వహ్వా'లు కొడుతూనే ఉండిపోయాడు.

కన్ను తెరిచినా, కన్ను మూసినా చీకటి తప్ప, గాఢాంధకారం తప్ప, ఓడించాలని చూసే నలుపు తప్ప మరేమీ ఎరగని ఆమె తన పాటతో దివ్వె వెలిగించింది. వెలుతురు చూస్తోంది. వెలుతురు చూపిస్తోంది.

నేపాల్‌కు చెందిన అంధురాలు మేనుకా పాడెల్‌కు ఆడిషన్స్ రౌండ్‌లో గోల్డెన్ మైక్ దొరికింది. ఇండియన్ ఐడెల్ సీజన్ 14లో ఇంకా ఆమె టాప్ కంటెస్టెంట్‌గా కొనసాగుతూ ఉంది. ముఖేష్ స్పెషల్‌లో ముఖేష్ తనయుడు నితిన్ ముఖేష్ సమక్షాన 'ఏ ప్యార్ కా నగ్మా హై' పాడితే ఆయన ఎంతో సంతోషించాడు. దర్శకుడు మహేశ్ భట్ సమక్షంలో 'జఖ్మ్' సినిమాలోని 'గలి మే ఆజ్ చాంద్ నిక్‌లా' పాటను పాడితే ఆయన స్పందిస్తూ 'హృదయం దగ్గర ఒక కన్ను ఉంటుందని నువ్వు నిరూపించావు' అన్నాడు.


'సలార్' చిత్రంలోని ఓ దృశ్యం

వాద్యాలు చూడకుండా, పాటను అక్షరాల్లో చూడకుండా, అంత పెద్ద సెట్‌ను చూడకుండా, తన ఎదుట ఉన్న జడ్జిలు ఎలా ఉంటారో చూడకుండా మేనుకా పాడెల్ ఎంతో నిబ్బరంతో పాటలు పాడటం వల్ల కోట్లమంది అభిమానులను సంపాదించుకుంది. ఇంతకుముందు రియాల్టీ షోలలో కొంతమంది అంధులు పాడటానికి ప్రయత్నించారు కానీ ఇలా నిలువలేదు. మేనుకా పాడెల్ గొంతులోని మాధుర్యం చివరకు ఆమెను 'సలార్' లో పాడే వరకూ తీసుకెళ్లింది.

'సలార్' హిందీ వెర్షన్‌లోని 'సూరజ్ హీ ఆజ్ తన్‌కే' పాటను మేనుకా పాడెల్ పాడింది. దీని వల్ల ఆమె బాలీవుడ్ ఎంట్రీ ఒక భారీ సినిమాతో జరిగిందని చెప్పాలి. ఇదంతా ఆమె పాడాలి అనుకోవడం వల్ల. ఓడాలి అని అనుకోకపోవడం వల్ల.

నేపాల్ అమ్మాయి

మేనుకా పాడెల్‌ది నేపాల్‌లోని జాపా. పుట్టుకతో చూపు లేకపోయినా తల్లిదండ్రులు ఆ లోటు తెలియనీకుండా పెంచారు. బాల్యం నుంచి గానం పట్ల ఆమె ఆసక్తిని ప్రోత్సహించారు. తండ్రి మలేసియాలో ఉపాధిని వెతుక్కుంటూ వెళ్లగా ఇంటి బాధ్యత ఇప్పుడు మేనుక మీదే ఉంది. ముంబైలోని సురేష్ వాడ్‌కర్ అకాడెమీలో కొన్నాళ్లు పాడటం నేర్చుకున్న మేనుక గాయనిగా తన ప్రతిభను చాటేందుకు ప్రయత్నిస్తూనే వచ్చింది. సాయిబాబా భజనలు పాడుతూ ఉపాధి పొందింది. 'సాయిబాబా నా కుటుంబ సభ్యుడు' అని చెప్పుకుంటుంది. బహుశా ఆ సాయి దయ వల్లే ఆమెకు ఇప్పుడు గొప్ప గుర్తింపు లభించింది. ఆమె పాటను మీరు ఇండియన్ ఐడల్‌లో వినచ్చు.

అదర్ సైడ్

'ఒక వ్యక్తిని
బాగా అర్థం చేసుకోవడానికి
తీరిక సమయాన్ని మించిన
విలువైన సమయం లేదు'
అంటుంది సురభి యాదవ్.
పని ఒత్తిడి లేని
తీరిక సమయం
మహిళలకు ఎలాంటిది?
పాట నుంచి ఆట వరకు
ప్రతి విన్యాసం, ప్రతి క్షణం
అపురూపం.
అలాంటి అపురూప
కాలాన్ని 'బసంతి:
ఉమెన్ ఎట్ లీజర్ టైమ్'
అందంగా అద్దం పడుతుంది....




సురభి యాదవ్

తీరిక వేళలో.. తీయటి జ్ఞాపకాలలో...


మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ ప్రాంతంలోని ఒక గ్రామంలో పుట్టి పెరిగిన సురభి యాదవ్ ఐఐటీ-ఢిల్లీలో బయో కెమికల్ ఇంజనీరింగ్ చేసింది. పెద్ద చదువు చదువుకున్న తొలి మహిళగా తనకు గ్రామంలో ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఊరు దాటి ఐఐటీ-క్యాంపస్‌లోకి అడుగుపెట్టిన సురభికి పెద్ద ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లుగా అనిపించింది. ఎంతోమంది వ్యక్తులు, వందలాది పుస్తకాలు, కళలు... తన ఆలోచనలను విశాలం చేశాయి.. 'థింకింగ్... రీడింగ్... రైటింగ్' అనేది తన ప్రధాన వ్యాపకంగా మారింది.

పై చదువుల కోసం కాలిఫోర్నియాకు వెళ్లిన సురభి అక్కడి నుంచి తిరిగి వచ్చిన తరువాత ఒక ఎన్జీవోలో కొంతకాలం పనిచేసింది. ఆ తరువాత 'సఝే సప్నే' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'సామాజిక సేవ అనేది ప్రయోజనాన్ని ఆశించి చేసేది కాదు. అది మన జీవనవిధానంలో భాగం' అని తండ్రి చెప్పిన మాటలు సురభి సామాజిక సేవా రంగంలోకి రావడానికి కారణం అయ్యాయి.

స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో తలమునకలయ్యే సురభి యాదవ్‌లో మంచి ఫోటోగ్రాఫర్ ఉంది. ఆమె తాజా ప్రాజెక్ట్ 'బసంతి: ఉమెన్ ఎట్ లీజర్ టైమ్' తన తల్లి జ్ఞాపకాల స్ఫూర్తితో చేసింది. కొన్ని సంవత్సరాల క్రితం తల్లి చనిపోయింది. తల్లి గురించి బంధువులు, పరిచయస్తులతో మాట్లాడుతున్న క్రమంలో తల్లికి సంబంధించి తనకు తెలియని కొత్త విషయాలు ఎన్నో తెలిసి ఆశ్చర్యానికి గురి చేశాయి. ఎప్పుడూ గంభీరంగా కనిపించే తల్లిలో ఒక సరదా మనిషి ఉన్నట్లు తెలియదు. ఆమెకు ఈత వచ్చు అనే విషయం తెలియదు. 'ఇలాంటి తల్లులు ఇంకా ఎంత మంది ఉన్నారో?' అని ఆలోచిస్తున్నప్పుడు 'ఉమెన్ ఎట్ లీజర్ టైమ్' ప్రాజెక్ట్ ఆలోచన వచ్చింది. తీరికవేళలలో సురభి తల్లి తన పేరు 'బసంతి'ని పేపర్ మీద రాస్తూ ప్రాక్టీస్ చేస్తూ ఉండేది. ఆమె చదువుకోలేదు. పిల్లల ప్రోగ్రెస్ కార్డులపై సంతకం పెడుతున్నప్పుడు ఆమె కళ్లలో గొప్ప వెలుగు కనిపించేది.


మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్‌లో ఎండాకాలంలో ఒక తీయటిరోజు


తీరికవేళ హిమాచల్‌ప్రదేశ్‌లోని సుక్వాడ్ గ్రామంలో మహిళల గానప్రతిభ

'ఒక వ్యక్తిని బాగా అర్థం చేసుకోవాలంటే ఆ వ్యక్తిని తీరిక సమయంలో పరిశీలించాలి. అయితే పని ఒత్తిడి వల్ల ఆ తీరిక సమయాన్ని పట్టుకోవడం కష్టం. ఒకవేళ పట్టుకుంటే అరుదైన సందర్భాలను రికార్డ్ చేయవచ్చు. బసంతి: ఉమెన్ ఎట్ లీజర్ టైమ్ అలాంటి ప్రయత్నమే' అంటుంది సురభి.

'ఉమెన్ ఎట్ లీజర్'లో ఉన్న వెయ్యికిపైగా చిత్రాలు దేశంలోని వివిధ ప్రాంతాలలో తీసినవి.

బ్యూటిప్

రెండుగంటలు నానిన నాలుగు టీస్పూన్ల పొట్టు పెసరపప్పుని పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ఆరెంజ్ పీల్ పొడి, టీస్పూను గంధం పొడి వేసి కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరవాత కొద్దిగా నీటితో తడిచేసి మర్దన చేసి కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం కాంతిమంతంగా, అందంగా కనిపిస్తుంది.



హెయిర్ కేర్

టీస్పూను అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల ఉల్లి రసం, మూడు టీస్పూన్ల కొబ్బరి నూనెవేసి అన్నిటినీ చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు రాసి మర్దన చేయాలి. మరుసటిరోజు తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పలుచబడిన మాడు ఒత్తుగా, నల్లగా నిగనిగలాడుతుంది.



ముగ్గు-ముచ్చట




రాపోలు మమత
కరీంనగర్

17 చుక్కలు
17 వరుసలు
సరిచుక్కలు


గాదిరెడ్డి సుభాషిణి
గుడివాడ

21 చుక్కలు
9 వరసలు
9 వచ్చేవరకు






ఎస్.ఉష
కడప

17 చుక్కలు
9 వచ్చేవరకు

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com



స్పెషల్ సర్‌ప్రైజ్ ఫర్ క్రిస్మస్

మరికొద్దిరోజుల్లో జరుపుకోనున్న క్రిస్మస్‌కు దాదాపు ప్రపంచమంతా ఆతృతగా రెడీ అయిపోతోంది. షాపింగ్ మాల్స్ నుంచి క్రిస్టియన్ లోగిళ్లు, చర్చ్‌లు.. క్రిస్మస్ స్టార్‌లు, ట్రీల అలంకరణతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. వీటితోపాటు తప్పనిసరిగా సందడి చేసేవి శాంతాక్లాజ్ ఇచ్చే బహుమతులు. శాంతాక్లాజ్ సర్‌ప్రైజ్ గిఫ్ట్స్ కోసం పిల్లలు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. పిల్లలేగాక, కొన్ని కంపెనీలు సైతం ఉద్యోగులకు, కొంతమంది బంధువులకు, స్నేహితులకు, సహోద్యోగులకు సర్‌ప్రైజ్‌గిఫ్ట్స్‌ను ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి క్రిస్మస్‌కు తక్కువ బడ్జెట్‌లో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా నిలిచే బహుమతులు ఇవ్వాలనుకుంటున్నారా? అయితే ఇలా ప్రయత్నించి చూడండి...



పర్సనలైజ్డ్ గిఫ్ట్స్

ఇమిటేషన్ జ్యూవెలరీ, ట్రెండీ అండ్ స్టైలిష్ ఫ్యాషన్ యాక్సరీస్ (వాచ్‌లు, సన్‌గ్లాసెస్, హ్యాండ్ బ్యాగ్స్), ఫొటో అల్బమ్స్, ఫ్రేమ్స్ కూడా క్రిస్మస్ గిఫ్ట్‌గా పనికొస్తాయి. ఇవి పండుగ సంతోషాన్ని రెట్టింపు చేస్తాయి.

మొక్కలు

పర్యావరణం పచ్చగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారు. అందుకే పర్యావరణ స్నేహితం అయిన పచ్చని మొక్కలను క్రిస్మస్‌కు బహుమతిగా ఇవ్వొచ్చు. ఇప్పుడున్న ఇరుకు ఇళ్లకు ఇండోర్ ప్లాంట్స్ అయితే మరింత మంచి గిఫ్ట్ అవుతాయి.

గిఫ్ట్‌కార్డ్స్, స్పా వోచర్స్

మార్కెట్లో రకరకాల ఫ్యాషన్ బ్రాండ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏవైనా గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. స్పా వోచర్స్ కూడా మంచి గిఫ్ట్సే.

మ్యాచింగ్ పీజేఎస్

పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి నప్పేలా మ్యాచింగ్ క్రిస్మస్ పైజమాలను గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. ఇవి ప్రత్యేకంగానూ, ఫన్నీగా ఉండి పండుగ సందడిని మరింత పెంచుతాయి.



బుక్స్

మార్కెట్లో పాపులర్‌గానూ, బాగా సేల్ అవుతున్న నవలలు, క్లాసిక్ సాహిత్యం, ప్రేరణ కలిగించే పుస్తకాలు, ఆర్ట్, ఫొటోగ్రఫీ, ట్రావెల్‌కు సంబంధించిన కాఫీ టేబుల్ బుక్స్‌కూడా మంచి బహుమతులు. ఈ గిఫ్ట్ ఎక్కువకాలం నిలిచి ఉంటుంది.

సెల్ఫ్‌కేర్

చలికాలంలో చర్మ సంరక్షణ చాలా అవసరం. ఎక్కువమంది వింటర్‌లో చర్మాన్ని కోమలంగా ఉంచుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. కాబట్టి వింటర్ స్కిన్ కేర్ ఉత్పత్తుల సెట్స్‌ను బహుమతిగా ఇవ్వొచ్చు. ఇవేగాక..సెంటెడ్ క్యాండిల్స్, ఫేస్ మాస్క్‌లు, స్లీపింగ్ మాస్కులు, బాతింగ్ కిట్స్ మంచి గిఫ్ట్స్.

పెర్‌ఫ్యూమ్స్

పెర్‌ఫ్యూమ్స్ క్లాసిక్‌గానూ, అందుబాటు ధరలో దొరికే గిఫ్ట్ ఐటమ్స్. పెర్‌ఫ్యూమ్ వాడిన ప్రతిసారి .. ఆ సువాసన భరిత పరిమళాలు మీ గిఫ్ట్‌తోపాటు మిమ్మల్ని, మీ అభిమానాన్ని గుర్తుచేస్తాయి.

మ్యూజిక్ బాక్స్

చార్మింగ్ లిటిల్ మ్యూజిక్ బాక్స్ కూడా ప్రత్యేకంగానూ ఫన్నీగా ఉంటుంది. ఇది కూడా క్రిస్మస్‌కు మంచి గిఫ్ట్. దీనినుంచి వచ్చే సంగీతం మనసుని ఆహ్లాద పరుస్తుంది.

అందమైన మగ్స్

ఉద్యోగులకు లేదా కొలీగ్స్‌కు అందంగా ఉండే మగ్స్ మంచి గిఫ్ట్ ఐడియా. ఈ మగ్స్‌లో స్టేషనరీ ఐటమ్స్ పెట్టుకోవడం లేదా, ఇష్టమైన కాఫీ తాగడం లేదా తరచూ వాడే ఐటమ్స్, అందమైన వస్తువులను పెట్టుకుంటారు. ఇవి తక్కువ ధరలో మంచి మంచి డిజైన్స్‌లో కూడా దొరుకుతాయి.

ఎయిర్ ప్యూరిఫైర్

ఎంతవేగంగా అభివృద్ధి చెందుతున్నామో అంతే స్పీడుగా గాలి కలుషితమైపోతున్న ఈ రోజుల్లో.. ఎయిర్ ప్యూరిఫయర్స్, ఫిల్టర్స్ అవసరంగా మారిపోతున్నాయి. అందుకే మినీ ప్యూరిఫయర్స్‌ను గిఫ్ట్‌గా ఇవ్వచ్చు. వీటిద్వారా మీ సన్నిహితులకు మంచి ఆక్సిజన్‌ను అందించిన వారవుతారు.

డెకరేషన్ ఐటమ్స్

అలంకరించేకొద్దీ ఇంటి అందం పెరగడంతోపాటు.. కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కాఫీ, టీసెట్స్, కుకింగ్ గాడ్జెట్స్, కిచెన్ టూల్స్, సెంటెడ్ క్యాండిల్స్ ఆర్ట్ వర్క్ హోం డెకోరేటివ్ ఐటమ్స్ కూడా మంచి గిఫ్ట్స్. చిన్న పరిమాణం నుంచి పెద్దసైజులో ఎంతో ఆకర్షణీయమైన, ఉపయోగకరమైనవి అందుబాటు ధరల్లో దొరుకుతున్నాయి.

క్రాఫ్ట్స్ మేకింగ్ కిట్స్

జ్యూవెలరీ తయారీ, క్యాండిల్ తయారీ, సబ్బుల తయారీ కిట్స్, వెరైటీ దియా మేకింగ్ కిట్స్, ప్లాంట్ టెర్రారియం, గార్డెనింగ్ సెట్స్ కూడా మంచి బహుమతులే.

వీటిలో ఏది బహుమతిగా ఇచ్చినా మీరు మీ ఆత్మీయుల సంతోషాన్ని చూరగొంటారు.











'సూపర్' సాల్ట్... 57 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్స్‌లతో 119



ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ (57 బంతుల్లో 119 : 7 ఫోర్లు, 10 సిక్స్‌లు) కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో మరో మెరుపు సెంచరీ సాధించాడు. ఫలితంగా వెస్టిండీస్‌తో టరూబాలో జరిగిన నాలుగో టి20లో ఇంగ్లండ్ 75 పరుగుల తేడాతో గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 267 పరుగులు చేసింది. టి20ల్లో ఇంగ్లండ్‌కిదే అత్యుత్తమ స్కోరు. టి20ల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా ఫిల్ సాల్ట్ నిలువగా... బట్లర్ (29 బంతుల్లో 55 : 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), లివింగ్‌స్టోన్ (21 బంతుల్లో 54 నాటౌట్: 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా మెరిపించారు. అనంతరం వెస్టిండీస్ కూడా ధాటిగా ఆడింది. అయితే వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. తుదకు విండీస్ 15.3 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఆండ్రీ రసెల్ (38 బంతుల్లో 51 : 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. మ్యాచ్ మొత్తంలో రెండు జట్ల ప్లేయర్లు కలిసి 34 ఫోర్లు, 33 సిక్స్‌లు బాదడం విశేషం.

'ఖేల్ రత్నా'లు సాత్విక్, చిరాగ్



చిరాగ్ శెట్టి
సాత్విక్ సాయిరాజ్

భారత బ్యాడ్మింటన్ జోడీకి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం

- హుసాముద్దీన్, ఇషా సింగ్, అజయ్ కుమార్‌లకు 'అర్జున'
- 2023 జాతీయ క్రీడా అవార్డుల ప్రకటన
- జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' లభించింది. 2023 సంవత్సరానికిగాను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బుధవారం జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది. ఉత్తమ క్రీడాకారులకు ఇచ్చే 'అర్జున' అవార్డు 26 మందిని వరించింది. ఉత్తమ కోచ్‌లకు అందించే 'ద్రోణాచార్య' అవార్డును రెగ్యులర్ విభాగంలో ఐదుగురికి... లైఫ్‌టైమ్ విభాగంలో ముగ్గురికి ప్రకటించారు. ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి క్రీడా పురస్కారాలు దక్కాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 23 ఏళ్ల రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ 'ఖేల్ రత్న' అందుకోనుండగా... ఆంధ్రప్రదేశ్‌కే చెందిన అజయ్ కుమార్ రెడ్డి (అంధుల క్రికెట్) 'అర్జున' పురస్కారం పొందాడు. తెలంగాణకు చెందిన బాక్సర్ హుసాముద్దీన్, మహిళా షూటర్ ఇషా సింగ్‌లకు కూడా 'అర్జున' అవార్డు దక్కింది. జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాలు అందజేస్తారు.

- 'ఖేల్ రత్న' అవార్డీలకు మెడల్, ప్రశంస పత్రంతోపాటు రూ. 25 లక్షలు... 'అర్జున' విజేతలకు రూ. 15 లక్షలు... 'ద్రోణాచార్య' అవార్డీలకు రూ. 15 లక్షలు... ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డీలకు రూ. 10 లక్షల చొప్పున నగదు పురస్కారం లభిస్తుంది.



అజయ్

- గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన 33 ఏళ్ల అజయ్ 2010 నుంచి భారత అంధుల క్రికెట్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. 2016లో టీమిండియాకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అజయ్ సారథ్యంలోనే భారత్ 2017 టి20 వరల్డ్ కప్, 2018 వన్డే వరల్డ్‌కప్, 2022 టి20 వరల్డ్‌కప్ టైటిల్స్ గెలిచింది.
- నిజామాబాద్ జిల్లాకు చెందిన 29 ఏళ్ల హుసాముద్దీన్ ఈ ఏడాది తాష్కెంట్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచాడు. ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్న హుసాముద్దీన్ 2022 ఆసియా చాంపియన్‌షిప్‌లో... 2018, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాలు నెగ్గాడు.
- హైదరాబాద్‌కు చెందిన 18 ఏళ్ల పిస్టల్ షూటర్ ఇషా సింగ్ ఈ ఏడాది అజర్‌బైజాన్‌లో జరిగిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు గెలిచింది. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఒక స్వర్ణం, మూడు రజత పతకాలు నెగ్గింది. గత ఏడాది జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్యం సాధించింది.



హుసాముద్దీన్



ఇషాసింగ్

నిలకడగా...

మహారాష్ట్రకు చెందిన 26 ఏళ్ల చిరాగ్ శెట్టితో కలిసి సాత్విక్ సాయిరాజ్ గత ఐదేళ్లలో పలు అంతర్జాతీయ టోర్నీల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ ఏడాది మొత్తం సాత్విక్-చిరాగ్ జోడీ సూపర్ ఫామ్‌లో ఉంది. దుబాయ్ వేదికగా జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో... చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగిన ఆసియా క్రీడల్లోనూ ఈ జంట స్వర్ణ పతకాలు సాధించింది. స్విస్ ఓపెన్ సూపర్-300, ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000, కొరియా ఓపెన్ సూపర్-500 టోర్నీల్లోనూ విజేతగా నిలిచింది. చైనా మాస్టర్స్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో రన్నరప్ ట్రోఫీ దక్కించుకుంది. దాంతోపాటు డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచి కొత్త చరిత్ర సృష్టించింది. ఇక 2022లో జరిగిన ప్రతిష్టాత్మక థామస్ కప్ టోర్నీలో తొలిసారి భారత్ విజేతగా నిలువడంలో సాత్విక్-చిరాగ్ శెట్టి కీలకపాత్ర పోషించారు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం పసిడి పతకాన్ని దక్కించుకుంది. అంతేకాకుండా ఇండియా ఓపెన్ సూపర్-500, ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 టోర్నీల్లోనూ టైటిల్స్ కైవసం చేసుకుంది. 2018లో హైదరాబాద్ ఓపెన్, 2019లో థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీల్లోనూ సాత్విక్-చిరాగ్ జంట విజేతగా నిలిచింది. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత జట్టుకు మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం రావడానికి సాత్విక్-చిరాగ్ ముఖ్యపాత్ర పోషించారు.

అవార్డు గ్రహీతలు...

'ఖేల్ రత్న' (2): సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి (బ్యాడ్మింటన్).

అర్జున అవార్డీలు (26): ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, అదితి స్వామి (ఆర్చరీ), శ్రీశంకర్, పారుల్ చౌధరీ (అథ్లెటిక్స్), హుసాముద్దీన్ (బాక్సింగ్), వైశాలి (చెస్), షమీ (క్రికెట్), అనూష్ అగర్వల్లా, దివ్యాకృతి సింగ్ (ఈక్వెస్ట్రియన్), దీక్షా డాగర్ (గోల్ఫ్), క్రిషన్ బహదూర్ పాఠక్, సుశీలా చాను (హాకీ), పవన్ కుమార్, రీతూ నేగి (కబడ్డీ), నస్రీన్ (ఖో-ఖో), పింకీ (లాన్ బౌల్స్), ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, ఇషా సింగ్ (షూటింగ్), హరీందర్ పాల్ (స్క్వాష్), అహిక ముఖర్జీ (టేబుల్ టెన్నిస్), సునీల్, అంతిమ్ పంఘాల్ (రెజ్లింగ్), రోషిబీనా (వుషు), అజయ్ కుమార్ రెడ్డి (అంధుల క్రికెట్), ప్రాచీ యాదవ్ (పారా కనోయింగ్).

ద్రోణాచార్య అవార్డీలు (రెగ్యులర్ కేటగిరీ-5): లలిత్ కుమార్ (రెజ్లింగ్), ఆర్‌బీ రమేశ్ (చెస్), మహావీర్ ప్రసాద్ (పారా అథ్లెటిక్స్), శివేంద్ర సింగ్ (హాకీ), గణేశ్ ప్రభాకర్ (మల్లఖంబ్).

ద్రోణాచర్య అవార్డీలు (లైఫ్‌టైమ్-3): జస్కీరత్ సింగ్ గ్రెవాల్ (గోల్ఫ్), భాస్కరన్ (కబడ్డీ), జయంత కుమార్ (టేబుల్ టెన్నిస్).

ధ్యాన్‌చంద్ అవార్డీలు (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్-3): మంజూషా కన్వర్ (బ్యాడ్మింటన్), వినీత్ శర్మ (హాకీ), కవితా సెల్వరాజ్ (కబడ్డీ).

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రోఫీ (అత్యుత్తమ యూనివర్సిటీలు-3): 1. గురునానక్ దేవ్ యూనివర్సిటీ (అమృత్‌సర్), 2. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (పంజాబ్), 3. కురుక్షేత్ర యూనివర్సిటీ (కురుక్షేత్ర, హరియాణా).

సమష్టిగా రాణిస్తేనే...

- నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మూడో వన్డే
- గెలిచిన జట్టుకు సిరీస్
- సాయంత్రం గం. 4:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



పార్ల్: సఫారీ గడ్డపై రెండోసారి వన్డే సిరీస్ సాధించాలనే లక్ష్యంతో... నేడు దక్షిణాఫ్రికాతో జరిగే చివరిదైన మూడో మ్యాచ్‌లో భారత్ బరిలోకి దిగనుంది. కేఎల్ రాహుల్ నాయకత్వంలోని టీమిండియా తొలి వన్డేలో ఘనవిజయం సాధించినా... రెండో వన్డేలో మాత్రం తడబడింది. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ నిరాశాజనక ప్రదర్శన కనబరిచింది. ఓపెనర్ సాయి సుదర్శన్ రెండు మ్యాచ్‌ల్లోనూ అర్ధ సెంచరీలు సాధించాడు. మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్, వన్‌డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ ఆకట్టుకోలేకపోయారు. తొలి మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్ అదరగొట్టగా... ముకేశ్ కుమార్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. మూడో మ్యాచ్‌లో భారత్ గెలవాలంటే సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. ఫామ్ కోల్పోయిన తిలక్ వర్మ స్థానంలో మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పటిదార్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. మరోవైపు రెండో వన్డేలో సాధించిన విజయంతో దక్షిణాఫ్రికా ఆత్మవిశ్వాసంతో ఉంది. ఓపెనర్ టోని జోర్జి సెంచరీ సాధించి ఫామ్‌లోకి వచ్చాడు. మార్క్‌రమ్, రీజా హెన్‌డ్రిక్స్, క్లాసెన్, డసెన్, మిల్లర్ కూడా రాణిస్తే ఆ జట్టు మరో విజయంపై ఆశలు పెట్టుకోవచ్చు. మూడో మ్యాచ్ వేదికైన పార్ల్‌లో భారత్‌పై దక్షిణాఫ్రికాదే పైచేయిగా ఉంది. గత ఏడాది ఈ వేదికపై భారత్‌తో జరిగిన రెండు వన్డేల్లోనూ దక్షిణాఫ్రికానే గెలిచింది.

తొలి విజయం లక్ష్యంగా...

- నేటి నుంచి ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు ఏకైక టెస్ట్
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఇంగ్లండ్ జట్టుపై సాధించిన ఘనవిజయం స్ఫూర్తితో... నేటి నుంచి ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు రోజుల ఏకైక టెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 347 పరుగుల తేడాతో గెలిచింది. అయితే ఆస్ట్రేలియా జట్టుపై భారత రికార్డు అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియాతో జరిగిన 10 టెస్టుల్లో భారత్ ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోయింది. నాలుగు టెస్టుల్లో ఓడిన భారత జట్టు... ఆరు టెస్టుల్లో ఓడిపోయింది. 1984 తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియా జట్టుతో భారత్ టెస్టు ఆడనుండటం గమనార్హం. ఆసీస్‌పై భారత్ తొలి గెలుపు సాధించాలంటే సమష్టి ప్రదర్శన తప్పనిసరి. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్, యస్తిక భాటియా భారీ స్కోర్లు చేయాలి. ఆల్‌రౌండర్లు దీప్తి శర్మ, స్నేహ్ రాణా, పూజా వస్త్రకర్ కూడా తమవంతు పాత్రను పోషించాలి. బౌలర్ రేణుక సింగ్ తన స్వింగ్ బౌలింగ్ పేస్‌తో ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేయాలి. మరోవైపు అలీసా హీలీ నాయకత్వంలో ఆస్ట్రేలియా జట్టు కూడా పటిష్టంగా ఉంది. బెత్ మూనీ, యాష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, ఎలీసా పెర్రీ, అనాబెల్ సదర్లాండ్ ప్రదర్శనపై ఆస్ట్రేలియా విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.

సినిమా


విధ్వంసం ఆపేవాడు దేవుడు!



- నవదీప్, అవసరాల, కావ్యా థాపర్, రవితేజ, అనుపమ, టీజీ విశ్వప్రసాద్, కార్తీక్

'తుపాకీ నుండి వచ్చే బుల్లెట్ ఆగేది ఎప్పుడో తెలుసా... అది పట్టుకున్న వాణ్ణి తాకినప్పుడు...' అంటూ నటుడు నవదీప్ చెప్పిన డైలాగ్‌తో 'ఈగల్' ట్రైలర్ ప్రారంభమైంది. 'ఆయుధంతో విధ్వంసం చేసేవాడు రాక్షసుడు... ఆయుధంతో విధ్వంసం ఆపేవాడు దేవుడు... ఈ దేవుడు మంచోడు కాదు... మొండోడు' అంటూ హీరో రవితేజ చెప్పిన డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. రవితేజ హీరోగా, కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ– ''ఈగల్' సినిమా చాలా బావుంటుంది. కార్తీక్ రూపంలో ఇండస్ట్రీకి మరో మంచి దర్శకుడు రాబోతున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నా హోమ్ ప్రొడక్షన్ లాంటిది. విశ్వ ప్రసాద్‌గారితో మరొక చిత్రం చేయబోతున్నా. జనవరి 13న థియేటర్స్‌లో కలుద్దాం.. కుమ్మేద్దాం'' అన్నారు. ''గత ఏడాది రవితేజ గారికి 'ధమాకా' అనే బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చాం. 'ఈగల్'తో మరో బ్లాక్ బస్టర్‌కి రెడీ అవుతున్నాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''ఈగల్' పండక్కి గొప్ప థియేట్రికల్ అనుభూతి ఇచ్చే చిత్రం. జనవరి 13న థియేటర్స్‌లో చూడండి'' అన్నారు కార్తీక్ ఘట్టమనేని. ఈ వేడుకలో అనుపమ, కావ్యా థాపర్, నటులు నవదీప్, శ్రీనివాస్ అవసరాల మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: డేవ్ జాండ్, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.

కర్ణాటకలో తండేల్



- నాగచైతన్య

నాగచైతన్య యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. ఇందులో సాయిపల్లవి హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై 'బన్నీ' వాసు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మత్స్యకారుడు రాజు పాత్రలో నాగచైతన్య కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ బుధవారం మొదలైంది. కర్ణాటకలోని మల్పే పోర్టులో (ఉడిపి) ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను, యాక్షన్ సీక్వెన్స్‌లను ప్లాన్ చేశారు మేకర్స్. తొలుత యాక్షన్ సీక్వెన్స్ మొదలైందని తెలిసింది. వాస్తవ సంఘటనల ఆధారంగా ప్రేమకథగా తెరకెక్కుతున్న 'తండేల్'కి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

సలార్ అందరి అంచనాలు అందుకుంటుంది

- నిర్మాత విజయ్ కిరగందూర్



''ప్రభాస్ సూపర్ స్టార్. ప్రశాంత్ నీల్ పెద్ద డైరెక్టర్. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే ఎలా ఉంటుందో అని అభిమానులు, ప్రేక్షకులతో పాటు ఇండస్ట్రీ వర్గాలు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. 'కేజీఎఫ్' తర్వాత ప్రశాంత్ నీల్ ఎలాంటి కథ చెబుతున్నారు? ప్రభాస్‌ను ఎలా చూపించబోతున్నారు? అంటూ అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వారందరి అంచనాలను 'సలార్' అందుకుంటుంది'' అని నిర్మాత విజయ్ కిరగందూర్ అన్నారు. ప్రభాస్, శ్రుతీహాసన్ జంటగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్'. హోంబలే ఫిలింస్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన 'సలార్' మూవీ తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ...

- 'సలార్' ని 2021లో ప్రారంభించాం. కోవిడ్ కారణంగా 2022లో పూర్తి స్థాయి షూటింగ్ ప్రారంభించి, 2023 జనవరిలో షూటింగ్‌ను పూర్తి చేశాం. ఐదు భాషల్లో(తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళం, హిందీ) సినిమాను విడుదల చేయాలనుకోవడంతో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. పోస్ట్ ప్రొడక్షన్‌కి కూడా సమయం పట్టింది. మా హోంబలే ఫిలింస్ తొలిసారి తెలుగులో హీరో ప్రభాస్‌గారితో పనిచేశాం. ప్రభాస్‌గారు చాలా మంచి వ్యక్తి. అందువల్లే ఈ ప్రయాణం మాకు మధురమైన అనుభూతినిచ్చింది.
- 'సలార్: సీజ్‌ఫైర్' 90 శాతం షూటింగ్‌ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చిత్రీకరించాం. ఈ సినిమా కోసం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించాం.. మేకింగ్ పరంగా ఎక్కడా రాజీపడలేదు. 'కేజీఎఫ్'తో కన్నడతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, హిందీ ప్రేక్షకుల్లోనూ మాకు మంచి గుర్తింపు దక్కింది. మా పై వాళ్లు చూపించిన ప్రేమాభిమానాలు, నమ్మకం మాలో మరింత బాధ్యతను పెంచాయి. అందువల్ల వాళ్లకి నచ్చేలా మంచి సినిమాలు చేయాలని ముందుకు వెళుతున్నాం.
- మన సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు వేర్వేరుగా ఉంటాయి. అయితే అన్నీ కలిస్తేనే ఇండియన్ సినీ ఇండస్ట్రీ అవుతుంది. భారతీయ చిత్ర పరిశ్రమను గ్లోబల్ రేంజ్‌కి తీసుకెళ్లాలనేదే నా అభిప్రాయం. అంతే తప్ప ఇది తెలుగు, ఇది కన్నడ సినిమా అని ఆలోచించటం లేదు. నిర్మాతగా పదేళ్లు పూర్తయ్యాయి. ఒక్కో సినిమా ఒక్కో అనుభవాన్ని నేర్పించింది. ప్రశాంత్ నీల్ ప్రొడక్షన్, మార్కెటింగ్‌లలో కల్పించుకోడు. మా మధ్య మంచి అనుబంధం, అవగాహన ఉంది. 'సలార్' లో రెండు భాగాలుగా చేసేంత కథ ఉంది.. అందుకే రెండు భాగాలుగా తీస్తున్నాం.
- నాకు కథ, డైరెక్టర్ ముఖ్యం. బడ్జెట్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వను. అవసరం మేరకు ఎంతైనా ఖర్చు పెడతాను. తెలుగు ఇండస్ట్రీ వాళ్లు బాగా రిసీవ్ చేసుకున్నారు. తెలుగు ప్రేక్షకుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వాళ్లు సినిమాను ఆదరిస్తున్న తీరే అందుకు ఉదాహరణ. ఓ వైపు ప్రభాస్ గారు, మరోవైపు ప్రశాంత్ నీల్ గారు బిజీగా ఉండటంతో 'సలార్' మూవీ నుంచి గ్రాండ్ ఈవెంట్ చేయలేదు. సినిమా రిలీజ్ తర్వాత సక్సెస్ ఈవెంట్‌ను కండెక్ట్ చేస్తాం.

ఒక ప్రేమకథ



- శ్రుతీహాసన్, అడివి శేష్

అడివి శేష్, శ్రుతీహాసన్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కనున్న యాక్షన్ లవ్ స్టోరీకి 'డకాయిట్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఒక ప్రేమకథ' అనేది ఉపశీర్షిక. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కనున్న ఈ సినిమాతో కెమెరామెన్ షానీ డియోల్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇచ్చే చిత్రంగా 'డకాయిట్' ఉంటుంది'' అన్నారు. 'ఇంటెన్స్ ఎమోషన్స్‌తో కూడిన యాక్షన్ డ్రామాగా ఈ మూవీ ఉంటుంది'' అన్నారు షానీ డియోల్. ఈ సినిమాకు సహ-నిర్మాత: సునీల్ నారంగ్.

కొత్త ప్రపంచాన్ని సృష్టించారు - శేఖర్ కమ్ముల



- సునీత, శేఖర్ కమ్ముల, తనికెళ్ల భరణి, భావన, ఆకాశ్, రాఘవేంద్రరావు, అనిల్

''సర్కారు నౌకరి' సినిమా ట్రైలర్ బాగుంది. ఈ మూవీ ద్వారా తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించారు. ఈ చిత్రం విజయం సాధించాలి'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. గాయని సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భావన హీరోయిన్. ఆర్కే టెలీషోపై కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా జనవరి 1న విడుదలకానుంది. ఈ మూవీ ట్రైలర్‌ని హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ–''వెంకటేశ్, మహేశ్ బాబు, ఎన్టీఆర్‌లను హీరోలుగా పరిచయం చేశాను.. వారంతా ఇప్పుడు గొప్ప స్థాయిలో ఉన్నారు. 'సర్కారు నౌకరి' తో పరిచయమవుతున్న ఆకాష్ కూడా వారిలా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఆకాష్ పాడగలిగినా నటనపై ఎక్కువ ఆసక్తి ఉండటంతో హీరోగా పరిచయవుతున్నాడు'' అన్నారు సునీత. ''నిజజీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాం'' అన్నారు గంగనమోని శేఖర్. ''నాకు తొలి అవకాశాన్ని ఇచ్చిన రాఘవేంద్రరావుగారికి ధన్యవాదాలు'' అన్నారు ఆకాష్.

వాణిజ్య అంశాలతో...



- యష్‌రాజ్, నవమి

యష్‌రాజ్, శివ బాలాజీ, నవమి గాయక్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అభిరామ్'. రామకృష్ణార్జున్ దర్శకత్వంలో లెజెండరీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై శ్రీనివాసులు నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని నిర్మాత ప్రసన్న కుమార్ విడుదల చేసి, మాట్లాడుతూ–''అభిరామ్' టైటిల్ చాలా బాగుంది. టీజర్ చూస్తుంటే ఈ సినిమా వాణిజ్య అంశాలతో కూడిన ఒక మంచి ప్రేమ కథగా అనిపిస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా 'అభిరామ్' టీజర్‌ని రిలీజ్ చేసి, మమ్మల్ని ప్రోత్సహించిన ప్రసన్న కుమార్‌గారికి కృతజ్ఞతలు'' అన్నారు శ్రీనివాసులు.

రివర్స్ లవ్‌స్టోరీ



- సూర్య, జెన్నీఫర్

సూర్య శ్రీనివాస్, శివ బొద్దు రాజు, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఈవీఓఎల్'. రామ్‌యోగి వెలగపూడి స్వీయదర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ''ఎల్‌ఓవీఈ'ని(లవ్) రివర్స్‌లో చూస్తే 'ఈవీఓఎల్'. ఈ మూవీ ఓ రివర్స్ లవ్‌స్టోరీగా ప్రేక్షకులముందుకు రానుంది. ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన రహస్య ఒప్పందం ఈ సినిమాలో కీలకం. బోల్డ్ అండ్ రియలిస్టిక్ సన్నివేశాలతో ఈ సినిమా తీశాం''అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్.

కాలేజీలో ప్రేమ



- సుధీష్, అంకిత

ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రం 'ప్యాషన్'. దర్శకులు శేఖర్ కమ్ముల, మదన్, మోహనకృష్ణ ఇంద్రగంటి వద్ద పని చేసిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ జోషువా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సుధీష్ వెంకట్, అంకిత సాహ జంటగా నటిస్తున్నారు. డాక్టర్ అరుణ్ మొండితోక, నరసింహ, ఎ. పద్మనాభరెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ మొండితోక కెమెరా స్విచ్చాన్ చేయగా, శేఖర్ కమ్ముల క్లాప్ ఇచ్చారు. వేణు ఊడుగుల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత పద్మనాభరెడ్డి స్క్రిప్ట్‌ని అరవింద్ జోషువాకు అందజేశారు. ''కొత్తవాళ్లతో నేను తీసిన 'హ్యాపీ డేస్'లా 'ప్యాషన్' యూత్‌ని ఆకట్టుకుని, ఇన్‌స్పైర్ చేసే సినిమా అవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు శేఖర్ కమ్ముల. ''త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు నిర్మాతలు. ''నా కథను నమ్మిన మా నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు అరవింద్ జోషువా.

సాక్షి బిజినెస్
గురువారం
21-12-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
931	303
70,506	21,150

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్‌	15,041	△	38
డోజోన్స్‌	37,631	△	72
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,716	△	78
డాక్స్‌	16,733	▽	11
షాంఘై	2,902	▽	30
నికాయ్‌	33,675	△	457

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,302	△	218
బంగారం (99.5 స్వచ్ఛత)	62,052	△	216
వెండి (కేజీ)	73,742	▽	90

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.77	83.79
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	104.10	106.67
€	యూరో	ఎస్‌బీఐ	90.18	92.55
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	57.25	58.57
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	55.40	57.34
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	61.45	63.44
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.22	22.85
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.75	23.54
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.53	12.60

జియో యూజర్లు 35 లక్షలు అప్‌..

13 లక్షలు పెరిగిన ఎయిర్‌టెల్‌ యూజర్లు



న్యూఢిల్లీ: దేశీ టెలికం రంగంలో రిలయన్స్‌ జియో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కంపెనీ యూజర్ల సంఖ్య మరో 34.7 లక్షలు పెరిగి మొత్తం 44.92 కోట్లకు చేరింది. అటు పోటీ సంస్థ భారతి ఎయిర్‌టెల్‌ సబ్‌స్క్రయిబర్స్‌ 13.2 లక్షలు పెరగ్గా వొడాఫోన్‌ ఐడియా యూజర్లు 7.5 లక్షలు తగ్గారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ బుధవారం వెల్లడించిన గణాంకాల ప్రకారం భారతి ఎయిర్‌టెల్‌ యూజర్ల సంఖ్య 37.77 కోట్లుగా, వొడాఫోన్‌ ఐడియా సబ్‌స్క్రయిబర్స్‌ సంఖ్య 22.75 కోట్లుగా ఉంది. సెప్టెంబర్‌ ఆఖరు నాటికి మొత్తం వైర్‌లెస్‌ సబ్‌స్క్రయిబర్స్‌ సంఖ్య 115 కోట్లకు చేరింది. పట్టణ ప్రాంతాల్లో యూజర్ల సంఖ్య 63 కోట్లకు, గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌స్క్రయిబర్స్‌ సంఖ్య 52 కోట్లకు చేరింది.

88.5 కోట్లకు బ్రాడ్‌బ్యాండ్‌ యూజర్లు..

ట్రాయ్‌ గణాంకాల ప్రకారం మొత్తం బ్రాడ్‌బ్యాండ్‌ యూజర్ల సంఖ్య ఆగస్టులో 87.65 కోట్లుగా ఉండగా సెప్టెంబర్‌ ఆఖరు నాటికి 88.5 కోట్లకు చేరింది. టాప్‌ 5 సర్వీస్‌ ప్రొవైడర్ల మార్కెట్‌ వాటా 98.35 శాతంగా ఉంది. ఇందులో రిలయన్స్‌ జియో ఇన్ఫోకామ్‌ (45.89 కోట్లు), భారతి ఎయిర్‌టెల్‌ (25.75 కోట్లు), వొడాఫోన్‌ ఐడియా (12.65 కోట్లు), బీఎస్‌ఎన్‌ఎల్‌ (2.51 కోట్లు) ఉన్నాయి.

పేమెంట్‌ అగ్రిగేటర్‌గా ఎన్‌క్యాష్‌కు అనుమతి



న్యూఢిల్లీ: పేమెంట్‌ అగ్రిగేటర్‌గా వ్యవహరించేందుకు రిజర్వ్‌ బ్యాంక్‌ నుంచి అనుమతి లభించినట్లు ఎన్‌క్యాష్‌ సంస్థ తెలిపింది. బిజినెస్‌–2–బిజినెస్‌ వ్యవస్థలో ఒలింపస్‌ బ్రాండ్‌ పేరిట కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు సంస్థ తెలిపింది. నిరంతరాయంగా, వినూత్నమైన, విశ్వసనీయమైన పేమెంట్‌ సొల్యూషన్స్‌ను అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా సంస్థ సహ–వ్యవస్థాపకుడు యద్వేంద్ర త్యాగి తెలిపారు. కార్పొరేట్‌ పేమెంట్స్‌ సొల్యూషన్స్‌ సంస్థగా ఎన్‌క్యాష్‌ 2018లో కార్యకలాపాలు ప్రారంభించింది. అప్పటి నుంచి దాదాపు 2,50,000 పైచిలుకు వ్యాపారాలు తమ కార్పొరేట్‌ పేమెంట్స్‌ వ్యవస్థను డిజిటలీకరించుకోవడంలో తోడ్పాటు అందించింది.

జీవితకాల గరిష్టాల వద్ద బేర్‌ పంజా..!

- 9 నెలల్లో అతిపెద్ద నష్టం
- లాభాల స్వీకరణతో సూచీలు డీలా
- తాజా కరోనా కేసుల నమోదు కలకలం
- రూ.8.91 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- చిన్న, మధ్య తరహా షేర్లలో అమ్మకాల సునామీ



ముంబై: దలాల్‌ స్ట్రీట్‌లో కొత్త శిఖరాలపై దూసుకెళ్తున్న బుల్‌ను ఒక్కసారిగా బేర్‌ ముట్టడించింది. ఫలితంగా ఆరంభ లాభాలను కోల్పోయిన సూచీలు గడిచిన 9 నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. సెన్సెక్స్‌ 931 పాయింట్లు క్షీణించి 70,506 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 303 పాయింట్లు నష్టపోయి 21,150 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. పలు రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌ ప్రారంభంలోనే సెన్సెక్స్‌ 476 పాయింట్లు లాభపడి 71,913 వద్ద, నిఫ్టీ 140 పాయింట్లు పెరిగి 21,593 వద్ద కొత్త జీవికాల గరిష్టాలు నమోదు చేశాయి. దేశీయంగా నెలకొన్న ప్రతికూల ప్రభావాలతో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ట్రేడింగ్‌ ముగిసే అన్ని రంగాల షేర్లలో అమ్మకాల సునామీ తలెత్తడంతో సూచీలు ఒకశాతానికి పైగా పతనమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 1,134 పాయింట్లు పతనమై 70,303 వద్ద, నిఫ్టీ 366 పాయింట్లు క్షీణించి 21,087 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. చిన్న, మధ్య తరహా షేర్లలో భారీ అమ్మకాలు తలెత్తాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ సూచీలు వరుసగా 3.42%, 3.12% చొప్పున నష్టపోయాయి.

- ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీల మార్కెట్‌ విలువ బుధవారం ఒక్కరోజే రూ.8.91 లక్షల కోట్ల సంపద తగ్గి రూ.350 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- సెన్సెక్స్‌ సూచీ 30 షేర్లలో ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌(0.19%) మినహా మిగిలిన 29 షేర్లూ 4% వరకు నష్టపోయాయి.
- రంగాల వారీగా యుటిలిటీ 4.65%, టెలికం 4.36%, విద్యుత్‌ 4.33%, సర్వీసెస్‌ 4.20%, మెటల్, కమోడిటీ, పారిశ్రామిక, క్యాపిటల్‌ గూడ్స్‌ రంగాలు 3.50% వరకు నష్టపోయాయి.
- ప్రభుత్వరంగ బ్యాంక్‌ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. యూకోబ్యాంక్‌ 10.50%, ఐఓబీ 10%, సెంట్రల్‌ బ్యాంక్‌ 8%, పీఎస్‌బీ, పీఎస్‌బీ, బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా షేర్లు 5% పతనయ్యాయి. ఇండియన్‌ బ్యాంక్, బీఓబీ షేర్లు 4–3% పడ్డాయి. ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్‌ ఇండెక్స్‌ ఈ ఏడాదిలో అత్యధికంగా 4% క్రాష్‌ అయ్యింది.

ఇవీ నష్టాలకు కారణాలు

లాభాల స్వీకరణ

విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల ప్రోద్బలంతో దేశీయ ఈక్విటీ మార్కెట్‌ గత నెల రోజుల్లో ఏకంగా 7.2% లాభపడింది. పలు రంగాల షేర్లు అధిక వాల్యుయేషన్ల వద్ద ట్రేడవుతున్నాయి. సాంకేతిక చార్టులు 'అధిక కొనుగోలు' సంకేతాలను సూచిస్తున్నాయి. వరుస ర్యాలీతో గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ అనివార్యమైందని మార్కెట్‌ నిపుణులు తెలిపారు.

మళ్లీ కరోనా భయాలు...

దేశవ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 614 కరోనా కేసులు నమోదయ్యాయి. కేరళలో కోవిడ్‌ 19 సబ్‌ వేరియంట్‌ జేఎన్‌.1కి సంబంధించి 292 కేసులు నమోదయ్యాయి. ముగ్గురు మృతి చెందారు. కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ పరిణామాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేశాయి.

ఎర్ర సముద్రం వద్ద ఉద్రిక్తతలు

ప్రపంచంలో ముఖ్య నౌకా మార్గాల్లో ఒకటైన ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీ తిరుగుబాటుదారులు దాడులు చేస్తుండడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. అనేక వాణిజ్య సంస్థలు ఆ మార్గం ద్వారా తమ నౌకలు వెళ్లకుండా నిలుపుదల చేశాయి. ఈ నేపథ్యంలో ముడిచమురు ధరలు మరింత పెరిగే వీలున్నందున ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు.

దుమ్మురేపిన డోమ్స్‌..



డోమ్స్‌ ఇండస్ట్రీస్‌ లిస్టింగ్‌ హిట్‌ అయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.790)తో పోలిస్తే 77% ప్రీమియంతో రూ.1,400 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 82% ర్యాలీ చేసి రూ.1,434 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివర్లో స్వల్ప లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 68% లాభంతో రూ.1,331 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.8,077 కోట్లుగా నమోదైంది. కాగా, ఇండియా షెల్టర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ లిస్టింగ్‌ పర్వాలేదనిపించింది. బీఎస్‌ఈ ఇష్యూ ధర (రూ.493)తో పోలిస్తే 12% ప్రీమియంతో రూ.613 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 27% ర్యాలీ చేసి రూ.625 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని వద్ద తాకింది. చివరికి 10% లాభంతో రూ.544 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.5,818 కోట్లుగా నమోదైంది.

ప్రాథమిక మార్కెట్లో ఐపీఓ 'రష్‌'

గడిచిన నెల రోజుల్లో ప్రధాన విభాగం నుంచి 11 కంపెనీలతో సహా అనేక చిన్న, మధ్య తరహా స్థాయి కంపెనీలు నిధుల సమీకరణకు సిద్ధమయ్యాయి. ఈ పబ్లిక్‌ ఇష్యూల్లో పాల్గొనేందుకు అవసరమైన లిక్విడిటీ(ద్రవ్య)ని పొందేందుకు హెచ్‌ఎన్‌ఐలు, రిటైల్‌ ఇన్వెస్టర్లు షేర్ల అమ్మకాలకు పాల్పడంతో సెకండరీ మార్కెట్‌ ఒత్తిడికి లోనై ఉండొచ్చని స్టాక్‌ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎంబసీ రీట్‌ నుంచి బ్లాక్‌స్టోన్‌ ఔట్‌

- 23.5 శాతం వాటా విక్రయం
- డీల్‌ విలువ రూ. 7,100 కోట్లు

న్యూఢిల్లీ: లిస్టెడ్‌ సంస్థ ఎంబసీ ఆఫీస్‌ పార్క్స్‌ రియల్‌ ఎస్టేట్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ట్రస్ట్‌(రీట్‌) నుంచి గ్లోబల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌ వైదొలగినట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. ఓపెన్‌ మార్కెట్‌ లావాదేవీల ద్వారా ఎంబసీ ఆఫీస్‌ పార్క్స్‌ రీట్‌లో తమకుగల మొత్తం 23.5 శాతం వాటాను విక్రయించినట్లు వెల్లడించాయి. ఒక్కో షేరుకి రూ. 316 సగటు ధరలో వాటా విక్రయాన్ని చేపట్టినట్లు తెలిపాయి. బుధవారం ముగింపు ధర రూ. 331తో పోలిస్తే ఇది 5 శాతం డిస్కౌంట్‌కాగా.. తద్వారా బ్లాక్‌స్టోన్‌ రూ. 7,100 కోట్లు సమకూర్చుకున్నట్లు అంచనా. ఈ బ్లాక్‌డీల్స్‌లో ఏడీఐఏసహా ప్రస్తుత యూనిట్‌ హోల్డర్లు, ఎస్‌బీఐ ఎంఎఫ్‌ తదితర కొత్త ఇన్వెస్టర్లు షేర్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బ్లాక్‌స్టోన్, ఎంబసీ గ్రూప్‌ సంయుక్తంగా ప్రమోట్‌ చేసిన ఎంబసీ ఆఫీస్‌ పార్క్స్‌ దేశీయంగా స్టాక్‌ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన తొలి రీట్‌గా నిలుస్తున్న సంగతి తెలిసిందే. 2019లో చేపట్టిన ఐపీవోలో భాగంగా రూ. 5,000 కోట్ల సమీకరణ ద్వారా లిస్టయ్యింది. సంస్థలో దేశీ ఎంబసీ గ్రూప్‌నకు సుమారు 8 శాతం వాటా ఉంది.

కార్వీ కేసులో బ్యాంకులకు ఊరట

- ఎన్‌ఎస్‌డీఎల్, ఎన్‌ఎస్‌ఈ, సెబీల నుంచి రూ.1,400 కోట్లు రాబట్టుకునే వెసులుబాటు

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: కార్వీ స్టాక్‌ బ్రోకింగ్‌ కేసులో బ్యాంకింగ్‌కు అనుకూలంగా సెక్యూరిటీస్‌ అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ (శాట్‌) బుధవారం కీలక ఉత్తర్వులు వెలువరించింది. సెక్యూరిటీస్‌ అండ్‌ ఎక్స్ఛేంజ్‌ బోర్డ్‌ ఆఫ్‌ ఇండియా (సెబీ), నేషనల్‌ స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌ (ఎన్‌ఎస్‌ఈ) నేషనల్‌ సెక్యూరిటీస్‌ డిపాజిటరీ లిమిటెడ్‌ (ఎన్‌ఎస్‌డీఎల్‌)లు సంయుక్తంగా బ్యాంకులకు కార్వీ తాకట్టు పెట్టిన షేర్‌లను తిరిగి ఇవ్వాలని లేదా బ్యాంకులకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కార్వీ రుణదాతలకు (బ్యాంకులకు) ఎన్‌ఎస్‌డీఎల్, ఎన్‌ఎస్‌ఈ, సెబీలు వార్షికంగా 10 శాతం వడ్డీసహా షేర్ల విలువ రూ. 1,400 కోట్ల పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

కేసు వివరాల్లోకి వెళితే...

క్లయింట్‌ సెక్యూరిటీలను కార్వీ స్టాక్‌ బ్రోకింగ్‌ దుర్వినియోగం చేసినట్లు సెక్యూరిటీస్‌ ఎక్స్ఛేంజ్‌ బోర్డ్‌ ఆఫ్‌ ఇండియా (సెబీ) 2019లో ధ్రువీకరించింది. బ్యాంకుల వద్ద రూ.2,300 కోట్లకుపైగా విలువైన ఖాతాదారుల సెక్యూరిటీలను స్టాక్‌ బ్రోకర్‌ తాకట్టు పెట్టినట్లు పేర్కొంది. అయితే తాము బ్రోకరేజ్‌ సంస్థకు ఇచ్చిన రుణాలకుగాను (ప్లెడ్జ్‌ ఆధారంగా) ఈ తనఖా షేర్లను సర్దుబాటు చేసుకుంటామని యాక్సిస్‌ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్‌ బ్యాంక్, బజాజ్‌ ఫైనాన్స్‌ సెబీని అభ్యర్థించాయి. అయితే దీనిని సెబీ తిరస్కరించింది. తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను బ్యాంకులకు బదిలీ చేయవద్దని రెగ్యులేటర్‌ డిపాజిటరీని ఆదేశించిన సెబీ, ఈ షేర్లను తిరిగి క్లయింట్‌ ఇన్వెస్టర్లకు బదిలీ చేయాలని డిపాజిటరీని ఆదేశించింది. దీనితో రుణదాతలు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. ట్రిబ్యునల్‌లో తాజాగా రెండు వేర్వేరు రూలింగ్‌ ఇస్తూ, సెబీ ఆదేశాలను తప్పుపట్టింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్‌ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

ఐడీబీఐలో.. స్పెషలిస్ట్‌ ఆఫీసర్‌

గ్రూప్‌ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకు.. ఇండస్ట్రియల్‌ డెవలప్‌మెంట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఐడీబీఐ).. పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా మొత్తం 86 స్పెషలిస్ట్‌ ఆఫీసర్‌ (ఎస్‌ఓ) పోస్టులకు ప్రకటన విడుదల చేసింది. రాత పరీక్ష లేకుండానే ఈ ఉద్యోగాలకు ఎంపిక కావచ్చు. గ్రూప్‌ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

బ్యాంకు వినియోగదారులకు అందించే సేవలను సులభతరం చేయడంతోపాటు, లావాదేవీలను సౌకర్యవంతం చేయడం స్పెషలిస్ట్‌ ఆఫీసర్ల విధి. మార్కెటింగ్, ఏటీఎం, ట్రేడ్‌ ఫైనాన్స్, ట్రెజరర్, సెక్యూరిటీ, డేటా అనలిస్ట్‌ తదితర విభాగాల కింద వీరు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 86

- » **పోస్టుల వివరాలు:** మేనేజర్‌–గ్రేడ్‌ బి–46 పోస్టులు, అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ (ఏజీఎం)–గ్రేడ్‌ సి–39 పోస్టులు, డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ (డీజీఎం)–గ్రేడ్‌ డి–01.
- » **అర్హత:** ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, ఎంబీఏ, సీఎఫ్‌ఏ, ఎఫ్‌ఆర్‌ఎం, ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.



- » **వయసు:** 01.11.2023 నాటికి మేనేజర్‌ పోస్టులకు 25–35 ఏళ్లు, అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ 28–40 ఏళ్లు, డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ పోస్టులకు 35–45 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనాలు:** డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌కు రూ.76,010–రూ.89,890. అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌కు రూ.63,840–రూ.78,230. మేనేజర్‌కు రూ.48,170–రూ.69,810.

ఎంపిక ఇలా

ప్రిలిమినరీ స్క్రీనింగ్‌ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడతారు.ఆన్‌లైన్‌లో పంపించిన దరఖాస్తుల్లోని విద్యార్హతలు,పని అనుభవం, ఇతర వివరాల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్టింగ్‌ చే స్తారు. షార్ట్‌లిస్ట్‌ చేసిన వారిని గ్రూప్‌ డిస్కషన్‌(జీడీ)/పర్సనల్‌ ఇంటర్వ్యూకి పిలుస్తారు. పర్సనల్‌ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
- » ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేదీ: 25.12.2023
- » వెబ్‌సైట్‌: https://www.idbibank.in

గ్రూప్‌–2పై గురిపెట్టండిలా!

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగార్థులకు.. ముఖ్యంగా గ్రూప్స్‌ అభ్యర్థులకు వరుస నోటిఫికేషన్లు స్వాగతం పలుకుతున్నాయి! ఇప్పటికే గ్రూప్‌-1 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన ఏపీపీఎస్సీ.. తాజాగా గ్రూప్‌-2 నోటిఫికేషన్‌ను సైతం ప్రకటించింది. మొత్తం 897 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. సర్కారీ కొలువులు కోరుకునే గ్రాడ్యుయేట్లకు ఇది సువర్ణావకాశం. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్‌-2 నోటిఫికేషన్‌ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్‌ తదితర వివరాలు..

- » గ్రూప్‌-2 నోటిఫికేషన్‌ విడుదల చేసిన ఏపీపీఎస్సీ
- » మొత్తం 897 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
- » స్క్రీనింగ్‌ టెస్ట్, మెయిన్‌ ఎగ్జామ్, సీపీటీ ఆధారంగా ఎంపిక
- » 2024, ఫిబ్రవరి 25న స్క్రీనింగ్‌ టెస్ట్‌ నిర్వహణ
- » బ్యాచిలర్‌ డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం



మొత్తం 897 పోస్టులు

ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 నోటిఫికేషన్‌ ద్వారా మొత్తం 897 పోస్టుల భర్తీ చేపట్టనుంది. ఇందులో 331 ఎగ్జిక్యూటివ్‌ పోస్టులు, 566 నాన్‌–ఎగ్జిక్యూటివ్‌ పోస్టులు ఉన్నాయి. వీటికి సంబంధించి తొలి దశ స్క్రీనింగ్‌ టెస్ట్‌ ఫిబ్రవరి 25న నిర్వహించనున్నారు.

ఎంపిక ప్రక్రియ

గ్రూప్‌–2 పోస్టుల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నారు. తొలి దశలో స్క్రీనింగ్‌ టెస్ట్, తర్వాత దశలో మెయిన్‌ పరీక్ష ఉంటాయి. ఈ రెండు పరీక్షలు కూడా ఆబ్జెక్టివ్‌ విధానంలోనే జరుగుతాయి. మెయిన్‌లో మెరిట్‌ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు కంప్యూటర్‌ ప్రొఫిషియన్సీ టెస్ట్‌ ఉంటుంది. ఇందులో అర్హత సాధిస్తేనే గ్రూప్‌2 కొలువు ఖరారవుతుంది.

150 మార్కులకు స్క్రీనింగ్‌ టెస్ట్‌

ఎంపిక ప్రక్రియ తొలి దశలో స్క్రీనింగ్‌ టెస్ట్‌ ఒకే పేపర్‌గా 150 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్షను జనరల్‌ స్టడీస్‌ అండ్‌ మెంటల్‌ ఎబిలిటీ అంశాలపై మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు నిర్వహిస్తారు.

రెండో దశలో మెయిన్‌

- స్క్రీనింగ్‌ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. రిజర్వేషన్‌ వర్గాల వారీగా ఒక్కో పోస్ట్‌కు 50 మందిని చొప్పున రెండో దశ మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్‌ పరీక్షను రెండు పేపర్లుగా 300 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్‌ 1లో 150 మార్కులకు రెండు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌ 1లో సోషల్‌ హిస్టరీ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌ (ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు), సెక్షన్‌ 2లో భారత రాజ్యాంగం సమీక్షపై ప్రశ్నలు అడుగుతారు.
- అదేవిధంగా పేపర్‌ 2లోనూ 150 మార్కులకు రెండు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌–1లో భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ; సెక్షన్‌–2లో సైన్స్‌ అండ్‌ టెక్నాలజీపై ప్రశ్నలు ఎదురవుతాయి.
- ప్రతి పేపర్‌లోనూ ఒక్కో సెక్షన్‌ నుంచి 75 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. పరీక్షను ఓఎంఆర్‌ లేదా కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్‌ విధానంలో ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. నెగిటివ్‌ మార్కుల విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కులను తగ్గిస్తారు.

మెయిన్స్‌.. మారిన విధానం

గ్రూప్‌–2 తాజా నోటిఫికేషన్‌ ప్రకారం–మెయిన్‌ పరీక్షలో మార్పులు చేశారు. గతంలో మూడు పేపర్లుగా 450 మార్కులకు మెయిన్‌ను నిర్వహించేవారు. ఇప్పుడు దాన్ని రెండు పేపర్లకు మార్చారు. తాజా విధానం ఫలితంగా అభ్యర్థులపై ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు.

కంప్యూటర్‌ ప్రొఫిషియన్సీ టెస్ట్‌

గ్రూప్‌–2 అభ్యర్థులకు చివరగా కంప్యూటర్‌ ప్రొఫిషియన్సీ టెస్ట్‌ ఉంటుంది. మెయిన్‌ పరీక్షలో అర్హత పొందిన వారిని 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసి.. కంప్యూటర్‌ ప్రొఫిషియన్సీ టెస్ట్‌ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌ను 100 మార్కులకు నిర్వహించే అవకాశం ఉంది. అభ్యర్థులకు కంప్యూటర్‌ ఆపరేటింగ్‌పై ఉన్న పరిజ్ఞానాన్ని, బేసిక్స్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో ఎంఎస్‌ వర్డ్‌లో లెటర్‌ టైపింగ్,ఎంఎస్‌ ఎక్సెల్‌ వినియోగించి టేబుల్స్,గ్రాఫ్స్‌ రూపొందించడం, పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ రూపొందించడం వంటి అంశాలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్‌ దరఖాస్తు తేదీలు: 2023, డిసెంబర్‌ 21–2024, జనవరి 10
- స్క్రీనింగ్‌ టెస్ట్‌ తేదీ: 2024, ఫిబ్రవరి 25
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: https://psc.ap.gov.in

పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్‌

2024, ఫిబ్రవరి 25న గ్రూప్‌2 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంటే.. అభ్యర్థులకు దాదాపు రెండున్నర నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో సిలబస్‌ అంశాలపై పట్టు సాధించేలా పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్‌ సాగించాలి. అందుకోసం ముందుగా సిలబస్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి.

కాన్సెప్ట్స్‌ + సమకాలీనం

ఆయా సబ్జెక్టుల సిలబస్‌ టాపిక్స్‌ను సమకాలీన అంశాలతో సమన్వయం చేసుకుంటూ.. డిస్క్రిప్టివ్‌ విధానంలో ప్రిపరేషన్‌ సాగించాలి. తద్వారా కోర్‌ సబ్జెక్ట్‌పై పట్టుతోపాటు సమకాలీన పరిస్థితుల్లో అన్వయించే నైపుణ్యం కూడా లభిస్తుంది. అభ్యర్థులు సిలబస్‌ అంశాలకు లభిస్తున్న వెయిటేజీని పరిశీలించాలి.పరీక్ష కోణంలో ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించే నైపుణ్యం పెంచుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌లలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అంశాలను గుర్తించాలి.

విశ్లేషణాత్మకంగా

ఆయా సిలబస్‌ అంశాలను చదివేటప్పుడు విశ్లేషణాత్మక దృక్పథాన్ని అనుసరించాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహనతోపాటు విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి.

పథకాలపై పట్టు

ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. ముఖ్యంగా నవరత్నాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్‌ కేటాయింపులు, ఇప్పటివరకు లబ్ధి పొందిన వారి సంఖ్య తదితర వివరాలను అవపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఆర్థిక విధానాలు, వాటి ద్వారా కలిగిన అభివృద్ధిపై దృష్టి సారించాలి. దీంతోపాటు జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యా విధానం, ఇటీవల కాలంలో కీలకమైన తీర్పుల గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలి.

సబ్జెక్ట్‌లు.. కీలక అంశాలు

- హిస్టరీలో.. రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ.. ముఖ్యమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్‌ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. ఇదే విధంగా భారతదేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.
- **జాగ్రఫీలో..** రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. అదే విధంగా చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్టులు.. వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **పాలిటీలో..** రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాలు (రాజ్యాంగ సవరణలు, వాటి ప్రభావం) తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్‌ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజాసేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా, సివిల్, క్రిమినల్‌ లా, కార్మిక చట్టాలు, సైబర్‌ చట్టాలు, ట్యాక్స్‌ లాస్‌ గురించి తెలుసుకోవాలి.
- **ఎకానమీలో..** మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటిద్వారా లబ్ధి చేకూరే వర్గాలు; జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్‌ సర్వేలపై అవగాహన పొందాలి.
- **సైన్స్‌ అండ్‌ టెక్నాలజీకి** సంబంధించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్‌ స్పేస్‌ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గురుకులాల్లో (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎల్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీఆర్‌ఈఐఎస్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి (ఇంగ్లిష్‌ మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి 2023–24 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధిత జిల్లాలోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి.
- » **వయసు:** ఓసీ, బీసీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఆదాయ పరిమితి:** విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతం రూ.1,50,000, పట్టణ ప్రాంతం రూ.2,00,000 మించకూడదు.
- » **ప్రవేశ పరీక్ష:** ప్రవేశపరీక్ష ఆబ్జెక్టివ్‌ పద్ధతిలో ఓఎంఆర్‌ షీట్‌ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం తెలుగు/ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. తెలుగు(20 మార్కులు), ఇంగ్లిష్‌(25 మార్కులు), మ్యాథ్స్‌(25 మార్కులు), మెంటల్‌ ఎబిలిటీ(10 మార్కులు), పరిసరాల విజ్ఞానం(20 మార్కులు) సబ్జెక్టుల్లో నాలుగో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
- » **ఎంపిక విధానం:** అర్హులైన అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్‌ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 18.12.2023.
- » **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 06.01.2024.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 11.02.2024.
- » **వెబ్‌సైట్‌:** http://tswreis.ac.in or http://tgcet.cgg.gov.in.

చిన్నపల్లెపై చిన్నచూపు!

రాష్ట్రంలో అతి తక్కువ ఓటర్లున్న దొంగతోగు గ్రామ పంచాయతీపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టు

ఊరిలో 108 మంది జనాభా... 69 మంది ఓటర్లు.. ప్రాథమిక పాఠశాల.. ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు ఏడుగురే విద్యార్థులు.. ఒక్కరే మాస్టారు.. ఊరికి ఒకవైపు కిన్నెరసాని, మరో వైపు వాగులు.. వర్షాకాలమైతే ఊరు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. సమీపంలోని కాస్త పెద్ద ఊరికి వెళ్లాలంటే ఆరు కిలోమీటర్ల మేర గతుకులు, బురద రోడ్డు దాటాలి. ఇది దాటేందుకు కనీసంగా గంటన్నర సమయం పడుతుంది. గుండెపోటుకు గురైతే రోడ్డు దాటే లోపు మృత్యువాత పడటమే.. అసలు ఇంతవరకు అంబులెన్స్ ఆ గ్రామానికి ఒక్కసారి కూడా రాలేదంటే పరిస్థితిని ఊహించుకోవచ్చు.

రాష్ట్రంలోనే అతి చిన్న గ్రామ పంచాయతీ 'దొంగతోగు' దుస్థితి ఇది. గ్రామంలో మద్యం విక్రయాలు లేకుండా అంతా ఏకతాటిపై ఉన్న ఆ ఏజెన్సీ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మళ్లీ పంచాయతీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం దొంగతోగు గ్రామ పంచాయతీ దయనీయ స్థితిపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్..


దొంగతోగు గ్రామం

(సాక్షిప్రతినిధి, ఖమ్మం)

పాలనా సౌలభ్యం కోసం గుండాల గ్రామ పంచాయతీలో భాగంగా ఉన్న దొంగతోగు 2018లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. కేవలం 80 మంది జనాభా, 35 మంది ఓటర్లతో రాష్ట్రంలోనే అతి చిన్న గ్రామ పంచాయతీగా ఏర్పాటైనా నేటికీ సమస్యలు సమసిపోలేదు. తొలి పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆదర్శంగా నిలిచినా ప్రభుత్వ ప్రోత్సాహకం మాత్రం అందలేదు. వర్షం వస్తే కిన్నెరసానికి వరదతో వాగులు.. వంకలు పొంగిపొర్లడం, కనీస రహదారి సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు అక్కడ నిత్యకృత్యం.

మండల కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరం

గుండాల నుంచి ఇక్కడికి 18 కిలోమీటర్లు కాగా, ఆళ్లపల్లికి 40 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. వాగులు పొంగిపొర్లితే ఇక్కడికి చేరుకోవడం కష్టం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆళ్లపల్లి మండలంలో ఈ గ్రామాన్ని కలిపినా దూరాభారంతో ఆ మండల కేంద్రం వైపు కూడా గ్రామస్తులు వెళ్లడం లేదు.

పాలనా కేంద్రంగా బడి..

గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ నిర్మాణానికి ఐటీడీఏ నుంచి రూ.16 లక్షలు మంజూరైనా ఇప్పటికీ పునాది పడలేదు. దీంతో పాఠశాల భవనంలోనే పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాలు పడితే ఈ బడికి చేరుకునేందుకు ఉన్న ఏకైక ఉపాధ్యాయుడు సాహసం చేయాల్సిందే. ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులు కూడా రాకపోవడంతో ఆ పల్లె అభివృద్ధికి నోచుకోలేదు. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించినా వరదలతో పైపులైన్లు ధ్వంసమై ఏడాదిగా గ్రామానికి తాగునీరు రావడం లేదు.

ఆరు కిలోమీటర్లు.. అవస్థలు..

దొంగతోగు సమీపంలోని ముత్తాపురం నుంచి ఇక్కడికి ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలి. ఎందుకంటే వర్షం వస్తే పొంగే వాగులు, వంకలు, గుంతల మయంగా ఉన్న ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే కనీసం రెండు గంటలు పడుతుంది. గ్రామం నుంచి గర్భిణులు, అస్వస్థతకు గురైన వారు వైద్యం కోసం గుండాల ఆస్పత్రికి వెళ్లాలంటే నరకం చూడాల్సిందే. రెండు నెలల క్రితం గుండెపోటుకు గురైన ఓ వ్యక్తిని ఈ దారిలో ట్రాక్టర్‌పై గుండాలకు, అక్కడి నుంచి కొత్తగూడెం తీసుకెళ్లే సరికే మృతి చెందాడు. రోడ్డు లేకపోవడంతో ఇప్పటివరకు ఒక్కసారి కూడా అంబులెన్స్ రాలేదు.

గ్రామ ప్రొఫైల్

- గ్రామ పంచాయతీ: దొంగతోగు (రాష్ట్రంలో అతి చిన్నది)
- 2018లో గుండాల పంచాయతీ నుంచి వీడి నూతన పంచాయతీగా ఏర్పాటు.
- తొలుత 35 మంది ఓటర్లు
- ఇటీవల అసెంబ్లీ ఎన్నికల జాబితా ప్రకారం 69 మంది ఓటర్లు.
- మొత్తం ఓటర్లలో పురుషులు 36, స్త్రీలు 33 మంది
- మొత్తం జనాభా : 108 మంది
- పురుషులు : 44, స్త్రీలు : 64 మంది

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల నిధుల కింద ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరైనా అటవీ శాఖ అనుమతి లభించలేదు. ఇటీవల రెండు కిలోమీటర్లకు అనుమతి రాగా, పనులు ప్రారంభమయ్యాయి.

మద్యం అమ్మకుండా..

గ్రామంలో 27 కుటుంబాలున్నాయి. అంతా పోడు వ్యవసాయం చేస్తుంటారు. వర్షాధారంగా వరి, మొక్కజొన్న, పత్తి, కంది పంటలు సేద్యమవుతున్నాయి. పోడు పట్టాలు రావడంతో వారి ఖాతాల్లో వానాకాలం రైతుబంధు డబ్బు పడింది. ఆదివాసీ కుటుంబాలన్నీ ఏకగ్రీవంగా సర్పంచ్‌ని ఎన్నుకున్నట్లే.. గ్రామంలో మద్యం అమ్మకూడదని ఏకగ్రీవంగా తీర్మానించారు. సర్పంచ్, నలుగురు వార్డు సభ్యులు ఉన్నారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు వస్తుండడంతో సందడి నెలకొనాల్సిన ఈ గ్రామంలో పాత కష్టాలే కళ్లముందు కనిపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొత్త పంచాయతీ అయితే రోడ్డు, మంచినీటి వసతి, కొత్త పంచాయతీ భవనం వస్తాయనుకున్న వారి ఆశలు నెరవేరలేదు.

రోడ్డే ప్రధాన ఇబ్బంది..



ముత్తాపురం నుంచి రోడ్డు పడితేనే మా గ్రామ సమస్యలు తీరుతాయి. పైపులైన్లు ధ్వంసం కావడంతో ట్యాంకు నుంచి మంచినీళ్లు రావడం లేదు. పంచాయతీకి ఇచ్చిన చిన్న ట్రాక్టర్ రిపేరు వచ్చినా చేయించలేకపోతున్నాం. నిధులు లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది.

– కొమరం బాయమ్మ, సర్పంచ్, దొంగతోగు

రోడ్డు ఉంటే ప్రాణం దక్కేది..



నా భర్త అక్టోబర్ 20న గుండెపోటుతో చనిపోయాడు. గుండె నొప్పి వస్తే బండి మీద గుండాల తీసుకెళ్లాం. అక్కడి నుంచి కొత్తగూడెం తీసుకెళ్లమన్నారు. అక్కడ వైద్యం పొందుతూ చనిపోయిండు. ఆరు కిలోమీటర్ల రోడ్డుపై గంటకు పైగా ప్రయాణించి గుండాల వేళ్లే సరికి నొప్పి ఎక్కువైంది. అదే రోడ్డు బాగుంటే త్వరగా ఆస్పత్రికెళ్తే ప్రాణాలు దక్కేవి. గర్భిణులను మొన్నటివరకు ఎడ్ల బండిపై తీసుకెళ్లారు. ఇప్పుడు ట్రాక్టర్లలో ఆస్పత్రికి తీసుకెళ్తున్నాం.

–పూణె అనంతలక్ష్మి, దొంగతోగు

క్లుప్తంగా...



బలరామునిగా భద్రాచల రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు బుధవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా బేడా మండపంలో ఆళ్వార్లతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులకు వేదపండితులు 200 పాశురాల దివ్యప్రబంధాన్ని పఠించారు. అనంతరం బలరామావతారంలో అలంకరించిన స్వామివారిని పల్లకిసేవగా మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకెళ్లి కొలువుదీర్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. స్వామివారికి నివేదన, హారతి సమర్పించారు. భక్తుల సందర్శనానంతరం కోలాటాలు, మేళతాళాల నడుమ తిరిగి ఆలయంలోకి తీసుకెళ్లారు. కాగా, శుక్రవారం పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం, శనివారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

సీమ లిఫ్టు పనులను అడ్డుకోండి

- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను కొనసాగించడంపై తెలంగాణ రాష్ట్రం అభ్యంతరం తెలిపింది. తక్షణమే క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టును సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, ఎన్జీటీ ఆదేశాల మేరకు నిర్మాణ పనులు కొనసాగకుండా అడ్డుకోవాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ బుధవారం కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. అనుమతుల్లేకుండా రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను కొనసాగించడం కృష్ణా ట్రిబ్యునల్–1 అవార్డుతో పాటు రాష్ట్ర పునర్విభజన చట్టాలకు వ్యతిరేకమని లేఖలో తప్పుబట్టారు.

జనవరి 15 వరకు హజ్ దరఖాస్తు గడువు పెంపు

- హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి షఫీవుల్లా

సాక్షి, హైదరాబాద్: హజ్ యాత్ర–2024కు దరఖాస్తుల స్వీకరణ గడువును వచ్చే జనవరి 15వ తేదీ వరకు పెంచినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.షఫీవుల్లా తెలిపారు. కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ నిర్ణయం మేరకు రాష్ట్రం నుంచి 2024 హజ్‌యాత్ర కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఈ అవకాశం కల్పించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ యాత్రకు ఈ నెల 4 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అయితే దరఖాస్తుదారుల నుంచి వచ్చిన స్పందనతోపాటు కొంతమందికి ఇంకా పాస్‌పోర్టులు అందకపోవడంతో గడువు పెంచారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 5 వేల దరఖాస్తులు అందినట్లు తెలిపారు. హజ్ యాత్రికుల సౌకర్యార్థం నాంపల్లి హజ్‌హౌస్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, జిల్లాల్లో హజ్ సొసైటీల కార్యాలయాల్లో దరఖాస్తులకు ఆన్‌లైన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై నేడు బీజేపీ నిరసనలు

సాక్షి, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై గురువారం మండల, జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ప్రజాస్వామ్యంపై, పార్లమెంటులో జరిగే చర్చలపై కాంగ్రెస్ పార్టీకి, దాని మిత్రపక్షాలకు విశ్వాసంలేదని ఆ పార్టీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు.

ప్రజారోగ్య సంచాలకునిగా రవీంద్రనాయక్

- డీఎంఈగా త్రివేణి



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖకు కొత్త బాస్‌లు వచ్చారు. ప్రజారోగ్య సంచాలకులు (డీహెచ్), వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ)గా కొత్త అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. డీహెచ్‌గా డాక్టర్ రవీంద్ర నాయక్‌ను, డీఎంఈగా డాక్టర్ త్రివేణిని నియమించారు. ఉత్తర్వులు వెలువడిన కొద్ది గంటల్లోనే పాత హెచ్‌వోడీలు రిలీవ్ కాగా, కొత్త అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించారు. కోఠి వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వారిద్దరూ తమ చాంబర్లలో విధులకు హాజరయ్యారు. ఉద్యోగులు, వైద్య సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఐదున్నరేళ్లుగా డీహెచ్‌గా పనిచేసిన డాక్టర్ గడల శ్రీనివాసరావు కరోనాలో తన పనితీరుతో మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తారన్న ప్రచారం జరిగింది. డీఎంఈగా పనిచేసిన డాక్టర్ రమేశ్‌రెడ్డి దాదాపు ఏడేళ్లు అదే పోస్టులో కొనసాగారు.

బురదలో పడుకుని సర్పంచ్ నిరసన

- పంచాయతీ స్థలం కబ్జాకు గురైనా చర్యలు లేవని ఆరోపణ
- మంత్రి దుద్దిళ్ల హామీతో ఆందోళన విరమణ



ముత్తారం (మంథని): శ్మశానవాటిక, హరితహారం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కబ్జాచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం లేదంటూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సీతంపేట సర్పంచ్ పులిపాక నరేశ్ పొలంలోని బురదలో పడుకుని నిరసన తెలిపారు. సీతంపేటలో పల్లెప్రకృతి వనం కోసం ఎకరం, శ్మశానవాటిక కోసం పది గుంటలు, హరిత హారానికి అవసరమైన నర్సరీ కోసం ఐదు గుంటలను అధికారులు గ్రామపంచాయతీకి గతంలో కేటాయించారు. దీంతోపాటు మరికొంత స్థలం అక్కడే ఖాళీగా ఉంది. ఈ స్థలానికి సమీపంలోనే గ్రామానికి చెందిన అన్నం రాయమల్లు పొలం ఉంది. శ్మశానవాటిక, నర్సరీ, పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిన భూమి తనదేనంటూ రాయమల్లు దానిని ఇటీవల కబ్జా చేశాడు. మొక్కలు ధ్వంసం చేసి ఈ యాసంగిలో పొలం దున్నడం ప్రారంభించాడు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు, తహసీల్దార్‌కు సర్పంచ్ ఫిర్యాదుచేశారు. అయినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో ప్రభుత్వం కేటాయించిన భూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలని, కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో బుధవారం నగేశ్ కబ్జాకు గురైన పొలంలోని బురదలో పడుకుని నిరసన తెలిపాడు. భూమి స్వాధీనం చేసుకోకుంటే ఇక్కడే చనిపోతానని భీష్మించుకు కూర్చున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై మధుసూదన్‌రావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీఐ సతీశ్, రెవెన్యూ అధికారులతో మాట్లాడించినా నగేశ్ ఆందోళన విరమించలేదు. నాయబ్ తహసీల్దార్ ఉదయ్, ఆర్ఐ శ్రీధర్ అక్కడకు చేరుకోగా.. 'మీ అండతోనే భూమి కబ్జా అవుతోంది, రాయమల్లుకు చెందిన భూమి అయితే ప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఎందుకు కేటాయించింది'అని వారిని నిలదీశారు. తగిన న్యాయం చేస్తామని చెప్పిన నాయక్ తహసీల్దార్.. నగేశ్‌ను బురదలోంచి పొలంగట్టుపైకి తీసుకొచ్చారు. సుమారు మూడు గంటలకుపైగా ఆందోళన కొనసాగింది. చివరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అదనపు కలెక్టర్ అరుణశ్రీ సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భూమిని గ్రామపంచాయతీకి అప్పగిస్తామని, కబ్జాదారుపై చర్యలకు భరోసా ఇవ్వడంతో సర్పంచ్ ఆందోళన విరమించారు.

రాయమల్లుపై గతంలోనే కేసులు..

పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక, నర్సరీ కోసం కేటాయించిన భూమి తనదేనంటూ అన్నం రాయమల్లు పది గుంటలు కబ్జాచేసి చదును చేశాడు. దీనిపై అక్టోబర్ 3న ఒకసారి, అదేనెల 28న పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్ ఫిర్యాదు చేశారు. రాయమల్లుపై అప్పట్లోనే రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

ఒరిజినల్ ధ్రువపత్రం చూపితేనే ఉచిత ప్రయాణం

- జిరాక్స్ ప్రతులు, ఫోన్‌లో ఫొటో చూపితే అనుమతించబోం
- స్పష్టంచేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ వసతి కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలకే వర్తిస్తుందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. రాష్ట్రానికి చెందిన వారుగా ధ్రువీకరించే ఫొటోతో కూడిన ధ్రువపత్రం ఒరిజినల్ కాపీని చూపితేనే జీరో టికెట్ జారీ చేస్తారని స్పష్టంచేశారు. జిరాక్స్ ప్రతులు, ఫోన్‌లో ఫొటోను చూపితే అనుమతించబోమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు కచ్చితంగా చార్జీ చెల్లించి టికెట్ పొందాల్సిందేనని సజ్జనార్ తెలిపారు. ధ్రువపత్రంలో పాత ఫొటోలు, అస్పష్టంగా ఫొటోలు ఉన్నవారు వాటిని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ పథకానికి అనూహ్య స్పందన వస్తోందని, ప్రారంభమైన 11 రోజుల్లోనే 3 కోట్ల మంది మహిళలు ప్రయాణించినట్లు వెల్లడించారు. రోజూ సగటున 30 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని, ఓఆర్ 88 శాతానికి చేరిందని, కొన్ని డిపోలు 100 శాతాన్ని సాధిస్తున్నాయని పేర్కొన్నారు. నాలుగైదు నెలల్లో 2,050 కొత్త బస్సులు విడతలవారీగా సమకూరుతాయని, వాటిల్లో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు కూడా ఉన్నాయని వివరించారు. ప్రయాణికులు ప్రమాదకర రీతిలో బస్సుల్లో ప్రయాణించొద్దని హెచ్చరించారు.

బిగ్‌బాస్ సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్ అరెస్టు

- ప్రభుత్వ ఆస్తుల దాడి కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అతని సోదరుడు మనోహర్ కూడా...
- కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు
- వాహనాలు నడిపిన డ్రైవర్లకు 14 రోజుల రిమాండ్


పల్లవి ప్రశాంత్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్ (హైదరాబాద్)/ గజ్వేల్: అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద ప్రభుత్వ ఆస్తులపై జరిగిన దాడి ఘటనలో ఏ–1, ఏ–2 నిందితులుగా ఉన్న బిగ్ బాస్ సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్, అతని సోదరుడు మనోహర్‌ను బుధవారం రాత్రి వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూరులో పోలీసులు అరెస్టు చేశారు. వీరిని అర్ధరాత్రి తర్వాత న్యాయమూర్తి ముందు హాజరు పరిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. మరోవైపు జూబ్లీహిల్స్ ఎస్ఎస్ఐ మెహర్ రాకేశ్ ఫిర్యాదు మేరకు దాడి ఘటనలో ప్రమేయమున్న నరేందర్, అతని స్నేహితుడు వినయ్, కారు డ్రైవర్లు సాయికిరణ్, ఎ.రాజుపై కేసు నమోదు చేశారు. అందులో సాయికిరణ్, రాజులను ఈనెల 19న అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరచగా.. వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. అంతకుముందు జూబ్లీహిల్స్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ప్రశాంత్ ఇంటివద్దకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ తల్లిదండ్రులు గొడుగు సత్యనారాయణ, విజయమ్మ, బంధువులు ఆందోళనకు గురయ్యారు. ఈనెల 17న బిగ్‌బాస్ సీజన్ –7 ఫైనల్స్‌లో భాగంగా జూబ్లీహిల్స్ అన్నపూర్ణ స్టూడియోలో షూటింగ్ వద్దకు పల్లవి ప్రశాంత్, రన్నరప్ అమర్‌దీప్ అభిమానులు చేరుకోగా అందులోని కొంతమంది ఆకతాయిలు రాళ్లను తీసుకుని బిగ్‌బాస్ సీజన్ 6 లో పాల్గొన్న గీతూ రాయల్, ప్రస్తుత సీజన్ కంటెస్టెంట్ అశ్విని కార్లను, ఆరు ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

అజ్ఞాతంలోకి వెళ్లలేదు: ప్రశాంత్

తాను అజ్ఞాతంలోకి వెళ్లినట్లు మీడియాలో వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రశాంత్ స్పష్టం చేశారు. అరెస్టుకు ముందు బుధవారం సాయంత్రం తన నివాసంలో తల్లిదండ్రులు గొడుగు సత్యనారాయణ, విజయమ్మలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం తాను ఇంటి వద్ద నుంచి ఎవరికీ చెప్పకుండా పొలం వద్దకు వెళ్లి వచ్చానని, దానికే తాను అజ్ఞాతంలో ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. దాడి ఘటనలో తన ప్రమేయం లేదని, తానెక్కడా అభిమానులను రెచ్చగొట్టలేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తన వల్ల ఇబ్బందులు కలిగినట్లు భావిస్తే పోలీసులకు క్షమాపణ చెబుతున్నానని, అద్దాల ధ్వంసం ఘటనలో వాస్తవాలను బయటపెట్టాలని కోరారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉందాం

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

- ఆసుపత్రుల్లో మాక్‌డ్రిల్ వెంటనే పూర్తవ్వాలి
- మహమ్మారిని ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలి
- మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష


సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ, క్రిస్టినా జడ్ చోంగ్తు

సాక్షి, హైదరాబాద్: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆందోళన పడాల్సిన అవసరంలేదనీ, అయితే అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహమ్మారిని ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కోవిడ్‌కేసుల పెరుగుదల నేపథ్యంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ త్రివేణి, డాక్టర్ శివరామప్రసాద్, ఉస్మానియా, గాంధీ, ఛాతీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ నాగేందర్, డాక్టర్ రాజారావు, డాక్టర్ మహబూబ్ ఖాన్, టీఎస్ఎంఎస్ఐడీసీ సంచాలకులు కౌటిల్య, చీఫ్ ఇంజనీరు రాజేంద్ర కుమార్, స్పెషల్ ఆఫీసర్ రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారన్నారు. జిల్లా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షలు, చికిత్సకు అవసరమైన పరికరాలు, ఔషధాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా కొరత ఉంటే టీఎస్ఎంఎస్ఐడీసీకి ఇండెంట్ పెట్టి, వెంటనే ఆయా వనరులను సమకూర్చుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో మాక్‌డ్రిల్‌ను వెంటనే పూర్తి చేయాలని, ఆస్పత్రుల సన్నద్ధతకు సంబంధించిన వివరాలను కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖకు అందజేయాలని సూచించారు.

ఈ 9 కేసుల్లో తీవ్రమైన లక్షణాలేమీ లేవు: తగినన్ని కరోనా పరీక్షలు నిర్వహించాలని, ఆస్పత్రులు, జిల్లా స్థాయిలో విభాగాధిపతులు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విధిగా నమూనాలను ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)కి పంపాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. శనివారం మరోమారు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి బుధవారం వరకు తొమ్మిది కరోనా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ తొమ్మిది కేసుల్లో తీవ్రమైన లక్షణాలేమీ లేవని, బాధితులంతా హోం ఐసోలేషన్‌లో కోలుకుంటున్నారని పేర్కొన్నారు. గడిచిన 24 గంటల్లో 319 కోవిడ్ పరీక్షలు నిర్వహించగా.. పాజిటివిటీ రేటు 0.31 శాతంగా ఉన్నట్లు తెలిపారు. కోవిడ్ కేసుల టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీట్‌మెంట్‌పై నిఘా పెంచాలని మంత్రి అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో కొత్తగా 6 కరోనా కేసులు

రాష్ట్రంలో బుధవారం మళ్లీ కరోనా కేసులు నమోదయ్యాయి. ఒక్కరోజులో 538 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా అందులో ఆరుగురికి కరోనా వైరస్ సోకినట్లు ప్రజారోగ్య సంచాలకుడు రవీంద్ర నాయక్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన బులెటిన్ విడుదల చేశారు. హైదరాబాద్ నగరంలోనే ఈ ఆరు కేసులు నమోదు కావడం గమనార్హం. ప్రస్తుతం 14 మంది ఆస్పత్రుల్లో లేదా ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. కరోనా మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 8.44 లక్షల కరోనా కేసులు నమోదైనట్లు తెలిపారు. అందులో ఇప్పటివరకు 4,111 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. మిగిలిన వారంతా రికవరీ అయ్యారు.

నందగిరిహిల్స్‌లో వాణిజ్యభవన నిర్మాణంపై కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: నందగిరి హిల్స్‌లోని ప్లాట్ నంబర్ 1లో వాణిజ్య భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)ని హైకోర్టు ఆదేశించింది. మూడు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన అధికారులతో పాటు నిర్మాణ సంస్థ నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

ఇదీ జరిగింది: 'నందగిరిహిల్స్‌లోని ప్లాట్ నంబర్ 1లో నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమంగా భారీ బహుళ వాణిజ్య నిర్మాణాన్ని చేపడుతోంది. కేబీఆర్ జాతీయ పార్కును పర్యావరణ సున్నిత ప్రాంతంగా కేంద్రం ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. వన్యప్రాణి పరిరక్షణలో భాగంగా ఈ పార్కు నుంచి కిలోమీటర్ దూరం వరకు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టరాదని చెప్పింది. ప్లాట్‌ను కొనేటప్పుడు కూడా ఇళ్ల నిర్మాణం కోసమేనని చెప్పిన నిర్మాణ సంస్థ ఇప్పుడు కేబీఆర్ పార్కు నుంచి 30 మీటర్ల దూరంలో 50 అంతస్తుల్లో నిర్మాణం చేపడుతోంది. సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్ కలిపి 5 నుంచి 7 ఫ్లోర్లు, 4 అప్పర్ ఫ్లోర్లు నిర్మిస్తామని 2013లో జీహెచ్ఎంసీ నుంచి అనుమతి తీసుకుంది. 2 లక్షల చదరపు అడుగులకు మించిన నిర్మాణాలకు పర్యావరణ పరిరక్షణ చట్టం కింద ఆమోదం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ నిర్వహణ మంత్రిత్వ శాఖ అనుమతి తప్పనిసరి. సదరు నిర్మాణ సంస్థ మాత్రం రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ బోర్డు నుంచి అనుమతి పొందింది. ఇది చట్టవిరుద్ధం. 2013లో అనుమతి పొందిన నిర్మాణ ఫ్లోర్లను 2019లో, 2021లో, 2022లో...ఇలా మూడుసార్లు మార్చారు. హౌసింగ్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు ముసుగులో 7 స్టార్ హోటళ్లు, మల్టీప్లెక్సులు, షాపింగ్‌మాల్‌లతో కూడిన వాణిజ్య భవన నిర్మాణం చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఎనిమిదిసార్లు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు'అని పేర్కొంటూ నందగిరి హిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది కె.రాఘవాచార్యులు వాదనలు వినిపించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

గురువారం 21-12-2023


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 96

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జగనన్న తనదైన ముద్రతో పాలనా సంస్కరణలు



ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే...

01 సాంఘిక భద్రత

ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించే క్రమంలో పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ఆర్థిక సాయం, ఆరోగ్య సంరక్షణ ద్వారా పేదలకు సహాయం

02 మెరుగైన సేవలు అందించడం

సంక్షేమం అందించడంలో మధ్యవర్తులు, అవినీతి వంటివి తొలిగించి వాలంటీర్లు, డీబీటీ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజలకే సేవల పంపిణీ



4500 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు చిత్తూరు జిల్లా, ఎస్.ఆర్.పురం మండలం కొటర్లపల్లె దగ్గర నిర్మించబడుతున్న స్మార్ట్ డివి సాఫ్ట్‌వేర్ కంపెనీని గౌ॥ శ్రీ వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి గారి చేతులమీదుగా జనవరి 2024 ప్రారంభోత్సవానికి ముస్తాబు అవుతున్న భవనం

03 సామాజిక న్యాయం

సామాజిక న్యాయం కేవలం నినాదం కాదు.. అది అమలు చేయాల్సిన విధానం. అందుకే సుపరిపాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట

04 మహిళా సాధికారత

మహిళా సాధికారత ద్వారా ప్రతి కుటుంబ సాధికారతకు అత్యంత ప్రాముఖ్యత

05 అమ్మ ఒడి

విద్యార్థులకు 75% హాజరు ఉంటే ప్రతి ఏటా రూ.15,000 ఆర్థిక సహాయం 44 లక్షల మంది తల్లులకు రూ.26 వేల కోట్ల లబ్ధి

06 ఆరోగ్యశ్రీ

అర్హులైన 1.4 కోట్ల కుటుంబాలకు ఖర్చు లేకుండా ఉచిత వైద్య చికిత్స 27 లక్షల మంది పేషెంట్లకు రూ.8800 కోట్ల విలువైన వైద్య సేవలు


07 రైతు భరోసా

రైతులకు మద్దతుగా ప్రతి ఏటా రూ.13,500 ఆర్థిక సహాయం 52 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల లబ్ధి



ఎం.సి.విజయానంద రెడ్డి

రాష్ట్ర వైస్ ఛైర్మన్, డైరెక్టర్ APSRTC (క్యాబినెట్ హోదా)
జిల్లా వై.ఎస్.ఆర్.సీ.పీ. ప్రధాన కార్యదర్శి, చిత్తూరు



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 96

గురువారం 21-12-2023

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | BANGALORE | DELHI | CHENNAI | VIJAYAWADA | HYDERABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్



మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మద్యం మహమ్మారి నుండి కుటుంబాలను కాపాడేందుకు మీ సోదరుడిగా నేనున్నానని అక్కా చెల్లెమ్మలకు భరోసానిస్తూ... ఈ నాలుగేళ్లలో మన ముఖ్యమంత్రివర్యులు

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు

దశలవారీగా చేపట్టిన మద్యనియంత్రణ చర్యల ద్వారా మద్యానికి బానిసలైన కుటుంబాలలో సంతోషాలు నెలకొన్నాయి.

పాదయాత్రలో అక్క-చెల్లెమ్మలకు ఇచ్చిన మాట పక్రారం మద్యపానం నియంత్రణ విషయంలో గత ప్రభుత్వానికి - జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాలు..

గత ప్రభుత్వం	మన ప్రభుత్వం
4380 మద్యం దుకాణాలు ప్రైవేట్ వ్యక్తులచే నిర్వహించబడేవి.	మద్యం దుకాణాలు 2934కు తగ్గించబడినవి, ఎపిఎస్‌బిసిఎల్‌కు అప్పగించబడినవి.
రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామాలలో 43000 బెల్టుషాపులు ఉండేవి.	రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామాలలో విస్తరించి ఉన్న 43000 బెల్టు షాపులు తొలగించబడినవి.
మద్యపానం కోసం మద్యం దుకాణాలకు 4380 పర్మిట్ రూమ్స్ కలుపబడి ఉండేవి.	మద్యం దుకాణాలకు కలుపబడిన 4380 పర్మిట్ రూమ్స్ అన్నింటినీ తొలగించడమైనది.
మద్యం అమ్మకానికి వ్యాపార వేళలు ఉ. 10.00 గం.ల నుండి రా. 10.00 గం.ల వరకు ఉండేవి.	వ్యాపార వేళలు ఉ. 11.00 గం.ల నుండి రా. 09.00 గం.ల వరకు తగ్గించబడినవి.
మద్యపానం ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టబడినవి.	కొత్త పన్ను ఎఆర్ఇటి విధించడం, వ్యక్తి కలిగియుండు లిక్కర్ పరిమితి తగ్గింపు మరియు చైతన్య చర్యలతో సహా మద్యపానం తగ్గించడానికి చర్యలు.

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు

ఇంధన గ్రీన్ హారిజన్స్ విస్తరణ :



సుస్థిరమైన భవిష్యత్ కోసం ఇథనాల్ ఉత్పత్తికి ప్రోత్సాహం.

- ప్రస్తుత ప్రభుత్వం 7 ఇథనాల్ ఉత్పత్తి చేసే యూనిట్లకు సంవత్సరానికి 3760 లక్షల BLs సామర్థ్యంతో లైసెన్స్‌లు / LOIs మంజూరు చేసింది.
- ఇథనాల్ కలిపిన ఇంధనానికి మారేందుకు గ్రీన్ ఎనర్జీ దిశగా గొప్ప ముందడుగు.

అధునాతన టెస్టింగ్ ఎక్సైజ్ లేబొరేటరీస్ : ఆధునికీకరించడం ద్వారా నాణ్యతను మెరుగుపరచడం





మద్య పానీయాల ఖచ్చితమైన పరీక్ష కోసం అధునాతన సాంకేతికత మరియు ఇండస్ట్రీ - లీడింగ్ సాఫ్ట్‌వేర్‌తో 5 ప్రాంతీయ ఎక్సైజ్ లేబొరేటరీలకు అన్ని సదుపాయాలు కల్పించబడినవి.



జప్తు కార్యకలాపాలు :

- ఇతర వాటితోపాటు మద్యం మరియు ఇసుకకు సంబంధించిన అన్ని చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక విభాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (SEB) ఏర్పాటు చేయబడినది.
- అక్రమ మద్యం బట్టీల ఖచ్చితమైన నియంత్రణ కోసం గ్రామ వలంటీర్లు మరియు వార్డు వలంటీర్ల సేవలు వినియోగించుకోబడుచున్నవి.
- ఐడి నేరంలో ప్రమేయం గల వ్యక్తులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించబడిన వారి సంఖ్య : 3862.
- సారా రహిత గ్రామాలుగా మారిన ఐడి ప్రభావిత గ్రామాల సంఖ్య : 2006
- గంజాయి కేసులు నమోదు సంఖ్య : (16-5-2020 నుండి 18-12-2023 వరకు) : 6256



అమ్మకం, రవాణా పై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్ **14500**

డ్రగ్స్‌తో చెలగాటం - ప్రాణానికి సంకటం



మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

లక్షలాది కుటుంబాల్లో వెలకట్టలేని సంతోషాలు



మద్యం వద్దు ... ఆరోగ్యం ముద్దు ...


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | BANGALORE | DELHI | CHENNAI | VIJAYAWADA | HYDERABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

గురువారం 21-12-2023

విశ్వసనీయతకు నిలువెత్తు రూపం.. ఆలోచనల్లో నిబద్ధత..

ఆచరణలో ఎంతటి కష్టం, నష్టం ఉన్నా వెనక్కి తగ్గని గుణం..

పాలనకు మానవత్వ పరిమళం అద్దడానికి నిరంతర ప్రయత్నం..

గడియారం ముల్లుతో పోటీపడే దినచర్య..

ఆడినమాట నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవహారశైలిపై కథనం

ఇదీ.. జగన్ కమిట్‌మెంట్

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అడుగులు



అమ్మ ఒడి అమలు చేస్తామని మేనిఫెస్టోలో హామీ

దాన్నుంచి ఒక్కొక్క పథకాన్నీ చేరుస్తూ విద్యలో విప్లవం

స్కూళ్లు, విద్యార్థుల స్థితిగతులు, చదివే విధానంలో సంస్కరణలు

- 'నాడు-నేడు'తో మారిన ప్రభుత్వ బడులు, ఆసుపత్రులు
- ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరికీ హక్కుగా ఇవ్వాలని భావించిన సీఎం
- అందుకే ఆరోగ్య శ్రీ పరిధిని విస్తరించి మరింత బలోపేతం
- చికిత్సలు, ఆసుపత్రుల సంఖ్య పెంపు.. రూ.25 లక్షల వరకూ ఉచితం
- స్పెషలిస్టు వైద్యులతో సహా వైద్య శాఖలో ప్రతి ఒక్క పోస్టూ భర్తీ
- గ్రామాలకు వెళ్లి మరీ సేవలందించేందుకు 'ఫ్యామిలీ డాక్టర్'
- వ్యవసాయంలో కొత్త ఒరవడికి ఆర్‌బీకేలతో నాంది
- విత్తనాలు, ఎరువుల విక్రయం నుంచి పంట కొనుగోలు దాకా అక్కడే
- రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎకరా వివరాలతో 100 శాతం 'ఈ-క్రాప్'
- ఉచితంగా ప్రతి ఎకరాకూ బీమా.. ఏటా రూ.13,500 రైతు భరోసా
- ఎలాంటి నష్టం జరిగినా ఒకటిరెండు రోజుల్లో పక్కాగా నివేదించే వ్యవస్థ
- సొంతిల్లు లేనివారు ఉండకూడదన్న ఉద్దేశంతో 31 లక్షల ఇంటి స్థలాలు
- ఆనక వాళ్లందరికీ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతనూ తీసుకున్న ప్రభుత్వం
- జగనన్న కాలనీల పేరిట ఎక్కడికక్కడ కొత్తగా వెలుస్తున్న ఊళ్లు

2లో

పరిపాలనను గ్రామ స్థాయికి వికేంద్రీకరిస్తూ గ్రామ సచివాలయాలు

స్థానికంగా ఏ సేవలైనా.. ధ్రువపత్రాలైనా అక్కడే పొందే వీలు

వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు

వీటితో పాటు ప్రభుత్వ పథకాలన్నిటికీ వారధులుగా ఈ సైనికులు

ఒకపక్క.. రోజుకు వంద రూపాయల సంపాదన కూడా లేక.. కనీస అవసరాలని చెప్పే తిండి, ఇల్లు, దుస్తులకు కూడా నోచుకోని జనం లెక్కించలేనంత మంది. మరోపక్క.. రోజుకు లక్ష రూపాయలు సైతం గ్యాంబ్లింగ్‌లో పోగొట్టుకుని చింతలేకుండా గడిపేసే శ్రీమంతులూ లెక్క లేనంతమంది. ఇదీ.. మన సమాజంలో ఉన్న విభజన. నానాటికీ పెద్దదవుతున్న ఈ రేఖ చెరిగేంతవరకూ అభివృద్ధి చెందిన దేశంగానో, రాష్ట్రంగానో మారటం అసాధ్యం. కనీస అవసరాలు తీర్చుకోలేని కోట్లాది మందిని విడిచిపెట్టేస్తే ఆ అభివృద్ధికి అర్థం ఉండదు. ఆ అభివృద్ధిలో వాళ్లకూ వాటా ఉండాలి. ఆ స్థాయికి వాళ్లను తీసుకురావాలి. వాస్తవానికి సంక్షేమ పథకాల పరమార్థం ఇదే. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తున్నది ఆ అభివృద్ధే.

ప్రభుత్వానికీ మనసు ఉండాలని..




అక్షరానికి అగ్రపీఠం



అన్నదాతకు అభయం



'నాడి' పట్టిన నేత



జలాభిషేకం

వరుసగా నాలుగేళ్లుగా కోటి ఎకరాలకు సాగునీరు



ఆంధ్రా తీరం.. ఆర్థికంగా ఊతం



పరిశ్రమలు క్యూ...



రాష్ట్రం 'క్లిక్' అయిందిలా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సాధించిన ప్రగతిపై ప్రత్యేక కథనాలు..

2,3,4,5,6,7,8,9,10,11 పేజీల్లో..

ఇదీ.. జగన్ కమిట్‌మెంట్

రమణమూర్తి మంథా

చదువుతోనే తలరాత మారుతుంది దీన్ని మనసావాచా నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్. కాబట్టే తన పిల్లలిద్దరినీ టాపర్లుగా నిలబెట్టగలిగారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకూ సరైన విద్యనందించాలన్న ఉద్దేశంతోనే మేనిఫెస్టోలో 'అమ్మ ఒడి'ని ప్రతిపాదించారు. చేతిలో డబ్బుల్లేక చిన్న పిల్లల్ని సైతం కూలికి పంపే పరిస్థితిని మార్చాలన్నదే దీనివెనకున్న ఆలోచన. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక దీన్ని ఆచరణలోకి తెచ్చారు. ఆశించినట్టే 'అమ్మ ఒడి' ఊతంతో పిల్లలు బడి బాట పట్టారు.

మరి ఇది సరిపోతుందా?

ఇదిగో.. ఈ ఆలోచనే విద్యారంగంలో పెను సంస్కరణలకు బీజం వేసింది. స్కూళ్లకొచ్చే పిల్లల కడుపు నిండితేనే చదువు ఒంట బడుతుందన్న ఆలోచన.. పౌష్టికాహారంతో కూడిన 'గోరుముద్ద'కు ప్రాణం పోసింది. బళ్లు తెరిచిన ఆరు నెలలకు కూడా పుస్తకాలు అందకపోతే పిల్లలెలా చదువుతారు? ఎవరి స్థాయిని బట్టి వారు దుస్తులు, బ్యాగులతో వస్తే.. ఒకరు షూ వేసుకుని, మరొకరు చెప్పులు లేకుండా వస్తే అంతా ఒక్కటేనన్న భావన ఎందుకొస్తుంది? వీటన్నిటికీ సమాధానమే.. స్కూళ్లు తెరవటానికి ముందే ప్రతి విద్యార్థికీ అందుతున్న 'విద్యా కానుక'.

సరే! మరి స్కూళ్లో? తమ వారి ప్రయివేటు ప్రయోజనాల కోసం గత ప్రభుత్వాలు వాటిని చిత్రవధ చేసి చంపేశాయిగా? ఆడపిల్లలు టాయిలెట్ కోసం ఇంటికెళ్లాలి. సరైన గదుల్లేవు. బెంచీలు, బ్లాక్ బోర్డులు అన్నీ అంతంతే! ఎందుకెళ్లాలి?... అనిపించేలా ఉన్నాయి మన బడులు. వీటిని మార్చాలనుకున్నారు జగన్. అందుకే.. 'నాడు-నేడు' పేరిట ఓ యజ్ఞాన్ని ఆరంభించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలనూ కార్పొరేట్ స్కూలుకు దీటుగా సౌకర్యాలతో తీర్చిదిద్దారు. వేల కోట్లు ఖర్చు చేయాల్సి రావటంతో.. దశల వారీగా ఈ యజ్ఞాన్ని పూర్తి చేస్తున్నారు.

స్కూళ్లకు వస్తున్నారు. భోజనం, దుస్తులు ఓకే. స్కూళ్లు మారాయి. మరి చదువో! మన పిల్లలు పోటీ పడాలంటే ఇంగ్లిష్ రావాలి. వస్తేనే రాణించగలరు. అంతర్జాతీయంగానూ పోటీ పడగలరు. అందుకే ప్రయివేటు స్కూళ్లకు మల్లే ప్రీప్రయిమరీ-1,2 తరగతులు వచ్చాయి. ఆది నుంచే ఇంగ్లిష్ మీడియంలో బోధన మొదలయింది. ఇలాగైతే ప్రయివేటు స్కూళ్లకు ఎవరూ రారు కనక.. మాతృభాషపై మమకారం లేదంటూ, ఇంగ్లీషు చదువులు వద్దంటూ మాఫియా గాళ్లంతా కలిసి మాయా యుద్ధానికి దిగారు. కేసులు వేశారు. అయినా సరే.. జగన్ సంకల్పం గట్టిది కావటంతో ఇంగ్లీషు మీడియం వచ్చింది. ఇప్పుడు చాలా మంది పిల్లలు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడుతుండటం ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. అక్కడితో ఆగలేదు జగన్. అగ్రశ్రేణి కార్పొరేట్ స్కూళ్లలోనే దొరికే ఎడ్యుటెక్ కంటెంట్‌ను దిగ్గజ సంస్థ 'బైజూస్' ద్వారా మన పిల్లలకూ అందుబాటులోకి తెచ్చారు. ఏటా 8వ తరగతి పిల్లలకు శాంసంగ్ ట్యాబ్‌లనూ అందజేస్తున్నారు. మిగిలిన తరగతుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేస్తున్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లనూ అందుబాటులోకి తెస్తున్నారు. దీన్ని బట్టి తెలిసేది ఒక్కటే. పిల్లల చదువుపై సీఎం జగన్‌కు అంతులేని నిబద్ధత ఉంది. చదివించటం ద్వారా వారి రాతలను మార్చాలన్న తపనతో.. యావత్తు విద్యారంగాన్ని సమూలంగా సంస్కరించటం మొదలెట్టారు. ఇదంతా చేసింది జస్ట్ నాలుగున్నరేళ్ల వ్యవధిలోనే!



అన్నిటినీ మించి వైఎస్ జగన్‌లో కనిపించేది విశ్వసనీయత, చిత్తశుద్ధి. వాస్తవానికి ఈ ప్రభుత్వ నాలుగున్నరేళ్లలో రెండేళ్లు కోవిడ్ సంక్షోభ ఛాయల్లోనే గడిచిపోయింది. యావత్తు ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయిన ఆ కాలంలో జీతాలు సహా అన్నింటా కోతలే. రాష్ట్రాలన్నీ పథకాలను నిలిపేశాయి. ఒక్క ఏపీ మాత్రం దీనికి మినహాయింపు. పేదలకిస్తున్న ఏ ఒక్క పథకాన్నీ ఆపలేదు. ఠంచనుగా ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. పైపెచ్చు ఆహారం, మందులు అన్నీ ఉచితంగా ఇస్తూ ఖర్చుకు వెరవకుండా కోవిడ్ సంరక్షణ చర్యలు చేపట్టింది. దీనికి అప్పట్లో ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారో తెలుసా..! 'ఇలాంటి కష్టకాలంలోనే కదా మనం తోడుండాల్సింది' అని. పొరుగు రాష్ట్రాల వారు ఏపీ మీదుగా కాలినడకన వారి సొంతూళ్లకు తరలిపోతున్నపుడు చేతిలో డబ్బులు పెట్టి మరీ సాగనంపిన ప్రభుత్వమిది. ఒక సొంతిల్లు ఎంతటి భరోసానిస్తుందో తెలుసు కనకే రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయటంతో పాటు.. వారికి ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తీసుకున్నారు సీఎం జగన్. జగనన్న కాలనీల పేరిట కొత్త ఊళ్లనే సృష్టించారు. ఈ చర్యతో రాష్ట్రంలో ఒక ప్రధాన సమస్య లేకుండా పోతుందని, జగన్‌కు ఎనలేని ఖ్యాతి వస్తుందని భావించిన ప్రతిపక్షం దీన్ని అడ్డుకోవటానికి రకరకాల ఎత్తుగడలు వేసింది. కోర్టులకెక్కింది. ఎక్కడికక్కడ లేని భూ వివాదాలు సృష్టించింది. అయినా సరే.. అన్నిటినీ దాటుకుని పేదలకు సొంతిళ్లు దక్కుతున్నాయంటే.. అది వైఎస్ జగన్ సంకల్పంలో ఉన్న బలమే.

వైద్యం.. ప్రతి ఒక్కరి హక్కు..

చదువుకైనా.. సరైన వైద్యం చేయించుకోవటానికైనా పేదరికం అడ్డు కాకూడదని, వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని జగన్ భావించారు. అందుకే.. వెయ్యి రూపాయలు దాటిన ఏ వైద్యానికైనా ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తానని మేనిఫెస్టోలో చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దాన్ని అమల్లోకి తెచ్చారు. ఆరోగ్య సేవలకు అదొక బీజం మాత్రమే. అక్కడి నుంచి మొదలుపెడితే.. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అంచెలంచెలుగా విస్తరిస్తూ పోయింది. ఆసుపత్రులన్నీ స్కూళ్ల మాదిరే 'నాడు-నేడు' కింద కొత్త రూపాన్ని, కొత్త సౌకర్యాలను సంతరించుకున్నాయి. ఎక్కడా ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు... ఇలా ప్రతి పోస్టూ భర్తీ చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యుల భర్తీతో పాటు.. అత్యాధునిక పరికరాలనూ తీసుకొచ్చారు. యావత్తు ప్రపంచంతో పాటు రాష్ట్రాన్ని కూడా కోవిడ్ వణికించినపుడు వీళ్లంతా కలిసి వలంటీర్ల సాయంతో ఎంత అద్భుతం చేశారన్నది రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఇతర రాష్ట్రాల్లో ఆసుపత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితుల్లో పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి, సంరక్షణ కేంద్రాల్లో ఉచితంగా చికిత్స తీసుకుని వెళ్లారంటే.. అది రాష్ట్రంలో వైఎస్ జగన్ అమల్లోకి తెచ్చిన పక్కా వ్యవస్థ వల్లేనన్నది కాదనలేని నిజం. అంతే కాదు.. గ్రామ స్థాయి నుంచీ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూ వచ్చారు. ఏకంగా 1,405 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పడ్డాయి. ప్రతి చోటా వైద్యులొచ్చారు. ఉచిత మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటన్నిటికీ తోడు విదేశాల్లోనే కనిపించే 'ఫ్యామిలీ డాక్టర్'... మన ఊళ్లలో ప్రతి ఇంటికీ అందుబాటులోకి వచ్చారు. రాష్ట్రంలో ఇపుడు నిరుపేదలందరికీ కావాలనుకున్న వెంటనే సూపర్ స్పెషాలిటీ డాక్టర్ అపాయింట్‌మెంట్.. అదీ ఉచితంగా దొరుకుతోందంటే.. అదే వైఎస్ జగన్ విజన్. పరిస్థితులు మారి... కొన్ని చికిత్సలకు వ్యయం ఎక్కువవుతోందని గ్రహించటంతో ఇపుడు ఆరోగ్య శ్రీ చికిత్సకయ్యే ఖర్చును ఏకంగా రూ.25 లక్షల వరకూ ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రతి చికిత్సా ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చేలా చికిత్స ప్రకిరయలను సైతం 1,059 నుంచి 3,257కి పెంచారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను 820 నుంచి 2,513కి పెంచారు. నాలుగున్నరేళ్లలో ఇవన్నీ చేయాలంటే ఎంత కమిట్‌మెంట్ ఉండాలి మరి!

ఇదీ వ్యవ'సాయం' అంటే..

దేశానికి రైతే వెన్నెముక. వైఎస్సార్ వారసుడిగా దీన్ని బలంగా నమ్మిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి. అందుకే ఏడాదికి రెండుసార్లు పంట వేసే ముందు రైతుకు పెట్టుబడిగా రూ.12,500 చొప్పున ఇస్తామని భరోసా ఇచ్చారు. దాన్ని మరో రూ.వెయ్యి పెంచి కోవిడ్ కష్టకాలంలోనూ ఆపకుండా మరీ అమల్లోకి తెచ్చారు. నిజానికి రైతుకు ఏం చేసినా తక్కువే. ఎంత చేసినా తక్కువే. అందుకే గ్రామ స్థాయిలోనే రైతులకు అన్ని సేవలూ అందించే ఓ బలమైన వ్యవస్థను సృష్టించాలని సంకల్పించారు. రైతు భరోసా కేంద్రాలకు ప్రాణం పోశారు. రైతు ఎదుర్కొంటున్న కష్టాలన్నిటికీ ఇది వన్‌స్టాప్ పరిష్కారంగా ఉండాలని భావించారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా ఇక్కడే సర్టిఫైడ్ విత్తనాలు, పురుగు మందులు దొరుకుతాయి. భూసార పరీక్ష కేంద్రాల నుంచి పండిన పంటను నిల్వ చేసుకునే గిడ్డంగులు, ఆఖరికి ఖాతాలో పడ్డ నగదును డ్రా చేసుకునేందుకు ఏటీఎంలు కూడా కొన్నిచోట్ల ఆర్‌బీకేలలోనే అందుబాటులోకి వచ్చాయి. ఇపుడు ఆర్‌బీకే అనేది ఓ బలమైన ప్రభుత్వ వ్యవస్థ. రైతును విత్తు నుంచి పండిన పంటను విక్రయించుకునేదాకా చేయిపట్టి నడిపించే అమ్మ, నాన్న.. అన్నీ. మనసు మంచిదైతే ప్రకృతి కూడా సహకరిస్తుందనేది ఎంత నిజమో ఈ నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్ పాలనలో ప్రస్ఫుటమైంది. సువిశాల కోస్తా తీరం కారణంగా కొన్నిసార్లు తుపాన్లు దెబ్బతీసినా.. తట్టుకుని రోజుల వ్యవధిలోనే బయటపడే వ్యవస్థను ఏర్పాటు చేశారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికీ అతివేగంగా సాయం అందించటంతో పాటు ప్రతి ఎకరాకూ ఉచితంగా ప్రభుత్వమే బీమా చేయించటం, ఒక సీజన్లో జరిగిన నష్టానికి మళ్లీ ఆ సీజన్ రాకముందే పరిహారాన్ని అందించటం.. ఏ సీజన్లో జరిగిన నష్టానికి ఆ సీజన్లోనే ఇన్‌పుట్ సబ్సిడీని అందించటం.. ఇలా ప్రతిదీ నెరవేర్చేలా 'ఈ-క్రాప్' ద్వారా ఆర్‌బీకేల చుట్టూ ఓ బలమైన వ్యవస్థను సృష్టించారు. ఇదీ విజన్ అంటే.

వికేంద్రీకరణకు కొత్త అర్థం

వృద్ధులకు, దివ్యాంగులకు ప్రభుత్వమిచ్చే పింఛన్లంటే ఇదివరకు ఓ మహా ప్రహసనం. పట్టణాల్లోనైతే బ్యాంకుల ముందు పడిగాపులు. పల్లెల్లోనైతే ఇచ్చే వ్యక్తి ఏ రోజున వస్తాడో తెలియని దైన్యం. అసలే వాళ్లు వృద్ధులు, దివ్యాంగులు. అలాంటి వారికిచ్చే సాయమేదైనా వారికి సాంత్వన కలిగించాలి తప్ప ఇబ్బంది పెట్టకూడదు కదా? ఇదిగో.. ఈ ఆలోచనతోనే ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ వలంటీర్ల సైన్యాన్ని సృష్టించారు. ప్రతినెలా ఒకటవ తేదీన ఠంచనుగా ఇళ్లకు వెళ్లి సామాజిక పింఛన్లు అందజేయటం ఈ సైన్యం బాధ్యత. ఆ తరవాత..! ఆ వలంటీర్లు మరిన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగమయ్యారు. పథకాలను లబ్ధిదారులకు చేరువ చేశారు. ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీరు. ప్రభుత్వానికి – ఆ గడపలకు తనే సంధానకర్త. సూక్ష్మ స్థాయిలో వికేంద్రీకరణ ఫలితాలను కళ్లకు కట్టిన వలంటీర్ల మాదిరే... గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు చేరువ చేయడానికి వలంటీర్లయితే... ప్రభుత్వాన్ని గ్రామ స్థాయికి చేర్చేది గ్రామ సచివాలయాలు. అవసరమైన సర్టిఫికెట్ల నుంచి స్థానికంగా కావాల్సిన సేవలూ అక్కడే. ఈ వ్యవస్థ ఆలోచనతో ఏకంగా లక్షన్నర ప్రభుత్వ ఉద్యోగాలొచ్చాయి. అవినీతికి, లంచాలకు ఆస్కారం లేకుండా యువత ఉన్న ఊళ్లోనే ఉద్యోగాలు తెచ్చుకుని కొలువుల్లో స్థిరపడింది. అక్కడితో ఆగకుండా గ్రామాల్లో రైతుల కోసం ఆర్‌బీకేలు, వైద్య సేవల కోసం పీహెచ్‌సీలు నిర్మించి, యావత్తు గ్రామ వ్యవస్థను బలోపేతం చేశారు జగన్. అందుకే ఇపుడు పల్లెల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. పల్లెల నుంచి వలసలు తగ్గాయి. ఒక బలమైన ఆలోచన... దాని ద్వారా మరింత మంచి చేయాలన్న తపన... ఈ రెండూ ఉంటే ఎంతటి అద్భుతమైన వ్యవస్థలను నిర్మించవచ్చో చేసి చూపించారు జగన్. అందుకే ప్రతి రాష్ట్రం ఇప్పుడు మన రాష్ట్రం వైపు చూస్తోంది.

డీబీటీ ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ఇప్పటిదాకా అందిన మొత్తం రూ.2,43,958.04 కోట్లు	లబ్ధి పొందిన వారి సంఖ్య (పలువురికి రెండు మూడు పథకాల ద్వారా లబ్ధి) 8,29,81,601	డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ఇప్పటిదాకా అందిన మొత్తం రూ.4,11,488.99 కోట్లు
నాన్ డీబీటీ ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ఇప్పటిదాకా అందిన మొత్తం రూ.1,67,530.95 కోట్లు	లబ్ధి పొందిన వారి సంఖ్య (పలువురికి రెండు మూడు పథకాల ద్వారా లబ్ధి) 4,44,04,251	డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధి పొందిన వారి సంఖ్య (పలువురికి 2, 3 పథకాల ద్వారా లబ్ధి) 12,73,85,852

ప్రభుత్వానికీ మనసు ఉండాలని..

పాలనకు మానవత్వ పరిమళం అద్దడానికి నిరంతర ప్రయత్నం

గడియారం ముల్లుతో పోటీపడే దినచర్య
ఆడిన మాట నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ
ఆలోచనల్లో నిబద్ధత.. ఆచరణలో కఠినత్వం
ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవహార శైలి

సాక్షి, అమరావతి

విశ్వసనీయతకు నిలువెత్తురూపం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆలోచనల్లో నిబద్ధత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆచరణలో ఎంతటి కష్టం, నష్టం ఉన్నా వెనక్కి తగ్గని గుణం ఆయన సొంతం. జీవనశైలి అత్యంత సాదాసీదాగా ఉంటుంది. మితాహారం ఆయనకు ఇష్టం. నిద్ర కూడా పరిమితమే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత నిరాడంబరంగా ఉన్నారో, అధికారంలో ఉన్నప్పుడూ అంతే నిరాడంబరత ఆయనలో కనిపిస్తుంది. మాట, భాష, వ్యవహార శైలే దీనికి నిదర్శనం. రోజురోజుకూ ఆయనలో ఓపిక, సహనం పెరుగుతూనే ఉన్నాయి. ఎంతమందితో మాట్లాడినా, ఎన్ని గంటలు చర్చించినా ముఖంలో చిరునవ్వు అలాగే కనిపిస్తుంది.

మితాహారం

మితాహారం తీసుకోవడం, అదే సమయంలో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడం జగన్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. కొన్నేళ్లుగా ఆయన లేచిన తర్వాత రెండు కప్పుల టీ, తర్వాత గ్లాసుడు జ్యూస్ మాత్రమే ఉదయం తీసుకుంటారు. లంచ్‌కు ముందు కప్పు కాఫీ, లంచ్‌లో వెజిటబుల్ సలాడ్, పన్నీర్, తక్కువ మొత్తంలో ఫిష్ లేదా సంబంధిత ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. సాయంత్రం కూడా ఒక కప్పు కాఫీ తాగుతారు. రాత్రికి పుల్కా లేదా, రోటీతో కూరగాయలు తీసుకుంటారు. ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారు. పరిమితమైన ఆహారం, వ్యాయామం విషయంలో చాలా కచ్చితంగా ఉంటారు. స్వీట్లు లాంటి పదార్థాలకు దూరంగా ఉంటారు. ఎంత అవసరమో అంతే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యమని అంటూ ఉంటారు.

నాన్చడం తెలియదు

జగన్ పరిపాలనా వ్యవహారాలను దగ్గరగా చూస్తే కొన్ని అంశాల్లో వినూత్నత కనిపిస్తుంది. సాధారణ రాజకీయ నాయకుడు మాదిరిగా ప్రతి అంశాన్ని నాన్చి మూలన పడేసే తత్వానికి ఆయన చాలా దూరం. ఏ విషయం మీద కూర్చున్నా దాని మూలాల వరకూ వెళ్తారు. అవసరమైతే మరింత ఆలోచన కోసం మరి కొంత సమయం వెచ్చిస్తారు. తన ఆలోచన మీద సంబంధిత అధికారులు, నిపుణులతో లోతైన చర్చ చేస్తారు. పూర్తిగా అవగతమైన తర్వాత కార్యాచరణకు దిగుతారు. అమలులో ఇబ్బందులొస్తే వెనక్కి తగ్గడం, వాయిదా వేయడం చేయకుండా, మరింత పట్టుదలతో ముందడుగు వేయడం ఆయన నైజం.

ఆపన్నులకు అండ

వైఎస్ జగన్.. అనే పేరు వింటే వెంటనే మనకు గుర్తుకు వచ్చేది ఒక నమ్మకం. ఆయన ఉన్నాడు.. మనల్ని చూసుకుంటాడనే భరోసా కనిపిస్తుంది. ఇంతటి విశ్వాసం పొందడానికి ఆయన అనుసరిస్తున్న మార్గాలు కూడా స్ఫూర్తిదాయకం. ఒక నాయకుడిగా తాను నడవటమే కాదు పది మందినీ నడిపించే ప్రేరణతో కూడిన శక్తి ఆయన సొంతం. రుజువర్తన, ప్రజలకు మేలు చేయాలనే పట్టుదల, అవి నేరవేరే దాకా చెక్కుచెదరని సంకల్పం, అన్నింటికీ మించి క్రమశిక్షణ ఆయన వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాయి. గొంతు విప్పలేని వర్గాలకు ఒక స్వరమై, ఆపన్నులకు ఆపద్బాంధవుడై ఆయన నిలవడం వెనుక ఈ వ్యక్తిత్వమే కారణం.

దినచర్య ఇలా..

సమయాన్ని అత్యంత విలువైనదిగా జగన్ భావిస్తారు. అందుకనే రోజువారీ ప్రణాళిక విషయంలో షెడ్యూలు ప్రకారం ముందుకు సాగుతారు. తెల్లవారక ముందే నిద్రలేచే అలవాటును అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎప్పుడూ వదులుకోలేదు. ఉదయం 4గంటలకు ఆయన దినచర్య ప్రారంభం అవుతుంది. ఆరోజు దినపత్రికలను ఒకసారి పరిశీలిస్తారు. స్పందించదగ్గ విషయాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి ఆదేశాలు ఇస్తారు. గంటకు పైగా వ్యాయామం ఉంటుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు కూడా జాతీయంగా, అంతర్జాతీయంగా వస్తున్న పరిణామాలను తెలుసుకునేందుకు ఇంగ్లిషు ఛానల్స్, లేదా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, సాంకేతిక, పాలనా రంగాల్లో వస్తున్న అంశాలపై నిపుణులు చేసిన పోడ్ కాస్ట్ వింటారు. ఇందులో స్వీకరించదగ్గ అంశాలను గుర్తు పెట్టుకుని ఒక పేపర్‌పై రాసుకుంటారు. రాష్ట్రానికి అవసరమైన అంశాల విషయంలో అవి ఎంత వరకు మేలు చేస్తాయనే విషయాన్ని ఆలోచించి వాటిని అమలు చేస్తారు. వ్యాయామం ముగిసిన తర్వాత తన కార్యాలయానికి రెడీ అవుతారు. సాధారణంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్యాలయంలోనే ఉంటారు.



అధికారులతో సమీక్షలు, పాలనా పరమైన వ్యవహారాలు, పార్టీ పనుల్లో నిమగ్నమై ఉంటారు. కార్యాలయానికి వచ్చిన తర్వాత మొదట సీఎంఓ అధికారులతో సీఎం ప్రతి రోజూ సమావేశం అవుతారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిణామాలపై చర్చ ఉంటుంది. ఇందులో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అమలు, అప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలు ఏమైనా ఉన్నాయా? ఎవరినైనా ఆదుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయా? అన్నదానిపై ప్రధానంగా చర్చ ఉంటుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్ల నుంచే ఆయన అధికారులతో నిరంతరం ఒక మాట చెప్తూ ఉంటారు. 'నేను అయినా, మీరు అయినా ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతోనే ఇక్కడ అందరూ కలిసి మాట్లాడుకుంటున్నాం. దాపరికంతో ఉన్నా, మీ ముందు నేను మనసు విప్పి ఓపెన్‌గా మాట్లాడకపోయినా ఈ సమావేశానికి అర్థం ఉండదు. ఏ అంశంపైనైనా మీ అభిప్రాయాలను సంకోచం లేకుండా చెప్పొచ్చు. అప్పుడే మనం మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతాం' అని పలు మార్లు చెప్పారు. వ్యతిరేకులు చెప్పిన విషయాల్లో కూడా తీసుకోదగ్గవి ఉంటే మనస్ఫూర్తిగా స్వీకరించాలని, వాటిని పాజిటివ్‌గా తీసుకోవాలని అధికారులకు సూచించడం.. ఆయన వ్యవహార శైలిలో భాగం. విపత్తు సమయాల్లో అసహాయులైన వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా సీఎం మెరుపు వేగంతో స్పందించడం గురించి పలుమార్లు అధికారులు గుర్తు చేస్తుంటారు.

ఒంటరిగా భోజనం చేయడం అరుదు

మధ్యాహ్నం లంచ్ సమయంలో కూడా ఆ సమయం వృథా కాకుండా సీనియర్ అధికారులతోనో లేదా పార్టీకి చెందిన నాయకులతోనో కలిసి భోజనం చేస్తూ అనేక విషయాల మీద మాట్లాడతారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకల్లా కార్యాలయానికి వచ్చి.. పాలనా విధుల్లో నిమగ్నమవుతారు. సాయంత్రం దాదాపు 7 గంటల వరకూ కార్యాలయంలో ఉంటారు. తిరిగి ఇంటికి వెళ్లిన సందర్భంలో కూడా ఒకరిద్దరు కార్యదర్శులు, సీనియర్ అధికారులు వెంటవెళ్తారు. ఈ సమయంలో మరో గంటన్నరసేపు ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చలు ఉంటాయి. రోజు వారీ విధులు ముగించిన తర్వాత ఒక ఆలోచన వచ్చినా, లేక టీవీల్లో రాష్ట్రానికి సంబంధించి ఏదైనా వార్తను చూసినా, ఇంగ్లిషు ఛానళ్లలో కొత్త అంశాలు వచ్చినా.. అప్పటికప్పుడు స్పందించి ఆయన అధికారులకు, పార్టీ నాయకులకు మార్గనిర్దేశం చేస్తారు. తగిన ఆదేశాలు కూడా జారీ చేస్తారు. రాత్రి ఎంత లేటైనా, ఎంత అలసట ఉన్నా తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు ఆయన దినచర్య ప్రారంభిస్తారు.

ప్రభుత్వానికి మనసు ఉండాలి

ప్రభుత్వానికి మనసు ఉండాలని అధికారులకు పదేపదే చెప్తారు ముఖ్యమంత్రి. అలాంటి మనసుతో ఆలోచించినప్పుడే పేదల కష్టాలను తీర్చగలమని తరచుగా అంటుంటారు. ఈ ప్రభుత్వ పాలనకు ప్రధానమైన పునాది ఉందంటే అది మానవత్వమేనంటూ అధికారుల్లో నిరంతరం స్ఫూర్తి నింపుతారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఒక బాలుడికి జీన్ థెరపీ అవసరం అని, దాని కోసం కనీసంగా రూ.50 లక్షలు ఖర్చు చేయాలని అధికారులు ప్రతిపాదించినప్పుడు ఏం చేద్దామని ఆయన ప్రశ్నించినప్పుడు.. అంత ఇవ్వలేమని అధికారులు బదులిచ్చారు. ప్రజలచేత ఎన్నుకోబడ్డ మనం ప్రజలకు అంత కష్టం వచ్చినప్పుడు, ఆలోచిస్తూ నిబంధనల సాకు చూపించడం అత్యంత అమానవీయం అని ఆయన కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ప్రభుత్వంగా మనం తప్పక సహాయం చేయాలని నిర్దేశించారు. అటు విశాఖలో పాలిమర్స్ ఘటన అయినా, బోటు ప్రమాదాలు అయినా, ప్రమాదాలు సంభవించినా, చివరకు మొన్నటి తుపానులో కానిస్టేబుల్ విధి నిర్వహణలో మరణించినా.. వైఎస్ జగన్ అత్యంత మానవీయతను చూపిస్తూనే ఉన్నారు. పేదల బాగు కోసం ఉన్న వ్యవస్థలను మార్చడానికైనా, బడ్జెట్లు దాటడానికైనా, నిబంధనలను తిరిగి రాయడానికైనా వెనుకాడని తత్వం ఆయన సొంతం.

విద్య, వైద్యం ప్రజలకు నాణ్యంగా అందించాలని తపన

విద్యలో నాణ్యత, ప్రజలకు అందించే వైద్య సేవల్లో నాణ్యత ఉండాలని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పడిన తపనను అధికారంలోకి రాగానే ఆచరణలోకి తీసుకొచ్చారు. ఈ రెండు రంగాల్లో నాడు-నేడు అలా పుట్టుకొచ్చిన కార్యక్రమాలే. అత్యంత భారంగా మారిన విద్య, వైద్యాన్ని విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రజలకు ఒక హక్కుగా అందించడంతోపాటు, జనాభాలో మెజార్టీ ప్రజలు ఆధారపడే వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు, పారిశ్రామిక-ఉపాధి రంగాన్ని పటిష్టం చేయడానికి ఈ నాలుగున్నర సంవత్సరాల్లో సీఎం ఒక యజ్ఞమే చేశారు. జిల్లాల్లో పర్యటనలు లేని సమయంలో ఎక్కువ సమయం ఈ అంశాలకు సంబంధించిన వ్యవస్థలను పరుగులెత్తించడంపైనే ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. క్రమం తప్పకుండా ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం, వారికి లక్ష్యాలు నిర్దేశించడం, మరుసటి సమీక్షా సమావేశాలకల్లా వాటిలో ప్రగతిని సమీక్షించడం సీఎం ప్రాధాన్యతగా పెట్టుకున్నారు. కాబట్టే ఈ నాలుగున్నరేళ్లు సాగిన సమీక్షల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలు చేయడం కూడా జరిగాయి. ప్రతి సమీక్ష ఒక సమస్యకు పరిష్కారాన్ని సాధించేలా సాగింది. తాను చేయాల్సిన పనులు, దృష్టి పెట్టాల్సిన అంశాలు కూడా తన జేబులో ఉన్న చిన్న పుస్తకంలో సీఎం ఇప్పటికీ రాసుకుంటారు. వాటిని తప్పనిసరిగా ఫాలో అప్‌చేసి ఫలితాలు సాధించే వరకూ ఆయన నిద్రపోరు. హడావిడి లేకుండా సాఫీగా, సజావుగా సత్వర ఫలితాలను సాధించాలనే శైలి ఆయనది.

ఆదేశాల్లో స్పష్టత

అధికారులకు స్థిరమైన బాధ్యతలు అప్పగించడం, అందులో కూడా స్పష్టత ఉండడం ముఖ్యమంత్రి జగన్ పాలనా తీరుకు అద్దం పడుతుంది. అధికారులు ఎవరైనా వారిలో పూర్తి సామర్థ్యాలను వెలికితీసి, లక్ష్యాల దిశగా అడుగులు వేయించడం సాధ్యమవుతుందని ఆయన బలంగా విశ్వసిస్తారు. నాయకుడిగా ఆయనకున్న వ్యక్తిత్వం అధికారుల నుంచి ఉత్తమ పనితీరును రాబట్టుకోగలిగింది. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరించడం, వారి అభిప్రాయాలను పూర్తిగా వినడం, బాధ్యతలను పూర్తిగా అప్పగించడం, సమిష్టి తత్వాన్ని పెంపొందించడం.. ఇలా అధికారుల పట్ల ఆయన వ్యవహరించే తీరుకు ప్రశంసలు దక్కాయి. అందుకే విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన శాఖాధిపతులు చాలా వరకు సుదీర్ఘకాలంగా అదే స్థానాల్లో ఉండి సేవలు అందించారు. ఇప్పుడూ కొనసాగుతున్నారు.

కీలక ఘటనలు

02.09.2009: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం

09.04.2010: పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఓదార్పుయాత్ర ప్రారంభించిన వైఎస్ జగన్

29.11.2010: ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు, కాంగ్రెస్ పార్టీకి వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మలు రాజీనామా

12.03.2011: ఇడుపులపాయలో మహానేత వైఎస్ సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ పతాకం ఆవిష్కరణ.. పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటన

13.05.2011: కడప లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ జగన్ 5,46,673 ఓట్ల రికార్డు మెజార్టీతో ఘన విజయం. పులివెందుల శాసనసభ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ విజయమ్మ 81,373 ఓట్ల రికార్డు మెజార్టీతో విజయభేరి.

27.05.2012: టీడీపీ, కాంగ్రెస్ కుమ్మక్కై పెట్టిన కేసుల్లో దర్యాప్తు కోసమని ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న వైఎస్ జగన్‌ను పిలిచి, అరెస్టు చేసిన సీబీఐ

14.06.2012: 19 శాసనసభ నియోజకవర్గాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో 17 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయభేరి, ఒక లోక్‌సభ స్థానంలో వైఎస్సార్‌సీపీ విజయం

24.09.2013: అక్రమ కేసుల్లో జైలు నుంచి బెయిల్‌పై వైఎస్ జగన్ విడుదల

05.10.2013: రాష్ట్ర విభజనను నిరసిస్తూ.. సమైక్య రాష్ట్రాన్ని ఆకాంక్షిస్తూ లోటస్ పాండ్‌లో ఆమరణ దీక్ష

18.12.2013: రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ అవిశ్వాస తీర్మానం

16.5.2014: సాధారణ ఎన్నికల ఫలితాల ప్రకటన.. 67 శాసనసభ స్థానాల్లో.. 8 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం.. కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారానికి దూరం

20.06.2014: శాసనసభలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌కు గుర్తింపు

25.10.2017: అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన వైఎస్ జగన్

06.11.2017: ఇడుపులపాయలో ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభం


09.01.2019: 3,648 కి.మీ.లు సాగిన పాదయాత్ర ఇచ్ఛాపురంలో ముగింపు

23.05.2019: రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం

30.05.2019: రాష్ట్ర ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం

రాష్ట్రం 'క్లిక్' అయిందిలా...

ఐటీ వినియోగంలో అగ్రగామిగా ఏపీ • మహిళల రక్షణకు 'దిశ' ద్వారా పరిష్కారం



రెవెన్యూ డిజిటలైజేషన్లో అందరికీ ఆదర్శం

కనీస మద్దతు ధరల నిర్ణయానికి టెక్నాలజీ దన్ను

రాష్ట్రంలో ప్రతి ఎకరా పంట ఇపుడు ఆన్‌లైన్లో

విద్యార్థుల హాజరు నుంచి సౌకర్యాల పర్యవేక్షణ కూడా...

ప్రతి విభాగంలోనూ సమర్థంగా ఐటీ వినియోగం

సుమతి రోడ్డుమీద వెళుతుండగా ఆకతాయిలు ఫాలో అవుతున్నారు. భయం వేసింది. చేతిలోని ఫోన్లో ఓ బటన్ నొక్కింది. ఐదు నిమిషాలు గడవకముందే పోలీసులొచ్చారు. ఆకతాయిల్ని పట్టుకుని బుద్ధి చెప్పారు. ఇదంతా.. 'దిశ' టెక్నాలజీతోనే సాధ్యమయింది. సుమతి దిశ యాప్‌లోని బటన్‌ను ప్రెస్ చేయటంతో అది పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారం పంపింది. అక్కడి నుంచి దగ్గర్లోని పెట్రోలింగ్ బృందానికి మెసేజ్ వెళ్లింది. అంతా క్షణాల్లో జరిగిపోవటంతో.. సుమతికి ఆపద తప్పింది.

ఢిల్లీ అత్యాచార ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ యాప్‌ను.. 1.46 కోట్ల మంది మహిళలు డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీనిద్వారా అలెర్ట్ రావటంతో... 31,541 ఘటనల్లో పోలీసులు తక్షణం స్పందించి చర్యలు తీసుకున్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ!. ఐటీ. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చింది తానేనంటారు చంద్రబాబు. ఈ క్లెయిమ్‌పై ఉన్న విభిన్న వాదనలనిక్కడ ప్రస్తావించాల్సిన అవసరం లేదు. మరి 2014 నుంచీ ఏపీ ముఖ్యమంత్రిగాఉన్నపుడు ఐటీని ఏం చేశారు? ప్రపంచమంతా కొత్త ఆవిష్కరణలతో పరుగులు తీస్తున్నపుడు ఇక్కడ మాత్రం అన్నీ మాటలే తప్ప చేతల్లో ఎందుకు కనిపించలేదు? ఐటీకి పితామహుడినని చెప్పారే తప్ప... కొత్తగా టెక్నాలజీని వినియోగించిందెక్కడ? సువిశాల తీరం ఉందని... దాన్నే అడ్వాంటేజ్‌గా తీసుకోవాలని పదే పదే చెప్పారు తప్ప ఒక్క పోర్టును గానీ, హార్బర్‌ను గానీ తేలేదెందుకు? మరి వైఎస్ జగన్ మాత్రం మాటలు చెప్పకుండా ప్రతి విభాగంలోనూ టెక్నాలజీని సమర్థంగా అమలు చేస్తున్నారు కదా? కొత్త పోర్టులు, హార్బర్లను తెచ్చారు కదా? మనకు కావాల్సింది హోరెత్తించే మాటలా..? కళ్లముందు కనిపించే నిజాలా?

రాష్ట్రంలో గత ఖరీఫ్‌లో 93,29,128 ఎకరాల్లో పంటలు వేశారు. దీన్లో వరి 32,83,593 ఎకరాల్లోను... వేరు శనగ 5,93166 ఎకరాల్లోను వేశారు. ఈ లెక్కల్లో ఒక్క ఎకరా కూడా తేడా లేదు. ఎందుకంటే 'ఈ-క్రాప్' టెక్నాలజీ ఉందిప్పుడు. ప్రతి రైతూ తన పంటను నమోదు చేసుకునే ఈ పటిష్ఠమైన డిజిటల్ వ్యవస్థతో... రాష్ట్రంలోని 27,800 గ్రామాల్లో ఉన్న ప్రతి ఎకరాకూ లెక్క ఉంది. అది బీమాకైనా... పంట నష్టానికైనా.. దిగుబడికైనా.

ఈ ఉదాహరణలన్నీ చూస్తే... రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రంగంలోనూ టెక్నాలజీని ఎంత సమర్థంగా వినియోగిస్తోందో అర్థమవుతుంది. భారీ ఎత్తున ఐటీ కాంట్రాక్టులివ్వకుండా, ఉన్న వనరులను... నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ సేవలను సమర్థంగా వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విభాగంలోనూ పూర్తిస్థాయిలో టెక్నాలజీని వాడుతోంది. అందుకనే... మునుపెన్నడూ చూడని పారదర్శకత, జవాబుదారీతనం ఇపుడు కనిపిస్తోంది. చేసిన పని పావలాదే అయినా... పదిరూపాయల ప్రచారం చేసుకోవటమనేది ఈ ప్రభుత్వ విధానం కాదు కాబట్టి.. పెద్దపెద్ద ఆరంభాలు, ఆర్భాటాలు లేకుండానే ప్రజలకు సమర్థమైన ఐటీ సేవలు అందుతున్నాయి.

ఏఎన్ఎం యాప్‌లో 15 మాడ్యూల్స్...

2020లో ప్రభుత్వం రూపొందించిన ఏఎన్ఎం యాప్ ద్వారా... క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యక్రమాన్నీ వారు రిపోర్ట్ చేస్తుంటారు. ఎన్‌సీడీ-సీడీ సర్వే, ఫీవర్ సర్వే, గర్భిణి స్త్రీలు, చిన్న పిల్లలు, పాఠశాల విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్, ఆరోగ్యశ్రీ ఫీడ్ బ్యాక్ ఇలా అన్నిటినీ నమోదు చేస్తారు. ఆశా వర్కర్లకు తెచ్చిన 'ఈ-ఆశా' యాప్ ద్వారా గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యాన్ని వైద్యశాఖ నిరంతరం పర్యవేక్షిస్తుంది. పీహెచ్‌సీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకూ యాప్‌లున్నాయి. ఇవన్నీ ఒకదానికొకటి అనుసంధానమై పనిచేస్తాయి.

స్కూళ్లకు పక్కా సమాచార వ్యవస్థ...

ఈ ప్రభుత్వం తెచ్చిన స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(సిమ్స్)లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు ఉన్న 82 లక్షల విద్యార్థుల వివరాలు అప్ టు డేట్‌గా ఉన్నాయి. విద్యార్థుల ఆధార్‌ను లింక్ చేస్తూ... ప్రత్యేక ఐడీ నెంబర్ కేటాయించారు. దీంతో స్టూడెంట్ హాజరు యాప్ ద్వారా ట్రాక్ చెయ్యటం... గ్రామ/వార్డు కార్యదర్శుల ద్వారా వారిని తిరిగి బడికి రప్పించటం సులువవుతోంది. ఇక టీచర్ల అటెండెన్స్‌కూ యాప్ ఉంది. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌తో అనుసంధానించిన ఈ యాప్... టీచర్ తమ స్కూల్ పరిసరాలకు 10 మీటర్ల దూరంలో ఉంటేనే హాజరును తీసుకుంటుంది. జగనన్న గోరుముద్ద అమలును పర్యవేక్షించడానికి 'ఇంటిగ్రేటెడ్ మోనిటరింగ్ సిస్టం ఫర్ మిడ్‌డే మీల్స్ అండ్ శానిటేషన్' (ఐఎంఎంఎస్) వచ్చింది. వారంలో ఆరు రోజులు.. రోజుకు సగటున దాదాపు 37,63,698 మంది విద్యార్థులకు ఆహారం తీసుకుంటున్నారు. టీచర్ల ఫోన్‌లోని ఈ యాప్ ద్వారా... హాజరుతో పాటు ఎంతమంది పిల్లలు ఆహారం తీసుకుంటున్నారు? ఏరోజు ఏం వడ్డించారు, ఇచ్చిన సరుకు ఎంత? ఎంత స్టాక్ ఉంది? వంటి వివరాలన్నీ తెలుస్తాయి. ప్రతిరోజు టాయిలెట్ల పరిస్థితులూ అప్‌డేట్ అవుతాయి. ఎంప్లాయి ఇన్ఫర్మేషన్ సిస్టంలో టీచర్ల హాజరుతో పాటు ఎస్‌టీసీ, సెలవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, గ్రీవెన్స్ సహా సర్వీసు రికార్డు మొత్తం ఉంటోంది.

- చైల్డ్ ఇన్ఫో సిస్టంలో విద్యార్థులు ఏ స్కూల్ నుంచి ఏ స్కూల్‌కు మారారు. కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా లింకేజ్ వంటివన్నీ ఉంటాయి.
- జేవీకే యాప్ ద్వారా ప్రతి స్కూల్లో అవసరమైన జగనన్న విద్యాకానుక కిట్లు ఎన్ని? ఎన్ని అందించారు? ఎన్ని మిగిలాయి? వంటివన్నీ తెలుస్తాయి. పైపెచ్చు ఈ వ్యవస్థలను పర్యవేక్షించేందుకు జిల్లాకు ఇద్దరు అధికారుల చొప్పున నియమించి ఇబ్రహీంపట్నం, విశాఖపట్నంలో రెండు కమాండ్ కంట్రోల్ సెంటర్లున్నాయి. బడుల్లో టీచర్లు, పిల్లల అటెండెన్స్ వేశాక అది ఈ సెంటర్లకు వెళుతుంది.

అర చేతిలో ఆరోగ్యశ్రీ...

ఆరోగ్య శ్రీ యాప్‌లో లాగిన్ అయితే... తాము గతంలో ఏ చికిత్స పొందామన్నది లబ్ధిదారులు తెలుసుకోవచ్చు. పథకం కింద ఏ ఆస్పత్రుల్లో ఏ వైద్య సేవలు అందుతాయి? దగ్గర్లో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఏమేం ఉన్నాయి? తెలుసుకోవచ్చు. వాటి లొకేషన్‌నూ ట్రాక్ చేయొచ్చు. 'ఈహెచ్ఆర్- డాక్టర్ కేర్' ఆన్‌లైన్ వేదికతో యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో డిజిటల్ వైద్య సేవలందుతున్నాయి. ఈ పోర్టల్ నుంచి రోగులకు అందించిన వైద్యం వివరాలను వారి ఆయుష్మాన్ భారత హెల్త్ ఖాతాలో అప్‌లోడ్ చేస్తున్నారు. ల్యాబ్ టెస్టుల ఫలితాలు ఈహెచ్ఆర్ నుంచి నేరుగా రోగుల మొబైల్‌కే ఎస్సెమ్మెస్ ద్వారా వెళుతున్నాయి.

టెక్నాలజీతో రైతుకు దన్ను...

'ఈ-కర్షక్' యాప్‌తో ఆర్‌బీకేలో రైతులు సీజన్‌లో తాము సాగు చేసే పంటల వివరాలను నమోదు చేసుకుంటారు. తర్వాత ఆర్బీకే సిబ్బంది పొలాలకు వెళ్లి స్వయంగా జియో కో ఆర్డినేట్స్, జియో ఫెన్సింగ్ ద్వారా రైతుసాగు చేసే పంట పొలం విస్తీర్ణం, సర్వే నెంబర్‌తో పాటు పంట వివరాలనూ ధ్రువీకరిస్తారు. పొలం ఫోటో డిజిటైజ్ చేస్తారు.

- ఆర్‌బీకేల్లోని వెటర్నరీ సహాయకుల పనితీరును పర్యవేక్షించడానికి 'పశు సంరక్షక్' యాప్ ఉంది.
- రోజువారీ వ్యవసాయ పంటల హెచ్చుతగ్గులను పర్యవేక్షించడానికి మార్కెటింగ్ శాఖ 'కంటిన్యూస్ మోనిటరింగ్ ఆఫ్ ప్రైస్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ పేమెంట్స్' (సీఎంయాప్)ను తీసుకొచ్చింది.
- 'ఈ-మత్స్యకార' పోర్టల్‌ను వివిధ యాప్‌లతో అనుసంధానించారు. అప్సడా రిజిస్ట్రేషన్లు, ఆర్‌బీకే ఇన్‌పుట్ సప్లయి, ఈక్రాప్, మత్స్య సాగుబడి, కేసీసీ, పీఎంఎంఎస్‌వై వంటివన్నీ దీని ద్వారానే నిర్వహిస్తున్నారు.
- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' యాప్‌తో 55607 అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.

నాలుగున్నరేళ్లలో భారీగా నియామకాలు చకచకా..

విభాగం	రెగ్యులర్	కాంట్రాక్టు	ఔట్‌సోర్సింగ్, ఇతర	మొత్తం
వ్యవసాయ, సహకార	133	2	40	175
పశుసంవర్ధక, డెయిరీ, మత్స్య	56	290	26	372
బీసీ సంక్షేమం	328	-	41	369
పౌరసరఫరాలు	2	116	119	237
ఇంధన	639	7,694	-	8,333
ఆర్థిక	92	2	7	101
జీఏడీ(ఏపీపీఎస్సీ)	3,784	-	22	3,806
గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు	1,25,110	-	2,60,867	3,85,977
ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం	21,109	16,766	15,251	53,126
ఉన్నత విద్య	136	385	533	1,054
గృహ నిర్మాణం	1	-	-	1
పరిశ్రమలు, వాణిజ్యం	17	-	46	63
ఐటీ, ఎలక్ట్రానిక్స్	-	-	2	2
కార్మిక విభాగం	59	-	22	81
మున్సిపల్, పట్టణాభివృద్ధి	25	11	21	57
పాఠశాల విద్య	6,361	-	-	6,361
స్కిల్‌డెవలప్‌మెంట్, శిక్షణ	88	814	374	1,276
సాంఘిక సంక్షేమం	605	1	152	758
ఏపీఎస్ఆర్టీసీ	51,387	-	7,001	58,388
గిరిజన సంక్షేమం	650	-	525	1,175
జలవనరులు	176	1	-	177
మహిళా, శిశు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమం	90	7	3,403	3,500
యువజన సర్వీసు, పర్యాటక, సాంస్కృతిక	19	3	70	92
గ్రూప్-1(నోటిఫికేషన్ విడుదలైంది)	81	-	-	81
గ్రూప్-2(నోటిఫికేషన్ విడుదలైంది)	897	-	-	897
పశుసంవర్ధక సహాయకులు (నోటిఫికేషన్ విడుదలైంది)	1,896	-	-	1,896
సబ్ టోటల్	2,13,741	26,092	2,88,522	5,28,355
డీఎస్సీ-2008	-	2,193	-	2,193
డీఎస్సీ-1998	-	5,887	-	5,887
ఆప్కాస్	-	-	95,212	95,212
మొత్తం	2,13,741	34,172	3,83,734	6,31,647

క్రొంగొత్తగా... రిజిస్ట్రేషన్ల వ్యవస్థ

దేశంలో దస్తావేజులు రాయటానికి కొన్ని స్టార్టప్‌లు ఆన్‌లైన్ రైటర్లను అందుబాటులోకి తెచ్చాయి. ఇక్కడ ప్రభుత్వమే ఆ పనిచేసింది. 'కార్డ్ ప్రైమ్' విధానం ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తిగా డిజిటలైజ్ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం... వినియోగదారులు ఎవరిపైనా ఆధారపడకుండా నేరుగా ఆన్‌లైన్లో డాక్యుమెంట్లు తయారు చేసుకునే వీలు కల్పించింది. ఆన్‌లైన్లోనే చలానాలు కట్టి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఆ టైమ్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళితే అరగంటలో పని పూర్తవుతుంది. గతంలోలా డాక్యుమెంట్ల స్కానింగ్ అక్కర్లేదు కూడా. డిజిటల్ సిగ్నేచర్ ఒక్కటీ చాలు.

- ఇక వ్యవసాయ భూములకు రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆటో మ్యుటేషన్ జరిగే కొత్త విధానాన్ని తెచ్చిందీ ప్రభుత్వం. గతంలో రిజిస్ట్రేషన్ అయ్యాక ఆ డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకిస్తే వాళ్లు మ్యుటేషన్ చేసేవారు. దీనికి సమయం పట్టేది. ఇప్పుడా అవసరం లేదు.
- స్టాంపు పేపర్ల స్థానంలో ఈ స్టాంపింగ్‌ను అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. గతంలో భౌతికంగా స్టాంపులు కొని, వాటి ద్వారా అగ్రిమెంట్లు చేసుకునేవారు. ఇప్పుడు స్టాంపు పేపర్లతో పని లేదు. కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలు, డాక్యుమెంట్ రైటర్ల వద్ద కూడా ఈ-స్టాంపింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. స్టాంపు పేపర్ల అవకతవకలకు చెక్ పడింది.
- భూముల రీ సర్వే ద్వారా ఏ రాష్ట్రంలో లేని విధంగా డిజిటల్ రెవెన్యూ రికార్డులు తయారవుతున్నాయి. డ్రోన్లతో సర్వే చేసి శాటిలైట్ లింకు ద్వారా జియో కోఆర్డినేట్స్‌తో రైతుల భూముల హద్దులు నిర్ధారిస్తున్నారు. ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో యునిక్ ఐడీ ఉంటోంది.

పరిశ్రమలు క్యూ..



ఏపీలో పెట్టుబడులు పెడుతున్న టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్‌లు

- విశాఖ జీఐఎస్ సదస్సులో రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు.. వీటిని అమల్లోకి తీసుకురావడం ద్వారా 6 లక్షల మందికి ఉపాధి
- నాలుగున్నరేళ్లలో 130 భారీ ప్రాజెక్టులతో రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి
- 3 పారిశ్రామిక కారిడార్లు.. 4 భారీ పారిశ్రామిక పార్కులు
- సులభతర వాణిజ్యంలో వరుసగా ఏపీకి మొదటి స్థానం



కొత్త పెట్టుబడులను ఆకర్షించడం.. వచ్చిన పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పారిశ్రామిక ప్రోత్సాహక నిర్ణయాలతో గతంలో ఎన్నడూలేని విధంగా ముఖేష్ అంబానీ, టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారు.

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో ఈ ఏడాది జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.13.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించింది. ఈ ఒప్పందాలను అమల్లోకి తీసుకురావడం ద్వారా 6 లక్షల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో ఇప్పటికే 33 యూనిట్లు ఉత్పత్తులు ప్రారంభించగా మరో 94 ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతున్నాయి. మరి కొన్నింటి పనులు ప్రారంభదశలో ఉన్నాయి. వీటికి అదనంగా దావోస్ పర్యటనలో మరో రూ.1,26,000 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి అమలు ద్వారా 38 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. పారిశ్రామికవేత్తలకు అన్ని అనుమతులు ఒకేచోట లభించేలా 'వైఎస్సార్ ఏపీ వన్' పేరుతో యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నాలుగున్నరేళ్లలో 130 భారీ, అతిభారీ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా దాదాపు రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. వీటి ద్వారా 86 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. మూడేళ్ల నుంచి సులభతర వాణిజ్యంలో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తోంది.

కొత్తగా 3 పారిశ్రామిక కారిడార్లు..

- విశాఖ–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు కారిడార్.
- విశాఖ–చెన్నై కారిడార్ అభివృద్ధిలో భాగంగా 2 గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ నోడ్‌లను తీర్చిదిద్దింది.
- విశాఖలోని నక్కపల్లి–రాంబిల్లి క్లస్టర్లను, చిత్తూరు నోడ్‌లో ఏర్పేడు, శ్రీకాళహస్తి క్లస్టర్లలో అంతర్గత సదుపాయాలను కల్పించారు.
- వీసీఐసీ ప్రాజెక్టుకు సంబంధించిన ఎక్స్‌టెర్నల్ సదుపాయాల కల్పనలో భాగంగా తిరుపతి స్పెషల్ జోన్‌లోని నాయుడుపేట, అనకాపల్లి స్పెషల్ జోన్‌లోని అచ్యుతాపురం ప్రాంతాలను పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసింది.
- నాయుడుపేటలో 276 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.3,051 కోట్ల పెట్టుబడులు, 9,030 ఉద్యోగాలు. అచ్యుతాపురంలో 2,272 పరిశ్రమల ఏర్పాటుతో రూ.12,381 కోట్ల పెట్టుబడులు, 60 వేల మందికి ఉద్యోగాలు.
- వీసీఐసీలో భాగంగా వైఎస్సార్ జిల్లాలోని కొప్పర్తిలోని 6,740 ఎకరాలలో పరిశ్రమల హబ్.
- కొప్పర్తి కేంద్రంగా మోడల్ ఇండస్ట్రియల్ పార్కు, ఎంఎస్ఈసీడీపీ, వైఎస్సార్ ఈఎంసీ, వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రణాళిక. రూ.2,595.74 కోట్ల నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధికి కార్యాచరణ. ఇప్పటికే 66 పరిశ్రమలు కొలువుదీరాయి. రూ.1,875.16 కోట్ల పెట్టుబడులు, 13,776 మందికి ఉద్యోగాలిచ్చేందుకు కొప్పర్తి సిద్ధమైంది.
- కృష్ణపట్నంను పారిశ్రామిక నోడ్‌గా తీర్చిదిద్దుతోంది. తిరుపతి జిల్లాలో క్రిస్ సిటీ ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దీనిద్వారా రూ.5 వేల కోట్ల పెట్టుబడులు, 14 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఓర్వకల్లు వద్ద పారిశ్రామిక నగరాన్ని అభివృద్ధి చేస్తోంది.
- పారదర్శక పెట్టుబడుల కోసం ప్రభుత్వం 'పారిశ్రామిక అభివృద్ధి విధానం–2023–27'ను తీసుకొచ్చింది. 'వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం' పేరుతో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం ఒక ప్రత్యేక పాలసీ. 9,140 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు.
- వీటికి గత ప్రభుత్వం జూన్ 2019 నాటికి పెండింగ్‌లో పెట్టిన రూ. 3,409 కోట్ల ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది.
- 11,059 ఎంఎస్ఎంఈ యూనిట్లకు సంబంధించిన రూ.1,324.53 కోట్ల బకాయిలతో పాటు రూ.962.05 కోట్ల బకాయిల (7,039 ఎంఎస్ఎంఈలకు మంజూరు) ఎరియర్లను కూడా అందజేసింది. 75 భారీ, మెగా యూనిట్లకు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ. 380.85 కోట్ల ప్రోత్సాహకాలను కూడా క్లియర్ చేసింది.
- వీటిలో ఆర్థిక సంక్షోభంలో ఉన్న 49 టెక్స్‌టైల్ యూనిట్లకు రూ.242.13 కోట్లు ఇచ్చింది.

సీఎం ప్రారంభించిన కొన్ని ప్రముఖ పరిశ్రమలు..

అచ్యుతాపురంలో యకహోమా టైర్స్..



జపాన్‌కు చెందిన ప్రముఖ టైర్ల తయారీ సంస్థ యకహోమా గ్రూప్ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసిన అలయన్స్ టైర్స్ కంపెనీ (ఏటీసీ)ని సీఎం జగన్ 2022 ఆగస్టు 16న ప్రారంభించారు. తొలి దశలో రూ.1,384 కోట్లతో హాఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్ ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష ఉపాధి. యకహోమా గ్రూప్ విశాఖ యూనిట్‌ను రూ.680 కోట్లతో విస్తరణ చేపట్టింది. 2024 చివరి త్రైమాసికానికి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిర్లా గ్రాసిం కాస్టిక్ సోడా యూనిట్..



తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూపు సుమారు రూ. 2,700 కోట్లతో కాస్టిక్ సోడా తయారీ యూనిట్‌ను 2022 ఏప్రిల్ 21న సీఎం జగన్ ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,000 మందికి ఉపాధి లభించనుంది. అంతకుముందు 2 నెలల క్రితం బిర్లా గ్రూపు వైఎస్సార్ జిల్లాలో గార్మెంట్ యూనిట్‌ను ఏర్పాటుచేసింది.

బద్వేల్‌లో సెంచురీ ప్యానల్స్..



వైఎస్సార్ జిల్లా బద్వేల్ సమీపంలోని గోపవరం వద్ద 482 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సెంచురీ ప్యానల్స్ తయారీ యూనిట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.1,600 కోట్లతో ఏర్పాటుచేస్తున్న ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 2,000 మందికి పరోక్షంగా 4,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ యూనిట్ నిర్మాణ పనులకు సీఎం జగన్ 2021, డిసెంబర్ 24న భూమి పూజ చేశారు. ఈ యూనిట్ తొలిదశ పనులను 2024 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఏసీ తయారీ హబ్‌గా శ్రీసిటీ..



తిరుపతి జిల్లా శ్రీసిటీకి ఏసీ తయారీ యూనిట్లు క్యూ కడుతున్నాయి. బ్లూస్టార్, డైకిన్ వంటి బ్రాండ్లతో పాటు దేశంలోని 20కి పైగా బ్రాండ్లకు సరఫరా చేసే అంబర్, హావెల్స్, ఈప్యాక్ డ్యూరబుల్స్, పానాసోనిక్–యాంకర్ వంటి విడిభాగాల తయారీ యూనిట్లు తమ పెట్టుబడులకు రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకున్నాయి. వీటి ద్వారా రూ.3,755 కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి రానుండగా, 9,700 మందికి ఉపాధి కల్పించనున్నాయి.

కొప్పర్తిలో డిక్సన్ ఉత్పత్తి ప్రారంభం..



వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌లో ఏఐఎల్ డిక్సన్ కంపెనీ వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. రూ.127 కోట్లతో సీసీటీవీ, ఐపీ కెమెరాలు, డిజిటల్ వీడియో రికార్డుల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేసింది. ఆదిత్య ఇన్ఫోటెక్‌తో కలిసి డిక్సన్ టెక్నాలజీస్ ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా 1,800 మందికి ఉపాధి లభించనుంది. ఈ యూనిట్‌ను ఈ ఏడాది జూలై 11న సీఎం జగన్ ప్రారంభించారు.

గుంటూరులో ఐటీసీ స్పైసెస్ పార్క్..



ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ ఐటీసీ కూడా రాష్ట్రంలో భారీగా విస్తరిస్తోంది. రూ.140 కోట్లతో వెల్‌కమ్ పేరుతో గుంటూరులో ఫైవ్‌స్టార్ హోటల్‌ను, రూ. 200 కోట్లతో గ్లోబల్ స్పైసెస్ పార్కులను ప్రారంభించింది. పల్నాడు జిల్లా యడ్లపాడు సమీపంలో సుమారు 6.2 ఎకరాల్లో సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి, ఎగుమతి చేసేలా గ్లోబల్ స్పైసెస్ పార్కును అభివృద్ధి చేసింది. దీనిని సీఎం జగన్ సెప్టెంబర్ 2022లో ప్రారంభించారు. ఈ పార్కు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 మందికి ఉపాధి కల్పిస్తోంది.

చిన్న పరిశ్రమలకు చేయూత

చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేనాటికి ఎంఎస్ఎంఈల సంఖ్య	జగన్ సీఎం అయిన తర్వాత కొత్తగా వచ్చిన యూనిట్లు	నాలుగున్నరేళ్లలో కొత్తగా ఉపాధి లభించిన వారి సంఖ్య	ఈ ఏడాది నెలకు సగటున ఏర్పాటైన యూనిట్లు	జగన్ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు అందించిన ప్రోత్సాహకాలు	ఎంఎస్ఎంఈల కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న క్లస్టర్లు	చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిల కోసం జగన్ సర్కార్ చెల్లించిన మొత్తం
1,93,530	3.87 లక్షలు	12.61 లక్షలు	19,476	రూ.2,087 కోట్లు	54	రూ.1,588 కోట్లు

తాజాగా విజయనగరంలో జిల్లా ఎస్.కోటలో రూ.531 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి.. ఇది అందుబాటులోకి వస్తే 35,750 మందికి ప్రత్యక్షంగా, 9,375 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు. అనకాపల్లి, కొప్పర్తిలో కూడా ఎంఎస్ఎంఈ పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.



అక్షరానికి అగ్రపీఠం



విద్యా సంస్కరణలకు ఏకంగా రూ.66,722.36 కోట్లు వ్యయం

మనబడి నాడు-నేడుతో మారిన 45 వేల సర్కారు పాఠశాలల రూపురేఖలు

ఇంగ్లిష్ మీడియంతోపాటు సీబీఎస్ఈ బోధన

ఉన్నత చదువులకు ఆసరాగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగాన్ని అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా గుర్తించారు. టీడీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ విద్యా రంగాన్ని విప్లవాత్మక సంస్కరణలతో ప్రక్షాళన చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంచలనాత్మక పథకాలకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటు విద్యా రంగానికి పెద్దపీట వేసి ప్రభుత్వ విద్యను భ్రష్టు పట్టించగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ విద్యా రంగానికి తనదైన శైలిలో ఊపిరిలూది ప్రగతి బాట పట్టించారు. ఇంటాబయటా వెల్లువెత్తుతున్న ప్రశంసలే దీనికి నిదర్శనం. దాదాపు ఈ నాలుగున్నరేళ్ల కాలంలో విద్యా సంస్కరణలకే ఏకంగా రూ. 66,722.36 కోట్లు వ్యయం చేశారు. నాడు-నేడుతో పాఠశాలల్లో కొత్త భవనాలు, తరగతి గదులు, అదనపు తరగతి గదులు, ప్రహరీ, డిజిటల్ బోర్డులు, ఫర్నీచర్, తాగునీటి సౌకర్యం, రన్నింగ్ వాటర్ సదుపాయంతో బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, తదితరాలను ఏర్పాటు చేశారు.

నవశకానికి నాంది..



- 2020 జనవరి 1న 'జగనన్న గోరుముద్ద' పథకానికి శ్రీకారం.
- ఏటా సగటున రూ.1,400 కోట్లు చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.6,995.34 బడ్జెట్ కేటాయింపు
- టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కోసం ఏటా చేసిన ఖర్చు రూ.450 కోట్లు మాత్రమే.
- 2020-21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి.
- ఈ ఏడాది ముగిసిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ) పరీక్షల్లో 91.33 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాశారు.
- నాడు నేడులో తొలి విడత కింద 2019-20 విద్యా సంవత్సరంలో 15,713 పాఠశాలలను రూ.3,669 కోట్లతో సంపూర్ణంగా అభివృద్ధి చేశారు. రెండో విడత కింద రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నారు.
- 42.62 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జగనన్న అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేల చొప్పున జమ.
- పది, ఇంటర్ బోర్డు పరీక్షల్లో ప్రతిభ చాటినవారిని 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం సత్కారం.
- 10 మంది పేద ప్రతిభావంతులైన విద్యార్థులను అమెరికా సందర్శించే అవకాశం.
- 2019 జూన్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు దాదాపు 47 లక్షల మంది విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ.15,762 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో జగనన్న విద్యాదీవెన కింద రూ. 11,317 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద మరో రూ. 4,267 కోట్లు చెల్లించింది.
- ప్రైవేటు వర్సిటీల్లో రూ.5 లక్షల వరకు ఫీజు చెల్లించాల్సిన ఇంజనీరింగ్ కోర్సుల్లో 35 శాతం సీట్లలో రిజర్వేషన్ కోటా అమలు.
- గత నాలుగున్నరేళ్లలో 1,925 మంది విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ఆర్థికంగా అండ.
- నైపుణ్య వర్సిటీ, ప్రత్యేక శిక్షణ సంస్థల ఏర్పాటుతోపాటు ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు 2021-22 బడ్జెట్‌లో రూ.774.01 కోట్లు ఖర్చుచేయగా 2022-23 బడ్జెట్‌లో రూ.969.91 కోట్లు కేటాయించారు.

మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం..

ఎడ్యుస్కిల్, సేల్స్‌ఫోర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో మరో 1.45 లక్షల మంది విద్యార్థులు నైపుణ్య కోర్సులు పూర్తి చేశారు. ఒక రాష్ట్రంలో 1.64 లక్షల మంది విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం చేసుకున్న మొట్టమొదటి ప్రభుత్వం ఏపీనే కావడం విశేషం. దీంతో 2018-19లో క్యాంపస్ ఎంపికల్లో 37 వేల మంది ఉద్యోగాలు పొందితే, 2019-20లో 52 వేల మంది, 2020-21లో 69 వేల మంది, 2021-22లో 85 వేల మంది ఉద్యోగాలు పొందారు. ఇక 2022-23లో 1.20 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి.

దేశ సగటు కంటే మెరుగ్గా జీఈఆర్..

ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుండడంతో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్)లో మన రాష్ట్రం దేశ సగటుకంటే చాలా ముందుంది. 2019-20లో ఇండియా సగటు 27.1 శాతం ఉంటే.. రాష్ట్రంలో 35.2 శాతం, 2020-21లో దేశ సగటు 27.3 శాతం ఉంటే రాష్ట్రంలో 37.2 శాతం జీఈఆర్ నమోదు కావడం విశేషం. మరోవైపు కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల నిబంధనలు కూడా విద్యా అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఆడపిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు మొగ్గచూపుతున్నారు.


అన్ని రంగాల్లో రెండంకెల వృద్ధి


నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4.44 లక్షల కోట్లు పెరుగుదల

- 2018-19లో 8.73 లక్షల కోట్లు.. 2022-23లో 13.17 లక్షల కోట్లు
- నాలుగేళ్లలో 50.81 శాతం పెరుగుదల.. ఏటా సగటున 12.70 శాతం వృద్ధి
- వ్యవసాయ రంగం వృద్ధి 63.19 శాతం
- పారిశ్రామిక వృద్ధి విలువ 50.48 శాతం
- నిర్మాణ రంగం వృద్ధి 39.83 శాతం
- తయారీ రంగం వృద్ధి 48.24 శాతం
- బ్యాంకింగ్ రంగం వృద్ధి 71.94 శాతం
- సేవా రంగం వృద్ధి విలువ 47.43 శాతం
- 2018-19లో తలసరి ఆదాయంలో 17వ స్థానం.. 2022-23లో 9వ స్థానం

సాక్షి, అమరావతి: ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభాలను సైతం అధిగమించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తితో పాటు వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగం, నిర్మాణ, తయారీ తదితర అన్ని రంగాల్లోనూ వరుసగా ఏటా సగటున రెండంకెల వృద్ధి నమోదైంది. కోవిడ్‌లాంటి సంక్షోభాలు లేనప్పటికీ గత చంద్రబాబు పాలనలో వ్యవసాయ రంగం వృద్ధి తిరోగమనంలోకి వెళ్లింది. ప్రస్తుత ధరల ప్రకారం 2019-20 ఆర్థిక ఏడాది నుంచి 2022-23 ఆర్థిక ఏడాది వరకు వరుసగా నాలుగేళ్ల పాటు రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ పెరుగుతూనే ఉంది. 2018-19లో చంద్రబాబు హయాంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.8,73,712.11 కోట్లు ఉండగా, 2022-23 నాటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.13,17,728.15 కోట్లుకు పెరిగింది. అంటే నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 4.44 లక్షల కోట్ల మేర పెరిగింది. నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ 50.81 శాతం పెరగ్గా ఏటా సగటున వార్షిక వృద్ధి 12.70 శాతం నమోదైంది.







- రైతన్నను అక్కున చేర్చుకున్న రైతు భరోసా కేంద్రాలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో సిరులు కురిపిస్తున్న పల్లె మాగాణులు.. నేడు సీజన్ ముందుగానే నాణ్యమైన ఉత్పాదకాలు అందజేత
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్దపీట

అన్నదాతకు అభయం



సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) అన్నదాతకు అభయమిస్తున్నాయి. రాత్రనకా, పగలనకా సేద్యం చేసి ఉత్పత్తి చేసిన పంటలకు గిట్టుబడి లేక సతమతమయ్యే రైతన్న పాలిట భరోసా కల్పిస్తున్నాయి. విత్తు నుంచి పంట విక్రయం వరకు ప్రతీ రైతును గ్రామస్థాయిలో చేయి పట్టి నడిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఎండనక, వాననక సొసైటీల వద్ద పడిగాపులు పడితే తప్ప విత్తనాలు దొరికేవి కావు. కానీ ప్రస్తుతం ఆర్బీకేల రాకతో రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎరువుల కోసం అర్రులు చాస్తూ క్యూలైన్లలో నిలబడే దృశ్యాలు మచ్చుకైనా కన్పించడం లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి పెద్ద పీట వేసి వాటి స్వరూపాన్ని మార్చేసింది. వ్యవసాయాన్ని పండగ చేసి చూపించింది.

నాటికి... నేటికీ కొనుగోళ్లు చెల్లింపులు ఇలా...

అంశం	టీడీపీ పాలనలో	వైఎస్సార్‌సీపీ పాలనలో
కొనుగోలు చేసిన ధాన్యం	2.65కోట్ల టన్నులు	3.16కోట్ల టన్నులు
చెల్లించిన మొత్తం	రూ. 43,134కోట్లు	రూ. 61వేల కోట్లు
గోతాలు ఇతరత్రా సాయం	---	రూ. పదివేలు
కొనుగోలు చేసిన ఇతర ఉత్పత్తులు	9లక్షల టన్నులు	21.59లక్షల టన్నులు
చెల్లించిన మొత్తం	రూ. 3,322 కోట్లు	రూ.7751.43 కోట్లు
పొగాకుకు చెల్లించిన మొత్తం	----	రూ. 139.90కోట్లు
పత్తికి చెల్లించిన మొత్తం	---	రూ. 1789కోట్లు

ఆర్బీకేల్లో పురుగు మందుల వివరాలు
- రైతుల సంఖ్య: 1.51 లక్షలు
- లబ్ధి: రూ. 14 కోట్లు
- పంపిణీ చేసిన పురుగు మందులు 1,36 లక్షలు (లీటర్లలో)

ఆర్బీకేల్లో రాయితీలో అందించిన విత్తనాల వివరాలు
- రైతుల సంఖ్య: 54.34 లక్షలు
- లబ్ధి: రూ. 881.47 కోట్లు
- పంపిణీ చేసిన విత్తనాలు: 31.16 లక్షలు (క్వింటాళ్లలో)

- ఆర్బీకేలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్లు - 421 వాటికైన ఖర్చు-రూ.63.15 కోట్లు
- ఈ సెంటర్లలో సేవలు పొందిన రైతులు-4 లక్షల మంది
- రూ.5.37 కోట్లతో ఏర్పాటైన శీతల గిడ్డంగుల సంఖ్య: 43

30.99 లక్షల మంది రైతులకు రూ.1,289.52 కోట్ల విలువైన 11.66 లక్షల టన్నుల ఎరువులు పంపిణీ

40 శాతం సబ్సిడీపై అందించిన యంత్రాలు రూ. 1,052.16 కోట్లతో
- ట్రాక్టర్లు - 6,362
- కంబైన్డ్ హార్వెస్టర్లు - 491
- ఇతర వ్యవసాయ పనిముట్లు - 36,153

రైతన్నకు భరోసా ఇలా..

రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలు 6.19 లక్షల మందికి రూ.715.84 కోట్లు

క్లెయిమ్‌లు, సెటిల్‌మెంట్లు, చెల్లింపుల్లో తొలి ఏడాది రైతుల వాటాతో కలిపి ప్రభుత్వం చెల్లించిన బకాయిలు - రూ.971 కోట్లు

ఏటా సగటున 13.62 లక్షల మందికి రూ.1,950.51 కోట్ల చొప్పున నాలుగేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు చేకూరిన లబ్ధి - రూ.7,802.05 కోట్లు

2023-24 రూపాయి ప్రీమియంతో బీమా కల్పిస్తూ ఏపీ మోడల్‌లో నడిచే రాష్ట్రాలు- మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ

ఏపీ మాదిరిగా ఈ పంట నమోదు చేస్తున్న రాష్ట్రాలు - తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర

- ఈ- పంట నమోదే అర్హతగా ఉచితంగా బీమా కవరేజ్ కల్పిస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి శ్రీకారం.
- భూముల్లేని కౌలుదారులకు ఈ-క్రాప్ ప్రామాణికంగా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు
- ఎన్నికల హామీ మేరకు 2019 ఖరీఫ్ సీజన్‌లో రూపాయి ప్రీమియంతో పథకం
- రూ.లక్ష లోపు రుణాలు తీసుకుని చెల్లించిన రైతుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీ జమ
- ఏటా లబ్ధిదారుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తూ అభ్యంతరాలు పరిష్కారం
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా 3 విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం
- ప్రతి ఎకరాకు ఈ క్రాప్ ఆధారంగా యూనివర్శల్ బీమా కవరేజ్‌ను కల్పిస్తోన్న ఏకైక రాష్ట్రం ఏపీయే
- ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయే రైతులకు సీజన్ చివరలో ఇన్‌పుట్ సబ్సిడీ
- 2022-23 నుంచి ఫసల్ బీమాతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు
- యూనివర్సల్ కవరేజ్‌కు కేంద్రం అంగీకరించకపోవడంతో మొత్తం బీమా పరిహారం ప్రభుత్వమే చెల్లింపు
- సీజన్‌కు ముందుగానే వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం

ఆదర్శం.. ‘ఫిష్ ఆంధ్ర’

- రాష్ట్రంలో ఏటా 50 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తులతో దేశంలోనే మొదటి స్థానం.
- ఏటా 4.36 లక్షల టన్నులున్న మత్స్య ఉత్పత్తుల స్థానిక వినియోగాన్ని 2025 నాటికి కనీసం 15 లక్షల టన్నులకు పెంచాలన్న సంకల్పానికి పదును.
- రూ.కోటి అంచనాతో జిల్లాకో ఆక్వా హబ్..
- జిల్లాకొకటి చొప్పున 26 ఆక్వా హబ్‌లు. 4,007 ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్స్
- 351 డెయిలీ, 149 సూపర్, 62 లాంజ్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యం
- వీటికి అనుబంధంగా రిటైల్ మినీ అవుట్‌లెట్స్, ఈ మొబైల్ త్రీ వీలర్, 4 వీలర్ ఫిష్ వెండింగ్ డెయిలీ యూనిట్లు, ఏర్పాటు.

‘ఫిష్ ఆంధ్ర’లో ఏమేమి దొరుకుతాయి...

- మెత్తళ్లు, పండుగప్పలు, కాలువ రొయ్యలు, సముద్ర పీతలు, టూనా, కోనాం చేపలు ఇలా ఏది కావాలన్నా తాజాగా బతికున్నవి లభ్యం. రాయలసీమ ప్రాంతంలో సముద్ర మత్స్య ఉత్పత్తులకు డిమాండ్ క్రమేపీ పెరుగుదల.

ఆక్వా రైతు ఆనందం

ఈ-ఫిష్ సర్వే ఆధారంగా రాష్ట్రంలో ఆక్వా సాగు పరిస్థితి

- సాగు విస్తీర్ణం: 4,65,877.54 ఎకరాలు
- ఆక్వాజోన్ పరిధిలోని భూమి: 4,22,309.63 ఎకరాలు
- పదెకరాల లోపు విస్తీర్ణం: 3,56,278 ఎకరాలు
- పదెకరాల పైబడి విస్తీర్ణం: 6,60,321.63 ఎకరాలు
- నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూమి: 43,567.91 ఎకరాలు
- పదెకరాల లోపు విస్తీర్ణం: 23,042.02 ఎకరాలు
- పదెకరాలకు పైబడి విస్తీర్ణం: 20,524.89 ఎకరాలు
- మొత్తం విద్యుత్ కనెక్షన్లు: 64,645
- సబ్సిడీ పరిధిలోని కనెక్షన్లు: 50,659



అక్కచెల్లెమ్మలు హ్యాపీ

ఆసరా, చేయూతతో మహిళా వికాసం

ఏపీలో 91 శాతానికి పైగా సంఘాలు ఏ, బీ గ్రేడ్‌లో..

చంద్రబాబు హయాంలో కుదేలైన పొదుపు సంఘాలకు తిరిగి జీవం

డ్వాక్రా మహిళలకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.19,178.17 కోట్ల రుణాలు అందజేత

వైఎస్సార్‌ చేయూత ద్వారా 16,44,029 మంది మహిళలకు జీవనోపాధి

26.39 లక్షల మంది మహిళలకు మూడేసి విడతల్లో రూ.14,129.11 కోట్లు పంపిణీ



లక్షలాది మంది మహిళలకు సీఎం జగన్‌ ఓ సోదరుడిలా అండగా నిలిచారు. వైఎస్సార్‌ చేయూత, ఆసరా వంటి చరిత్రాత్మక పథకాలకు రూపకల్పన చేసి వారి జీవితాల్లో వెలుగు నింపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయి కుదేలైన పొదుపు సంఘాల మహిళలందరినీ ఆదుకునేందుకు సీఎం జగన్‌ 'ఆసరా' పథకాన్ని అమలు చేశారు. పొదుపు సంఘాల మహిళలకు రుణ విముక్తి కలిగించి ఆర్థికంగా బలోపేతం చేశారు. వైఎస్సార్‌ సున్నా వడ్డీ పథకం తిరిగి ప్రవేశపెట్టారు.

-సాక్షి, అమరావతి

'చేయూత' ఇలా..

- వైఎస్సార్‌ చేయూత పథకం ద్వారా ఇప్పటికే 16,44,029 మంది మహిళలకు లబ్ధి.
- వివిధ రకాల వ్యాపారాలు, శాశ్వత జీవనోపాధుల ద్వారా స్థిర ఆదాయం.
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 45–60 ఏళ్ల మధ్య వయసు మహిళలకు వైఎస్సార్‌ ఆసరా పేరుతో వినూత్న పథకం.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు చేయూత పథకం ద్వారా ఒక్కొక్కరికి ఏటా రూ. 18,750ల చొప్పున నాలుగేళ్లలో రూ. 75 వేల ఆర్థిక సహాయం.
- ఈ పథకం ద్వారా 26.39 లక్షల మంది మహిళలకు మూడేసి విడతలుగా రూ. 14,129.11 కోట్లు అందజేత.
- మహిళలు శాశ్వత జీవనోపాధి పొందేలా వ్యాపారాలకు పెట్టుబడి తోడ్పాటు అందించేందుకు హిందూస్థాన్‌ యూనీలీవర్, ప్రోక్టర్‌ అండ్‌ గ్యాంబల్, ఐటీసీ, రిలయెన్స్‌



వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందం.
- కోటి మంది మహిళల అప్పు తీరేలా.. 'ఆసరా' పథకం ద్వారా 2019 ఎన్నికలు జరిగిన ఏప్రిల్‌ 11 నాటికి పొదుపు సంఘాల పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉండే అప్పు 4 విడతల్లో చెల్లింపు.
- బ్యాంకర్ల లెక్కల ప్రకారం మహిళల పేరిట రూ. 25,517 కోట్ల అప్పు... ఇప్పటికే 3 విడతల్లో రూ.19,178.17 కోట్లు అందజేత.
- వైఎస్సార్‌ సున్నా వడ్డీ పథకం పునఃప్రారంభంతో పొదుపు సంఘాల మహిళలకు ఊతం. చంద్రబాబు హయాంలో 60 శాతం పైబడి సంఘాల సీ, డీ గ్రేడ్‌లకే పరిమితం. ఇప్పుడు రాష్ట్రంలో 91 శాతానికి పైగా సంఘాలు ఏ, బీ గ్రేడ్‌లో..



జలాభిషేకం

పులిచింతల ఫుల్‌ 2019 ఆగస్టులో తొలిసారిగా 45.77 టీఎంసీల నిల్వ

రూ.500 కోట్లు తెలుగుగంగ ప్రధాన కాలువ, లింక్‌ కెనాల్‌ లైనింగ్‌ పూర్తి

- వరుసగా నాలుగేళ్లుగా కోటి ఎకరాలకు సాగునీరు
- సంగం, నెల్లూరు బ్యారేజ్‌లు, లక్కవరం ఎత్తిపోతల, అవుకు రెండో టన్నెల్‌ జాతికి అంకితం
- తుది దశలో వెలిగొండ.. కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌
- పులిచింతల, సోమశిల, కండలేరు, గండికోట, బ్రహ్మంసాగర్, చిత్రావతిలో గరిష్టంగా నిల్వ
- పోలవరంలో తప్పిదాలను సరిదిద్దుతూ వేగంగా సీఎం జగన్‌ అడుగులు

- వైఎస్సార్‌ చేపట్టిన సంగం, నెల్లూరు బ్యారేజ్‌లలో మిగిలిన పనులను సీఎం జగన్‌ పూర్తి చేసి 2022లో జాతికి అంకితమిచ్చారు.
- హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి నీటిని ఎత్తిపోసి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చెరువులను నింపడం ద్వారా లక్కవరం ఎత్తిపోతల పథకాన్ని సీఎం జగన్‌ పూర్తి చేసి సెప్టెంబరు 18న జాతికి అంకితం చేశారు.
- గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు వద్ద రెండో టన్నెల్‌ను పూర్తి చేసి నవంబర్‌ 30న జాతికి అంకితం చేశారు. ప్రస్తుత డిజైన్‌ మేరకు 20 వేల క్యూసెక్కులు తరలించేందుకు మార్గం సుగమం చేశారు.
- వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగంలో మిగిలిన 2.833 కి.మీ. పనులను 2021 జనవరి 13 నాటికే సీఎం జగన్‌ పూర్తి చేశారు. రెండో సొరంగంలో మిగిలిన 7.698 కి.మీ.లో 7.506 కి.మీ. పనులు పూర్తయ్యాయి. మిగిలిన 192 మీటర్ల పనులు పూర్తి చేసి సొరంగాలను జాతికి అంకితం చేయనున్నారు.
- విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కమీషన్ల దాహంతో పోలవరాన్ని నీరుగార్చారు. జగన్‌ అధికారంలోకి వచ్చాక అప్రోచ్‌ ఛానల్, స్పిల్‌వే, స్పిల్‌ ఛానల్, పైలట్‌ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్‌ డ్యామ్‌లను పూర్తి చేసి 2021లో గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా మళ్లించారు. బాబు అవినీతితో ఈసీఆర్‌ఎఫ్‌ డ్యామ్‌ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను పూడ్చి యథాస్థితికి తెచ్చే పనులను వేగవంతం చేశారు.

కడలి పాలవుతున్న నదీ జలాలను బంజరు భూములకు మళ్లించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా దివంగత వైఎస్సార్‌ జలయజ్ఞం చేపట్టగా ఆయన తనయుడు సీఎం జగన్‌ ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నారు. ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా జలయజ్ఞం ఫలాలను రైతులకు అందిస్తున్నారు. కోవిడ్, ఆర్థిక ఇబ్బందుల్లోనూ సాగునీటి పనులను పరుగులెత్తించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 2019, 2020, 2021, 2022 ఖరీఫ్, రబీతో కలిపి ఏటా కోటి ఎకరాలకు సీఎం జగన్‌ నీళ్లందించారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రాష్ట్రంలో ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందించడంతో రైతులు భారీ ఎత్తున పంటలు సాగు చేశారు. రికార్డు స్థాయిలో ధాన్యపు దిగుబడులతో ఏపీని మళ్లీ దేశ ధాన్యాగారం (రైస్‌ బౌల్‌ ఆఫ్‌ ఇండియా)గా సీఎం జగన్‌ నిలిపారు.

-సాక్షి, అమరావతి

నీటి పారుదలలో రికార్డు

కృష్ణా డెల్టా వరదాయిని పులిచింతల ప్రాజెక్టును దివంగత వైఎస్సార్‌ సాకారం చేశారు. గత సర్కారు నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల 2019 వరకూ పూర్తి స్థాయిలో 45.77 టీఎంసీలను నిల్వ చేయలేని దుస్థితి నెలకొంది. నిర్వాసితులకు వేగంగా పునరావాసం కల్పించిన సీఎం జగన్‌ 2019 ఆగస్టులోనే పులిచింతలలో 45.77 టీఎంసీలను నిల్వ చేసి కృష్ణా డెల్టాలో రెండో పంటకూ నీళ్లందించేందుకు మార్గం సుగమం చేశారు.

గత సర్కారు నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్, సోమశిల, కండలేరులో కూడా పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడింది. సీఎం జగన్‌ గండికోట నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లతో, చిత్రావతి బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ నిర్వాసితులకు రూ.250 కోట్లతో పునరావాసం కల్పించారు. దీంతో గండికోటలో 26.85 టీఎంసీలు, చిత్రావతిలో పది టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.

తెలుగుగంగ ప్రధాన కాలువ, లింక్‌ కెనాల్‌కు రూ.500 కోట్లతో లైనింగ్‌ చేయడం ద్వారా సకాలంలో వెలిగోడు, బ్రహ్మంసాగర్‌ను నింపడానికి సీఎం జగన్‌ మార్గం సుగమం చేశారు. బ్రహ్మంసాగర్‌ మట్టికట్టకు డయాఫ్రమ్‌ వాల్‌ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేసి పూర్తి స్థాయిలో 17.74 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.

గత నాలుగున్నరేళ్లలో ఆరు రిజర్వాయర్లలో గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వకు మార్గం సుగమం చేయడం ద్వారా నీటి పారుదల రంగ చరిత్రలో సీఎం జగన్‌ రికార్డు సృష్టించారు.



ఉత్తరాంధ్ర వైభోగాపురం

సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం

సీఎం వైఎస్‌ జగన్‌ భూమి పూజతో శరవేగంగా నిర్మాణ పనులు

2025 నాటికి మొదటి దశ పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం

వాణిజ్య, పర్యాటక రంగాలు సహా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రపంచస్థాయి సౌకర్యాలతో విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. ఈ ఏడాది మే 3న సీఎం వైఎస్‌ జగన్‌ భూమిపూజ చేయగా.. పనులు పురోగతిలో ఉన్నాయి. జీఎంఆర్‌ గ్రూప్‌ పీపీపీ విధానంలో ఇక్కడ విమానాశ్రయ నిర్మాణాన్ని చేపట్టింది. 2025 నాటికి మొదటి దశ పూర్తి చేయాలనే లక్ష్యం. విమానాశ్రయ నిర్మాణానికి సేకరించిన 2,203.26 ఎకరాల భూమిని ప్రభుత్వం జీఎంఆర్‌కు స్వాధీనం చేసింది. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ల్యాండ్‌ ఫిల్లింగ్‌ చేస్తున్నారు. 3,800 మీటర్ల పొడవున రన్‌వేతో పాటు సమాంతరంగా ట్యాక్సీ వే కూడా నిర్మించనున్నారు. 5 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రత్యేక కార్గో విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.



ఆర్థిక ప్రగతికి దోహదం


ఏడాదికి 4 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సొంతం. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రం నుంచి దేశీయ, విదేశీ విమానయానం మరింత ఊపందుకుంటుంది. ఇంటర్నేషనల్, డొమెస్టిక్‌ కార్గో టెర్మినల్‌ కూడా అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే ఉత్తరాంధ్రలో ఉన్న ఫార్మా తదితర పరిశ్రమల విస్తరణకు, ఎగుమతుల ప్రోత్సాహకానికి ఉపయోగపడుతుంది. వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. విశాఖపట్నం పోర్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకూ ప్రభుత్వ పరిశీలనలోనున్న భీమిలి బీచ్‌ కారిడార్‌ కార్యరూపం దాల్చితే ఈ ప్రాంతంలో మల్టీ మోడల్‌ లాజిస్టిక్‌ నెట్‌వర్క్‌ పెరగడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం ఏర్పడుతుంది.

ప్రభుత్వ తోడ్పాటు ఇలా...

- రూ.835.48 కోట్లతో భూసేకరణ పూర్తి. నిర్వాసితులైన నాలుగు గ్రామాల్లోని 404 కుటుంబాలకు రూ.67.04 కోట్లతో అన్ని మౌలిక వసతులున్న రెండు పునరావాస కాలనీల నిర్మాణం.
- ప్రతి కుటుంబానికి 240 చదరపు గజాల ఇంటిస్థలం, అక్కడ నిర్మాణం పూర్తి చేసుకోవడానికి రూ.9.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం.
- విమానాశ్రయానికి ఏటా 5 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయడానికి ఒప్పందం. తక్షణమే 1.70 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు సంబంధించిన పనులను పూర్తి చేయడానికి రూ.5.30 కోట్లు మంజూరు.
- 2.5 మిలియన్‌ యూనిట్ల విద్యుత్‌ సరఫరా ఏర్పాట్లకు రూ.2.62 కోట్లు మంజూరు.
- విమానాశ్రయానికి సేకరించిన భూమిలో విద్యుత్‌ లైన్లు, స్తంభాల స్థల మార్పిడికి రూ.2.30 కోట్ల వ్యయం.
- స్టాఫ్‌ క్వార్టర్ల నిర్మాణానికి భోగాపురం మండలం బసవపాలెం వద్ద 24.30 ఎకరాల భూమి కేటాయింపు.
- 132/133 కేవీ సబ్‌స్టేషన్‌ నిర్మాణానికి భోగాపురం మండలం కొంగవానిపాలెం వద్ద 5.47 ఎకరాల భూమి కేటాయింపు.

నెరవేరిన కల.. ఇళ్లతో కళకళ





-సాక్షి, అమరావతి

తమకంటూ ఓ పక్కా ఇల్లు ఉండాలనేది ప్రతి పేదింటి మహిళ స్వప్నం. ఈ కల నెరవేర్చుకోలేని పేదరికంలో ఉన్న అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం' కింద ఉచితంగా స్థలాలు ఇవ్వడంతోపాటు, ఇంటి నిర్మాణానికి అండగా నిలిచారు.

- మహిళల పేరిట ఏకంగా 30.7 లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ తో దేశంలో ఓ రికార్డు
- ఇంటి స్థలాల పంపిణీ కోసం రాష్ట్రంలో 17,005 వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో ఏకంగా కొత్త ఊళ్లు నిర్మాణం.
- 71,811.49 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన స్థలాల మార్కెట్ విలువ రూ.2.5 – రూ.5 లక్షల పైనే
- కనిష్ఠంగా రూ.75 వేల కోట్లు నుంచి గరిష్ఠంగా రూ.1.5 లక్షల కోట్ల విలువైన భూమి పేదల చేతుల్లో..
- టీడీపీ, ఎల్లో మీడియా, దుష్ట పన్నాగాలను ఛేదిస్తూ ముమ్ముందుకే...
- ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి ప్రతి మహిళకూ కనిష్ఠంగా రూ.7 – రూ.10 లక్షలకుపైగా స్థిరాస్తి

చకచకా నిర్మాణాలు

- రెండు దశల్లో కలిపి 21.75 లక్షలకుపైగా గృహ నిర్మాణాలకు అనుమతులు.
- ఈ ఏడాది అక్టోబర్ 12వ తేదీ నాటికి 7.43 లక్షల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేత.

ఉచితంగా స్థలం.. ఆపై సాయం

- ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు.
- స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణ సాయం.
- ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడంతోపాటు 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా
- రూ.40 వేలు చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున అదనంగా లబ్ధి.

వసతుల రూపంలో మరో రూ.1.5 లక్షలు

- ఉచితంగా స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షల చొప్పున ప్రయోజనం.
- ప్రతి ఇంటికీ ఉచితంగా మౌలిక సదుపాయాల కల్పన ద్వారా మరో రూ.1.70 లక్షల మేర అదనపు లబ్ధి.
- ఉచితంగా నీటి, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇవ్వడం, డ్రైన్లు, రోడ్లు లాంటి వసతుల కల్పన.

పథకం అమలులో కీలక ఘట్టాలు ఇలా...

- **2020 డిసెంబర్:** 25 లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ. తొలిదశలో 15.60 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు.
- **28 ఏప్రిల్ 2022:** రెండో దశకు శ్రీకారం. 1.24 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ. 3.53 లక్షల ఇళ్లకు అనుమతులు.
- **27 మే 2023:** సీఆర్‌డీఏలో 1,402.58 ఎకరాలు 50,793 మందికి పంపిణీ.
- **12 అక్టోబర్ 2023:** 7.43 లక్షల ఇళ్లు లాంఛనంగా లబ్ధిదారులకు అందజేత.

వ్యయం రూ.కోట్లలో...

నీటి సరఫరా	3,847.18
విద్యుత్	4,431.26
ఇంటర్నెట్	707.48
రోడ్లు	10,408
డ్రైన్లు	5,927.78
ఆర్చ్‌లు	347.34
ఇంకుడు గుంతలు	108
ఫేజ్ 2	7,131.96
మొత్తం	32,909


ఊరూరా కొత్త భవనాలు



మౌలిక వసతుల కల్పనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ సేవలతో పాటు వైద్యపరంగా, రైతులకు ఎక్కడికక్కడే సేవలు
- ప్రతి చోటా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం

సాక్షి, అమరావతి : అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టారు. వినూత్నంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చారు. పేదలందరికీ అన్ని సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పరమైన సేవలతో పాటు వైద్యపరంగా, రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు వారికి అందేలా చూస్తున్నారు. అందుకనుగుణంగా ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పూనుకున్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ఆరంభంలోనే ఇటీవలే కొత్తగా నిర్మాణం పూర్తయిన, దాదాపు నిర్మాణం పూర్తవుతున్న దశలో ఉన్న భవనాలు దర్శనమిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం రెండతస్తుల గ్రామ సచివాలయాల భవనాలను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించేలా హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లలో అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరికరాలను కూడ ప్రభుత్వం సరఫరా చేసింది.



భవనం	నిర్మాణం దాదాపు పూర్తయినవి	పారంభోత్సవం చేసినవి
గ్రామ సచివాలయాలు	9585	6765
రైతు భరోసా కేంద్రాలు	7436	5211
హెల్త్ క్లినిక్‌లు	5,414	2980
మొత్తం	22435	14956

జిల్లాల పాలన సరి 'కొత్త'గా..

అధికార వికేంద్రీకరణే ప్రభుత్వ లక్ష్యం	ప్రజా మనోభావాలకూ ప్రాధాన్యం	అదనంగా 13 జిల్లాల ఏర్పాటుతో సుపరిపాలన
పునర్వ్యవస్థీకరణతో సాహసోపేత నిర్ణయం	పార్లమెంట్ నియోజకవర్గ యూనిట్‌గా విభజన	కొత్త జిల్లాలకు మహనీయుల పేర్లు
సంస్కరణలతో పాలన మరింత సులభతరం	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రెవెన్యూ డివిజన్‌గా కుప్పం ఆవిర్భావం	ఎన్టీఆర్‌ను విస్మరించిన టీడీపీ సర్కారు
ఆదివాసీలకు అందలం		
సొంత నియోజకవర్గాన్ని సైతం పట్టించుకోని చంద్రబాబు	కృష్ణా జిల్లాకు ఆయన పేరు పెట్టిన జగన్ ప్రభుత్వం	

అంశం	గతం	ప్రస్తుతం
జిల్లాలు	13	26
రెవెన్యూ డివిజన్లు	51	78

చరిత్రలో నిలిచిపోయేలా..

దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం

వలంటీర్లతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

నేనున్నానంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పేదలకు భరోసా ఇచ్చారు. మడమ తిప్పను..మాట తప్పను.. అంటూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలిరోజే గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలను ప్రకటించి సంచనల సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నగరాల్లో నివసించే వారి రీతిలోనే ఏపీలో మన్యంలో కొండలపై నివసించే కుగ్రామాల ప్రజలకు సైతం వారి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలను చేరువచేశారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పించారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జరిగిన పాలనతో పోల్చితే నాలుగున్నరేళ్ల జగన్ పాలన కచ్చితంగా పూర్తి భిన్నమైనది. పారదర్శకంగా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలందుతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల వ్యవస్థతో వైఎస్ జగన్ తన పేరును దేశ చరిత్రలో చిరస్థాయిగా లిఖించుకున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.



- సాక్షి, అమరావతి

సచివాలయాల స్వరూపం..

గ్రామ సచివాలయాలు	10,960
వార్డు సచివాలయాలు	4,044
శాశ్వత ఉద్యోగులు	1,34,694
వలంటీర్లు	2,55,457
ప్రత్యేక కేబుల్ వసతి ఇంటర్‌నెట్	14,095
టెలిఫోన్ సిగ్నల్ ద్వారా నెట్	909
ప్రజలకు అందిన సేవల సంఖ్య	9.74 కోట్లు
అందుతున్న సేవల రకాలు	722
కంప్యూటర్లు	30,004
యూపీఎస్‌లు	15,004
ప్రింటర్లు	15,004
స్మార్ట్ ఫోన్లు	29,592
లామినేషన్ మిషన్లు	16,851
ఫింగర్ ప్రింట్ స్కానర్లు	2,86,646
మొబైల్ ఫోను సిమ్‌లు	2,91,592
ఆధార్ కిట్లు	3,000

హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తో సచివాలయాల అనుసంధానం	2020 జనవరి 26 న సచివాలయ సేవలు ప్రారంభం.

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా దశలవారీగా సచివాలయాల్లోనే చేపట్టేలా ప్రణాళికలు

ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున వలంటీర్లు	అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సేవలు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అందజేత

ఠంచనుగా ఒకటో తేదీనే ఇళ్లకు వెళ్లి అవ్వాతాతల చేతిలో పెంఛన్ సొమ్ము



డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో సీఎం బటన్ నొక్కగానే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ

నాడు ప్రభుత్వాసుపత్రుల్లో శిశువులను ఎలుకలు పీక్కుతిన్న అధ్వాన పరిస్థితులు.. సెల్‌ఫోన్‌ లైట్‌ వెలుతురులో సర్జరీలు చేసిన ఘటనలు.. విపరీతమైన సిబ్బంది కొరత.. వెరసి ప్రభుత్వాసుపత్రులపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం అడుగంటింది..

నేడు సర్కారీ వైద్యం ప్రజలకు అత్యంత చేరువైంది. నాడు–నేడుతో ప్రభుత్వాసుపత్రులు కార్పొరేట్‌ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా మారాయి. 53 వేలకుపైగా పోస్టుల భర్తీ. అటకెక్కిన ఆరోగ్యశ్రీ మళ్లీ పట్టాలెక్కింది. పిలవగానే పలికే అంబులెన్సులు. గ్రామ స్థాయిలో ఆరోగ్య శిబిరాలు. ఇలా నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజారోగ్య ముఖచిత్రాన్ని సీఎం వైఎస్‌ జగన్‌ సమూలంగా మార్చేశారు.

'నాడి' పట్టిన నేత..

ప్రజారోగ్య ముఖచిత్రం మార్చిన సీఎం వైఎస్‌ జగన్‌

- గ్రామస్థాయికి ప్రభుత్వ వైద్యసేవల విస్తరణ
- వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి విప్లవాత్మక సంస్కరణలు
- అంతంతమాత్రంగా ఉన్న 108, 104 సేవలకు జవసత్వాలు
- ఆరోగ్యశ్రీ పథకం కింద 3,257 ప్రొసీజర్లతో ఉచిత వైద్యం

2019కి ముందు చిన్న జబ్బు చేసినా ప్రజలు పట్టణాలు, నగరాల్లోని ప్రైవేట్‌ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి. ఇప్పుడు అందుకు పూర్తి భిన్నం. ఏకంగా రూ.16 వేల కోట్లకుపైగా నిధులతో నాడు–నేడు కింద వివిధ కార్యక్రమాలను చేపట్టారు. గతంలో పడకేసిన డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని ప్రజల ఆరోగ్యానికి రెట్టింపు భరోసా కల్పిస్తున్నారు. పథకంలో ఏకంగా 3,257 వైద్య ప్రొసీజర్లు అందుబాటులో తీసుకొచ్చారు. అంతేకాక.. దేశంలో ఎక్కడా లేనట్లుగా వైద్యులే ప్రజల వద్దకు వెళ్లి చికిత్సలు అందించే ఫ్యామిలీ డాక్టర్‌ విధానాన్ని సీఎం జగన్‌ ప్రవేశపెట్టారు.

– సాక్షి, అమరావతి



ఆరోగ్యశ్రీ బలోపేతం ఇలా..

- 2014–19 మధ్య ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్లు 1,059
- వైఎస్‌ జగన్‌ సర్కార్‌ కొత్తగా చేర్చిన ప్రొసీజర్లు 2,198
- వైద్యం ఖర్చు రూ. వెయ్యి దాటే ప్రతి చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు.
- 2019 నుంచి ఈ ఏడాది నవంబరు వరకు ఆరోగ్యశ్రీలో వైద్యం పొందినవారు– 37,40,525 మంది
- వీరికి వైద్యం కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం – రూ. 11,859.96 కోట్లు
- ఆరోగ్య ఆసరా కోసం వెచ్చించిన మొత్తం – రూ.1,309.90 కోట్లు
- నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం చేసిన ఖర్చు– రూ.13,169.86 కోట్లు
- ఆరోగ్యశ్రీకి 2014–19 మధ్య గత టీడీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు– రూ. 5,177.38 కోట్లు
- కరోనాకు సంబంధించిన 10 రకాల చికిత్సలను 2021 మే, జూన్‌ నెలల్లో ఆరోగ్యశ్రీలోకి చేర్చారు.
- రెండు లక్షల మందికిపైగా కరోనా బాధితులకు ఉచితంగా చికిత్స అందించారు.
- కోవిడ్‌ బాధితుల చికిత్స కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.744 కోట్లు.

ప్రజారోగ్యానికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష..

- రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శిబిరాలు 12,423
- సొంత గ్రామంలోనే చికిత్స పొందినవారు 60.27 లక్షలు
- మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్‌ చేసింది 86,690 మంది
- కేటరాక్ట్‌ సర్జరీలు నిర్వహించింది 78,292 మందికి

నాడు-నేడులో పనులు..

- రూ.1,692 కోట్లతో 10,032 వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ల ఏర్పాటు.. వీటి ద్వారా 12 రకాల వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు గ్రామంలోనే అందుతున్నాయి.
- రూ.664.96 కోట్లతో పీహెచ్‌సీల బలోపేతం చేశారు. 983 పీహెచ్‌సీ భవనాలకు మరమ్మతులు చేయడంతో పాటు 150 కొత్త భవనాలను నిర్మించారు. కొత్తగా 176 పీహెచ్‌సీల ఏర్పాటు. ప్రతి పీహెచ్‌సీలో 63 రకాల వైద్య పరీక్షలు, 215 రకాల మందులను అందుబాటులోకి తెచ్చారు.
- రూ. 374.61 కోట్లతో 528 వైఎస్సార్‌ పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు. వీటి కోసం 184 భవనాలకు మరమ్మతులు, 344 కొత్త భవనాల నిర్మాణం.
- రూ.682 కోట్లతో 42 ఏరియా ఆస్పత్రులు, రూ.13 కోట్లతో ఎంసీహెచ్‌/జిల్లా ఆస్పత్రులు, రూ.528 కోట్లతో 121 సీహెచ్‌సీల బలోపేతం చేశారు.
- రూ.246 కోట్లతో రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ఐదు ట్రైబల్‌ మల్టీ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు..
- రూ. 272 కోట్లతో కడపలో క్యాన్సర్, మెంటల్‌ హెల్త్, సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం..
- రూ.85 కోట్లతో శ్రీకాకుళం జిల్లా పలాసలో డాక్టర్‌ వైఎస్సార్‌ కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌ ఏర్పాటుచేశారు.



17 వైద్యకళాశాలల ఏర్పాటుతో నూతన అధ్యాయం

మన విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలను మెరుగుపరచడంతో పాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సూపర్‌ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేస్తూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో తన ముద్ర చూపించారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా వైద్యవిద్యకు పెద్దపీట వేశారు.

- రూ. 8,480 కోట్లతో 17 కొత్త కళాశాలల ఏర్పాటుద్వారా 2,550 ఎంబీబీఎస్‌ సీట్లు.
- 2023లో విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, రాజమహేంద్రవరం వైద్యకళాశాలల ప్రారంభం.
- కొత్త వైద్య కళాశాలలో ఒక్కోచోట 150 చొప్పున మొత్తం 750 ఎంబీబీఎస్‌ సీట్లు అందుబాటులోకి.
- వచ్చే విద్యాసంవత్సరంలో మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని వైద్యకళాశాలల ప్రారంభం.
- ఇక మిగిలిన ఏడు కళాశాలలు 2025–26లో ప్రారంభించడానికి అనుగుణంగా చర్యలు.



108 సేవలకు ఊపిరి..

ఇక వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి 108 అంబులెన్సు సేవలు 336 వాహనాలతో అరకొరగా ఉండేవి. అంటే అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉంటే మండలానికి ఒక అంబులెన్స్‌ కూడా లేని దుస్థితి ఉండేది. ఈ పరిస్థితుల్లో మార్పునకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌ 2020 జూలై 1న 412 కొత్త అంబులెన్సులను ప్రారంభించారు. దీంతో..

- ఒక్కసారిగా ప్రభుత్వ అంబులెన్సుల సంఖ్య 748కు పెరిగింది. ఇందుకోసం మొత్తం రూ.96.5 కోట్లు ఖర్చుచేశారు.
- వీటిలో 2.5 లక్షల కిలోమీటర్లకు పైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో ఈ ఏడాది జూలైలో 146 కొత్త అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చింది. వీటి కొనుగోలుకు మరో రూ.34.79 కోట్లు ఖర్చుచేసింది.
- గిరిజన ప్రాంతాల కోసమే ప్రత్యేకంగా రూ.4.76 కోట్లతో 20 కొత్త అంబులెన్స్‌లను 2022 అక్టోబరులో అదనంగా కొన్నారు. దీంతో 108 అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది.
- ఇలా అంబులెన్స్‌ల కొనుగోలుకు రూ.136.05 కోట్లు ఖర్చుచేశారు. వీటి నిర్వహణ కోసం ఏటా రూ.188 కోట్ల చొప్పున ఖర్చుచేస్తున్నారు.
- ఈ లెక్కన పరిశీలించినట్లయితే నిర్వహణ, కొత్త వాహనాల కొనుగోలు రూపంలో రూ.750 కోట్లకు పైగానే ఖర్చు చేసినట్లయింది.
- మరోవైపు.. గత ప్రభుత్వంలో కేవలం 292 '104' వాహనాలు ఉండగా ఇందులో పాతవాటిని తొలగించి మొత్తం 910 మొబైల్‌ క్లినిక్‌ యూనిట్లను ఈ ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటి నిర్వహణ కోసం గత ప్రభుత్వం కన్నా ఇప్పుడు భారీగా ఖర్చు పెడుతున్నారు.



ఆంధ్రా తీరం.. ఆర్థికంగా ఊతం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ సముద్ర తీరాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి 50 కి.మీకు ఒక్క పోర్టు లేదా ఫిషింగ్‌ హార్బరు (మినీ పోర్టు)లను నిర్మిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి నాలుగు పోర్టులతో పాటు పది ఫిషింగ్‌ హార్బర్లు, ఆరు ఫిష్‌ ల్యాండ్‌ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టి రికార్డు సృష్టించింది. ఇందుకోసం సుమారు రూ.20,000 కోట్లు వ్యయం చేస్తుండటం గమనార్హం. తొలి దశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్‌ హార్బర్ల పనులు దాదాపు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధం కానున్నాయి. ఎగుమతులను ప్రోత్స హించే విధంగా తీర ప్రాంత అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్‌ కూడా ప్రశంసించింది. 2022 సంవత్సరానికి నీతి ఆయోగ్‌ ప్రకటించిన ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో రాష్ట్రం 59.27 పాయింట్లతో 8వ స్థానంలో నిలిచింది. మరోవైపు మత్స్యకారులు చేపల వేటకు గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌ వంటి రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. మరో వైపు పోర్టులను ఆధారంగా చేసుకుని చుట్టుపక్కలా పారిశ్రామిక ప్రగతిని వెదజల్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. సుమారు 8,000 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కుతో పాటు తెట్టు వద్ద కార్గో ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. ఫిషింగ్‌ హార్బర్ల సమీపంలో ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఎగుమతుల్లో 10 శాతం వాటా లక్ష్యం

దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఎగుమతుల్లో 10 శాతం వాటాను చేజిక్కించుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. 2030 నాటికి 10 శాతం మార్కెట్‌ వాటాతో టాప్‌ 3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలవాలన్న లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నెలల కాలంలో రాష్ట్ర వాణిజ్య ఎగుమతుల విలువ రూ. 82,732.65 కోట్ల నుంచి రూ.85,021.74 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా ఎగుమతుల విలువ రూ. 18,17,640.99 కోట్ల నుంచి రూ. 17,42,429.99 కోట్లకు పడిపోవడం గమనార్హం. 2022–23 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్రం రూ.1,59,368.02 కోట్ల ఎగుమతులు చేయడం ద్వారా 4.40 శాతం వాటాతో ఆరో స్థానంలో నిలవగా, ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో రూ. 85,021.74 కోట్ల ఎగుమతులతో దేశ ఎగుమతుల్లో రాష్ట్ర వాటాను 4.88 శాతంకు పెంచుకొని ఐదో స్థానానికి ఎగబాకింది.

- పోర్టులు హార్బర్ల నిర్మాణం కోసం రూ.20,000 కోట్లు
- ఏక కాలంలో నాలుగు పోర్టుల నిర్మాణం
- ప్రారంభానికి సిద్ధంగా రామాయపట్నం పోర్టు
- మిగిలిన మూడు పోర్టుల్లో వేగంగా పనులు
- 10 ఫిషింగ్‌ హార్బర్లు, 6 ఫిష్‌ ల్యాండ్‌ సెంటర్ల అభివృద్ధి

రాష్ట్రంలో **60,000** మత్స్యకార కుటుంబాలకు స్థానికంగానే ఉపాధి

పోర్టులు	తొలిదశ వ్యయం	సామర్థ్యం	విస్తీర్ణం
రామాయపట్నం	రూ.3,736.14కోట్లు	34.04 ఎంటీపీఏ	851.15 ఎకరాలు
మూలపేట	రూ.4,361.91కోట్లు	23.5 ఎంటీపీఏ	1254.72 ఎకరాలు
మచిలీపట్నం	రూ.5,155.73కోట్లు	35.12 ఎంటీపీఏ	1922.97 ఎకరాలు
కేసెజ్‌ పోర్టు	రూ.2,123.43 కోట్లు	16 ఎంటీపీఏ	1944 ఎకరాలు (పీపీపీ విధానంలో)

ఫిషింగ్‌ హార్బర్‌	ప్రాజెక్ట్‌ వ్యయం	మత్స్యకారులకు లబ్ధి	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	రూ.288.80 కోట్లు	6,100	1,250
నిజాంపట్నం	రూ.451 కోట్లు	9,000	1,600
మచిలీపట్నం	రూ.422 కోట్లు	3,300	550
ఉప్పాడ	రూ.361 కోట్లు	17,700	2,500
మంచినీళ్లపేట	డీపీఆర్‌ దశలో ఉంది		
బుడగట్ల పాలెం	రూ.365.80 కోట్లు	3,840	780
పూడిమడక	రూ.392.53 కోట్లు	4,870	930
కొత్తపట్నం	రూ.392.53 కోట్లు	4,200	820
వాడరేవు	రూ.417.55 కోట్లు	9,500	1,650
బియ్యపు తిప్ప	రూ.429.43 కోట్లు	2,348	441
మొత్తం	రూ.3,520.64 కోట్లు	60,858	10,521

ఫిష్‌ ల్యాండింగ్‌ సెంటర్లు

- విశాఖపట్నం జిల్లా భీమిలి
- అనకాపల్లి జిల్లా రాజయ్యపేట, దొండవాక
- విజయనగరం జిల్లా చింతపల్లి
- తిరుపతి జిల్లా రాయదరువు
- కాకినాడ జిల్లా ఉప్పలంక

సీఎం మార్క్ బ్రాండ్ సిటీ

నాలుగున్నరేళ్లలో విశాఖకు కొత్త రూపు



ఐటీ, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సదస్సుతో పెరిగిన ఇమేజ్


- అంతర్జాతీయ గుర్తింపుతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన నగరం
- పెట్టుబడుల స్వర్గధామంగా మార్పు
- సక్సెస్ మంత్రంగా బీచ్ ఐటీ కాన్సెప్ట్
- ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలతో కళకళ
- నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి
- ప్రజల్ని సరికొత్తగా పలకరిస్తున్న రహదారులు, పార్కులు
- ఎన్ఏడీ ఫ్లైఓవర్ పూర్తి.. సిరిపురం జంక్షన్‌లో జోరుగా మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులు
- జీవీఎంసీ పరిధిలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు

టైర్-1 సిటీలతో సాటి

నీతి ఆయోగ్ ఇటీవల వెల్లడించిన పట్టణ సుస్థిర అభివృద్ధి సూచిక ర్యాంకుల్లో విశాఖకు 18వ ర్యాంకు సాధించింది. దేశంలోని రాష్ట్రాల రాజధానులు, 10 లక్షల జనాభా పైబడిన నగరాలు.. మొత్తంగా 56 నగరాలకు ఈ ర్యాంకులు ఇచ్చారు. టైర్-1 సిటీల కంటే ద్వితీయ శ్రేణిలో ఉన్న వైజాగ్.. అందర్నీ ఆకర్షిస్తోంది. స్మార్ట్ సిటీ ర్యాంకింగ్‌లోనూ సత్తా చాటుతోంది. 2018-19లో 23వ ర్యాంకులో ఉన్న నగరం ఆ తర్వాత వరుసగా టాప్-10లోనే కొనసాగుతోంది. ఈ ఏడాది క్లైమేట్ స్మార్ట్ సిటీ ఫ్రేమ్ వర్క్‌లో 4 స్టార్ రేటింగ్ సాధించింది.

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి

సువిశాల సాగరతీరం చెంతనే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఐటీ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి.. సిటీ ఆఫ్ డెస్టినీని ఐటీ హబ్‌గా మార్చాలనే ఉద్దేశంతో.. బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని తొలుత ప్రమోట్ చేయాలని భావించారు. ఇందులో భాగంగానే ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్, అమేజాన్ తదితర ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని విప్రో నిర్ణయించింది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు. ఐటీ రంగంలో తిరుగులేని నగరంగా విశాఖపట్నంని అభివృద్ధి చేసేందుకు ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా.. ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో పాటు సంయుక్త సర్టిఫికేషన్ కోర్సుల్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ చెగ్.. విశాఖలో కొత్త బ్రాంచ్‌ని ప్రారంభించింది. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ స్వయంగా శంకుస్థాపన చేశారు. వైజాగ్ టెక్ పార్క్ కూడా డేటా సెంటర్‌తో పాటు బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీని రూ.21,844 కోట్ల పెట్టుబడితో 39,815 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చింది. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎన్టీపీసీ, ఇంధన రంగంలో హెచ్‌పీసీఎల్, పర్యాటక రంగంలో ఒబెరాయ్, తాజ్, ఇనార్బిట్‌మాల్, టర్బో ఏవియేషన్.. ఇలా.. విభిన్న రంగాల్లో బహుళ ప్రాజెక్టుల్ని ఏర్పాటు చేస్తున్నారు.



ఐటీ ఉద్యోగాల జోరు..

రాష్ట్రంలోని ఐటీ రంగంలో 2014-19 కాలంలో 24,350 ఐటీ ఉద్యోగాల కల్పన జరిగితే ఆ తర్వాత రెండేళ్లు కోవిడ్ వంటి కష్టకాలం ఉన్నప్పటికీ ఈ నాలుగున్నర ఏళ్లల్లో కొత్తగా 29,500 ఉద్యోగాలు వచ్చాయి. దీంతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల సంఖ్య 53,850కు చేరింది.

భూసంస్కరణలతో నవశకం

రైతులకు మేలు చేసేలా రెవెన్యూ శాఖలో సీఎం జగన్ సాహసోపేత నిర్ణయాలు

- కుప్పలు తెప్పలుగా ఉన్న రెవెన్యూ సమస్యలన్నింటికీ పరిష్కారం
- లక్షల ఎకరాలపై ఆంక్షలు తొలగింపు
- నిరుపేదలకు 46 వేలఎకరాల భూముల పంపిణీ.. లంక భూములకు అసైన్‌మెంట్ పట్టాలు
- వివాదాలు లేని భూయాజమాన్యం కోసం భూముల రీ సర్వే
- దేశంలోనే మొదటిసారి ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గతిని మార్చేలా భూములకు సంబంధించి సీఎం జగన్ ఈ నాలుగున్నరేళ్లలో అనేక సంస్కరణలు అమలు చేశారు. భూముల రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా రెవెన్యూ శాఖను సమూలంగా మార్చి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసేందుకు కంకణం కట్టుకున్నారు. లక్షలాది ఎకరాలపై ఉన్న ఆంక్షలను తొలగించారు. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూము లకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంరెవెన్యూ వ్యవస్థలో పెను మార్పులు తెస్తోంది.

రెవెన్యూలో సాధించిన పురోగతి ఇదీ

- భూ పంపిణీలో డీకేటీ పట్టాలు పొందిన వారు - 42,307 మంది
- పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 46,463.82
- లంక భూముల్లో పట్టాలు పొందిన వారి సంఖ్య - 17,768 మంది
- పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 9,064 ఎకరాలు
- దళిత వాడల్లో ష్మశానాల స్థలం లేని గ్రామాలు - 1,563
- ప్రభుత్వ భూమిని ష్మశానాల కోసం కేటాయించిన స్థలం (విస్తీర్ణం) - 951 ఎకరాలు
- చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించడంతో లబ్ధిపొందిన రైతుల సంఖ్య - 1.50 లక్షలు మంది
- వారికి అందించిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 2.06 లక్షలు
- ఈనాం భూములపై ఆంక్షలు తొలగడంతో లబ్ధిపొందినవారు - 1,61,584
- వారికి పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) 1,58,113 ఎకరాలు
- భూమికొనుగోలు పథకంలో లబ్ధిపొందిన దళితులు - 22,347
- పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 22,837 ఎకరాలు
- శాశ్వత భూ హక్కు పథకంలో పూర్తయిన రీ సర్వే గ్రామాలు - 4 వేలు
- పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలు - 20 లక్షలు
- భూముల సరిహద్దులు గుర్తిస్తూ పాతిన రాళ్లు - 50 లక్షలు







Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ

The Andhra Pradesh Mineral Development Corporation Ltd.

మైనింగ్ రంగాన్ని వైవిధ్యభరితమైన సంస్కరణలతో అభివృద్ధి పథంలో పయనింపచేస్తూ, బెరైటీస్, గ్రానైట్, బొగ్గు మరియు ఇతర ఖనిజాల ఎగుమతులకు అనుకూలంగా పోర్టులు, అనుబంధ ప్రాసెసింగ్ & ఇతర సంస్థల ఏర్పాటుకు తోడ్పడుతూ, వినూత్న విధానాలతో పారిశ్రామికాభివృద్ధి సాధిస్తూ.. సంక్షేమ పథకాలతో సుపరిపాలన సాగిస్తున్న గౌరవ ముఖ్యమంత్రివర్యులు

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారి సారథ్యంలో విజయపథంలో ఎపిఎండిసి

ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలతో...



ప్రగతిపథంలో ఎపిఎండిసి

- 2020-21 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ: రూ.434 కోట్లు
- 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ : రూ.900 కోట్లు
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ: రూ.1800 కోట్లు
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లక్ష్యం : రూ.4000 కోట్లు
- గ్రానైట్, కాల్సైట్, బాల్ క్లే, ఐరన్ ఓర్ మైనింగ్ లో పురోగతి
- 'కడప ఉక్కు కర్మాగారం'కు ఖనిజ సరఫరాకై అనంతపురం జిల్లాలో 110 మి.టన్నుల హైగ్రేడ్ ఖనిజ నిల్వల గుర్తింపు
- కడప జిల్లా బ్రహ్మంగారి మఠం (మం.) పలుగురాళ్ళపల్లిలో వైట్ బెరైటీస్ ప్రాజెక్ట్
- జగనన్న భూహక్కు-భూరక్ష సర్వే కోసం ఇప్పటివరకు 75 లక్షల సర్వే రాళ్ళ సరఫరా
- చిలకలూరిపేట (మం.) యడవల్లి (గ్రా)లో 70 హెక్టార్లలో కలర్ గ్రానైట్ లీజు
- రూ. 300కోట్లతో మంగంపేటలో పునరావాసం.

అంతర్జాతీయంగా 'ఎపిఎండిసి' రికార్డులు

- మిడిల్ ఈస్ట్ దేశాల్లో మంగంపేట బెరైటీస్‌కు గట్టి డిమాండ్
- అమెరికా మార్కెట్లో 54 శాతం ఎపిఎండిసి బెరైటీస్ వాటా
- అంతర్జాతీయంగా 30 దేశాలకు బెరైటీస్ ఎగుమతులు



జాతీయస్థాయిలో ఎపిఎండిసి విజయాలు

- సింగరేణి, కోల్ ఇండియా సరసన నిలిచిన 'ఎపిఎండిసి'
- 2022-23లో మధ్యప్రదేశ్ సుల్యారీ లో బొగ్గు ఉత్పత్తి ద్వారా రెవెన్యూ : రూ.487 కోట్లు.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుల్యారీ బొగ్గు గనుల ద్వారా రెవెన్యూ లక్ష్యం : రూ. 1600 కోట్లు. ఇప్పటివరకు రూ. 1,000 కోట్లు రెవెన్యూ ఆర్జన.
- ప్రైవేటు సంస్థలతో పోటీ పడి ఝార్ఖండ్ లోని బ్రహ్మదియా కోకింగ్ కోల్‌ను వేలంలో దక్కించుకున్న ఎపిఎండిసి
- 2023-24 లో బ్రహ్మదియాలో కోకింగ్ కోల్ ఉత్పత్తికి సన్నాహాలు
- రెండు HMBS మైనింగ్ లీజులను ఎపిఎండిసికి కేటాయించిన కేంద్రం

ఎపిఎండిసి ఫౌండేషన్ ద్వారా సామాజిక కార్యక్రమాలు

- అన్నమయ్య జిల్లా మంగంపేటలో ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ ద్వారా 1000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య
- విద్యార్థులకు ఉచితంగా పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం.
- డిజిటల్ క్లాస్‌రూంలతో అత్యుత్తమ బోధన.
- మంగంపేట పరిసర 10 గ్రామాలకు హెల్త్ సెంటర్ ద్వారా ఉచిత వైద్య సేవలు.
- మంగంపేట పరిధిలో సిఎస్ఆర్ కింద 211 మందికి ప్రతినెలా రూ.2 వేల చొప్పున పెన్షన్
- సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కమ్యూనిటీ హాళ్ళు, బస్ షెల్టర్ల నిర్మాణం
- వికలాంగులకు ఉచితంగా ట్రై స్కూటర్లు
- 4 జిల్లాల్లో 300 హ్యాబిటేషన్ లలో దాదాపు 3 లక్షల మందికి ఆర్వో వాటర్ ప్లాంట్ల ద్వారా రక్షిత మంచినీరు
- మధ్యప్రదేశ్ లోని సుల్యారీలో 800మంది విద్యార్థులకు డి.ఎ.వి. భాగస్వామ్యంతో మోడల్ స్కూల్
- సుల్యారీ పరిసర ప్రాంతాల్లోని 10 గ్రామాలకు ఉచిత వైద్య సేవలు

డోర్‌నెం. 294/1డి, తాడిగడప-ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు, కానూరు, విజయవాడ - 521 137
ఆంధ్రప్రదేశ్, ఫోన్: 0866-2429999, ఫ్యాక్స్ : 0866 - 2429977 E-mail : info-ho@apmdc.in :: website : www.apmdc.ap.gov.in